సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 168

సోమవారం 8-9-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'గ్రామం ప్రగతిపథంలో ఉంటే ఎవ్వరూ ముఠా కక్షల జోలికి వెళ్లరు'



మనదే ఆసియా కప్

- ఫైనల్లో 4–1తో దక్షిణ కొరియాపై గెలుపు
- ప్రపంచకప్ హాకీ టోర్నీకి టీమిండియా అర్హత

14లో



'టీనేజ్' సెయింట్!

క్రైస్తవ ప్రచారానికి కృషి చేసి లుకేమియాతో 15 ఏళ్లకే కన్నుమూసిన కార్లో అక్యూటిస్‌కు పోప్ సెయింట్‌హుడ్ ప్రకటించారు.


వివరాలు 6లో ▸



షికాగోపై రణన్నినాదం!

అమెరికాలోని మూడోపెద్ద నగరమైన షికాగో నుంచి వలసదార్లను బయటకు వెళ్లగొట్టనున్నట్లు ట్రంప్ సంకేతాలిచ్చారు.

వివరాలు 6లో ▸



వెనెజువెలాపై యుద్ధం!

'ఆయిల్ రిచ్' దేశం వెనెజువెలాపై విరుచుకు పడేందుకు యుద్ధనౌకలు, ఎఫ్–35 యుద్ధ విమానాలను అమెరికా మోహరించింది.

వివరాలు 6లో ▸



ఇషిబా సయోనారా!

అధికార ఎల్‌డీపీలో అంతర్గత విభేదాల నేపథ్యంలో జపాన్ ప్రధాని ఇషిబా పదవికి రాజీనామా చేయనున్నట్లు ప్రకటించారు.

వివరాలు 6లో ▸

ఏం చేద్దాం.. ఏం చెబుదాం?

సీఎం రేవంత్‌రెడ్డితో 'బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల' కీలక భేటీ

- అదనపు అడ్వకేట్ జనరల్‌తో కలిసి గంటకు పైగా చర్చ
- సుప్రీంకోర్టు డెడ్‌లైన్, స్పీకర్ నోటీసులు, బీఆర్‌ఎస్ ఎన్నికల సన్నాహాల నేపథ్యంలో సమావేశానికి ప్రాధాన్యత
- నియోజకవర్గాల అభివృద్ధిపై చర్చించామని బయటకు చెబుతున్న ఎమ్మెల్యేలు
- కానీ తాము పార్టీ మారలేదంటూ స్పీకర్‌కు సమాధానం ఇవ్వాలని భేటీలో నిర్ణయం?
- భవిష్యత్ వ్యూహం, స్పీకర్‌కు ఏం జవాబు చెప్పాలో నిర్ధారించుకునేందుకే అంటున్న రాజకీయ వర్గాలు
- అన్ని విషయాల్లో తాను అండగా ఉంటానని ముఖ్యమంత్రి భరోసా!
- కడియం శ్రీహరి మినహా 9 మంది హాజరు
- భట్టి విక్రమార్క, పొంగులేటి, శ్రీధర్‌బాబు, మహేశ్‌గౌడ్ కూడా..



సాక్షి, హైదరాబాద్

రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత కీలక పరిణామం చోటు చేసుకుంది. బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి పార్టీ ఫిరాయించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న 9 మంది ఎమ్మెల్యేలు ఆదివారం రాత్రి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమయ్యారు. జూబ్లీహిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో దాదాపు గంటకు పైగా జరిగిన ఈ సమావేశానికి ఎమ్మెల్యేలతో పాటు కాంగ్రెస్ పార్టీ పెద్దలు, న్యాయ నిపుణులు కూడా హాజరు కావడం విశేషం. వీరి అనర్హత విషయంలో సుప్రీంకోర్టు డెడ్‌లైన్ విధించడం, సుప్రీం ఆదేశాల మేరకు పార్టీ ఫిరాయింపుపై జవాబు చెప్పాలని అసెంబ్లీ స్పీకర్ జారీ చేసిన నోటీసుల గడువు ముగుస్తుండడం, మరోవైపు ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్ ఆ పది నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలకు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో సీఎంతో ఫిరాయింపు ఎమ్మెల్యేల భేటీ ప్రాధాన్యతను సంతరించుకుంది. సమావేశంలో తమ నియోజకవర్గాల అభివృద్ధి తమకు పాత కాంగ్రెస్ నేతలతో ఉన్న సమస్యల పరిష్కారం పైనే చర్చించామని ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ వర్గాలు బయటకు చెబుతున్నప్పటికీ.. రాజకీయ వర్గాల్లో మాత్రం మరో చర్చ జరుగుతోంది. సుప్రీంకోర్టులో కేసు, స్పీకర్ జారీ చేసిన నోటీసుల విషయంలో వ్యూహాన్ని ఖరారు చేసేందుకు, ఎలా ముందుకు వెళ్లాలి? ఏం చెప్పాలి అనేది

మిగతా 5వ పేజీలో ▶



ఆదివారం ఢిల్లీలో జరిగిన బీజేపీ ఎంపీల వర్క్‌షాప్‌లో చివరి వరుసలో కూర్చున్న ప్రధాని నరేంద్ర మోదీ

బీజేపీ ఎంపీలకు వర్క్‌షాప్

ఉప రాష్ట్రపతి ఎన్నికల విధానంపై అవగాహన సమావేశం

6లో

అమెరికాకు వద్దు బ్రో

భారతీయ యువతను వణికిస్తున్న నిరుద్యోగ గణాంకాలు

- వేగంగా ఊడిపోతున్న ఉద్యోగాలు.. వారానికి 8 వేల మంది రోడ్ల మీదికి..
- లేబర్ వర్క్‌ను మింగేస్తున్న యాంత్రీకరణ
- డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాలతో ఐటీలో మంటలు
- కుచించుకుపోతున్న సర్వీస్ సెక్టార్.. భారతీయ విద్యార్థులు అతలాకుతలం
- అమెరికా రావొద్దంటూ భారత్‌లోని మిత్రులకు ఫోన్లు



సాక్షి, హైదరాబాద్: అమెరికాకు వెళ్లాలంటేనే భారతీయులు వణికిపోయే పరిస్థితి వచ్చింది. అమెరికాకు చెందిన బ్యూరో ఆఫ్ లేబర్ స్టాటిస్టిక్స్ తాజా గణాంకాలు యువతను మరీ భయపెడుతున్నాయి. 'అక్కడ పరిస్థితి ఏమిటి?' అని ప్రవాస భారతీయులకు ఫోన్ చేస్తే ముందుగా వచ్చే మాట ఒక్కటే.. 'వద్దు బ్రో.. ఇప్పుడు అమెరికాకు రావొద్దు'. గ్రీన్‌కార్డు ఉన్న వాళ్ల నుంచీ ఇదే మాట వినిపిస్తోంది. పెరుగుతున్న ఖర్చులు, పడిపోతున్న ఆదాయం, వెంటాడుతున్న అప్పులు.. ఇదీ పరిస్థితి అంటున్నారు అమెరికాలోని మనవాళ్లు. కేవలం ఆరు నెలల కాలంలోనే లేబర్ మార్కెట్ నేలబారుకు చేరిందని చెబుతున్నారు. ఐటీ సెక్టార్‌లో ఎప్పుడేం జరుగుతుందో తెలియని పరిస్థితి కనిపిస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చదువు కోసం వెళ్లిన విద్యార్థులను ఈ పరిస్థితులు మరింత ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. కొత్తగా యూఎస్ వెళ్లాలనుకునే వాళ్లు పునరాలోచించాల్సి వస్తోంది.

ఆగస్టులో దారుణ పరిస్థితి

అమెరికాలో నిరుద్యోగ గణాంకాలను అక్కడి అధికారిక సంస్థ బ్యూరో ఆఫ్ లేబర్ వెల్లడిస్తుంది. జూలై 19వ తేదీ నాటికి అమెరికాలో నిరుద్యోగ జాబితాలో 2.21 లక్షల మంది నమోదు చేసుకున్నారు. ఆగస్టు 30 నాటికి ఈ సంఖ్య 23.7 లక్షలకు పెరిగింది. నిరుద్యోగుల సంఖ్య సగటున వారానికి 8 వేల చొప్పున పెరుగుతోందని బీఎస్‌ఎస్ తెలిపింది. గడచిన ఆరు వారాల్లో

మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్

నెల్లుట్ల రమాదేవికి కాళోజీ పురస్కారం



ప్రజాకవి కాళోజీ పేరిట ప్రభుత్వం ఏటా అందిస్తున్న సాహితీ పురస్కారానికి 2025కుగాను ప్రముఖ కవయిత్రి నెల్లుట్ల రమాదేవి ఎంపికయ్యారు. నిపుణుల కమిటీ సిఫారసును సీఎం రేవంత్ ఆమోదించారు.

- వివరాలు 3లో▶

రిజర్వేషన్లకు చట్టబద్ధత తర్వాతే ఎన్నికలకు..



స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత సాధించిన తర్వాతే ఎన్నికలకు వెళ్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. రిజర్వేషన్లకు అడ్డుతగిలేవారి భరతం పడతామన్నారు.

- వివరాలు 2లో▶

సబలెంకాదే టైటిల్



యూఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్ విభాగంలో బెలారస్ స్టార్ సబలెంకా విజేతగా నిలిచింది. ఫైనల్లో ఆమె అమెరికా ప్లేయర్ అనిసిమోవాపై గెలిచింది. సబలెంకాకు 50 లక్షల డాలర్లు (రూ. 44 కోట్ల 11 లక్షలు) ప్రైజ్ మనీగా లభించాయి.

- వివరాలు 14లో▶

42 కీలక ఔషధాల ధరలకు కళ్లెం



అవయవ మార్పిడి, తీవ్ర బాక్టీరియల్ ఇన్ఫెక్షన్ల చికిత్సలో వాడే 42 కీలక ప్రాణాధార ఔషధాల రిటైల్ ధరలను జాతీయ ఔషధ ధరల నియంత్రణ ప్రాధికార సంస్థ ఖరారు చేసింది. దీంతో రోగులకు వైద్య ఖర్చుల భారం తగ్గడమే గాక ఫార్మా కంపెనీలు, మందుల దుకాణాల అక్రమ వ్యాపారానికి అడ్డుకట్ట పడనుంది.

- వివరాలు 6లో▶

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE
Venkateshwara CHICKEN
Suggested Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates

12 Eggs Retail Rate	Ex Farm Live Bird	113 kg	Dressed with Skin	196 kg
₹ 74	Retail Live Bird	135 kg	Skin Less	223 kg

Conditions Apply
Issued in the interest of consumers

ఇదండీ సంగతి



అవసరమైతే బడ్జెట్‌లో నిధులు కేటాయిద్దాం మేడం!

లేబర్‌గా చేరి.. లోగుట్టు పట్టి..

- నెలరోజుల పాటు వాగ్దేవి ల్యాబ్స్‌పై ఎంబీవీవీ పోలీస్ ఆఫీసర్ నిఘా.. పూర్తి వివరాలు సేకరించి మహారాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారం
- పట్టుబడిన డ్రగ్స్ సీజ్.. 200 డ్రమ్ముల్లో ఉన్న కెమికల్స్ లారీల్లో ముంబైకి.. ఏడాది క్రితమే మహారాష్ట్రలో శ్రీనివాస్ విజయ్ వోలేటిపై డ్రగ్స్ కేసు



సాక్షి, హైదరాబాద్/కుషాయిగూడ: వాగ్దేవి ల్యాబ్స్ కెమికల్ ఫ్యాక్టరీలో లేబర్‌గా చేరి తేగానీ డ్రగ్స్ రాకెట్‌ను ఛేదించలేమని భావించిన మహారాష్ట్ర పోలీసులు పక్కా పథకం వేశారు. దీంతో ఎంబీవీవీ క్రైమ్ బ్రాంచ్ యూనిట్–4కు చెందిన ఓ ఆఫీసర్ నెలరోజుల ముందే వాగ్దేవి ల్యాబ్స్‌లో కార్మికుడిగా చేరాడు. కంపెనీలో దిగుమతి అవుతున్న ముడి సరుకులు, రసాయనాలు, డ్రగ్స్ తయారీ కేంద్రం, కార్మికులు, రవాణా ఏర్పాట్లు తదితరాలపై నిఘా పెట్టారు. నెలరోజుల పాటు వివరాలు సేకరించి, పక్కా ఆధారాలు లభించగానే ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. దీంతో ఎంబీవీవీ క్రైమ్ బ్రాంచ్ యూనిట్–4 ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ భడక్, తన బృందంతో ఆకస్మికంగా దాడులు చేసి గుట్టు రట్టు చేశారు.

ప్రతిసారి 5 కిలోల విక్రయం: భారీ మొత్తంలో డ్రగ్స్ తయారు చేస్తూ మహారాష్ట్ర పోలీసులకు చిక్కిన శ్రీనివాస్ విజయ్ వోలేటి బృందం కేసులో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో కీలక నిందితుడు శ్రీనివాస్ విజయ్ పదేళ్లుగా

మిగతా 3వ పేజీలో ▶

కోర్టు కళ్లుగప్పి కుప్పి గంతులు!

మద్యంపై అక్రమ కేసులో ముగ్గురి విడుదలను అడ్డుకునేందుకు విఫలయత్నాలు

- ఏసీబీ కోర్టులో ఓ అధికారి ద్వారా కథ నడిపిన ప్రభుత్వ పెద్దలు!
- ముగ్గురి పూచీకత్తులూ ఒకేసారి సమర్పిస్తేనే రిలీజ్ ఆర్డర్లు ఇస్తానన్న అధికారి
- సమయం ముగిసే వరకు వాగ్వాదంతో తాత్సారం.. దీంతో న్యాయాధికారి దృష్టికి తెచ్చిన పిటిషనర్ల న్యాయవాది
- సాక్షాత్తూ న్యాయాధికారి ఆదేశించినా పట్టించుకోని కోర్టు అధికారి
- ప్రభుత్వం తరపున హైకోర్టులో అత్యవసరంగా హౌస్‌మోషన్ పిటిషన్లు
- శనివారం రాత్రి 9.30 సమయంలో దాఖలు చేసి అత్యవసర విచారణకు అభ్యర్థన.. తిరస్కరించిన హైకోర్టు
- సోమవారం అనుబంధ జాబితాలో ఈ వ్యాజ్యాలను ఉంచాలని రిజిస్ట్రీకి ఆదేశం
- హౌస్‌మోషన్ పిటిషన్లపై నేడు విచారణ

12లో



విజయవాడ జైలు నుంచి బయటకు వస్తున్న బాలాజీ గోవిందప్ప, ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి

- ఉ.6 గంటలకే రావాల్సిన జైలర్‌ను 9 గంటల వరకు రానివ్వకుండా చేసి ప్రభుత్వ పెద్దల తెరచాటు కుతంత్రాలు
- దొంగ కేసుల్లో ఇరికించి బయటకు రాకుండా చేసే కుట్రలకు పదును.. న్యాయవాదుల ధర్నా, సర్వత్రా వెల్లువెత్తిన విమర్శలతో ఉలిక్కిపాటు
- 'హౌస్‌మోషన్'ను హైకోర్టు తిరస్కరించడంతో బెడిసికొట్టిన కూటమి సర్కారు కుతంత్రాలు..
- గత్యంతరం లేక ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్పను విడుదల చేసిన జైలు అధికారులు

కేన్సర్‌పై రామబాణం ఎంటెరోమిక్స్



కొత్త వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసిన రష్యా సైంటిస్టులు

- కోవిడ్ టీకాల తరహాలో కేన్సర్ టీకా అభివృద్ధికి ఎంఆర్‌ఎన్‌ఏ సాంకేతికత వినియోగం
- మూడేళ్లపాటు సాగిన ముందస్తు క్లినికల్ ట్రయల్స్‌లో ప్రభావవంతంగా పనిచేసిన టీకా
- పెద్దపేగు, మెదడు, చర్మ కేన్సర్లకు ఈ వ్యాక్సిన్ అద్భుతంగా పనిచేస్తుందన్న పరిశోధకులు
- త్వరలో క్లినికల్ ట్రయల్స్ చేపట్టనున్నట్లు తయారీ సంస్థ ఎఫ్ఎంబీఏ వెల్లడి

- వివరాలు 6లో▶

'గోదావరి'కి నేడు సీఎం శంకుస్థాపన

రూ.7,360 కోట్ల అంచనాతో జరగనున్న గోదావరి రెండు, మూడో దశ పనులు

- మల్లన్నసాగర్ నుంచి 20 టీఎంసీల తరలింపు
- 2027 డిసెంబర్ నాటికి హైదరాబాద్‌కు రోజూ నల్లా నీళ్లు
- రూ.298 కోట్ల 'కోకాపేట్' ప్రాజెక్టుకూ శంకుస్థాపన
- రూ.1,200 కోట్ల ఓఆర్ఆర్ రెండో దశ ప్రాజెక్టు ప్రారంభోత్సవం



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నగర తాగునీటి అవసరాలను 2027 డిసెంబర్ నాటికి తీర్చడంతో పాటు నగరంలో రోజూ నల్లా నీటిని సరఫరా చేయాలనే లక్ష్యంతో ప్రతిపాదించిన గోదావరి తాగునీటి పథకం రెండు, మూడో దశ పనులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సోమవారం గండిపేట వద్ద శంకుస్థాపన చేయనున్నారు. తాగునీటి సరఫరాకు సంబంధించిన మరో రెండు ప్రాజెక్టులకు కూడా సీఎం శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేయనున్నారు.

మల్లన్నసాగర్ నుంచి గోదావరి జలాలు

రూ.7,360 కోట్ల అంచనాలతో హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హామ్) విధానంలో గోదావరి తాగునీటి పథకం రెండు, మూడో దశ పనులు చేపట్టనున్నారు. మూసీ నదీ పునరుజ్జీవన పథకంలో భాగంగా చేపట్టనున్న ఈ ప్రాజెక్టు ద్వారా మల్లన్నసాగర్ నుంచి గోదావరి జలాలను ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాలకు తరలిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం పెట్టుబడి పెట్టనుండగా, 60 శాతం వాటాను నిర్మాణ సంస్థ భరించనుంది. రెండేళ్లలో ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలని ప్రభుత్వం గడువు విధించింది. మల్లన్నసాగర్ నుంచి మొత్తం 20 టీఎంసీల నీళ్లను తరలించి ఆ నీళ్లతో ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాలు నింపడంతో పాటు మూసీ పునరుజ్జీవనానికి 2.5 టీఎంసీలను విడుదల చేస్తారు. మిగిలిన 17.50 టీఎంసీల

మిగతా 16వ పేజీలో ▶

ఆమెకు అభద్రత!



దేశంలోని ప్రతి 10 మంది మహిళల్లో నలుగురు.. తాము ఏమంత సురక్షితంగా లేమని భావిస్తున్నారట. యువతుల్లో భయాందోళనలు గత ఏడాది కంటే పెరిగాయి. ఫిర్యాదు ఇస్తే న్యాయం జరుగుతుందన్న ఆశ బాధిత మహిళల్లో చాలా తక్కువగా ఉందట. పని చేసే చోట భద్రత గురించి మాత్రం .. సురక్షితమైన వాతావరణం ఉందని అత్యధికులు చెప్పారు. దేశంలోని మహిళల భద్రతా స్థితిగతులపై జాతీయ మహిళా కమిషన్.. 'నారీ 2025 వార్షిక నివేదిక, భద్రతా సూచిక' పేరిట విడుదల చేసిన నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి.

- వివరాలు 2లో▶

ఆమెకు అభద్రత!

దేశంలోని ప్రతి 10 మంది మహిళల్లో నలుగురు.. తాము ఏమంత సురక్షితంగా లేమని భావిస్తున్నారట. యువతుల్లో భయాందోళనలు గత ఏడాది కంటే పెరిగాయి. ఫిర్యాదు ఇస్తే న్యాయం జరుగుతుందన్న ఆశ బాధిత మహిళల్లో చాలా తక్కువగా ఉందట. పని చేసే చోట భద్రత గురించి మాత్రం.. సురక్షితమైన వాతావరణం ఉందని అత్యధికులు చెప్పారు. దేశంలోని మహిళల భద్రతా స్థితిగతులపై జాతీయ మహిళా కమిషన్.. 'నారీ-2025 వార్షిక నివేదిక, భద్రతా సూచిక' పేరిట విడుదల చేసిన నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి.

సాక్షి, స్పెషల్ డెస్క్

సురక్షితంగా లేమంటున్న 40 శాతం మహిళలు

యువతులపై వేధింపులు గతేడాది కన్నా ఎక్కువ

ఫిర్యాదులపై నమ్మకం లేని వారు 75 శాతం మంది

మహిళల భద్రతా నివేదిక 'నారీ-2025'



వీధి లైట్లు.. ప్రజా రవాణా!

- 'ప్రివెన్షన్ ఆఫ్ సెక్సువల్ హెరాస్‌మెంట్' గురించి విన్నవారిలో చాలా మంది, ఆఫీసులలో అలాంటి యంత్రాంగం ఒకటి ఉంటుందన్న అవగాహన మహిళలకు భద్రత కల్పిస్తుందని అభిప్రాయపడ్డారు.
- మహిళల భద్రత అంటే కేవలం వారికి భౌతిక రక్షణను మాత్రమే ఇవ్వటం కాదని; వారి మానసిక, ఆర్థిక, డిజిటల్ భద్రతలను కూడా కల్పించాలని నివేదిక సూచించింది.
- స్థలాన్ని, సమయాన్ని బట్టి కూడా భద్రత అర్థం మారుతుందనీ, పగటిపూట సురక్షితమైన వాతావరణాన్ని నైట్ షిఫ్టులలో ఆశించ లేమని మహిళలు అన్నారు.
- వీధి లైట్లు లేకపోవటం, సరిగా లేని ప్రజా రవాణా వ్యవస్థ కూడా రాత్రివేళ మహిళలకు భద్రత లేకపోవటానికి కారణమని వారు తెలిపారు.



దేశంలోని 31 నగరాల్లో 12,770 మంది మహిళల అభిప్రాయాలు సేకరించి జాతీయ మహిళా కమిషన్ 'నారీ-2025 వార్షిక నివేదిక, భద్రతా సూచిక' రూపొందించింది. సర్వేలో దాదాపు 60 శాతం మంది మహిళలు తమ నగరాల్లో తాము సురక్షితంగా ఉన్నట్లు చెప్పగా, 40 శాతం మంది అంత సురక్షితంగా లేమని లేదా సురక్షితంగా అస్సలు లేమని భావిస్తున్నట్లు తెలిపారు. యువతులలోని భయాందోళనలు గత ఏడాది కంటే పెరగటాన్ని కూడా నివేదిక గుర్తించింది. 2024లో సర్వేలో పాల్గొన్న మహిళల్లో 7 శాతం మంది బహిరంగ వేధింపులకు గురయ్యామని చెప్పగా, 24 ఏళ్లలోపు యువతుల్లో ఇలా చెప్పిన వారి సంఖ్య గరిష్ఠంగా 14 శాతంగా ఉంది. ముఖ్యంగా చదువుకునే అమ్మాయిలు, ఉద్యోగినులైన యువ నిపుణులు, సామాజిక వేడుకల్లో పాలుపంచుకున్న మహిళలు వేధింపులకు గురైనట్లు సర్వే పేర్కొంది.

ముగ్గురిలో ఒక్కరే ఫిర్యాదు!

ఫిర్యాదు ఇస్తే న్యాయం జరుగుతుందన్న ఆశ బాధిత మహిళల్లో చాలా తక్కువగా ఉందని నివేదిక తెలిపింది. సర్వే ప్రకారం, వేధింపులకు గురైన ముగ్గురిలో ఒకరు మాత్రమే ఫిర్యాదు చేశారు. 75 శాతం మహిళలు.. తమ ఫిర్యాదులను అధికారులు పరిష్కరిస్తారని నమ్మటం లేదు. వేధింపులు, ఇతర ఘటనల్లో 22 శాతం వరకే కేసులు నమోదు కాగా, వాటిల్లో పరిష్కారం అయినవి కేవలం 16 శాతం మాత్రమే. వ్యవస్థపై అపనమ్మకం, బాధితుల మౌనం ఏ స్థాయిలో ఉన్నాయో ఈ లెక్కలు చెబుతున్నాయి. వేధింపుల ఘటనల్లో 32 శాతం.. తెలిసిన ప్రాంతాలలో జరుగుతుండగా, 29 శాతం ప్రయాణ సమయాలలో సంభవిస్తున్నాయని నివేదిక తెలిపింది.

కోహిమాలో సురక్షితం

నగరాల వారీ భద్రతా అసమానతలను కూడా నివేదిక పొందుపరిచింది. కోహిమా, విశాఖపట్నం, భువనేశ్వర్.. భద్రతా సూచికలో అగ్రస్థానంలో ఉన్నాయి, తరువాత ఐజ్వాల్, గ్యాంగ్‌టక్, ఇటానగర్ ముంబై ఉన్నాయి. ఇందుకు భిన్నంగా పట్నా, జైపూర్, ఫరీదాబాద్, ఢిల్లీ, కోల్‌కతా, శ్రీనగర్, రాంచీ మరీ దిగువ స్థానాల్లో ఉన్నాయి. రాంచీ అంత సురక్షితమైనది కాదని 44 శాతం మంది మహిళలు భావిస్తుండగా, ఢిల్లీ, ఫరీదాబాద్‌లలో ఈ శాతం దాదాపు 42గా ఉంది. దేశంలోని మహిళల భద్రతను పట్టణ పరిస్థితులు, అక్కడి పాలనా యంత్రాంగం పనితీరు ప్రభావితం చేస్తున్నట్లు 'నారీ-2025' తేల్చి చెప్పింది.

పనిచేసే చోట భద్రమే

పని చేసే చోట భద్రత గురించి 91 శాతం మంది మహిళలు.. కార్యాలయంలోని వాతావరణం సురక్షితంగా ఉందని తెలిపారు. అయితే వారిలో దాదాపు సగం మంది, తమ సంస్థ తప్పనిసరి 'లైంగిక వేధింపుల నివారణ' (పి.ఓ.ఎస్.హెచ్. - ప్రివెన్షన్ ఆఫ్ సెక్సువల్ హెరాస్‌మెంట్) యంత్రాంగాన్ని అమలు చేస్తోందో లేదో తమకు తెలియదని చెప్పారు.

ఫిర్యాదు చేసినా లాభం లేదు	'భద్రత ఉంది' అని చెప్పినవారు	60%	ఫిర్యాదు చేసిన బాధితులు	33%
	'అంతగా లేదు' అన్నవారు	40%	మౌనంగా ఉండిపోయినవారు	67%
	'ఫిర్యాదులిచ్చి లాభం లేదు'	75%	పనిచేసే చోట ఫిర్యాదులు	22%
	'వ్యవస్థపై నమ్మకం ఉంది'	25%	ఫిర్యాదులపై చర్యలు	16%



వేధింపులు

- బహిరంగ వేధింపులకు గురయ్యామని చెప్పిన మహిళలు 7 శాతం. 24 ఏళ్లలోపు యువతుల్లో ఇది 14 శాతం.
- వేధింపు ఘటనల్లో 32 శాతం తెలిసిన ప్రాంతాల్లోనే జరుగుతున్నాయి.
- ముఖ్యంగా 38% ఇరుగు పొరుగు వారి వల్లే జరుగుతున్నాయి.
- 29 శాతం ప్రయాణాల సమయాలలో సంభవిస్తున్నాయి.
- వేధింపుల్లో మాటలతో అత్యధికంగా 58 శాతం చోటు చేసుకుంటున్నాయి.
- వేధింపులకు గురైనవారిలో ప్రతి ముగ్గురిలో కేవలం ఒక్కరే ఫిర్యాదు చేస్తున్నారు.

క్లుప్తంగా...

శ్రీవారిని దర్శించుకున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి



తిరుమల శ్రీవారిని ఆదివారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ దర్శించుకున్నారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వదించగా, టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు.

\- తిరుమల

నేడు టీపీసీసీ విస్తృతస్థాయి సమావేశం

హాజరుకానున్న మీనాక్షి, మహేశ్‌కుమార్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం సోమవారం గాంధీభవన్‌లో జరగనుంది. ఉదయం 11 గంటలకు జరగనున్న ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ హాజరుకానున్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, డీసీసీ అధ్యక్షులు, పార్టీ ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జులు, అనుబంధ సంఘాల చైర్మన్లు, కార్పొరేషన్ల చైర్మన్లు, ఇతర నాయకులు ఇందులో పాల్గొననున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు, నామినేటెడ్ పోస్టులు, జనహిత పాదయాత్ర, జైబాపూ-జైభీం కార్యక్రమాల నిర్వహణపై ఈ సమావేశంలో చర్చ జరుగుతుందని గాంధీభవన్ వర్గాలు తెలిపాయి.

'జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి ఎంఐఎం మద్దతు'



సాక్షి, హైదరాబాద్: ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతివ్వాలని ఎంఐఎం నిర్ణయించింది. ఈ మేరకు ఆ పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆదివారం ఎక్స్ వేదికగా వెల్లడించారు. 'జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతివ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. న్యాయకోవిదుడు, తోటి హైదరాబాదీ అయిన ఆయనకే మద్దతివ్వాలని ఎంఐఎం నిర్ణయించింది. జస్టిస్ సుదర్శన్‌రెడ్డితో కూడా మాట్లాడి శుభాకాంక్షలు తెలియజేశాను' అని తన ట్వీట్‌లో ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు.

సాక్షి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా.. మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం
1800 425 9899

అమెరికాకు వద్దు బ్రో..

▶ మొదటి పేజీ తరువాయి

ఐటీ సెక్టార్‌లోనే దాదాపు 5.8 లక్షల మందిని ఉద్యోగాల నుంచి తొలగించారు. ఈ రంగం కొత్తగా సృష్టించిన ఉద్యోగాలు 50,200 మాత్రమే. ముఖ్యంగా ఆగస్టు నెలలో 1.8 లక్షల ఉద్యోగాలు ఊడిపోయినట్టు జాబ్‌లెస్ డేటా పేర్కొంది. యూఎస్ జాబ్ మార్కెట్‌లో ఈ పరిస్థితి ఐదేళ్ల క్రితం కూడా లేదని చెబుతున్నారు. ఐటీ ఉద్యోగాల సృష్టి తప్ప, కుదించడం తక్కువేనని.. అది కూడా కొత్త టెక్నాలజీతో మార్పు చేసినట్టు అక్కడి మార్కెట్ వర్గాలు అంటున్నాయి.

లేబర్ మార్కెట్ డౌన్

అమెరికా కొన్ని దేశాలకు లేబర్ వీసాలు జారీచేస్తుంది. మాల్స్, పెట్రోల్ బంకులు, రెస్టారెంట్లు, డెలివరీ విభాగం తదితర చోట్ల శారీరక శ్రమ చేసే కొన్ని రకాల పనులను క్లాస్-4గా విభజించారు. ఈ పనులు చేసేందుకు భారతీయులకు అనుమతి లేదు. లేబర్ వీసాలో భారతీయులను మినహాయించారు. అయితే, మెజారిటీ భారతీయ విద్యార్థులు చదువుకుంటూనే ఇలాంటి పార్ట్‌టైం ఉద్యోగాలు చేస్తుంటారు. ట్రంప్ వచ్చిన తర్వాత లేబర్ మార్కెట్‌పై ఆంక్షలు ఎక్కువయ్యాయి. దీంతో విద్యార్థులు ఈ పనులు చేసేందుకు భయపడుతున్నారు. ఫలితంగా చాలా రెస్టారెంట్లు పూర్తిస్థాయిలో నడవడం లేదని లేబర్ మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. కొన్ని నెలలుగా రెస్టారెంట్లు, డెలివరీ, మాల్స్‌లో రోబోటిక్ సర్వీస్ విధానాలను తీసుకొస్తున్నారు. పూర్తి యాంత్రీకరణ దిశగా ఇప్పటికే కొన్ని సంస్థలు వెళ్లాయి. ఫలితంగా లేబర్ పనులకు అవకాశం ఉన్న వారికీ ఉద్యోగాలు ఊడిపోతున్నాయి.

ఐటీ అతలాకుతలం: ఐటీ రంగం పూర్తిగా సర్వీస్ సెక్టార్ పైనే ఆధారపడింది. అమెరికన్ కంపెనీలు భారత్‌లో ఉండే ఉద్యోగులను నియమించుకుంటున్నాయి. అమెరికాలో ఎక్కువ వేతనం ఇచ్చేకన్నా, భారత్‌లో తక్కువ వేతనంతో రిమోట్ పని విధానం చేయించుకోవచ్చని భావిస్తున్నాయి. మరోవైపు ఏఐ ఐటీ సెక్టార్‌పై ప్రభావం చూపుతోంది. బిగ్ డేటా సెంటర్స్ ఆవిర్భావం, ప్రత్యేక కోడింగ్ విధానం ఐటీకి సొంతమైంది. ఫలితంగా సాధారణ కోడింగ్‌తో ఉండే ఉద్యోగాల అవసరం తగ్గుతోంది. ఇదే క్రమంలో ట్రంప్ టారిఫ్‌ల భారం పరిస్థితిని మరింత దిగజార్చింది. ఐటీ రంగంపై భారీగా టారిఫ్‌లు విధించవచ్చనే వార్తలతో ఐటీ సెక్టార్ కొత్త ఉద్యోగ నియామకాలు నిలిపివేసింది. టారిఫ్‌లు విధిస్తే ఇండియాలో పనిచేసే ఉద్యోగి వేతనం, ఇంచుమించు అమెరికాలో ఉద్యోగి వేతనంతో సమానం (ఉద్యోగికి ఇచ్చేది కాదు... టారిఫ్‌లు కలుపుకుని) అవుతుంది. ఫలితంగా కంపెనీలు ఆర్థికంగా దెబ్బతినే అవకాశం ఉంటుంది. అమెరికా ఫెడ్ రేట్లపై ఐటీ కంపెనీలు ఇప్పుడు ఆశలు పెట్టుకున్నాయి. సానుకూల నిర్ణయాలు ఉంటే తప్ప ఐటీ బతకడం కష్టమని ప్రవాస భారతీయులు అంటున్నారు.

ఆరు వారాలుగా జాబ్‌లెస్ క్లెయిమ్ డేటా..
(అమెరికా బ్యూరో ఆఫ్ లేబర్ లెక్కల ప్రకారం)

తేదీ	ఉద్యోగం కోల్పోయిన వారు (లక్షల్లో)
జూలై 19	2.21
జూలై 26	22.5
ఆగస్టు 2	22.7
ఆగస్టు 9	22.9
ఆగస్టు 16	22.8
ఆగస్టు 23	22.9
ఆగస్టు 30	23.7

ఇది కరెక్ట్ సీజన్ కాదు

నాకు గ్రీన్ కార్డ్ ఉంది. ఐటీ సంస్థలో పనిచేస్తున్నా. టారిఫ్‌ల ఫలితంగా లేఆఫ్ ఇచ్చారు. యూఎస్ నిబంధనల ప్రకారం గ్రీన్‌కార్డు ఉన్నవాళ్లకు ఆరు నెలలు నిరుద్యోగ భృతి ఇస్తారు. జాబ్‌లెస్ డేటాలో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఇలా జాబ్‌లు కోల్పోయే వారి సంఖ్య పెరుగుతోంది. ఈ సమయంలో కొత్తవాళ్లు అమెరికాకు రావొద్దు.

\- కమలాకర్ బుర్రా, అమెరికాలో ఐటీ ఉద్యోగి

యాంత్రీకరణే శరణ్యం

రెస్టారెంట్‌లో భారతీయ విద్యార్థులు పనిచేసినంత కాలం సమస్య ఉండేది కాదు. అనధికారమే కావచ్చు కానీ వాళ్లకు ఆర్థికంగా చేయూత ఉండేది. ట్రంప్ వచ్చిన తర్వాత విద్యార్థులు పనిచేయడం లేదు. అమెరికాలో అధికారిక లేబర్ వీసా ఉన్నవాళ్ల కోరికలు మేం తీర్చలేం. దీంతో రోబోటిక్ వైపు వెళ్తున్నాం. భవిష్యత్‌లో లేబర్ మార్కెట్ స్వరూపం పూర్తిగా మారుతుంది.

\- పి.మున్నీనాథ్, డల్లాస్‌లో ఓ రెస్టారెంట్ యజమాని

ప్రభుత్వాన్ని స్తంభింపజేస్తేనే సమస్యకు పరిష్కారం

ట్రిపుల్‌ఆర్ భూ నిర్వాసితుల సమావేశంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

సంస్థాన్ నారాయణపురం: 'బతుకునిచ్చే భూమి పోతుంటే ఎవరి మనసు ఒప్పుకోదు.. దేనికైనా సిద్ధంగా ఉండాలి.. అవసరమైతే ప్రభుత్వాన్ని స్తంభింపజేయనిదే సమస్య పరిష్కారం కాదు' అని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. సంస్థాన్ నారాయణపురం, గట్టుప్పల్ మండలాలకు చెందిన రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) భూ నిర్వాసితులు, రైతు సంఘాల నాయకులు ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి హాజరయ్యారు. భూమి పోకుండా చూడాలని, అలైన్‌మెంట్ మార్పించాలంటూ పలువురు మహిళలు, రైతులు కన్నీటి పర్యంతం అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ ప్రాంత ఎమ్మెల్యేగా తనను సంప్రదించకుండానే అలైన్‌మెంట్ ఫిక్స్ చేశారని.. సీఎంగానీ, మంత్రిగానీ, అధికారులు గానీ అలైన్‌మెంట్ ఎక్కడి నుంచి మార్చాలని తనను అడిగారా అని ప్రశ్నించారు.అధికారులు ఎట్ల డిసైడ్ చేశారో తనకు తెలియదని, పేపర్లు చూసిన తర్వాత తెలిసిందన్నారు. రోడ్డు నిర్మాణం ఎక్కువగా జరిగేది మునుగోడు నియోజకవర్గ పరిధిలోనేనన్నారు. భూసేకరణ చేయొద్దని ఇప్పటికే ఆర్డీఓ,కలెక్టర్‌తో మాట్లాడినట్టు తెలిపారు.

మహేశ్ ఆత్మహత్యకు సీఎం, సీతక్కలే బాధ్యులు

మృతుని తల్లిదండ్రులను ఫోన్‌లో పరామర్శించిన కేటీఆర్



కేటీఆర్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న లక్ష్మి

ములుగు: ఐదు నెలల వేతనం అందక ములుగు మున్సిపల్ కార్మికుడు మైదం మహేశ్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటనకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క బాధ్యత వహించాలని మాజీమంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. ములుగు మండలంలోని మాధవరావుపల్లిలో మృతుడి కుటుంబ సభ్యులను ఆదివారం రెడ్కో మాజీ చైర్మన్ ఏరువ సతీశ్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా సతీశ్‌రెడ్డి.. మృతుడి తల్లిదండ్రులు లక్ష్మి-మల్లయ్యతో కేటీఆర్‌తో మాట్లాడించారు. కేటీఆర్ వారితో మాట్లాడుతూ మహేశ్ ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని, కార్మికులకు జీతాలు కూడా చెల్లించలేని దుస్థితి తెచ్చిన ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బాధితుడి కుటుంబాన్ని ఆదుకోవాల్సిందిపోయి.. మంచినీళ్లు అనుకుని పురుగుల మందు తాగి మరణించాడని ఓ వీడియోను సృష్టించి ప్రచారం చేసుకోవడం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు. మృతుడి కుటుంబానికి వెంటనే 50 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియాతోపాటు అతడి భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాగా, మహేశ్ కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ తరఫున అండగా ఉంటామని, ముగ్గురు ఆడబిడ్డలను ఆదుకుంటామని, పిల్లలకు ఆర్థిక సాయం అందిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు.

రిజర్వేషన్లకు చట్టబద్ధత తర్వాతే ఎన్నికలకు

బీసీ రిజర్వేషన్లకు బండి సంజయ్, కిషన్‌రెడ్డిలే అడ్డు

- బీజేపీ బండారం బయట పెట్టేందుకే 15న కామారెడ్డిలో సభ
- పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్‌కుమార్‌గౌడ్. చిత్రంలో వాకిటి శ్రీహరి, పొన్నం, కొండా సురేఖ, షబ్బీర్ అలీ, సీతక్క

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత సాధించిన తర్వాతే ఎన్నికలకు వెళతామని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆలస్యమైనా సరే రిజర్వేషన్లకు చట్టబద్ధత సాధిస్తామన్నారు. బీసీలకు అన్యాయం చేస్తున్న బీజేపీ బండారాన్ని బయటపెట్టి, రిజర్వేషన్లకు అడ్డుతగిలేవారి భరతం పట్టేందుకు ఈనెల 15న కామారెడ్డిలో రెండు లక్షల మందితో సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభకోసం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కామారెడ్డి వేదికగా చేసిన డిక్లరేషన్‌లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామన్న వాగ్దానం మేరకు తాము అధికారంలోకి రాగానే శాస్త్రీయ పద్ధతిలో కులగణన చేసి, బీసీల జనాభా లెక్కలు తేల్చామన్నారు. దీని ప్రకారం బీసీలు 56.33 శాతం మంది ఉన్నట్లు తేలిందని, అందుకు అనుగుణంగా స్థానిక సంస్థలతో పాటు విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో అసెంబ్లీలో బిల్లుకు ఆమోదం సాధించిందని పేర్కొన్నారు. అయితే ఆ బిల్లును గవర్నర్ కేంద్రానికి పంపితే అక్కడ చట్టం చేయడానికి సహకరించాల్సిన బండి సంజయ్, కిషన్‌రెడ్డి అడ్డు తగులుతున్నారన్నారు.

అమలు చేసి తీరుతాం..

'కిషన్‌రెడ్డి, రాంచందర్‌రావులు బీసీలకు వ్యతిరేకంగా మాట్లాడితే అర్థం ఉంటుంది కానీ, బండి సంజయ్ మున్నూరు కాపు.. అయినా దేశ్‌ముఖ్‌లా వ్యవహరిస్తున్నారు' అని మహేశ్‌గౌడ్ ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డి.. రెడ్డి అయినా బీసీల కోసం కష్టపడుతున్నారన్నారు. ధర్మపురి అర్వింద్ బీసీల గురించి మాట్లాడడం లేదని, ఈటల రాజేందర్ ముఖం చాటేశారని విమర్శించారు. బండికి పౌరుషం ఉంటే మోదీ, అమిత్‌షాలను ఒప్పించి రెండు బిల్లులు, ఒక ఆర్డినెన్స్‌కు చట్టబద్ధత ఇప్పించాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్, కిషన్‌రెడ్డిలు ఎన్నికల్లో దేవుడి పేరుతో ఓట్లడుక్కునే బిచ్చగాళ్లని ఆయన విమర్శించారు.ఈ సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎంపీ సురేశ్‌షెట్కార్, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, మదన్ మోహన్‌రావు, తోట లక్ష్మీకాంతరావు, భూపతిరెడ్డి, ఆది శ్రీనివాస్, వెడ్మ బొజ్జు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ పాల్గొన్నారు.

సాఫీగా నిమజ్జనాలు.. సీఎం హర్షం

పోలీసు, రెవెన్యూ, విద్యుత్, పురపాలక, పీఆర్ శాఖలకు అభినందన



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌తో పాటు తెలంగాణ వ్యాప్తంగా వినాయక నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా ముగియడంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తొమ్మిది రోజులపాటు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా, అత్యంత భక్తి శ్రద్ధలతో శోభాయాత్ర ప్రశాంతంగా సాగడంలో అహర్నిశలు పనిచేసిన పోలీసు, రెవెన్యూ, విద్యుత్, రవాణా, మున్సిపల్, పంచాయతీ రాజ్ శాఖలు, ఇతర శాఖల అధికారులు, పారిశుధ్య సిబ్బంది, ఉత్సవ కమిటీల సభ్యులు, మండపాల నిర్వాహకులు, క్రేన్ ఆపరేటర్లు, భక్తులకు ఆయన అభినందనలు తెలిపారు. హైదరాబాద్ నగరంలో లక్షలాది విగ్రహాలను క్రమపద్ధతిలో నిర్దేశిత సమయానికి ట్యాంక్‌బండ్‌తో సహా మిగతా అన్ని ప్రాంతాల్లో నిమజ్జన కార్యక్రమం సాఫీగా, ప్రశాంతంగా సాగడానికి సహకరించిన ప్రజలందరికీ సీఎం అభినందనలు తెలిపారు.

సకాలంలో జీతాలు చెల్లించు

సీఎం రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు డిమాండ్



సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయుల దినోత్సవంలో ఆడంబరంగా ప్రకటనలు చేయడం కాదని, టీచర్లకు సకాలంలో జీతాలు చెల్లించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ పాలనలో గురుకుల విద్యావ్యవస్థ దీనస్థితికి చేరడం శోచనీయమన్నారు. 'విష జ్వరాలు, పాముకాట్లు, కుక్కకాట్లు, ఫుడ్ పాయిజనింగ్‌తో విద్యార్థులు ఆసుపత్రులపాలై ప్రాణాలు కోల్పోయే పరిస్థితి దాపురించింది. గురుకులాల్లో పనిచేస్తున్న 2,500 మంది కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి రెండు నెలల నుంచి జీతాలు ఇవ్వని దుస్థితి. ఇక నుంచి గురుకులాలను తానే పర్యవేక్షిస్తానని చెప్పిన సీఎం మాటలు నీటి మూటలు అయ్యాయి. కేసీఆర్ గారి హయాంలో గురుకుల విద్యావ్యవస్థ దేశానికి ఆదర్శంగా నిలిస్తే.. రేవంత్‌రెడ్డి పాలనలో నరక కూపాలుగా మారాయి. కాంగ్రెస్ 22 నెలల పాలనలో గురుకులాల ఖ్యాతి అధఃపాతాళానికి దిగజారింది. ఇది మీ అసమర్థ పాలనకు మరో నిదర్శనం. తక్షణమే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి పెండింగ్ జీతాలను చెల్లించాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం' అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

తెలంగాణలో పోలీస్ రాజ్యం: జగదీశ్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న జగదీశ్‌రెడ్డి

చివ్వెంల (సూర్యాపేట): తెలంగాణలో పోలీస్ రాజ్యం నడుస్తోందని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మంత్రులకు పాలన చేతకాక పోలీసులను ముందు పెడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్తలపై పోలీసులు అక్రమంగా కేసులు పెడుతున్నారని ఆయన మండిపడ్డారు. యూరియా కోసం వేచి ఉన్న రైతుల లైన్ ఫొటో తీసి పెడితే కేసులు పెట్టడం దుర్మార్గం అని ఆవేదన వ్యక్తం చేశారు. అర్థం లేని కేసులో అర్ధరాత్రి అరెస్టులు చేయడం హేయమైన చర్య అని ధ్వజమెత్తారు. ఓ తాగుబోతు ఇచ్చిన ఫిర్యాదుతో తమ పార్టీ సీనియర్ నాయకుడిని అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రభుత్వం చేస్తున్న మోసాలను ఎండగడుతున్నామన్నారు. ఎన్ని కేసులు పెడతారో, ఎంతమందిని జైల్లో పెడతారో తేల్చుకుంటామన్నారు. ఎటువంటి కేసులు తమకు కొత్తకాదన్నారు. ప్రజల అండ ఉన్నంత వరకు ఇటువంటి కేసులు భయ పెట్టలేవన్నారు. పోలీస్ అధికారులు చట్టం ప్రకారం పనిచేసేలా చూడాలని నల్లగొండ, సూర్యాపేట ఎస్పీలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, జూలకంటి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై నేడు సుప్రీంకోర్టులో విచారణ

హైకోర్టు తీర్పును సవాల్ చేసిన తెలంగాణ బీజేపీ

సాక్షి, న్యూఢిల్లీ: సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై దాఖలైన పరువు నష్టం పిటిషన్‌ను దేశ అత్యున్నత న్యాయస్థానం విచారించనుంది. ఎన్నికల ప్రచారంలో చేసిన వ్యాఖ్యలపై నమోదైన పరువు నష్టం దావాను హైకోర్టు రద్దు చేయడంతో తెలంగాణ బీజేపీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. తెలంగాణ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ బీజేపీ వేసిన పిటిషన్‌పై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్.గవాయి, జస్టిస్ కె.వినోద్‌చంద్రన్, జస్టిస్ అతుల్.ఎస్. చందుర్కర్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించనుంది.

ఇదీ కేసు...: 2024 లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మే 4న కొత్తగూడెంలో జరిగిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు బీజేపీ ప్రతిష్టను దెబ్బతీశాయని ఆరోపిస్తూ ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు గతేడాది ఫిర్యాదు చేశారు. బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దవుతాయని రేవంత్ తప్పుడు వాతావరణం సృష్టించారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదుపై హైదరాబాద్ ట్రయల్ కోర్టు ప్రైమాఫేసీ కేసు ఉందని గుర్తించింది. పూర్వపు ఐపీసీ సెక్షన్లతోపాటు ప్రజాప్రతినిధుల చట్టం 1951లోని సెక్షన్ 125 కింద కేసు కొనసాగుతుందని ఆదేశించింది. అయితే, రేవంత్ హైకోర్టును ఆశ్రయించి, రాజకీయ ప్రసంగాలు అతిశయోక్తులతో నిండినవేనని, వాటిని పరువు నష్టంగా పరిగణించడం తగదని వాదించారు. దీంతో హైకోర్టు రేవంత్‌రెడ్డి వాదనను సమర్థిస్తూ ట్రయల్ కోర్టు ఆదేశాలను రద్దు చేసింది. అయితే హైకోర్టు ఇచ్చిన ఈ తీర్పును సవాల్ చేస్తూ తెలంగాణ బీజేపీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి చంద్ర గ్రహణంలోని వివిధ దశలు ఇలా..



రాత్రి: 9:59 | 10:16 | 10:28 | 10:36 | 10:41 | 10:52 | 10:57 | 11:01 | 11:17



అంబేద్కర్ విగ్రహం వద్ద..



టెక్.. టాక్!

ఏంటి బ్రో.. నిజమే..

చాట్‌బాట్‌లు చెప్పేవన్నీ నిజాలు కావట.. కొన్ని వాటికవే ఊహించేసుకుని మనకు చెప్పేస్తాయట.. నిజం.. ఎందుకంటే.. దీన్ని చెప్పింది మేం కాదు.. ప్రఖ్యాత చాట్‌బాట్ సంస్థ చాట్ జీపీటీ నిర్వహణ సంస్థ అయిన ఓపెన్ ఏఐలోని పరిశోధనా బృందం. చాట్‌జీపీటీ వంటి చాట్‌బాట్‌లను లార్జ్ లాంగ్వేజ్ మోడల్(ఎల్ఎల్ఎం) అంటారు. ''లాంగ్వేజ్ మోడళ్లు ఎందుకు ఊహాత్మక సమాధానాలిస్తాయి?'' అనే అంశంపై ఓపెన్ ఏఐ పరిశోధకులు ఆడమ్ టౌమన్ కలాయ్, ఓఫెర్ నచూమ్, ఎడ్విన్ ఝాంగ్ సహా జార్జియా టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్‌లో కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్ సంతోష్ ఎం.వెంపాల సంయుక్తంగా ఒక నివేదికను రూపొందించి ఇటీవల విడుదల చేశారు. అందులో చెప్పిందే ఈ విషయం. వాళ్లేమంటారంటే..





''ఉదాహరణకు పాఠశాలల్లో పిల్లాడిని ఉపాధ్యాయుడు ఏదైనా ప్రశ్న అడిగితే.. సమాధానం కింద ఇచ్చే నాలుగు సమాధానాల్లో ఏదో ఒకటి చెబుతాడు. అయితే కరెక్ట్ అవుతుంది లేదంటే తప్పు. నాకు తెలీదు అని కూర్చుంటే ఉన్న ఒక్క మార్కు కూడా పోతుంది. అచ్చం అలాంటి పిల్లల్లాగే కృత్రిమ మేధ చాట్‌బాట్‌లు కూడా ప్రవర్తిస్తాయి. గతంలో తమ యూజర్లు ప్రాంప్ట్ మాదిరిగా అందించిన సమాచారంలో ఈ కొత్త ప్రశ్న తాలూకు సమాచారం లేకపోతే చాట్‌బాట్ సొంతంగా ఒక తప్పుడు సమాచారాన్ని సృష్టించి యూజర్‌కు అందజేస్తుంది. ఆ సమాధానంతో యూజర్ సంతృప్తి చెందితే తాను చెప్పిన అంశం వాస్తవానికి దగ్గరగా ఉందని చాట్‌బాట్ గుర్తుంచుకుంటుంది. లేదంటే మరోసారి మరో సమాధానం ఇస్తుంది. ఇలా చాట్‌బాట్‌లు ఎప్పటికప్పుడు కొత్త అంశాలపై సమీక్ష జరుపుకుంటూ తమను తాము మెరుగుపర్చుకుంటాయి. తప్పులను మనం ఆపలేం కానీ ఆ తప్పుల నుంచి పాఠాలను నేర్చుకోగలం అనే సిద్ధాంతంతో చాట్‌బాట్‌లు పనిచేస్తాయి''

అది బ్రో.. చాట్‌బాట్ నిజం వెనకున్న అసలైన నిజం..

గంటకు రూ. 5,000 ఇంతకీ దేనికి?



ఇంక దేనికి.. హిందీ చాట్‌బాట్‌ను సృష్టించేందుకు.. చాట్‌బాట్‌లను మనం తెగ వాడతాం. ఈ విషయం మెటా సహ వ్యవస్థాపకుడు మార్క్ జుకర్‌బర్గ్‌కు బాగా తెలుసు. అందుకే ఇప్పుడు హిందీ చాట్‌బాట్ కోసం క్రియేటర్లు, కాంట్రాక్టర్లను నియమించుకుంటున్నారు. ఇందుకోసం గంటకు దాదాపు రూ.5,000 చెల్లిస్తున్నారు. క్రిస్టల్ ఈక్వేషన్, ఆక్వెంట్ టాలెంట్ సంస్థల ద్వారా కొత్త ఉద్యోగుల ఎంపిక ప్రక్రియ ఇప్పటికే మొదలైంది. హిందీ, ఇండోనేషియన్, స్పానిష్, పోర్చుగీస్ భాషలు అనర్గళంగా మాట్లాడే వాళ్లకు తొలి ప్రాధాన్యం కల్పిస్తారు. కథలు చెప్పడం, పాత్రల సృష్టి, కృత్రిమమేధ కంటెంట్ తయారీ వంటి సృజనాత్మక రంగంలో ఆరేళ్ల అనుభవం ఉన్న అభ్యర్థులకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఇన్‌స్టాగ్రామ్, మెసెంజర్, వాట్సాప్ యాప్‌లలో హిందీ భాషలో చాట్‌బాట్‌ను సృష్టించడం ఈ ఉద్యోగుల ప్రధాన విధి. కోడింగ్ మాత్రమే కాదు ఈ మూడు యాప్‌లలో ఏఐ పాత్రలను సృష్టించే నిపుణులకు కూడా అవకాశాలు మెండుగా ఉన్నాయని కంపెనీ పేర్కొంది. టాలెంట్ ఉందా.. **మరి బీ రెడీ.**

కంటెంట్ ఈజ్ కింగ్..

కంటెంట్ క్రియేటర్లకు మార్కెట్లో డిమాండ్ ఉంది. కృత్రిమమేధ(ఏఐ) బ్రాండ్లు మార్కెట్లో మనుగడలో ఉండాలంటే కంటెంట్ క్రియేటర్లపై ఆధారపడక తప్పని పరిస్థితి. అందుకే కంటెంట్ స్ట్రాటజీ ఉద్యోగికి దాదాపు రూ.3.46 కోట్ల వార్షిక వేతనం ఇస్తామని తాజాగా ఓపెన్‌ఏఐ ప్రకటించింది. కంటెంట్ స్ట్రాటజీ, కాపీ రైటింగ్, గ్రోత్ మార్కెటింగ్ విభాగాల్లో ఆరేళ్ల అనుభవం ఉన్న అభ్యర్థులు దీనికి అర్హులని తెలిపింది. అక్షరాలు, ఆలోచనలకు వాస్తవరూపమిచ్చి కోట్లాది వినియోగదారుల మనసుల్ని



చూరగొనే ఉద్యోగులే మాకు కావాలని చెప్పింది. ఇంతకీ జాబ్ ఎక్కడంటే.. అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కో నగరంలో.. అందుకే కటౌట్ కాదు.. మన దగ్గరున్న కంటెంట్ ముఖ్యం అనేది..

ఏంటి భయ్యా ఇదీ..

మీరీ విషయం విన్నారా? తక్కువ వృత్తి నైపుణ్యాలున్న, కింది స్థాయి(ఎంట్రీలెవల్) ఉద్యోగాలను కృత్రిమమేధ తుడిచిపెట్టేస్తుందని కృత్రిమమేధ భద్రతా, పరిశోధనా సంస్థ 'ఆంత్రోపిక్' సీఈఓ డేరియో ఆమోడీ చెప్పారు. కన్సల్టింగ్, న్యాయసేవలు, ఫైనాన్స్, అడ్మినిస్ట్రేషన్ రంగాల్లో ఎంట్రీలెవల్ ఉద్యోగులు ఒకటి నుంచి ఐదేళ్లలోపు కొలువుల్ని కోల్పోవడం ఖాయమని చెప్పారు. బీబీసీ పాడ్‌కాస్ట్ అయిన ''బీబీసీ ర్యాడికల్ విత్ అమోల్ రాజన్' ఆడియో ఇంటర్వ్యూలో డేరియో పలు అంశాలపై మాట్లాడారు. ''న్యాయసేవలు అందించే సంస్థలు మొదలు ఫైనాన్స్, అడ్మినిస్ట్రేషన్ విభాగాల దాకా కొన్ని సంస్థల్లో డాక్యుమెంట్‌ల తనిఖీ అనేది మూస పద్ధతిలో సాగుతుంది. ఇలాంటి వైట్‌కాలర్ ఉద్యోగుల పనిని కృత్రిమమేధ సులభంగా చేయగలదు. అందుకే ఇలాంటి ఎంట్రీ లెవల్ ఉద్యోగాలు త్వరలో మాయం అవుతాయి. కిందిస్థాయి ఉద్యోగుల్ని ఏఐతో భర్తీచేయాలని ఎన్నో కంపెనీల చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు ఆలోచిస్తున్నారు. క్లరికల్ పనిని ఏఐతో చేయించాలని చూస్తున్నారు. ఎలాంటి సాఫ్ట్‌వేర్ కోడింగ్‌ను అయినా ఏఐ అనేది మూడు నుంచి ఆరు నెలల్లోపు నేర్చేసుకుంటుంది. దీంతో అత్యున్నతస్థాయి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు మినహా కిందిస్థాయి ఉద్యోగాలు డేంజర్‌లో పడనున్నాయి'' అని ఆయన హెచ్చరించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

లేబర్‌గా చేరి.. లోగుట్టు పట్టి

▶ మొదటి పేజీ తరువాయి

ఎండీ (మెఫిడ్రోన్) డ్రగ్స్ తయారు చేసి అమ్ముతున్నట్టుగా పోలీసులు ఆధారాలు సేకరించారు. ప్రతిసారి కనీసం 5 కిలోల చొప్పున మెఫిడ్రోన్ డ్రగ్స్ విక్రయించేవాడని, ఒక్కొక్క కిలో రూ.50 లక్షల చొప్పున ఏజెంట్లకు విక్రయించినట్టు పోలీసులు గుర్తించారు. బంగ్లాదేశ్ యువతి నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఏకంగా రూ.12వేల కోట్ల విలువైన డ్రగ్స్ తయారీ ముడి పదార్థాలను మహారాష్ట్ర పోలీసులు ఈనెల 5న గుర్తించిన విషయం తెలిసిందే. చర్లపల్లి ఇండస్ట్రియల్ ఏరియాలోని నవోదయ కాలనీలోని వాగ్దేవి ల్యాబ్స్ కెమికల్ ఫ్యాక్టరీలో డ్రగ్స్ తయారు చేస్తున్న నిర్వాహకుడు శ్రీనివాస్‌విజయ్ వోలేటి, అతడితో కలిసి పనిచేస్తున్న తానాజీ పండరీనాథ్ పట్వారీలను మిరా–భయందర్, వసాయ్–విరార్ (ఎంబీవీవీ) పోలీసులు అరెస్టు చేసిన విషయం విదితమే. ఈ సోదాల్లో భాగంగా స్వాధీనం చేసుకున్న 5 కిలోల 968 గ్రాముల ఎండీ (మెఫిడ్రోన్), 35,500 లీటర్ల ఇతర కెమికల్స్, 19 బాక్స్‌లలోని 950 కిలోల మిథైలిన్ డైక్లోరైడ్ (ఎండీసీ) పొడి సహా మెఫిడ్రోన్ (ఎండీ) తయారీకి వాడే ఇతర రసాయనాలు కలిపి మొత్తం 200 డ్రమ్ముల్లో ఉన్న కెమికల్స్‌ను, నాచారంలోని వాగ్దేవి ఇన్నోసైన్స్‌లో భారీగా నిల్వచేసిన డ్రగ్ పౌడర్‌ను ఆదివారం రెండు లారీల్లో ముంబైకి తరలించారు. శ్రీనివాస్‌విజయ్ ఓలేటి, తానాజీ పండరీనాథ్ పట్వారీలను కస్టడీకి తీసుకొని ప్రశ్నించేందుకు సిద్ధమవుతున్నారు. గతంలో



ఫ్యాక్టరీ నుంచి డ్రగ్స్ తయారీ కెమికల్స్‌ను తరలిస్తున్న దృశ్యం

పట్టుబడిన 11 మంది నిందితుల నుంచి సేకరించిన వివరాలతోపాటు వీరిద్దరిని కస్టడీకి తీసుకొని ప్రశ్నిస్తే మరిన్ని కొత్త కోణాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది. కాగా, డ్రగ్స్ పట్టుబడిన ఫ్యాక్టరీ ప్రాంతంలో స్థానిక పోలీసులు సైతం ఆధారాలు సేకరించినట్టు సమాచారం.

ఏడాది క్రితమే ఓలేటిపై డ్రగ్స్ కేసు

తాజా డ్రగ్స్ కేసులో పట్టుబడిన శ్రీనివాస్‌విజయ్ ఓలేటి పాత నేరస్తుడేనని ఎంబీవీవీ క్రైమ్ బ్రాంచ్ యూనిట్–4 ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ భడక్ 'సాక్షి'కి తెలిపారు. గతేడాది ముంబైలో డ్రగ్స్ సరఫరా చేస్తూ పోలీసులకు పట్టుబడ్డాడని, కేసు నమోదైందని చెప్పారు. ముంబై కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో బయటకు వచ్చి, మళ్లీ హైదరాబాద్ కేంద్రంగా డ్రగ్స్ తయారీ చేస్తున్నట్టు బంగ్లాదేశ్ యువతి అరెస్టుతో వెలుగులోకి వచ్చిందని తెలిపారు. కొన్నేళ్లుగా హైదరాబాద్ నుంచి ముంబై, బెంగళూరు, ఢిల్లీ వంటి మెట్రో నగరాలతోపాటు బంగ్లాదేశ్ వంటి ఇతర దేశాలకు కూడా డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు విచారణలో పోలీసులు గుర్తించారు. శ్రీనివాస్ విజయ్ ఓలేటి హైదరాబాద్ కేంద్రంగా వాగ్దేవి ల్యాబ్స్‌తో పాటు వాగ్దేవి ఇన్నోసైన్స్, అటెంటివ్ టెక్నాలజీస్ ప్రై.లి. కంపెనీలను సైతం నిర్వహిస్తున్నాడు.

డ్రగ్స్ తయారీ ఫ్యాక్టరీలపై ఫోకస్

హైదరాబాద్ శివారులో గుట్టుచప్పుడు కాకుండా ఇంత పెద్దమొత్తంలో డ్రగ్స్‌ను ఒక కెమికల్ ఫ్యాక్టరీ వెనుక భాగంలో నడుపుతుండడం సంచలనంగా మారింది. దీంతో అప్రమత్తమైన రాచకొండ పోలీసులు, ఈగల్ (ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్), హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్‌–న్యూ), డీసీఏ (డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్) సిబ్బంది అప్రమత్తమైంది. రసాయన ఫ్యాక్టరీలపై నిఘా పెంచాయి. కెమికల్ ఫ్యాక్టరీల పేరిట అనుమతులు తీసుకొని వాటిల్లో ఏం తయారు చేస్తున్నారు? మూతపడిన పరిశ్రమలు, రసాయన గోదాంల ప్రస్తుత పరిస్థితి ఏంటి ? వాటిలో ఏం నిల్వ చేస్తున్నారన్న అంశాలపై దృష్టి పెట్టారు. నగరంలో మత్తుపదార్థాలు తయారు చేసే ఫ్యాక్టరీలపై ఇప్పటికే దృష్టి పెట్టామని, గతంలోనూ ఆల్ప్రాజోలం, ఎఫిడ్రిన్ సహా ఇతర మత్తు పదార్థాలను గుర్తించిన ఘటనలు ఉన్నాయని ఈగల్‌కు చెందిన ఓ ఉన్నతాధికారి 'సాక్షి'కి తెలిపారు. అయితే కెమికల్ ఫ్యాక్టరీల్లో సోదాలు డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) పరిధిలోకి వస్తాయని, డీసీఏతో కలిసి ఈగల్ బృందాలు సైతం ఈ రకమైన సోదాల్లో పాల్గొంటున్నాయని చెప్పారు.

అంగన్‌వాడీ.. అనువైన స్థలమేదీ?

- 1,025 కేంద్రాలు మంజూరు చేస్తే... 625 కేంద్రాలకు స్థలాలు ఖరారు
- ఒక్కో భవన నిర్మాణానికి రూ.12 లక్షలు చొప్పున కేటాయింపు
- అన్ని కేంద్రాలకు స్థలాలు ఖరారయితే నిర్మాణ ప్రక్రియ షురూ..
- నవంబర్ 19 నాటికి అందుబాటులోకి కష్టమే !



సాక్షి, హైదరాబాద్: కొత్తగా మంజూరైన అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. స్థలాల లభ్యతపై స్పష్టత రాకపోవ డమే ప్రధాన సమస్య. రాష్ట్రవ్యాప్తంగా 1,025 అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఒక్కో అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి రూ.12 లక్షలు చొప్పున విలువను నిర్ధారించిన ప్రభుత్వం... స్థలాల గుర్తింపు పూర్తయిన తర్వాత టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లను ఎంపిక చేసి నిర్మాణాలు ప్రారంభించాలని నిర్ణయించింది.

స్థలాల అన్వేషణపై జిల్లా యంత్రాంగాల ఉదాసీనత

2025–26 వార్షిక సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా 1,025 అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయిస్తూ.. రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు ప్రతిపాదనలను ఆమోదించింది. ఆయా జిల్లాల్లో నిర్దేశించిన లొకేషన్లలో అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి స్థలాలను గుర్తించి... ప్రతిపాదనలను సమర్పించాలని కమిషనరేట్ అధికారులు ఆదేశించారు. ఇప్పటివరకు 625 చోట్ల మాత్రమే స్థలాలను గుర్తించారు. మిగిలిన చోట్ల స్థలాల గుర్తింపులో తీవ్ర జాప్యం జరుగుతోంది. వాస్తవానికి మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని నవంబర్ 19వ తేదీన భవనాలను ప్రారంభించాలని అధికారులు భావించారు. ఈ మేరకు వేగవంతంగా మంజూరు ప్రక్రియను పూర్తి చేశారు. దీనిపై మంత్రి సీతక్క పలుమార్లు సమీక్షలు నిర్వహించి జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినా, స్థలాల గుర్తింపు ప్రక్రియే పూర్తికాలేదు. ఈ నెలాఖరుకల్లా అన్ని జిల్లాల నుంచి స్థలాల ప్రతిపాదనలు ఖరారు చేసి పంపాలని ఇటీవల రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ స్పష్టత ఇచ్చింది. దీంతో నెలాఖరుకల్లా స్థలాల ఎంపిక పూర్తయితే... ఆ తర్వాత కాంట్రాక్టర్ల ఎంపిక చేపట్టి నిర్మాణ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని అధికారుల చర్యలు వేగవంతం చేశారు. అయితే నవంబర్ 19వ తేదీ నాటికి నిర్మాణాలు పూర్తయ్యే పరిస్థితి మాత్రం కనిపించడం లేదు.

తాడిపత్రి నుంచి వెళ్లిపొండి..

- 24 గంటలు గడవక ముందే కేతిరెడ్డి పెద్దారెడ్డికి ఆదేశాలు
- సీఎం పర్యటన నేపథ్యంలో భద్రత కల్పించలేమన్న పోలీసులు



తాడిపత్రి నుంచి వెళ్లాలని కేతిరెడ్డి పెద్దారెడ్డిని ఆదేశిస్తున్న పోలీసులు

తాడిపత్రి టౌన్ : సుప్రీం కోర్టు ఆదేశాలతో దాదాపు 16 నెలల తర్వాత తాడిపత్రికి చేరుకున్న వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని 24 గంటలు గడవక ముందే పోలీసులు హైడ్రామా మధ్య ఆది వారం ఆయన్ను తిరిగి స్వగ్రామం తిమ్మంపల్లికి పంపించారు. అనంతపురం జిల్లా తాడిపత్రిలోని కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటికి ఉ.7 గంటలకే చేరుకున్న డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, సీఐలు రామసుబ్బయ్య, శివగంగాధర్‌రెడ్డి, ఈరన్న, సత్యబాబు.. ఈనెల 10న జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటన ఉన్నందున పోలీస్ బలగాలను అక్కడికి పంపిస్తున్నామని, మీకు భద్రత కల్పించలేమని, తిమ్మంపల్లికి తిరిగి వెళ్లాలని సూచించారు. ఈ మేరకు తనకు లిఖితపూర్వకంగా ఆదేశాలివ్వాలని కేతిరెడ్డి పెద్దారెడ్డి కోరారు. దీంతో.. జిల్లా ఎస్పీ జగదీష్ పేరుతో మెయిల్ పంపించారు. ఇందుకు పెద్దారెడ్డి ఎస్పీకి బదులిస్తూ.. తాను చట్టానికి లోబడే ఉంటానని, పోలీసులకు సహకరిస్తూ తిమ్మంపల్లికి వెళ్లేందుకు సిద్ధమవుతున్నానని తన లేఖలో పేర్కొన్నారు. సీఎం పర్యటన ముగిసిన తర్వాత తిరిగి 11న తాడిపత్రికి వస్తానన్నారు.

జేసీ వస్తున్నారన్న సమాచారంతోనేనా?

కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రికి వచ్చినప్పటి నుంచి టీడీపీ నాయకుడు జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి పట్టణంలో లేరు. వారు తిరిగి తాడిపత్రికి వస్తున్నారన్న సమాచారంతోనే కేతిరెడ్డి పెద్దారెడ్డిని పోలీసులు తాడిపత్రి నుంచి బలవంతంగా పంపించి వేశారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అయితే, 11న తిరిగి తాడిపత్రికి వస్తానన్న కేతిరెడ్డి పెద్దారెడ్డి మాటలతో ఆ రోజు పోలీసులు ఎలాంటి హైడ్రామా నడుపుతారోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నెల్లుట్ల రమాదేవికి కాళోజీ పురస్కారం

- హృద్యమైన సాహిత్యానికి చిరునామా రమాదేవి
- 9న కాళోజీ జయంతి సందర్భంగా పురస్కారం ప్రదానం

సాక్షి, హైదరాబాద్/స్టేషన్‌ఘన్‌పూర్/హన్మకొండ కల్చరల్: ప్రజాకవి, పద్మ విభూషణ్ కాళోజీ నారాయణరావు పేరిట భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఏటా అందజేస్తున్న సాహితీ పురస్కారానికి 2025వ సంవత్సరానికి గాను ప్రముఖ కవయిత్రి, రచయిత్రి, కాలమిస్ట్ నెల్లుట్ల రమాదేవి ఎంపికయ్యారు. లోక కవి, తెలంగాణ రాష్ట్ర గీత రచయిత అందెశ్రీ అధ్యక్షతన ఏర్పాటైన నిపుణుల కమిటీ ఆమె పేరును సిఫారసు చేయగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమోదించి, ఆమెకు అభినందనలు తెలిపారు. మంగళవారం సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతిలో జరిగే కాళోజీ జయంతి వేడుకల్లో పురస్కారాన్ని రమాదేవికి ప్రదానం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ ఇతర ప్రముఖులు పాల్గొంటారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

'రమ'పేరుతో రచనలు

నెల్లుట్ల రమాదేవి స్వస్థలం జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్. 1962 జనవరి 12న జన్మించారు. ఆమె 'రమ'కలం పేరుతో కార్టూనిస్టుగానూ ప్రసిద్ధులు. ఆమె తల్లిదండ్రులు శకుంతలా దేవి, కీ. శే. నెల్లుట్ల రామచందర్‌రావు. భర్త కీ.శే. వేముల దేవేందర్. ఆమెకు ఇద్దరు సంతానం. రమాదేవి ఎస్సెస్సీ వరకు స్టేషన్ ఘన్‌పూర్‌లో, ఇంటర్, హైదరాబాద్‌లోని రెడ్డి కాలేజీలో చదివారు. కాకతీయ వర్సిటీలో అర్థశాస్త్రంలో పీజీ చేశారు. ఆంధ్రాబ్యాంకులో సీనియర్ బ్యాంక్ మేనేజర్‌గా పనిచేశారు. ప్రస్తుతం బ్యాంకు ఉద్యోగులకు శిక్షణ ఇస్తున్నారు. కాలేజీలు, స్కూళ్లలో విద్యార్థులకు ఓరియంటేషన్ తరగతులు కూడా చెబుతుంటారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్‌లో సభ్యురాలిగా, వ్యక్తిగత స్థాయిలోనూ పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

చాలా సంతోషంగా ఉంది



కాళోజీ పురస్కారానికి ఎంపిక కావడం ఎంతో సంతోషంగా ఉంది. తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అందించే ఈ పురస్కారం ఇప్పటివరకు 11 మందికి లభించింది. కాళోజీ పుట్టిన గడ్డమీద కాళోజీ పేరిట ఉన్న అవార్డుకు ఎంపిక కావడం గౌరవంగా భావిస్తున్నాం. వేణుగోపాల్‌తో మొదలైన ప్రతిష్టాత్మక అవార్డును గోరటి వెంకన్న తదితరులు అందుకున్నారు. ఈ అవార్డును మొదటి మహిళగా అందుకోవడం చాలా సంతోషంగా ఉంది. **- నెల్లుట్ల రమాదేవి**

రమాదేవి రచనలు

- మనసు భాష (కవిత్వం)- 2011
- రమణీయం (కార్టూన్లు)- 2011
- మనసు మనసుకూ మధ్య (కథలు)- 2011
- చినుకులు (నానీలు)- 2021
- తల్లి వేరు (కథలు)-2021
- డి. కామేశ్వరి కథలపై మోనోగ్రాఫ్-2023
- అశ్రువర్ణం (కవిత్వం)-2024
- రమాయణం-1 (కాలమ్స్)-2024
- పురస్కారాలు
- సుశీలా నారాయణ రెడ్డి పురస్కారం (కవయిత్రి తొలి సంపుటికి -2004)
- అపురూప అవార్డు- కార్టూన్లకు (2014)
- తెలంగాణ ప్రభుత్వ ఉత్తమ రచయిత్రి (వరంగల్ జిల్లా)- రాష్ట్ర ఆవిర్భావ ప్రథమ వార్షికోత్సవం (2015)
- పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం (2015)
- జాతీయ సాహిత్య పరిషత్తు, సిద్దిపేట ఐతా భారతి చంద్రయ్య సంప్రదాయ కథా సాహితీ పురస్కారం (2015)
- గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్ అవార్డు - కథలకు (2017)
- పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారం (2017)
- గుఱ్ఱం జాషువా ఫౌండేషన్ పురస్కారం (2018)
- వెంకటసుబ్బు స్మారక అవార్డు (2019)
- పర్చా రంగారావు స్మారక అవార్డు - (2019)
- తిరుమల స్వరాజ్యలక్ష్మి సాహితీ పురస్కారం - (2021)
- రాగతి పండరి స్మారక పురస్కారం- కార్టూనిస్ట్‌గా బాపు రమణ అకాడమీ వారిచే (2021)
- ప్రొ. వాసిరెడ్డి భాస్కర్ రావు స్మారక పురస్కారం - తల్లివేరు కథా సంపుటికి (2023)
- ఎక్స్ రే పత్రిక ఉత్తమ కవితా పురస్కారం -2024
- డా.రాణీ పులోమజాదేవి స్మారక గౌరవ పురస్కారం - తల్లివేరు కథా సంపుటికి (2025)
- డా. సినారె సాహిత్య పురస్కారం- 2025 (యాదాద్రి భువనగిరి జిల్లా రచయితల సంఘం -2025)
- అబోపా, వరంగల్ వారి సాహిత్య కళానిధి పురస్కారం- 2025

రేపటి నుంచి 7వ ఆల్ ఇండియా ప్రిజన్స్ డ్యూటీ మీట్

- పోలీస్ అకాడమీకి చేరుకుంటున్న వివిధ రాష్ట్రాల జట్లు

సాక్షి, హైదరాబాద్: జాతీయ స్థాయిలో ఈనెల 9 నుంచి 11 వరకు మూడు రోజులపాటు నిర్వహించనున్న 7వ ఆల్ ఇండియా డ్యూటీ మీట్‌కు తెలంగాణ జైళ్లశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. తెలంగాణ పోలీస్ అకాడమీలో మంగళవారం ఉదయం 9.30 గంటలకు డ్యూటీమీట్‌ను ముఖ్యఅతిథి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించనున్నట్టు జైళ్ల శాఖ డీజీ సౌమ్యా మిశ్రా తెలిపారు. బీపీఆర్అండ్‌డీ (బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్), తెలంగాణ జైళ్లశాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ డ్యూటీ మీట్‌లో.. 21 రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లోని జైళ్ల శాఖల సిబ్బంది పాల్గొంటున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే చాలా జట్లు హైదరాబాద్‌కు చేరుకున్నట్టు తెలిపారు. మొత్తం 31 అంశాల్లో పోటీలను నిర్వహించనున్నారు.

ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థికే వైఎస్సార్‌సీపీ మద్దతు

సాక్షి, న్యూఢిల్లీ: ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌కు వైఎస్సార్ సీపీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వైవీ సుబ్బారెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం ఢిల్లీలో కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి ఆహ్వానం మేరకు ఎన్డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌తో సుబ్బారెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. 'పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మా పార్టీకి చెందిన 11 మంది ఎంపీలు ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో సీపీ రాధాకృష్ణన్‌కే అనుకూలంగా ఓటు వేస్తారు' అని తెలిపారు. రాజ్యాంగబద్ధమైన పదవుల ఎన్నిక ఏకగ్రీవంగా జరగాలన్నది వైఎస్ జగన్ అభిమతమని, ఆ స్ఫూర్తితోనే తాము ఎన్డీఏ అభ్యర్థికి మద్దతిస్తున్నా మని ఆయన పునరుద్ఘాటించారు. తమ మద్దతు ప్రకటించినందుకు వైఎస్ జగన్‌కు రాధాకృష్ణన్ ప్రత్యేకంగా ఫోన్‌లో ధన్యవాదాలు తెలిపారని సుబ్బారెడ్డి పేర్కొన్నారు. అంతేగాక ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో తగినంత సంఖ్యాబలం లేకపోయినా కాంగ్రెస్ పార్టీ పోటీకి దిగడాన్ని సుబ్బారెడ్డి తప్పుబట్టారు. కేవలం పోటీ చేయాలనే ఉద్దేశంతోనే అభ్యర్థిని నిలబెట్టారని పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎంపీలకు మాక్ పోలింగ్

ఉపరాష్ట్రపతి ఎన్నికల నేపథ్యంలో తమ పార్టీ ఎంపీలకు ఓటింగ్‌పై అవగాహన కల్పించేందుకు మాక్ పోలింగ్ నిర్వహించనున్నట్లు సుబ్బారెడ్డి తెలిపారు. సోమవారం మధ్యాహ్నం ఒంటిగంటకు ఢిల్లీలోని తన నివాసంలో ఎంపీలతో సమావేశమై మాక్ పోలింగ్ నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు.



సీపీ రాధాకృష్ణన్‌ను కలిసిన వైవీ సుబ్బారెడ్డి





ఎవరైతే బంధనాలను విప్పుకోవాలనుకుంటున్నారో, దుఃఖం నుండి ముక్తి పొందాలనుకుంటున్నారో, వారు తమ మనస్సును వశపరచుకోండి. తమ మనస్సు వశంలోకి జారుకోకండి.

- ఎస్.ఎన్. గోయెంకా

సాక్షి

సోమవారం, 8 సెప్టెంబర్ 2025

అక్షరాల చదువులు

అన్నమే కాదు, అక్షరమూ పరబ్రహ్మ స్వరూపమే! బొందిలో ప్రాణాన్ని నిలుపుకోవడానికి అన్నం ఎంత అవసరమో; ఆలోచనలను పదును పెట్టుకోవడానికి, పదును పెట్టుకున్న ఆలోచనలను పదికాలాల పాటు పదిలపరచుకోవడానికి అక్షరం అంతే అవసరం. 'అక్షరం బ్రహ్మ పరం స్వభావో అధ్యాత్మముచ్యతే/ భూతభావోద్భవకరో విసర్గః కర్మసంజ్ఞితః' అని 'భగవద్గీత' చెబుతోంది. అంటే, నాశనం లేని అక్షరమే పరబ్రహ్మం. అక్షర స్వభావమే, తన ఆత్మరూపమే అధ్యాత్మం అని అర్థం. అక్షరం జ్ఞానకళిక. ప్రపంచం సాధించిన నేటి పురోగతికి అక్షరమే ఆలంబన. అక్షరమే లేకుంటే, నేటికీ ప్రపంచం అజ్ఞాన తమస్సమాధిలోనే కూరుకుని ఉండేది.

అనంత జ్ఞానయానానికి అక్షరం తొలి అడుగు మాత్రమే! కేవలం అక్షరాస్యత వల్లనే ఎవరూ జ్ఞానఖనులు కాలేరు. 'జీవితంలో విజయవంతం కావాలంటే అక్షరాస్యత, డిగ్రీలు మాత్రమే చాలవు; విద్య కావాలి' అన్నారు ప్రఖ్యాత హిందీ రచయిత మున్షీ ప్రేమ్‌చంద్. ఆయన మాట అక్షరసత్యం. మన దేశంలో పట్టభద్రుల సంఖ్య పెరుగుతున్నంతగా విద్యావంతుల సంఖ్య పెరగడం లేదు. అక్షరాస్యత సాధించడమే ఘన కార్యంగా ప్రచారం చేసుకునే దశ నుంచి మన ప్రభుత్వాలు ఎంత త్వరగా బయటపడితే దేశానికి అంత మంచిది. మన దేశంలోని బడిపిల్లల్లో అక్షరాస్యత కూడా అరకొరగానే ఉంటోంది. ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు చదువుకుంటున్న విద్యార్థుల్లో దాదాపు సగం మందికి ప్రాథమిక స్థాయి అంశాలపై కూడా అవగాహన లేదని; చిన్న చిన్న లెక్కలు చేయడానికి, సరళమైన వాక్యాలు రాయడానికి కూడా వీరు సతమతమయ్యే స్థితిలోనే ఉన్నారని కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ పరిశీలనలో తేలింది. నేటి బడిపిల్లలే రేపటి పట్టభద్రులు. నేటి పునాదులే ఇంత చక్కగా ఉంటే, ఈ పునాదుల పైనే వెలిసే రేపటి భవంతులు ఎంత దృఢంగా ఉంటాయో ఊహించుకోవాల్సిందే!

మన చదువుల తీరుతెన్నులపై ఇప్పుడు కొత్తగా పుట్టుకొచ్చిన ఆందోళన కాదిది. ఈ పరిస్థితి బ్రిటిష్ హయాంలోనూ ఉండేది. 'ఇంగిలీషుతో పాటుగా నిపుడు సంస్కృ/ తమ్మునకు గూడ డిగ్రీల తంపి వచ్చె/ నట్లు ప్యాసగు వారలయందెవండొ/ తక్క దక్కినవారు శుద్ధ జడమతులె' అని చెళ్లపిళ్లవారు అప్పట్లోనే వాపోయారు. బ్రిటిష్ పాలన ముగిసి, దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు దాటినా, మన అక్షరాస్యత డెబ్బయి ఐదు శాతానికి లోపే! అంటే, ఇంకా దాదాపు నాలుగో వంతు జనాభా అక్షరాస్యతకు దూరంగానే ఉంది. స్వాతంత్ర్యం వచ్చే నాటితో పోల్చుకుంటే దేశంలోని పట్టభద్రుల సంఖ్య దాదాపు నూటయాభై రెట్లు పెరిగింది. డిగ్రీల మీద డిగ్రీలు సంపాదించుకుంటున్న బహుపట్టభద్రుల్లో ఎంతమంది వివేకం కలిగిన విద్యావంతులో నిగ్గుతేల్చడం అంత సాధ్యమయ్యే పనికాదు. అయినా, ఎవరి డిగ్రీలు వారి వ్యక్తిగతాలు. వాటి గురించి ఎంత తక్కువగా మాట్లాడుకుంటే అంత మంచిది.

అక్షరాస్యత వలన విద్య; విద్య వలన వినయ వివేకాలు ఒనగూరుతాయనేది ఒక చిరకాల విశ్వాసం. విశ్వాసాలు విశ్వాసాలే! విశ్వాసాలన్నీ వాస్తవాలు కావాలనే నిబంధనేదీ లేదు. 'చదువది యెంతగల్గిన రసజ్ఞత యించుక చాలకున్న నా/ చదువు నిరర్థకమ్ము గుణసంయుతులెవ్వరు మెచ్చరెచ్చటన్/ బదునుగ మంచి కూర నలపాకము చేసిననైన నందు నిం/పొదవెడు నుప్పులేక రుచి బుట్టక నేర్చునటయ్య భాస్కరా!' అన్నాడు శతకకారుడు. ఎంత చదువు చదివినా, కాస్త రసజ్ఞత లేకుంటే ఆ చదువు నిరర్థకమే! గుణవంతులెవరూ అలాంటి చదువును మెచ్చరు అని మారవి వెంకయ్య కవిహృదయం.

'చదువని వాడజ్ఞుండగు/ చదివిన సదసద్వివేక చతురత గలుగున్/ చదువగ వలయును జనులకు/ చదివించెదనార్యులొద్ద చదువుము తండ్రీ!' అని పోతనామాత్యుడు భాగవతంలో హిరణ్యకశిపుడి పాత్ర ద్వారా చెప్పారు. ప్రహ్లాదుడిని చండామార్కుల గురుకులానికి పంపిస్తూ, ఎందుకు చదువుకోవాలో చెప్పాడు హిరణ్యకశిపుడు. మన పూర్వ కవులకు తెలిసిన చదువుల ప్రయోజనానికీ, నేటి జనాలకు తెలిసిన చదువుల ప్రయోజనానికీ నడుమ యోజనాల దూరం ఉంది. అక్షరాస్యత వలన డిగ్రీలు; డిగ్రీల వలన కొలువులు ఒనగూరుతాయనేదే నేటి విశ్వాసం.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** బ.పాడ్యమి ప.11.39 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** పూర్వాభాద్ర రా.10.10 వరకు, తదుపరి ఉత్తరాభద్ర, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ప.12.21 నుండి 1.10 వరకు, తదుపరి ప.2.47 నుండి 3.36 వరకు, **అమృత ఘడియలు:** ప.2.35 నుండి 3.56 వరకు, **మహాలయపక్ష ప్రారంభం.**

సూర్యోదయం : 5.50
సూర్యాస్తమయం: 6.07
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

సోషల్ టాక్

నా పాట



ఇప్పుడు నాకున్న ఏకైక కోరిక, పాడుతూనే నేను పాటలో ఐక్యమైపోవాలని. నా జీవితమంతా పాడుతూనే ఉన్నాను. మూడేళ్ల వయసులో శాస్త్రీయ సంగీతం నేర్చుకోవడం మొదలుపెట్టాను. పాడటం మొదలుపెట్టి 82 సంవత్సరాలు అయింది. ఇదే కదా జీవన సాఫల్యం.

- ఆశా భోస్లే, ప్లేబ్యాక్ సింగర్ (92)

ఒత్తిడి



ఒత్తిడిలో ఉండటం అనేది ఎప్పుడూ మంచి విషయమే. ఒత్తిడిలో మనం మన శక్తులన్నీ కూడదీసుకుని పని చేస్తాం. అత్యుత్తమమైన ఫలితాలను సాధిస్తాం. ఒత్తిడి మనిషిని కుదిపి, చిలికి, నాణ్యమైన దానిని బయటికి తీస్తుంది.

- మొహమ్మద్ అజారుద్దీన్, క్రికెట్ దిగ్గజం

ప్రతిభ



మనం ప్రతిభను తప్పుగా అంచనా వేస్తాం. రన్స్ తియ్యటం, వికెట్లు పడగొట్టటం, చక్కగా ఫీల్డింగ్ చెయ్యటం... ఇవి మాత్రమే ప్రతిభ కాదు. టైమ్ సెన్స్, దృఢ సంకల్పం, ధైర్యం, క్రమశిక్షణ, స్వభావంలోని తమాయింపు కూడా ప్రతిభ కిందకే వస్తాయి.

- రాహుల్ ద్రావిడ్, క్రికెటర్, కోచ్

మహిళలూ..!



మీరు ఏమి అవలేరో అది అవండి. మీరు ఏమి చేయలేరో అది చేయండి. మీకున్న పరిమితుల నుంచి పాఠాలు నేర్చుకోండి. మీరు శారీరకంగా బలహీనులు కావచ్చు, మీరు బిగ్గరగా మాట్లాడలేకపోవచ్చు, కానీ, మీ మనోబలం మీరు ఏదైనా సాధించేలా చేస్తుంది.

- శిఖా గోయెల్, పోలీసు ఉన్నతాధికారి

ఆచరణ



మీ ఐడియాలతో మీరు ప్రేమలో పడిపోకండి. అవి అద్భుతమైన ఆలోచనలే కావచ్చు, కానీ ఆచరణకు కష్టం అవుతుంటే వెంటనే వాటిని వదిలించుకోండి. నచ్చని వ్యక్తులకు చెప్పినట్లే, మీకు నచ్చిన మీ ఆలోచనలకూ 'నో' చెప్పగలిగే ధైర్యం మీకు ఉండాలి.

- అంక్లేసరియా అయ్యర్, కాలమిస్ట్

జ్ఞానం



దేశంలో మంచి వనరులు కలిగి ఉన్న ఐఐటీలు, ఐఐఎంలు కూడా అవసరమైన సమాచారాన్ని ప్రచురణకర్తలకు ఇవ్వటం లేదు. దీనివల్ల పరిశోధనల నాణ్యత తగ్గే ప్రమాదం ఉంది. జ్ఞానాన్ని పంచుకుంటేనే కదా పురోగతి సాధ్యమయ్యేది.

- అరుల్ జార్జ్ స్కారియా, లా ప్రొఫెసర్

విక్రమ్... ఒక గేమ్ ఛేంజర్

విశ్లేషణ




టి.వి. వెంకటేశ్వరన్

భారతదేశం పూర్తిగా స్వదేశీ టెక్నాలజీతో అభివృద్ధి చేసిన 32 బిట్ ప్రాసెసర్ 'విక్రమ్ 3201' ప్రత్యేకత ఏమిటి? రేపటి తరం ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్లను నడిపేంత శక్తిమంతమైంది కాకపోవచ్చు కానీ... భారతదేశ అంతరిక్ష ప్రయోగాల్లో మాత్రం కీలకపాత్ర పోషించనుంది. ఇటీవల నిర్వహించిన 'ఇండియా సెమికాన్' సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ అందుకున్న విక్రమ్ 3201 ప్రాసెసర్‌దే ప్రతిష్ఠాత్మక చంద్రయాన్, గగన్‌యాన్ యాత్రల ఎలక్ట్రానిక్స్‌లో ముఖ్య భూమిక. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) డిజైన్ చేయగా మొహాలీలోని సెమీకండక్టర్ లేబొరేటరీ తయారు చేసిన ఈ ప్రాసెసర్‌కు భారతదేశం గర్వించదగ్గ శాస్త్రవేత్త విక్రమ్ సారాభాయి పేరు పెట్టారు. గతేడాది డిసెంబరులో ఇస్రో ప్రయోగించిన పీఎస్ఎల్వీ సీ–60లో విజయవంతంగా పరీక్షించి చూశారు కూడా. 2009 నుంచి ఉపయోగిస్తున్న విక్రమ్ 1601 ప్రాసెసర్ స్థానంలో ఇకపై విక్రమ్ 3201ను ఉపయోగిస్తారు.

పోటీ పడలేనప్పటికీ...

ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్లలో ఉపయోగిస్తున్న ప్రాసెసర్లతో పోల్చి చూస్తే విక్రమ్ 3201 గొప్ప శక్తిమంతమైందేమీ కాదు. సాంకేతిక పరిజ్ఞానం విషయంలోనూ స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లలోని ప్రాసెసర్లతో సరితూగేది కాదు. ఆధునిక ఎలక్ట్రానిక్ పరికరాల్లో 64 బిట్ ప్రాసెసర్లు ఉపయోగిస్తూండగా విక్రమ్ 32 బిట్ ప్రాసెసర్ మాత్రమే. కొంచెం సింపుల్‌గా చెప్పాలంటే 32 బిట్ ప్రాసెసర్‌తో నాలుగు గిగాబైట్ల ర్యామ్‌తో పనిచేయగలం. అదే 64 బిట్ ప్రాసెసర్‌తోనైతే 8 గిగాబైట్లు, అవసరమైతే 16 గిగాబైట్ల ర్యామ్‌తోనూ పనిచేయించవచ్చు. అంటే, 64 బిట్ ప్రాసెసర్‌తో చేయగలిగిన పనులన్నీ 32 బిట్ ప్రాసెసర్‌తో చేయడం కష్టమన్నమాట. అంతేకాదు... విక్రమ్ 3201ను 180 నానోమీటర్ల సైజున్న ట్రాన్సిస్టర్లతో తయారు చేశారు. ఆధునిక మైక్రోప్రాసెసర్లలోని ట్రాన్సిస్టర్ల సైజు ప్రస్తుతం మూడు నానోమీటర్లు! సైజు తక్కువగా ఉంటే ప్రాసెసర్‌లో ఎక్కువ ట్రాన్సిస్టర్లు పడతాయి. తద్వారా వాటి వేగం, సామర్థ్యాలు పెరుగుతాయి. ఈ రకంగా చూస్తే విక్రమ్ 3201 ఎప్పుడో 1990ల నుంచి 2000 సంవత్సరం వరకూ అందుబాటులో ఉన్న ప్రాసెసర్ల స్థాయిది. ఇంటెల్ కోర్ ఐ5 ప్రాసెసర్, ఎలెవన్త్ జనరేషన్ కూడా పది నానోమీటర్ల ట్రాన్సిస్టర్లతో తయారైందన్నది గమనార్హం. ట్రాన్సిస్టర్ల సైజు తక్కువగా ఉంటే ప్రాసెసర్ సైజు తగ్గి... చిన్న చిన్న పరికరాల్లోనూ ఏర్పాటు చేసుకోవచ్చు.



◆ దుర్భర పరిస్థితులను తట్టుకుని, అతి తక్కువ తప్పులతో పనిచేసేలా 32 బిట్ ప్రాసెసర్ విక్రమ్ 3201ను తయారు చేశారు. 'అంతరిక్ష రంగంలో స్వావలంబన' అన్న భారత్ ఆశలు నెరవేర్చడంలో విక్రమ్ 3201 మేలి మలుపు.

అన్నింటికీ తట్టుకునేలా...

అయితే స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లతో పోలిస్తే అంతరిక్షంలో ఉపయోగించే ఎలక్ట్రానిక్స్ తీరుతెన్నులు భిన్నం. అవి అంతరిక్షంలోని కఠిన పరిస్థితులను తట్టుకుని పనిచేయాలి. అక్కడ ఉష్ణోగ్రతల్లో విపరీతమైన మార్పులుంటాయి. భూ కక్ష్యలో తిరుగుతున్నప్పుడు సూర్యాభిముఖంగా ఉన్నప్పుడు ఉపగ్రహాలు 125 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రతలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇంకో వైపు ఉన్నప్పుడు ఉష్ణోగ్రతలు–55 డిగ్రీ సెల్సియస్‌కు పడిపోతాయి. రేడియోధార్మికత కూడా ఎక్కువ. పైగా ప్రయోగ సమయంలో పుట్టే ఎలక్ట్రిక్ ప్రకంపనలు, ధ్వని తాలూకూ షాక్‌లను తట్టుకుని మరీ పనిచేయాల్సి ఉంటుంది. భూ వాతావరణ పొర తాలూకూ రక్షణ ఉండదు కాబట్టి సౌరగాలులు, అత్యంత శక్తిమంతమైన కణాలతో కూడిన కాస్మిక్ రేస్ వంటివన్నీ నిత్యం ప్రాసెసర్లకు పరీక్ష పెడుతూంటాయి. ప్రాసెసర్లలో సమాచారం '1', '0'ల రూపంలోనే నిక్షిప్తమవుతూ ఉంటుంది. ట్రాన్సిస్టర్ల గుండా విద్యుత్తు ప్రవహిస్తే '1', ప్రవహించకపోతే '0' అన్నమాట. ఖగోళం నుంచి దూసుకొచ్చే శక్తిమంతమైన కణాలు ట్రాన్సిస్టర్లపై ప్రభావం చూపితే సమాచారం తారుమారయ్యే ప్రమాదం ఉంటుంది. ఆధునిక మైక్రో ప్రాసెసర్లలో ఇలా జరిగేందుకు అవకాశాలు ఎక్కువ. ట్రాన్సిస్టర్ల సైజు తక్కువగా ఉండటం, విద్యుదావేశాన్ని నిలిపి ఉంచుకోవడం దీనికి కారణాలు. విక్రమ్ 3201లో 180 నానోమీటర్ల ట్రాన్సిస్టర్లు ఉండటం వల్ల ఈ తప్పులు జరగవు.

వేగం కంటే అవసరాలే ముఖ్యం...


పీఎస్ఎల్వీ వంటి అంతరిక్ష ప్రయోగాల్లో టెలిమెట్రీ, నావిగేషన్, కంట్రోల్ సిస్టమ్స్ వంటివి నమ్మకంగా పనిచేయాలి. ఈ అవసరాలతో పోలిస్తే స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లలోని ప్రాసెసర్ల గిగాబైట్ల వేగం అంత ముఖ్యం కాదు. అత్యంత దుర్భర పరిస్థితులను తట్టుకుని, అతితక్కువ తప్పులు, వైఫల్యాలతో పనిచేసేలా విక్రమ్ 3201ను తయారు చేశారు. అంతరిక్ష రంగంలో స్వావలంబన అన్న భారతదేశ ఆశలు నెరవేర్చడంలో విక్రమ్ 3201 మేలి మలుపు కాగలదనడంలో సందేహం లేదు. 2009లో కార్టోశాట్ ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టేందుకు ఉపయోగించిన పీఎస్ఎల్వీ సీ–47లో విక్రమ్ 1601ను ఉపయోగించగా... ఫ్లోటింగ్ పాయింట్ కాలిక్యులేషన్ వంటి ఆధునిక హంగులు, అడా వంటి ఆధునిక కంప్యూటర్ భాషలతో పనిచేయగల సామర్థ్యాన్ని అందించి విక్రమ్ 3201ను తయారు చేశారు. దీన్ని విజయవంతంగా పరీక్షించిన నేపథ్యంలో ఇస్రో ఇప్పటికే 70 నానోమీటర్ల ట్రాన్సిస్టర్లతో కొత్త మైక్రో ప్రాసెసర్ తయారీ యత్నాలు ప్రారంభించినట్లు సమాచారం.

విక్రమ్ 1601 ప్రాసెసర్ వినియోగం కేవలం అంతరిక్షానికి మాత్రమే పరిమితం కాలేదు. రైల్వే వ్యవస్థల్లోనూ వినియోగిస్తున్నారు. ముఖ్యంగా ట్రాక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, ఆటోమెటిక్ ట్రెయిన్ సూపర్‌విజన్స్ వంటి వాటిల్లో. ఇదే విధంగా విక్రమ్ 3201ను కూడా ఇతర రంగాల్లో వాడే అవకాశం ఉంది. విక్రమ్ 1601కు ముందు దేశం ప్రాసెసర్ల దిగుమతిపైనే ఎక్కువగా ఆధారపడి ఉండేది. తద్వారా సరఫరా, నియంత్రణలు, భద్రతాంశాల విషయంలో సవాళ్లు ఎదుర్కొనేది. 1998 నాటి పోఖ్రాన్ అణు పరీక్షల తరువాత అమెరికా విధించిన ఆంక్షలతో స్వావలంబన అవసరం మరింత పెరిగిన విషయం తెలిసిందే. ఈ సవాలును స్వీకరించిన శాస్త్రవేత్తలు విక్రమ్ 3201తో తొలి అడుగు వేశారని చెప్పాలి. అంతరిక్ష రంగంలో సాంకేతిక పరిజ్ఞానపరంగా 'ఆత్మ నిర్భరత' సాధించే విషయంలో ఇది నిజంగానే మేలిమలుపు!

వ్యాసకర్త మొహాలీలోని 'ఐసర్' విజిటింగ్ ప్రొఫెసర్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

పుస్తక ప్రపంచం

విభజన రేఖల చరిత్ర



'షాటర్డ్ ల్యాండ్స్: ఫైవ్ పార్టిషన్స్ అండ్ ద మేకింగ్ ఆఫ్ మోడర్న్ ఏసియా'



సామ్ డాల్రింపుల్

భారతదేశ విభజన అంటే 'హిందుస్థాన్', పాకిస్తాన్‌గా విడిపోయిన నేల గురించే అనుకుంటాం. కానీ బ్రిటిష్ వారి పాలనలో, అదన్ రేవు (యెమెన్) నుంచి రంగూన్ వరకు, కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అంతా 'ఇండియన్ ఎంపైరే'! అందరూ 'ఇండియన్సే'. రూపాయే అంతటా చెల్లుబాటయ్యేది. అంతటి నేల ఐదు సార్లు ఎలా విభజితమైందో చెప్పే పుస్తకం 'షాటర్డ్ ల్యాండ్స్'. ఢిల్లీలో పెరిగిన స్కాట్లాండ్ చరిత్రకారుడు సామ్ డాల్రింపుల్ రచయిత.

గాంధీజీ అహింసా సిద్ధాంతాన్ని నమ్మిన బర్మా (బ్రహ్మదేశ్) నాయకుడు యు ఒట్టామా, బ్రిటిష్-బర్మా 'అధిపతి' బా మా భారత సామ్రాజ్యంలో బర్మా అంతర్భాగమని పోరాడారు. కానీ విభజన రాజకీయాల్లో భాగంగా బ్రిటిష్‌వారు 1937లో బర్మాను విడదీశారు. 'ఆసియా రూపురేఖలను మార్చడానికి దేవుడు పంపిన మనిషి ముందు నేను మౌనంగా నిలబడ్డాను' అంటాడు గల్ఫ్‌కు వచ్చిన గాంధీజీని చూస్తూ యెమన్ రచయిత మహమ్మద్ అలీ లుక్‌మాన్. కానీ తమను 'మెయిన్ ల్యాండ్' అంతగా పట్టించుకోవడం లేదన్న భావన అరబ్బుల్లో ఉండేది. 'హిందూ జాతీయవాదుల' దృష్టిలోనేమో పవిత్ర భరతభూమి అనుకునే భౌగోళిక హద్దుల్లో అరబ్బు ప్రాంతం లేదు. 1931లో అదన్ రేవును, 1947లో 'పర్షియన్ గల్ఫ్'ను విడదీయడంతో ఆ బంధమూ ముగిసింది.

ఎన్నో రిఫరెన్సులతో ఒక ఉద్విగ్న చరిత్రను కళ్లముందు నిలబెట్టే ఈ 520 పేజీల పుస్తకం అధికంగా ఒక మాటగానైనా ఉనికిలో లేని 'పాకిస్తాన్' ఏర్పడటానికి దారితీసిన పరిస్థితులను చర్చిస్తుంది. వేల్స్, స్కాట్‌లాండ్ దేశాలు యూకేలో భాగమైనట్టుగానే, పాక్ కూడా ఇండియన్ యూనియన్‌లో స్వతంత్ర ప్రాంతంగా ఉండటానికి అంగీకరించిన జిన్నా తన మనసు మార్చుకోవడం, మత ద్వేషాలు కలగలిసి ప్రపంచ చరిత్రలోనే అతిపెద్ద మానవతా సంక్షోభం తలెత్తింది. రాడ్‌క్లిఫ్ లైన్ అన్న ఒక్క గీతతో జాతీయతలు మారిపోయాయి. లక్షలాది మంది మరణించారు, కోట్లాదిమంది నిరాశ్రయులయ్యారు.



చదరపు కిలోమీటరు విస్తీర్ణం కలిగిన అతిచిన్న సంస్థానాల నుంచి యూరప్ దేశాలంతటి పెద్దవైన సుమారు ఆరు వందల సంస్థానాలే ఇప్పటి ఇండియాకు ఈ రూపునిచ్చాయనేది వాస్తవం (నాలుగో విభజన–విలీనం). 'శరీరం లేని రెండు రెక్కలతో' మతం పేరుతో ఏర్పడిన పాకిస్తాన్ నుంచి భాష కారణంగా బంగ్లాదేశ్ విడిపోవడంతో పుస్తకం ముగుస్తుంది(ఐదో విభజన). 1931 నుంచి 1971 వరకు జరిగిన ఐదు విభజనలు ఇండియా, పాకిస్తాన్, బంగ్లాదేశ్, బర్మా, నేపాల్, భూటాన్, యెమెన్, ఒమన్, యూఏఈ, ఖతార్, బహ్రెయిన్, కువైట్ ఇప్పటి రీతిలో ఏర్పడటానికి కారణమైన పరిస్థితులను పుస్తకం లోతుగా వివరిస్తుంది. మనుషుల సూక్ష్మ వివరాలను జోడిస్తూ రాయడం వల్ల చారిత్రక నవలను చదివిన అనుభూతినిస్తుంది. ఈ ద్రవరూప సరిహద్దులు అనాదిగా ఇలాగే ఉన్నాయని నమ్మించడంలో రాజ్య ప్రయోజనాలు ఉన్నాయి; అందుకే గత ఉమ్మడి చరిత్ర పట్ల దేశాలు మరుపును ప్రదర్శిస్తాయంటారు రచయిత. ఈ విభజనలకు బాధితులు మాత్రం ప్రజలు. 'ఇండియన్స్' తమ అవకాశాలను లాక్కుంటున్నారని బర్మాలో యు సా మొదలుపెట్టిన ప్రచారం హింసాత్మకమై లక్షలాది మంది కట్టుబట్టలతో ఆ నేలను వీడి వందల మైళ్లు నడుచుకుంటూ వచ్చారు. బెంగాలీ మహిళల మీద పాక్ సైన్యం జరిపిన అత్యాచారాల వల్ల 1,70,000 గర్భస్రావాలు జరగడం, 30,000 మంది 'యుద్ధ శిశువులు' పుట్టడం మానవత్వానికి మచ్చ. గల్ఫ్‌లోనూ జనాలు ఇబ్బందులు పడ్డారు.

కథ ఇక్కడితో ముగిసిందా? బెంగాల్‌ను ఒక దేశంగా చేయాలని సుహ్రావర్దీ పట్టుబట్టాడు. నాగాలాండ్ కోసం ఫిజో పోరాడాడు. ట్రావెన్‌కోర్, అండమాన్, 'ప్రిన్సిస్థాన్'(సంస్థానాలన్నీ కలిపి), 'అచ్యుతిస్థాన్(దళితుల కోసం) లాంటి దేశాలు కూడా ఒక దశలో ఆలోచనలుగా ఉన్నవే. కశ్మీర్, బలూచిస్తాన్, 'రోహింగ్యా' పోరాటాలు ఇప్పటి వాస్తవమే. కాబట్టి ఇది ఇంకా నడుస్తున్న చరిత్రే!

❑ ఎడిటోరియల్ టీమ్

భారత తొలి మహిళా ఆంత్రోపాలజిస్ట్

విజ్ఞాన శేఖరుముక్కలు-29

ఐరావతి కర్వే భారత దేశపు తొలి మహిళా సామాజిక శాస్త్రవేత్త, మానవ శాస్త్రవేత్త. ఆరు దశాబ్దాల క్రితం మహాభారతం ఆధారంగా చేసిన మరాఠీ రచన 'యుగాంత'తో సంచలనం రేపిన రచయిత్రి కూడా. సోషియాలజీ, ఆంత్రోపాలజీ, ఆంత్రోపోమెట్రీ, సెరాలజీ, ఇండాలజీ, పాలియెంటాలజీ వంటి విభిన్న శాస్త్రాల్లోనే కాకుండా; జానపద గీతాలను సేకరించడం, స్త్రీవాద కవిత్వాన్ని అనువదించడం వంటి వాటిలోనూ అందె వేసిన చెయ్యి.

1905 డిసెంబర్ 15న జన్మించిన ఐరావతి పుణెలోని ఫెర్గూసన్ కాలేజీలో ఫిలాసఫీలో డిగ్రీ సాధించారు. ఆ కాలేజీలో కెమిస్ట్రీ బోధించే దినకర్ కర్వేని ఇష్టపడి పుట్టింటివారి సమ్మతి లేకుండానే పెళ్లి చేసుకున్న ఆమె... స్కూటర్ నడిపిన తొలి భారతీయ మహిళల్లో ఒకరు. జర్మనీలో ప్రఖ్యాత మానవ శాస్త్రవేత్త ప్రొ॥ యుగెన్ ఫిషర్ వద్ద పరిశోధనకు చేరి పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఐరావతి పరిశోధన నిమిత్తం 149 మానవ పుర్రెలను అధ్యయనం చేశారు. ఆమె పరిశోధక పర్యవేక్షకుడు ఫిషర్ తెల్లవారైన యూరోపియన్ల పుర్రెలలో కుడిభాగం పెద్దగా ఉంటుంది కనుక, వారు మరింత తర్కబద్ధంగా, ప్రతిభావంతంగా ఉంటారని తేల్చడానికి తాపత్రయ పడ్డారు. అయితే ఐరావతి పరిశోధన ద్వారా తేలింది ఏమిటంటే... పుర్రె ఆకారానికి, ఆలోచనా తీరుకు సంబంధం లేదని! అంటే అప్పట్లో చలామణిలో ఉన్న వాదనలను తిరస్కరించి, ఫిషర్ అహంభావాన్ని ఐరావతి దెబ్బతీశారు. ఫిషర్ ఆలోచనలను నాజీ పార్టీ తన సిద్ధాంతాలుగా మార్చుకొని ప్రచారం చేయడం, ఫిషర్ ఆ పార్టీలో చేరడమూ చరిత్ర.



ఐరావతి కర్వే

1930లో భారతదేశం తిరిగి వచ్చిన తర్వాత, ఐరావతి బొంబాయిలోని ఎస్.ఎన్.డి.టి. ఉమెన్స్ యూనివర్సిటీలో రిజిస్ట్రార్‌గా 1931 నుంచి 1936 దాకా పనిచేశారు. 1939లో ప్రఖ్యాతి చెందిన పుణెలోని దక్కన్ కాలేజీలో సోషియాలజీ విభాగం రీడర్‌గా చేరి, తన జీవిత పర్యంతం అక్కడే బోధన, పరిశోధన చేశారు. 1953లో ప్రచురితమైన 'కిన్‌షిప్ ఆర్గనైజేషన్ ఇన్ ఇండియా' భారతీయ మానవశాస్త్రంలో పునాది వంటి గ్రంథం. భారతదేశపు కుల వ్యవస్థకు సంబంధించి రాసిన 'హిందూ సొసైటీ: యాన్ ఇంటర్‌ప్రెటేషన్' ఎంతో సంచలనం రేపింది. 'యుగాంత' సాహిత్య అకాడమీ బహుమతిని పొందింది. విభిన్నంగా, విలక్షణంగా, తెగువగా బతికిన ఆమె 65 ఏళ్ల వయసులో 1970 ఆగస్టు 11న కన్నుమూశారు. ఆమె మనవరాలు, రచయిత్రి ఊర్మిళా దేశ్‌పాండే, థియాగో పింటో బర్బోజాతో కలసి 2025లో రాసిన 'ఐరు: ద రిమార్కబుల్ లైఫ్ ఆఫ్ ఐరావతి కర్వే' ఎంతోమందికి కొత్త వెలుగులను పంచింది.

- డా॥ నాగసూరి వేణుగోపాల్ I ఆకాశవాణి మాజీ ఉన్నతాధికారి

డేటా పాయింట్

క్రెడిట్ కార్డులు 11.16 కోట్లు

దేశంలో క్రెడిట్ కార్డుల సంఖ్య, వాటి ద్వారా చేసే వ్యయం ఏటా పెరుగుతోంది. సగటున ఒక కార్డు ద్వారా చేసిన వ్యయం ఈ ఏడాది జనవరిలో రూ.16,950 నుంచి జులై నాటికి రూ.17,399కి ఎగబాకింది.

	మొత్తం కార్డులు (కోట్లలో)	ఖర్చు (రూ.లక్షల కోట్లలో)
జనవరి	10.89	1.85
ఫిబ్రవరి	10.93	1.68
మార్చి	10.99	2.02
ఏప్రిల్	11.04	1.85
మే	11.12	1.9
జూన్	11.12	1.83
జులై	11.16	1.94



ఆధారం: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

జ్యోతిర్మయం

దైవం తోడుగా ఉంటే...

కురుక్షేత్ర సంగ్రామంలో విజయం దక్కిన తరువాత, శ్రీకృష్ణుడు తోడు రాగా పాండవులు తమ శిబిరాలకు వెళ్ళిపోతూ, దారిలో దుర్యోధనుడి శిబిరం మీదుగా వెళ్ళారు. శిబిరం లోపలికి వెళ్ళి రథాలు దిగారు. తామున్న రథం దిగబోతూ శ్రీకృష్ణుడు అర్జునుడితో 'గాండీవాన్ని, రెండు అక్షయ తూణీరాలను తీసుకుని నీవు రథం దిగు. తరువాత నేను దిగుతాను' అన్నాడు. శ్రీకృష్ణుడు చెప్పినట్లే చేశాడు అర్జునుడు. అర్జునుడు రథం దిగిన వెంటనే శ్రీకృష్ణుడు పగ్గాలను వదిలి తాను కూడా రథం దిగాడు. శ్రీకృష్ణుడు రథం దిగగానే కపిధ్వజం మాయమైంది. అది జరిగిన మరుక్షణమే రథం నుండి ఒక్కసారిగా మంటలు ఉవ్వెత్తున యెగసిపడి, ఆ మంటలలో అర్జునుడి రథం పూర్తిగా దగ్ధమయింది. అది చూసిన పాండవులు నిశ్చేష్టులై నిలబడ్డారు. శ్రీకృష్ణుడి పాదాలకు అర్జునుడు నమస్కరించి లేచి నిలబడి, 'గోవిందా! ఈ రథం ఇలా అకస్మాత్తుగా మంటల్లో ఎందుకు మండిపోయింది? కారణం ఏమిటో తెలుసుకోవడానికి నేను అర్హుడనని నీవు భావిస్తే చెప్పు!' అన్నాడు. అర్జునుడి ఆ ప్రశ్నకు శ్రీకృష్ణుడు ఇలా సమాధానం చెప్పాడన్నాడు తిక్కన, ఆంధ్రమహాభారతం, శల్య పర్వాంతంలో.

కం. గురుకర్ణుల యస్త్రాగ్నుల / నెరిసినయది మున్ను; దీని నిటు గాకుండం / భరపడి రక్షించితి; సంగరము దెగిన దొలగి యిపుడు గాల విడిచితిన్. 'అర్జునా! భీష్మ ద్రోణ కర్ణాది మహావీరుల ధనుస్సుల నుండి వెలువడిన బాణములు తగిలిన ఈ రథం, ఇంతకు మునుపే దగ్ధమైంది. అయితే, నేను కూర్చుని ఉండటం వలన యుద్ధం జరుగుతుండగా భస్మమై బూడిద కాలేదు. నీ వలన జరగవలసినదిగా ఉన్న ఈ పని నేటికి పూర్తయింది. కనుక ఈ రథాన్ని ఇక విడవవలసిన సమయం వచ్చింది. నేను రథం దిగగానే ద్రోణాచార్యుడు, కర్ణుడు ప్రయోగించిన బ్రహ్మాస్త్రాల తేజస్సులో ఎప్పుడో దగ్ధమైనదిగా మిగిలిన ఈ రథం... ఇప్పుడు మంటల్లో మండి పడిపోయి నీకు కనపడింది' అని పెదవులపై మందహాసంతో అర్జునుడికి తెలిపాడు శ్రీకృష్ణుడు.

దైవం తోడుంటే భీకరమైన అగ్ని కీలల నుండి కూడా బయటపడతాడు మనిషి. ఆ తోడు తప్పిపోగానే మామూలు ఎండదెబ్బ తగిలి మరణిస్తాడు!

- భట్టు వెంకటరావు

యాదగిరి గుట్టలో..



భద్రాచలంలో..



బాసరలో..



చంద్రగ్రహణం.. ఆలయాలకు తాళం

యాదగిరిగుట్ట/భద్రాచలం/బాసర: సంపూర్ణ చంద్ర గ్రహణం నేపథ్యంలో ప్రసిద్ధ పుణ్య క్షేత్రాలైన యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం, భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం, నిర్మల్ జిల్లాలోని బాసర ఆలయాలను అర్చకులు, అధికారులు మూసి వేశారు. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిత్య పూజలు, కైంకర్యాలను నిర్వహిం చిన అనంతరం ద్వారాలను మూసివేశారు. చంద్ర గ్రహణం ముగిసిన తరువాత సోమవారం తెల్లవారు జామున 3 గంటల అనంతరం సంప్రోక్షణ కార్య క్రమాలు నిర్వహించి అన్ని ఆలయాలను యథావిధిగా తెరిచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.



సందడి లేని టోల్‌ప్లాజా

బీబీనగర్: వారాంతంలో వాహనాల రద్దీ నెలకొనే యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా చంద్ర గ్రహణం కారణంగా ఆదివారం నిర్మానుష్యంగా మారింది. చంద్రగ్రహణంతో యాదగిరి లక్ష్మీనర్సింహస్వామి క్షేత్రం, భువనగిరి పరిధిలోని స్వర్ణగిరి దేవాలయంతో పాటు ఇతర ఆలయాలను మూసివేయడంతో భక్తుల రాకపోకలు నిలిచిపోవడంతో టోల్‌ప్లాజా వెలవెలబోయింది.

ప్రైవేటు ఆస్పత్రిలో యువతిపై లైంగికదాడి

- కరీంనగర్‌లో ఓ కాంపౌండర్ అఘాయిత్యం

కరీంనగర్ క్రైం: కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్‌గా ఉన్న యువతిపై లైంగికదాడి జరిగింది. ఆస్పత్రి కాంపౌండర్ ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. కరీంనగర్ త్రీటౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. పొరుగు జిల్లాకు చెందిన ఓ యువతి ఆరోగ్యం బాగోలేదని కరీం నగర్‌లోని శ్రీదీపిక ఆస్పత్రిలో శనివారం ఇన్‌పేషెంట్‌గా అడ్మిట్ అయ్యింది. ఎమర్జెన్సీ వార్డులో నిద్రిస్తున్న యువతిపై ఆదివారం వేకువజామున ఆస్పత్రిలో పనిచేసే కాంపౌం డర్ దక్షిణామూర్తి (24) మత్తుమందు ఇచ్చి లైంగికదాడికి పాల్పడ్డాడు. విషయాన్ని యువతి తన కుటుంబసభ్యులకు చెప్పడంతో వారు త్రీటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఆస్పత్రిలో విచారణ చేపట్టారు. బాధితురా లిని వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో సీసీ ఫుటేజీలు, బెడ్‌షీట్లు, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. ఘటన జరిగిన సమయంలో ఎమర్జెన్సీ వార్డులో ఇతర పేషెంట్లు ఎవరైనా ఉన్నారా, డ్యూటీ డాక్టర్లు, సిబ్బంది ఎవరున్నారనే అంశంపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

జంపన్నవాగులోపడి భక్తుడి మృతి



మనీశ్

ఎస్‌ఎస్‌తాడ్వాయి: ములుగు జిల్లా ఎస్‌ఎస్‌తాడ్వాయి మండలంలోని మేడారం జంపన్న వాగులో గల్లంతై ఓ భక్తుడు మృతిచెం దాడు. జనగా మకు చెందిన కనిగంటి మనీశ్ (25) స్నేహితు లతో కలిసి అమ్మవార్లను దర్శించుకునేందుకు ఆదివారం మేడారానికి వచ్చాడు. ఊరట్టం లోని ధ్వంసమైన లోలెవల్ కాజ్‌వే వద్ద స్నానం చేసేందుకు జంపన్నవాగులో దిగి ప్రమాదవశాత్తు నీటమునిగి గల్లంతయ్యాడు. విషయం తెలుసు కున్న పస్రా సీఐ దయాకర్, తాడ్వాయి తహసీల్దార్ సురేశ్‌బాబు, ట్రైనీ ఎస్సై మధు, ఎన్‌డీఆర్ ఎఫ్ బృందాలు ఆయన కోసం వాగులో గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేదు. అయితే గాలాల సాయంతో ప్రయత్నం చేస్తామని అక్కడికి వచ్చిన యువకులు అధికారులకు చెప్పారు. గాలం వైరుకు ఇనుప రింగులు, రాళ్లు కట్టి వాగులో విసిరి ప్రయత్నించారు. చివరికి గాలానికి మృతదేహం తట్టుకుంది. కొంత మేరకు వరదలో నుంచి బయటకు లాగడంతో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు స్ట్రెచర్‌పై మృతదేహా న్ని బయటకు తీసుకొచ్చాయి. మనీశ్ మృ తదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమా ర్టం నిమిత్తం ఏటూరునాగారంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధ దంపతుల బలవన్మరణం

- ఉరేసుకున్న భర్త.. చెరువులో దూకిన భార్య



శ్రీనివాస్‌రెడ్డి

యాలాల: వృద్ధ దంపతులు బలవన్మర ణానికి పాల్పడిన ఘట న వికారాబాద్ జిల్లా యాలాల మం డలం రాస్నంలో చోటు చేసు కుంది. ఎస్‌ఐ విఠల్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మంచన్‌పల్లి శ్రీనివాస్‌రెడ్డి (68), భాగ్యమ్మ దంపతులకు కరుణాకర్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి సంతానం. వీరికున్న ఐదెకరాల అసైన్డ్ భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొంతకాలంగా శ్రీనివాస్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నా డు. ఈ క్రమంలో ఆయన శనివారం అర్ధరాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భర్త మరణంతో భాగ్యమ్మ కన్నీరు మున్నీరుగా విలపించింది. ఆదివారం ఉదయం రాస్నం –ధారూరు మార్గంలో ఉన్న వరద కాల్వ లోకి దూకి భాగ్యమ్మ బలవన్మరణానికి పాల్పడింది. గమనించిన గ్రామస్తులు ఆమె మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చారు. గంటల వ్యవధిలోనే భార్యాభర్తలు ఆత్మహత్యకు పాల్పడటంతో గ్రా మంలో విషాదఛాయలు అలుముకున్నాయి. యాలాల పోలీసులు మృతదేహాలకు తాం దూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వినియోగం పెరిగి.. వెతలు

- గత సంవత్సరం ఇదే సీజన్‌లో 7.98 ఎల్‌ఎంటీ యూరియా కొనుగోలు
- ఈ ఏడాది 8.33 ఎల్‌ఎంటీ కొనుగోలు చేసిన రైతులు
- ప్రతిరోజు 10 వేల మెట్రిక్ టన్నులు తెప్పిస్తున్నా, అవే క్యూలు



ఉమ్మడి వరంగల్ జిల్లాలో యూరియా కోసం తిప్పలు తప్పడం లేదు. మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో రైతులు ఆదివారం ఉదయమే పీఏసీఎస్‌లు, రైతు వేదికల వద్ద బారులు తీరారు. వ్యవసాయ అధికారులు, పోలీసులు కూపన్లు అందించి రైతులకు యూరియా పంపిణీ చేశారు. పలు చోట్ల యూరియా అందకపోవడంతో చాలా మంది రైతులు నిరాశతో వెనుదిరిగి వెళ్లిపోయారు.

– మహబూబాబాద్ రూరల్

సాక్షి,హైదరాబాద్: సాగు విస్తీర్ణం పెరగడంతో యూరియా వినియోగం పెరిగి కొరత ఏర్పడింది. దీంతో రాష్ట్రంలో యూరియా కష్టాలకు ముగింపు లేకుండా పోయింది. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో యూరియా వినియోగం అత్యధికంగా ఉం టుంది. అయితే గత నెల నుంచే రాష్ట్రంలో యూరియా కష్టాలకు పతాకస్థాయికి చేరుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కేం ద్రంతో మాట్లాడి ఏ రోజుకారోజు యూరియా ను తెప్పిం చుకుంటూ తాత్కాలికంగా రైతులకు ఊరట కల్పించే ప్రయత్నం చేస్తోంది. అయినా యూరియా కోసం రైతులు ఉదయం నుంచే దుకాణాల వద్ద, ప్యాక్ సెంటర్ల వద్ద క్యూలు కడుతున్న దృశ్యాలు సర్వ సాధారణమయ్యాయి.

గత సంవత్సరం కన్నా ...

రాష్ట్రంలో వానాకాలం సీజన్‌లో 10 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా యూరియా వినియోగం ఉంటుంది. ఈసారి గత సం వత్సరం కన్నా 10 లక్షల ఎకరాల్లో అధికంగా సాగు కావడం , అందులో వరి 7 లక్షల ఎకరాల్లో, మరో 3 లక్షల ఎకరాల్లో పత్తి అధికంగా సాగైంది . దీంతో సాధారణంగానే యూరియా అధికంగా అవసరమైంది. గత సంవత్సరం సెప్టెంబర్ మొదటి వారానికి రాష్ట్రంలో 7.98 ఎల్‌ఎంటీ యూరియా అమ్మకాలు జరగగా, మరో 3 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వలు ఉన్నాయి. కానీ ఈసారి గతం కన్నా అధికం గా 8.33 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అమ్మకాలు జరిగాయి. కానీ స్టాక్ పరిస్థితి ఏరోజుకారోజు లాగే ఉంది.

బఫర్ స్టాక్ లేకుంటే ఆగమయ్యే పరిస్థితి

రాష్ట్రంలో ఈ వానాకాలం సీజన్‌లో 9.80 ఎల్‌ఎంటీ యూరియాను కేటాయించిన కేంద్రం.. పంపించింది 5.95 ఎల్‌ఎంటీ మాత్రమే. అంటే 2.35 ఎల్‌ఎంటీ యూరియా ఇప్పటికీ కోత పెట్టింది. అయితే బఫర్ స్టాక్ 1.92 ఎల్‌ఎంటీ నిల్వలు ఉండడంతో కొంత పరిస్థితి మెరుగైంది. జూలై, ఆగస్టు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి కారణంగా యూరియా అధిక మొత్తంలో సరఫరా కాకపోయి ఉంటే పరిస్థితి ఇంకా చేయి దాటేదే. కాగా ఈ సంవత్సరం కేటాయింపులో రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన 2.35 ఎల్‌ఎంటీల యూరియా వస్తే తప్ప ఈ నెలలో కష్టాలు గట్టెక్కేలా లేవు. రోజు 10 వేల మెట్రిక్ టన్నుల లోపు యూరియా వస్తున్నా, పైపైనే ఎగిరిపోతుందని ఓ వ్యవసాయ అధికారి వ్యాఖ్యానించారు. ఈనెలలో యూరియా గండం గట్టెక్కడానికి ప్రభుత్వం ఏం చర్యలు చేపడుతుందో చూడాలి.

యూరియా లెక్కలు ఇవీ.. (ఎల్‌ఎంటీలో)

నెల	కేటాయింపు	సరఫరా
ఏప్రిల్	1.71	1.21
మే	1.61	0.88
జూన్	1.70	0.98
జూలై	1.60	1.43
ఆగస్టు	1.70	1.55
సెప్టెంబర్	1.60	0.40
మొత్తం (బఫర్ స్టాక్‌తో)	9.91	6.44

సాగు అంచనా : 1.32 కోట్ల ఎకరాలు

ఇప్పటి వరకు సాగైన ప్రధాన పంటలు ఇలా..

వరి	62.27 లక్షల ఎకరాలు
పత్తి	45.47 లక్షల ఎకరాలు
మొక్కజొన్న	6.27 లక్షల ఎకరాలు
సోయాబీన్	3.62 లక్షల ఎకరాలు
కందులు	4.78 లక్షల ఎకరాలు

గెలవాలనుకునే రాష్ట్రంలో ఎక్కువ దశల్లో పోలింగ్

- ఫైనల్ ఓటింగ్ శాతం ప్రకటించేందుకు 11 రోజులు సమయం
- ఆంధ్రాలో ప్రొవిషనల్, ఫైనల్ పర్సెంటేజీల మధ్య 12.5 శాతం తేడా ఉంది: పరకాల ప్రభాకర్



సెమినార్‌లో మాట్లాడుతున్న పరకాల ప్రభాకర్

ఖమ్మంమయూరిసెంటర్ : దేశంలో అధికారం లో ఉన్న వారు తాము ఏ రాష్ట్రంలో గెలవాల నుకుంటే అక్కడ ఎక్కువ దశల్లో పోలింగ్ ని ర్వహిస్తున్నారని, ఏ రాష్ట్రంలో గెలవాలి, ఏ రా ష్ట్రాన్ని వదిలేయాలని ముందుగానే నిర్ణయిం చుకుని ఎన్నికలు నిర్వహిస్తున్నారని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు పరకాల ప్రభాకర్ పేర్కొ న్నారు. ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రం లో ప్రత్యామ్నాయ పౌర సమూహం ఆధ్వర్యం లో ఆదివారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషనర్ల ని యామకంలో చీఫ్ జస్టిస్‌ను తప్పించి కేంద్ర మంత్రిని చేర్చడం ద్వారా విశ్వసనీయత దెబ్బతిన్నదని చెప్పారు. దేశంలో పలు రాష్ట్రాల్లో ఎన్నికలు ముగిసిన రోజుకు ఫైనల్ ఓటింగ్‌శాతం ప్రకటనకు మధ్య 11 రోజుల సమయం పట్టిందని, చండీఘర్‌లో కేవ లం 644 పోలింగ్ బూత్‌ల సమాచారం రావడానికి ఐదు రోజులు పట్టటం హాస్యా స్పదమని పేర్కొన్నారు. ఆంధ్రాలో ప్రొవిషనల్, ఫైనల్ పర్సంటేజీల మధ్య 12.5 శాతం తేడా ఉందని వెల్లడించారు. గత లోక్‌సభ ఎన్నికల్లో ఈ శాతం ఐదు కోట్ల ఓట్లు గా ఉందని, ఈ తేడా లేకపోతే ప్రతిపక్షాలకు 305 సీట్లకుపైగా వచ్చేవని విశ్లేషించారు. దేశంలో ఇంతవరకు ప్రొవిషనల్, ఫైనల్ ఓట్లలో 2 శాతం కంటే వ్యత్యాసం ఎప్పుడూ లేదని, ఇటీవల యూపీలో ఈ వ్యత్యాసం రెండు శాతం మాత్రమే ఉంటే ఎన్డీయే సీ ట్లు తగ్గాయని వివరించారు. ఎన్నికల సంఘం మహా మాయాజాలం వల్ల ఎన్నికల ఫలితాల తర్వాత పోలింగ్ శాతాన్ని ప్రకటిస్తోందని విమర్శించారు. సుప్రీంకోర్టు అడిగినా సరైన వివరాలు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో ప్రజలు ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం కాదని, ప్రభుత్వమే ఓటర్లను ఎంపిక చేస్తోందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం నెమ్మదిగా ఓట్ల చోరీని అలవాటు చేస్తోందని, ప్రజలు మేల్కొన కుంటే భవిష్యత్ అంధకారమైపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సెమినార్‌కు అధ్యక్షత వహించిన ప్రముఖ డాక్టర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఖమ్మం ప్రజలు మానవతా విలువలు, ప్రజాస్వామ్య విలువల పట్ల ఎప్పుడూ సరైన దృక్పథంతో నిలబడతారని అన్నారు.

ఏం చేద్దాం.. ఏం చెబుదాం?

▶ మొదటి పేజీ తరువాయి

నిర్ణయించేందుకే ఈ భేటీ జరిగిందని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి.

సమావేశంలో ఏఏజీ..!

ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్‌తో పాటు అదనపు అడ్వకేట్ జనరల్ రజనీకాంత్‌రెడ్డి కూడా పాల్గొ నడం విశేషం. కాగా ఎమ్మెల్యేలు దానం నాగేందర్, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మహీపాల్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, అరెకపూడి గాంధీ, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ సంజయ్, తెల్లం వెంకట్రావు, కాలె యాదయ్యలు పాల్గొన్నారు. మరో ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరుకాలేదు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఈ భేటీలో ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసు, స్పీకర్ ఇచ్చిన నోటీసులపై చర్చ జరిగింది. దీంతో పాటు ఈ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు, స్థానిక కాంగ్రెస్ నేతలతో ఉన్న సమస్యలు తదితర అంశాలపై చర్చ జరిగింది. అయితే స్పీకర్ ఇచ్చిన నోటీ సులకు ఎలా సమాధానం ఇవ్వాలన్న అంశంపై న్యాయ నిపుణులతో చర్చించిన అనంతరం.. తాము పార్టీ మారలేదని, బీఆర్‌ఎస్ లోనే ఉన్నామని, నియోజకవర్గ అభివృద్ధి నిమిత్తమే ముఖ్యమంత్రిని కలిసామనే రీతిలో సమాధానమివ్వాలనే నిర్ణయానికి ఎమ్మెల్యేలు వచ్చినట్టు తెలిసింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ..అన్ని విషయాల్లో తాను అండగా ఉంటానని, పార్టీని, తనను నమ్మి వచ్చిన ఎమ్మెల్యేలను కాపాడుకునే విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ వెనకాడబోమని భరోసా ఇచ్చినట్టు తెలిసింది. నియోజక వర్గాల్లో పెండింగ్‌లో ఉన్న పనులకు వీలున్నంత మేర నిధులు మంజూరు చేస్తామని, నియోజకవర్గాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని సూచించినట్టు సమాచారం. స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజ లతో పాటు పాత కాంగ్రెస్ నాయకత్వంలో సమన్వయంతో ముందుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. అదేవి ధంగా కోర్టు కేసుల విషయంలో కూడా పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చినట్టు సమాచారం.

గతంలోనే కలవాలనుకున్నాం..

సమావేశం అనంతరం ఓ ఎమ్మెల్యే 'సాక్షి'తో మాట్లాడుతూ.. అందరం కలిసి సీఎంతో సమావేశం అవు దామని గతంలోనే నిర్ణయించుకున్నామని చెప్పారు. ఆ మేరకే ఆయన్ను కలిశామని, అనేక అంశాలపై చర్చించామని, సీఎం కూడా తమకు భరోసా ఇచ్చారని తెలిపారు. నియోజకవర్గాల అభివృద్ధే ధ్యేయం గా ముందుకెళ్దామని నిర్ణయించుకున్నామని వెల్లడించారు.

యూరియా కోసం ఆందోళన వద్దు

- రాష్ట్రానికి అదనంగా 40 వేల మెట్రిక్ టన్నుల కేటాయింపు: మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్/ అశ్వారావు పేటరూరల్: రైతులెవరూ యూరియా కోసం ఆందోళన చెందొద్దని, అందరికీ సరిపడా పంపిణీ చేస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భరోసా ఇచ్చారు. డిమాండ్ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ఆగస్టు నెలలో రాష్ట్ర వాటా కంటే అదనంగా 40 వేల మెట్రిక్ టన్నులు సాధించామని చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం గంగారంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రానున్న వారం రోజుల్లో అందరికీ అవసరమైనంత యూరియా అందిస్తామని తెలిపారు. రాష్ట్రంలో అక్కడక్కడా కొంతమంది ఏదో ప్రయోజనం ఆశించి రైతులను రెచ్చగొడుతున్నారని, అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. యూరియా కొరత విషయాన్ని తాను, సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లామని, దీంతో రావాల్సిన కోటా కంటే అదనంగా కేటాయించారని తెలిపారు. కాకినాడ, కృష్ణపట్నం, గంగవరం పోర్టులు, నౌకాశ్రయాల ద్వారా యూరియా సరఫరా అవుతోందని వెల్లడించారు. సెప్టెంబర్‌లో 1.60 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేస్తారని, గత ఆరు రోజుల్లో రాష్ట్రానికి 33 వేల మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని చెప్పారు. రాష్ట్రంలో 901 పీఏసీఎస్‌లు, 320 సబ్‌సెం టర్లు, 705 ఆగ్రో రైతు సేవాకేంద్రాలు, 11 హాకా సెంటర్లతోపాటు 495 రైతు వేదికల వద్ద ప్రత్యేక కౌంటర్ల ద్వారా రైతులకు యూరియా సరఫరా చేస్తున్నామని వెల్లడించారు. 11 వేల మంది ప్రైవేట్ డీలర్ల ద్వారా కూడా పంపిణీ జరుగుతోందన్నారు. యూరియా అధిక ధరకు విక్రయించినా, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుం టామని మంత్రి తుమ్మల హెచ్చరించారు. ఆయన వెంట ఆయిల్‌ఫెడ్ అడ్వైజరీ కమిటీ మెంబర్ ఆలపాటి రామచంద్రప్రసాద్, నాయకులు బండి భాస్కర్, మొగళ్లపు చెన్నకేశవరావు ఉన్నారు.

జూరాలలో లక్ష్యం మేరకు విద్యుదుత్పత్తి



దిగువ జూరాల జలవిద్యుత్ కేంద్రం

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజె క్టు ఎగువ, దిగువ విద్యుత్ కేంద్రాల్లో ఈ ఏడాది విద్యుదుత్పత్తి లక్ష్యాన్ని చేరుకు న్నారు. ప్రాజెక్టు చరిత్రలో మొదటిసారి అధికారులు సెప్టెంబర్ మొదటి వారం లోనే లక్ష్యాన్ని చేరుకొని రికార్డు సృష్టిం చారు. మే నెలలో కురిసిన ముందస్తు వర్షాలకు విద్యుదు త్పత్తిని ప్రారంభిం చగా.. ఎగువ, దిగువ కేంద్రాల్లోని 12 యూనిట్ల ద్వారా ఈ ఏడాది ఆదివారం వరకు లక్ష్యానికి అనుగుణంగా 613 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధిం చారు. ఎగువన ఉన్న నారాయణపూర్, ఆల్మట్టి ప్రాజెక్టుల నుంచి ముందస్తుగా వరద రావడం వల్లే ఇది సాధ్యమైందని అధికారులు తెలిపారు. రెండేళ్లుగా ఎగువ జల విద్యుత్ కేంద్రంలోని మూడో యూనిట్‌లో సాంకేతిక ఇబ్బందులు ఎదుర్కొం టుండగా.. ఈ ఏడాది ఆగస్టు 3వ వారంలో అది పూర్తిగా వినియోగంలోకి వచ్చిం ది. దీంతో ఉత్పత్తి మరింత పెరిగింది. ప్రాజెక్టు చరిత్రలో 2022–23 సీజన్ లో 640 మి.యూ. లక్ష్యం పెట్టుకోగా.. 876 మి.యూ. విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ఈ ఏడా ది ఆ రికార్డును అధిగమించే అవకాశం ఉందని చెపుతున్నారు. ప్రాజెక్టు చరిత్రలోనే మొదటిసారి అతి త్వరగా లక్ష్యాన్ని చేరుకున్నామని, ముందస్తు వరదలు, సిబ్బంది సహకారంతోనే ఇది సాధ్యమైందని జూరాల జన్‌కో ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు.

తెలుగు వర్సిటీ మాజీ ప్రొఫెసర్ డి.ఆర్.రాజు కన్నుమూత



నాంపల్లి (హైదరాబాద్): తెలుగు యూనివర్సిటీ పురావస్తు శాఖ మాజీ ప్రొఫెసర్, చరిత్ర, సంస్కృతి శాస్త్రాల మాజీ డీన్ డాక్టర్ దొమ్మరాజు రామలింగరాజు (75) (డి.ఆర్. రాజు) ఆదివారం ఉదయం హైదరాబాద్ కాకతీయ హిల్స్ లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయన గత కొంతకాలంగా మధు మేహంతో బాధపడుతున్నారు. డాక్టర్ రాజు ఏపీలోని అన్నమయ్య జిల్లా, రైల్వే కోడూరు అనంతరాజు పేటలో జన్మించారు. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎం.ఎ. ఆంత్రోపాలజీ పూర్తి చేశారు. పూణే విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. కడప ప్రాంతంలోని పురాతన శిలాయుగ ప్రదేశాలపై విస్తృత పరిశోధనలు చేశారు. 1990 సంవత్సరంలో తెలుగు వర్సిటీలో ప్రొఫెసర్‌గా చేరిన ఆయన 2012లో పురావస్తు శాఖ డీన్ హోదాలో పదవీ విరమణ పొందారు. డాక్టర్ రాజు స్టోన్ ఏజ్ హంటర్–గేదర్స్.. యాన్ ఎథ్నో–ఆర్కియాలజీ ఆఫ్ కడప రీజియన్, సౌత్–ఈస్ట్ ఇండియా (1988) అనే పుస్తకాన్ని రచించారు. కాగా, పం జాగుట్ట మహా ప్రస్థానం శ్మశానవాటికలో ఆయన అంత్యక్రియలు జరిగాయి. డాక్టర్ డి.ఆర్.రాజు మృతిపై తెలుగు వర్సిటీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆచార్య పెదారపు చెన్నారెడ్డి సంతాపాన్ని తెలియజేశారు.

ఎన్టీపీసీలో విద్యుత్ ఉత్పత్తి నిలిపివేత

జ్యోతినగర్ (రామగుండం): దేశంలో విద్యుత్‌కు డిమాండ్ పడిపోవడంతో పెద్దపల్లి జిల్లా రామగుండంలోని ఎన్టీపీసీలో ఐదు యూనిట్లలో ఆదివారం విద్యుత్ ఉత్పత్తి ని నిలిపివేశారు. అయితే దీనివల్లఎన్టీపీసీకి భారీనష్టం కలిగే అవకాశం ఉందని అం టున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో కొద్దిరోజులుగా భారీవర్షాలు కురుస్తున్నా యి. దీంతో విద్యుత్ వినియోగం పడిపోయింది. ఫలితంగా 2,600 మెగావాట్ల రామగుండం సూపర్ థర్మల్ పవర్ స్టేషన్ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా విద్యుత్ ఉత్పత్తి యూనిట్లను మూసివేశారు. ఇందులో 500 మెగావాట్ల ఆరో యూనిట్‌లో 25 రోజులుగా వార్షిక మరమ్మతులు కొనసాగుతున్నాయి. విద్యుత్ డిమాండ్ లేక గత సోమవారమే 500 మెగావాట్ల ఏడో యూనిట్‌లో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసిన అధికారులు.. మూడు రోజులుగా మొదటి దశలోని 200 మెగావాట్ల రెండో, మూ డో యూనిట్లలోనూ ఉత్పత్తిని నిలిపివేశారు. అదేవిధంగా రెండోదశలోని 500 మెగావాట్ల ఐదో యూనిట్‌లోనూ విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశారు. మొదటి దశలోని 200 మెగావాట్ల ఒకటో యూనిట్‌లోనే ప్రస్తుతం విద్యుత్ ఉత్పత్తిని కొనసా గిస్తున్నారు. ఆదివారం కేవలం 700 మెగావాట్ల విద్యుత్‌ను మాత్రమే ఉత్పత్తి చేశా రు. ప్రస్తుతం రామగుండం ప్రాజెక్టు రిజర్వాయర్లో నిర్మించిన 100 మెగా వాట్ల ఫ్లోటింగ్ సోలార్ పవర్ స్టేషన్, 10 మెగా వాట్ల మరో సోలార్ పవర్ స్టేషన్‌లోనే పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి జరుగుతున్నట్లు తెలుస్తోంది.



వరంగల్ అండర్ బ్రిడ్జి కింద వరదనీటిలో చిక్కుకున్న ఆర్టీసీ బస్సులు, ఆటో



అండర్ బ్రిడ్జి వద్ద బస్సులోని ప్రయాణికులను తాడు సాయంతో బయటకు తీసుకువస్తున్న దృశ్యం

వరంగల్‌లో దంచి కొట్టిన వర్షం

సాక్షి, వరంగల్/హనుమకొండ/వరంగల్ అర్బన్: వరంగల్ నగరంలో వర్షం దంచికొట్టింది. ఆదివారం ఉదయం 8.30 నుంచి 11 గంటల వరకు కురిసిన మోస్తరు వానతో వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాం తాల్లోని ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. వరంగల్ అండర్ బ్రిడ్జి కింద వరద చేరడంతో.. గం టపాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఆర్టీసీ బస్సుల్లోకి కొం తవరకు నీరు రావడంతో.. పోలీసులు తాడు సాయంతో ప్రయాణికులను క్షేమంగా బయటకు తీసుకొచ్చారు. హనుమకొండలోని జిల్లా బస్‌స్టేషన్ ఆవరణలోకి పెద్ద ఎత్తున వరద నీరు చేరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఎర్ర సముద్రం అడుగున
తెగిన కేబుళ్లు

ఆసియా దేశాల్లో ఇంటర్నెట్ సేవలకు అంతరాయం

దుబాయ్: ఎర్ర సముద్రం అడుగున్న కేబుళ్లు తెగడంతో భారత్ సహా పలు ఆసియా దేశాల్లో ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి. సౌదీ అరేబియాలోని జెడ్డా సమీపంలో ఎస్ఎండబ్ల్యూ4, ఐఎంఈడబ్ల్యూఈ కేబుల్ వ్యవస్థలు స్తంభించాయని ఇంటర్నెట్ పర్యవేక్షక సంస్థ నెట్‌బ్లాక్స్ తెలిపింది. గాజా యుద్ధాన్ని ఆపేసేలా ఇజ్రాయెల్‌పై ఒత్తిడి పెంచేందుకే కేబుళ్లకు నష్టం కలిగించి ఉండొచ్చంటున్నారు. ఆగ్నేయాసియా, మధ్యప్రాచ్యం, పశ్చిమ ఐరోపా4 కేబుల్‌ను టాటా కమ్యూనికేషన్స్.. భారత్, పశ్చిమాసియా, పశ్చిమ యూరప్ కేబుళ్లను అల్కాటెల్ లూసెంట్ నిర్వహిసతఉన్నాయి. ఈ పరిణామంపై సౌదీ మౌనం వహించగా, నెట్ వేగం తగ్గిందని యూఈఏ తెలిపింది.

క్యాన్సర్‌పై రామబాణం...
ఎంటెరోమిక్స్



సరికొత్త వ్యాక్సిన్ ● అతి త్వరలో అందుబాటులోకి!

- పెద్ద పేగు, బ్రెయిన్, చర్మ క్యాన్సర్లపై దివ్యాస్త్రమే
- పరీక్షల్లో 80 శాతం దాకా తగ్గిన క్యాన్సర్ గడ్డలు

మాస్కో: క్యాన్సర్. ఏటా లక్షల మందిని పొట్టన పెట్టుకుంటున్న ప్రపంచవ్యాప్త మహమ్మారి. సరైన చికిత్స లేక జీవితాంతం క్యాన్సర్‌తో బాధపడుతున్న వారు కోకొల్లలు. అలాంటి ప్రాణాంతక వ్యాధి నివారణకు రష్యా సైంటిస్టులు నూతన టీకా (వ్యాక్సిన్)ను అభివృద్ధి చేశారు. దీనిపై ఇప్పటికే ఏడాదిపాటు పరిశోధనలు, మూడేళ్లపాటు ముందస్తు క్లినికల్ ట్రయల్స్ జరిగాయి. త్వరలో క్లినికల్ ప్రయోగాలు జరపనున్నట్టు తయారీ సంస్థ ఫెడరల్ మెడికల్, బయోలాజికల్ ఏజెన్సీ (ఎఫ్ఎంబీఏ) వెల్లడించింది. ఈ వ్యాక్సిన్‌కు 'ఎంటెరోమిక్స్' అని పేరుపెట్టారు. కొన్ని రకాల కోవిడ్–19 నివారణ టీకాల తరహాలోనే దీని అభివృద్ధికి ఎంఆర్ఎన్ఏ టెక్నాలజీని వాడారు. వ్యాక్సిన్ల అభివృద్ధికి సాధారణంగా నిర్జీవ వైరస్‌ను ఉపయోగిస్తారు. కానీ ఎంఆర్ఎన్ఏతో తయారైన టీకాలు మాత్రం శరీర కణాలే ప్రొటీన్లను ఉత్పత్తి చేసేలా ప్రేరేపిస్తాయి. అలా రూపొందించిన ఈ కొత్త టీకాతో శరీరంలో ఉత్పత్తయ్యే ప్రొటీన్లే క్యాన్సర్ కణాలను నిర్వీర్యం చేసేలా రోగ నిరోధక శక్తిని పెంచుతున్నట్లు వెల్లడైంది. దీన్ని పలుమార్లు తీసుకున్నా శరీరంలో దుష్ప్రభావాలేవీ కనిపించడం లేదని, పైగా అత్యంత ప్రభావవంతంగా పని చేస్తోందని తేలింది. ఈ వ్యాక్సిన్ పూర్తి సురక్షితమని పరిశోధకులు హామీ ఇస్తున్నారు. పలు కేసుల్లో క్యాన్సర్ గడ్డల పరిమాణాన్ని ఈ వ్యాక్సిన్ ఏకంగా 60 శాతం నుంచి 80 శాతం దాకా తగ్గిస్తున్నట్లు వెల్లడైంది! ప్రధానంగా పెద్ద పేగు, బ్రెయిన్, చర్మ క్యాన్సర్‌కు ఇది రామబాణమేనని అంటున్నారు. రష్యాలోని వ్లాడివోస్తోక్‌లో 10వ తూర్పు ఆర్థిక వేదిక సదస్సులో 'ఎంటెరోమెక్స్' టీకా గురించి ప్రకటించారు. 75 దేశాలకు చెందిన 8,400 మంది పరిశోధకులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

ఉప రాష్ట్రపతి ఎన్నికపై ఎంపీలకు
బీజేపీ వర్క్‌షాప్

ఎంపీల వరుసలో కూర్చున్న మోదీ

న్యూఢిల్లీ: ఉప రాష్ట్రపతి ఎన్నిక తీరుపై ఎంపీలకు అవగాహన కల్పించడానికి అధికార బీజేపీ ఆదివారం వర్క్‌షాప్ ప్రారంభించింది. కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ వెనుక వరుసలో ఎంపీలతో కలిసి కూర్చోవడం హైలైట్‌గా నిలిచింది. జీఎస్టీ సంస్కరణలపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశంసిస్తూ ఈ సందర్భంగా తీర్మానం ఆమోదించారు. వర్క్‌షాప్‌లో మోదీ పలు సూచనలు చేశారు. కీలక అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. ఎంపీల బృందంతో మాట్లాడారు. వర్క్‌షాప్ సోమవారమూ కొనసాగనుంది. రెండోరోజు ఎన్డీఏ భాగస్వామ్య పార్టీల ఎంపీలు కూడా పాల్గొననున్నారు. సోమవారం మాక్‌పోలింగ్ నిర్వహించనున్నారు.వర్క్‌షాప్‌లో మోదీ చివరి వరుసలో కూర్చున్న ఫొటో వైరలైంది.

ఇషిబా సయోనారా!

జపాన్ ప్రధాని అనూహ్య రాజీనామా ● పరాజయాలు, పార్టీ ఒత్తిళ్లే కారణం!



టోక్యో: జపాన్ ప్రధానమంత్రి షిగెరు ఇషిబా (68) పదవి నుంచి తప్పుకోవాలని అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. లిబరల్ డెమొక్రటిక్ పార్టీ (ఎల్‌డీపీ) అధ్యక్ష బాధ్యతల నుంచి కూడా తప్పుకుంటున్నట్లు స్పష్టం చేశారు. ఆదివారం ఈ మేరకు ఆయన ప్రకటన చేశారు. ఎన్నికల్లో వరుస పరాజయాలు, ఎల్‌డీపీలో అంతర్గత విభేదాలే రాజీనామాకు కారణమని సమాచారం. ఇషిబా గతేడాది అక్టోబర్‌లోనే గద్దెనెక్కారు. ఆ తర్వాత అన్ని ఎన్నికల్లోనూ ఎల్‌డీపీకి ఓటములే ఎదురయ్యాయి. పార్లమెంట్ ఉభయ సభల్లో మెజార్టీ కోల్పోయింది. గత జూలైలో జరిగిన పార్లమెంటరీ ఎన్నికల్లో ఓటమికి బాధ్యత వహించాలంటూ ఇషిబాపై పార్టీలో ఒత్తిడి పెరిగింది. తాను దిగితే రాజకీయ శూన్యత ఏర్పడుతుందంటూ ఆయన అంగీకరించలేదు. అమెరికా టారిఫ్‌లు, ధరల పెరుగుదల, ధాన్యం పాలసీ సంస్కరణలు, ప్రాంతీయ ఉద్రిక్తతల నేపథ్యంలో తాను తప్పుకోవడం సరికాదని అప్పట్లో అన్నారు. కానీ ఒత్తిళ్లు పెరిగిపోవడంతో గత్యంతరం లేక రాజీనామా చేసినట్లు సమాచారం.

రేసులో కొయిజుమీ, తకాయిచీ

ఎల్డీపీ నూతన అధ్యక్షుడి ఎంపికను గడువుకు ముందుగానే చేపట్టాలా వద్దా అనే దానిపై సోమవారం ఓటింగ్ జరగాల్సి ఉంది. ఇది ఒకరకంగా ఇషిబాపై అవిశ్వాస తీర్మానమే. అది నెగ్గేలా ఉండడంతో ఒక రోజు ముందే రాజీనామా చేశారు. శనివారం ఆయన వ్యవసాయ మంత్రి షిన్‌జిరో కొయిజుమీ, మాజీ ప్రధాని యోషిహిడే సుగాతో భేటీ అయ్యారు. వారి సూచన మేరకే రాజనామాకు మొగ్గుచూపారు. తదుపరి తరానికి పగ్గాలు అప్పగించబోతున్నానంటూ భావోద్వేగ ప్రకటన చేశారు. జపాన్‌లో అధికార పార్టీ అధ్యక్షుడే ప్రధాని అవుతారు. దాంతో ఎల్డీపీ పగ్గాల కోసం కొయిజుమీతో పాటు సీనియర్ నేత సనాయ్ తకాయిచీ తలపడుతున్నారు. గతేడాది పార్టీ అధ్యక్ష ఎన్నికల్లో ఇషిబా చేతిలో తకాయిచీ ఓడారు. కొత్త ప్రధాని తన పదవిని పదిలం చేసుకోవడానికి పార్లమెంట్‌కు ముందస్తు ఎన్నికలు జరుపుతారంటున్నారు. కానీ ఆ అవసరం లేదని 55 శాతం ప్రజలు భావిస్తున్నట్లు ఓ సర్వే తేల్చింది. అమెరికాతో వాణిజ్య ఒప్పందమే ప్రధాని హోదాలో ఇషిబా చివరి అతి పెద్ద నిర్ణయం. దానిప్రకారం జపాన్ ఉత్పత్తులపై అమెరికా టారిఫ్‌లను 25 నుంచి 15 శాతానికి తగ్గించింది. బదులుగా అమెరికాలో 550 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడతామని ఇషిబా ప్రకటించారు.

శ్రుతి మించుతున్న ట్రంప్...
వెనెజువెలాపై యుద్ధం!

నావికా, వాయు దళాలతో
అష్టదిగ్బంధం

- ఏ క్షణమైనా వెనెజువెలాపై దాడి!
- అక్కడి చమురు నిక్షేపాలే లక్ష్యం



వాషింగ్టన్: ఆసియా, యూరప్ అనంతరం అమెరికా ఖండాన్ని సైతం యుద్ధ మేఘాలు వేగంగా కమ్ముకుంటున్నాయి. తమకు చిరకాలంగా కొరకరాని కొయ్యగా మారిన పొరుగు దేశం వెనెజువెలాపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కన్ను పడింది. వెనెజులాలో డ్రగ్స్ కార్టెళ్ల విధ్వంసం ముసుగులో అక్కడి అపార చమురు నిక్షేపాలను చేజిక్కించుకునే దిశగా డొనాల్డ్ ట్రంప్ శరవేగంగా పావులు కదుపుతున్నారు. అమెరికా సైన్యం ఇప్పటికే వందల సంఖ్యలో భీకర, భారీ క్షిపణులను వెనెజువెలాపైకి ఎక్కుపెట్టింది. ట్రంప్ ఊ అన్న మరుక్షణమే విరుచుకుపడేందుకు అమెరికా యుద్ధనౌకలు, అత్యాధునిక ఎఫ్–35 యుద్ధ విమానాలు సర్వ సన్నద్ధంగా ఉన్నాయి. ఈ బాహుబలి దాడిని కాచుకునేందుకు నిరుపేద వెనెజువెలా కాలూ చేయీ కూడదీసుకుంటోంది. యుద్ధాలను ఆపేస్తానంటూ ఆదర్శాలు వల్లించి రెండోసారి గద్దెనెక్కిన ట్రంప్ ఈ ఎనిమిది నెలల్లో ఏ యుద్ధాన్నీ ఆపలేకపోగా ఇలా పొరుగు ఖండంలోనే స్వయంగా రణన్నినాదాలకు దిగుతుండడటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మాదకద్రవ్యాలను తమ దేశంలోకి అక్రమంగా సరఫరా చేస్తున్న వెనెజువెలా డ్రగ్స్ ముఠాల ధ్వంసానికి సైనిక చర్యకూ వెనుకాడబోమని ట్రంప్ ఇటీవల ప్రకటించారు. అన్నట్టుగానే వెనెజువెలాను సముద్ర మార్గాన చుట్టుముట్టాల్సిందిగా నేవీని ఆదేశించారు. దాంతో అత్యాధునిక యుద్ధ నౌకలు యూఎస్ఎస్ గ్రేవ్‌లీ, యూఎస్ఎస్ జాసన్ డన్‌హమ్ ఆగమేఘాలపై దక్షిణ కరేబియన్ సముద్రంలోకి ప్రవేశించి వెనెజువెలాపైకి గైడెడ్ మిసైల్స్ ఎక్కుపెట్టాయి. అప్పటికే అక్కడున్న డిస్ట్రాయర్ నౌక యూఎస్ఎస్ సామ్సన్ వాటికి తోడైంది. ఇవి చాలవన్నట్టు పసిఫిక్ మహాసముద్రం నుంచి యూఎస్ఎస్ లేక్ ఏరీ నౌకను రప్పిస్తున్నారు. యూఎస్ఎస్ ఇవో జిమా, యూఎస్ఎస్ సాన్ ఆంటోనియో, యూఎస్ఎస్ ఫోర్ట్ లాడెర్డేల్ వంటి యుద్ధ నౌకలూ యుద్ధ ప్రాతిపదికన వచ్చి చేరుతున్నాయి. ఇలా 8 అత్యాధునిక యుద్ధ నౌకలు వెనెజువెలా తీరం వెంబడి అంతర్జాతీయ జలాలను అష్టదిగ్బంధనం చేశాయి. 4,000 మంది సెయిలర్లు, మెరైన్ కమెండోలు సిద్ధంగా ఉన్నారు. వెనెజువెలా డ్రగ్స్ ముఠాలపై ఆకాశ మార్గంలో కూడా విరుచుకుపడేందుకు 10 అత్యాధునిక ఎఫ్–35 యుద్ధ విమానాలను కూడా అమెరికా శనివారమే ప్యూర్టోరికోకు తరలించి ఉంచింది!

8 యుద్ధ నౌకలు
10 యుద్ధ విమానాలు

వెనెజువెలా 'తగ్గేదే లే'!

సైనికపరంగా అమెరికాతో వెనెజువెలా ఏమాత్రం తూగలేదు. అమెరికా, యూరప్ కఠిన ఆంక్షల దెబ్బకు నికొలాస్ మదురో సారథ్యంలోని కమ్యూనిస్టు ప్రభుత్వం అత్యాధునిక ఆయుధ, సైనిక సంపత్తిని సమకూర్చుకోలేకపోయింది. ఉన్నవల్లా కాలం చెల్లిన పాత కాలపు ఎఫ్–16 యుద్ధ విమానాలే! సైన్యం కూడా 1.5 లక్షల కన్నా లేదు. అన్ని విభాగాలూ కలిపినా 3.5 లక్షల లోపే! అయినా సరే, అమెరికా వంటి తిరుగులేని సైనిక శక్తిని యథాశక్తి ప్రతిఘటించి తీరతామని మదురో ఇటీవలే ప్రకటించారు. అతి త్వరగా ఏకంగా 50 లక్షల సైన్యాన్ని సిద్ధం చేస్తానని చెప్పారు!

చమురు నిక్షేపాలపై కన్ను

పేద దేశమైనా ప్రపంచంలో అత్యధిక చమురు నిల్వలకు వెనెజువెలా కేంద్రం. దేశంలో దాదాపు 48 వేల మిలియన్ టన్నుల చమురు నిల్వలున్నట్లు గుర్తించారు. అమెరికా కఠిన ఆంక్షల వల్ల వాటిని వెలికితీయటం సాధ్యపడటం లేదు. ట్రంప్ తొలిసారి అమెరికా అధ్యక్షుడైనప్పుడే ఆ చమురు నిల్వలపై కన్నేశారు. వెనెజువెలా చమురంతా అమెరికాకే దక్కాలని అప్పట్లోనే బహిరంగ ప్రకటనలు చేశారు. అందుకోసం అవసరమైతే అక్కడి చమురు క్షేత్రాలను ఆక్రమించుకుంటామన్నారు! మరోవైపు కమ్యూనిస్టు నాయకుడైన అధ్యక్షుడు మదురో అగ్రరాజ్యానికి కొరకరాని కొయ్యగా మారాడు. ట్రంప్ మద్దతుదారులైన ప్రతిపక్ష నేతలను తీవ్రంగా అణచివేశారు. దాంతో మదురోను పట్టించినవారికి రూ.450 కోట్లు ఇస్తామని అమెరికా ప్రకటించింది. వెనెజువెలాలో చైనా భారీ పెట్టుబడులు పెట్టడంతోపాటు 90 శాతం చమురు కొనుగోలు చేస్తోంది. ఇది అమెరికాకు కంటగింపుగా ఉంది.

ఇజ్రాయెల్‌పై హౌతీల డ్రోన్ దాడి

టెల్అవీవ్: యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదార్లు ఆదివారం ఇజ్రాయెల్‌పై డ్రోన్ దాడికి పాల్పడ్డారు. హౌతీలు ప్రయోగించిన డ్రోన్ బహుళ అంచెల గగనతల రక్షణ వ్యవస్థలను దాటుకుని ఎయిలట్‌కు సమీపంలోని రమోన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ప్యాసింజర్ టెర్మినల్‌ను తాకింది. కిటికీల అద్దాలు పగిలిపోయి, పొగలు కమ్ముకున్నాయి. ఒకరికి గాయాలయ్యాయి. ఘటన నేపథ్యంలో విమానాశ్రయంలో రాకపోకలను సుమారు రెండు గంటలపాటు నిలిపివేశారు. కొన్ని విమానాలను దారి మళ్లించారు. హౌతీలు ప్రయోగించిన మూడు డ్రోన్లను తమ భూభాగంలోకి ప్రవేశించకమునుపే కూల్చి వేసినట్లు అంతకుముందు ఇజ్రాయెల్ ఆర్మీ తెలిపింది. ఒక డ్రోన్ మాత్రం తప్పించుకుందని పేర్కొంది. దీనిపై దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించింది. దాడుల నేపథ్యంలో దక్షిణ ఇజ్రాయెల్ వ్యాప్తంగా సైరన్లు మోగాయి. దీంతో, ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. వారం క్రితం రాజధాని సనాపై ఇజ్రాయెల్ ఆర్మీ జరిపిన వైమానిక దాడిలో హౌతీల ప్రభుత్వ ప్రధాని అహ్మద్ అల్–రహావీ చనిపోవడం తెల్సిందే. తమ ప్రత్యేక మిలటరీ ఆపరేషన్‌తో శత్రు దేశం విమానాశ్రయాలకు భద్రత లేదన్న విషయం రూఢీ అయ్యిందని హౌతీలు ప్రకటించుకున్నారు. పాలస్తీనాకు మద్దతు తెలుపుతున్న హౌతీలు తరచూ ఇజ్రాయెల్‌పైకి దాడులకు దిగుతున్నారు. ఎర్ర సముద్రంలో ప్రయాణించే వాణిజ్య నౌకలపైనా దాడులకు తెగబడి, వాటిని ముంచేస్తున్నారు.

మిలటరీ ఆపరేషన్ ఆగదు: నెతన్యాహూ

గాజా నగరంలో చేపట్టిన భారీ ఆపరేషన్ కొనసాగుతుందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ప్రకటించారు. హమాస్‌కు పట్టున్న గాజా, మరిముఖ్యంగా గాజా నగరం నుంచి హమాస్‌ను నిర్మూలించడమే లక్ష్యమని తెలిపారు. ఈ ఆపరేషన్‌లో ముందస్తు ప్రయత్నాలు చేపట్టేందుకు ఇప్పటికే లక్షమంది పాలస్తీనియన్లు నగరాన్ని వదిలి వెళ్లిపోయారన్నారు. ఇలా ఉండగా, ఆదివారం ఉదయం ఇజ్రాయెల్ ఆర్మీ చేపట్టిన వైమానిక దాడుల్లో కనీసం 13 మంది చనిపోయారు.

ఉత్తమ దర్శకురాలు
అనుపర్ణా రాయ్



- వెనిస్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో అవార్డు
- తొలి చిత్రానికే అరుదైన గౌరవం

న్యూఢిల్లీ: భారత యువ దర్శకురాలు అనుపర్ణ రాయ్ ప్రతిభ అంతర్జాతీయ వేదికపై తళుకులీనింది. 'సాంగ్స్ ఆఫ్ ఫర్గాటెన్ ట్రీస్' చిత్రానికి ప్రఖ్యాత వెనిస్ అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఆమెకు ఉత్తమ దర్శకురాలి అవార్డు దక్కింది. అరంగేట్రం, నవతరం ప్రతిభ, స్థానిక సొబగులు, కొత్తతరహా అంశాల కలబోత అయిన అంతర్జాతీయ 'ఒరిజోంటీ' విభాగంలో అనుపర్ణ ఈ గౌరవాన్ని సొంతం చేసుకున్నారు. తొలి సినిమాకే ఈ పురస్కారం దక్కడం విశేషం. ఒరిజోంటీ కేటగిరీలో ఒక భారతీయ డైరెక్టర్‌కు అవార్డు దక్కడమూ ఇదే తొలిసారి!

అణగారిన మహిళలకే అంకితం

82వ వెనిస్ అవార్డు ప్రదానోత్సవంలో ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ చేతుల మీదుగా అనుపర్ణ అవార్డును స్వీకరించారు. ఈ అవార్డును గొంతుక లేని, నిర్లక్ష్యానికి గురైన మహిళలకు అంకితమిస్తున్నట్లు ఆమె ప్రకటించారు. ''నా విజయం మహిళా గొంతుకలకు బలాన్నిస్తుంది. అణచివేతకు గురైన మహిళల గాథలను గట్టిగా వినిపిస్తుంది'' అని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముంబైకి వలసవచ్చిన ఇద్దరు మహిళల ఆటుపోట్లను 'సాంగ్స్ ఆఫ్ ఫర్గాటెన్ ట్రీస్'' కళ్లకు కట్టింది. 'గోల్డెన్ లయన్' పేరిట విజేతలకు 1949 నుంచి పురస్కారాలు అందిస్తున్నారు. కొత్త ప్రతిభను, స్వతంత్ర చిత్రాలను ప్రోత్సహించేందుకుగాను గోల్డెన్ లయన్‌కు సాటిగా ఒరిజోంటి అవార్డును రెండు దశాబ్దాల క్రితం ప్రవేశపెట్టారు. ఈఏడాది గోల్డెన్ లయన్ అవార్డ్‌ను అమెరికాకు చెందిన ' ఫాదర్ మదర్ సిస్టర్ బ్రదర్' సినిమా ఎగిరేసుకుపోయింది.

42 కీలక ఔషధాల ధరలకు కళ్లెం

సాక్షి, న్యూఢిల్లీ: ఔషధాల ధరలతో సతమతమవుతున్న సామాన్యులకు కేంద్రం ఊరట కల్పించింది. అవయవ మార్పిడి, తీవ్రమైన బాక్టీరియల్ ఇన్ఫెక్షన్ల చికిత్సలో వాడే 42 కీలక ప్రాణాధార ఔషధాల రిటైల్ ధరలను జాతీయ ఔషధ ధరల నియంత్రణ ప్రాధికార సంస్థ (ఎన్‌పీపీఏ) ఖరారు చేసింది. దాంతో రోగులకు వైద్య ఖర్చుల భారం తగ్గడమే గాక ఫార్మా కంపెనీలు, మందుల దుకాణాల అక్రమ వ్యాపారానికి అడ్డుకట్ట పడనుంది. ధరలను నియంత్రించిన జాబితాలో బ్రాడ్–స్పెక్ట్రమ్ యాంటీబయాటిక్స్, అవయవ మార్పిడి తర్వాత వాడే ఇమ్యునోసప్రెసెంట్స్ వంటి అత్యంత కీలకమైన ఔషధాలున్నాయి. తీవ్రమైన ఇన్ఫెక్షన్ల చికిత్సలో వాడే మెరోపెనమ్–సల్బాక్టమ్ ఇంజెక్షన్ ధరను రూ.1,938.59, అవయవ మార్పిడిలో కీలకమైన మైకోఫెనోలేట్ మోఫెటిల్ టాబ్లెట్‌కు రూ.131.58, బాక్టీరియల్ ఇన్ఫెక్షన్ నివారిణి టాబ్లెట్ క్లారిత్రోమైసిన్ ఎక్స్‌టెండెడ్–రిలీజ్ టాబ్లెట్‌కు రూ.71.71గా నిర్ణయించారు. మందుల ధరలను నియంత్రిస్తూ జాతీయ ఔషధ ధరల నియంత్రణ ప్రాధికార సంస్థ ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఆదేశాల ప్రకారం.. ఔషధ తయారీదారులు తప్పనిసరిగా ధరల పట్టికను డీలర్లు, రాష్ట్ర ఔషధ నియంత్రణ సంస్థలు, ప్రభుత్వానికి అందజేయాలి. అంతేకాకుండా, ప్రతి రిటైల్ మందుల దుకాణం, డీలర్ తమ ప్రాంగణంలో అందరికీ స్పష్టంగా, సులభంగా కనిపించేలా ధరల జాబితాను ప్రదర్శించాల్సి ఉంటుంది.

సామాన్యుడికి ప్రయోజనం ఏమిటి?

సామాన్య రోగులను ఆదుకోవడమే ప్రధాన ఉద్దేశం. మందుల దుకాణాల్లో ధరల పట్టికను తప్పనిసరిగా ప్రదర్శించాలన్న నిబంధనతో వాటికి ప్రభుత్వం నిర్ణయించిన ధర ఎంత ఉందో వినియోగదారులు సులభంగా తెలుసుకోవచ్చు. దీనివల్ల మందుల దుకాణదారులు మోసాలకు పాల్పడకుండా నిరోధించవచ్చు. ఈ చర్యతో ఖరీదైన మందుల భారం తగ్గడమే కాకుండా, ఫార్మా రంగంలో పారదర్శకత మెరుగుపడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఆరోగ్య రంగ సంస్కరణల్లో ఇదొక కీలక మలుపు అని అభిప్రాయపడుతున్నారు.



ఉక్రెయిన్ కేబినెట్ భవనంపై దాడి

కీవ్: రష్యా మరోసారి పేట్రేగిపోయింది. ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లోని కేబినెట్ భవనంపై దాడి చేసింది. ఇందులో మంత్రుల కార్యాలయాలుంటాయి. దాడిలో భవనంలో నుంచి పెద్ద ఎత్తున మంటలు, పొగలు వ్యాపించాయి. పైకప్పు, ఎగువ అంతస్తులు దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు. దాడి నేపథ్యంలో ఆ ప్రాంతాన్ని మొత్తాన్ని అధికారులు దిగ్బంధించారు. కీవ్ నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు లక్ష్యంగా రష్యా దాడులకు దిగడం ఇదే మొదటిసారని చెబుతున్నారు. ఇలా ఉండగా, రష్యా ఆదివారం ఉక్రెయిన్‌పైకి ఏకంగా 810 డ్రోన్లు, 13 క్షిపణులను ప్రయోగించింది. దాడులతో రాజధాని కీవ్‌లో సైరన్ల మోతలు ప్రతిధ్వనించగా ప్రజలు షెల్టర్లలోకి పరుగులు తీశారు. రష్యా చేపట్టిన అతిపెద్ద గగనతల దాడి ఇదేనని ఉక్రెయిన్ ఎయిర్ ఫోర్స్ ప్రతినిధి తెలిపారు. 747 డ్రోన్లు, నాలుగు క్షిపణులను కూల్చినట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా 33 ప్రాంతాల్లో పడిన 54 డ్రోన్లు, 9 క్షిపణులు బీభత్సం సృష్టించాయి. ఎనిమిది చోట్ల కూల్చిన డ్రోన్లు, క్షిపణుల శకలాలు పడి ప్రజల ఆస్తులకు నష్టం వాటిల్లింది. మూడు నెలల పసికందు సహా నలుగురు చనిపోగా, 44 మంది గాయపడ్డారు. దాడిని ఫ్రాన్స్, బ్రిటన్ తీవ్రంగా ఖండించాయి. రష్యాలోని అజోవ్ సముద్రం, ఆక్రమిత క్రిమియా మధ్యలోని బెల్గొరోడ్, వొరొనెఝ్, క్రాస్నోడార్ తదితర ప్రాంతాలపైకి ఉక్రెయిన్ 100 డ్రోన్లను ప్రయోగించింది. ఈ డ్రోన్లను మధ్యలోనే కూల్చినట్లు రష్యా ప్రకటించింది.



టీనేజ్ సెయింట్!

కార్లో అక్యూటిస్‌కు మరణానంతరం ప్రకటించిన పోప్

వాటికన్ సిటీ: కార్లో అక్యూటిస్. వీడియో గేమ్స్ ఆడుతూ, పెంపుడు జంతువులతో వీడియోలు చేస్తూ సరదాగా గడిపిన టీనేజర్. అదే సమయంలో డిజిటల్ వేదికల ద్వారా ప్రపంచవ్యాప్తంగా క్రైస్తవ ప్రచారానికి ఎనలేని కృషి చేసిన 'దైవ ప్రభావకుడు (గాడ్స్ ఇన్‌ఫ్లుయెన్సర్)'. లుకేమియా (రక్త కణజాల క్యాన్సర్) బారిన పడి 15 ఏళ్ల వయసులోనే కన్నుమూసిన కార్లోకు సెయింట్ హోదా కట్టబెట్టి క్యాథలిక్ చర్చి పెను సంచలనం సృష్టించింది. వాటికన్ సిటీలోని సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో అసంఖ్యాకంగా గుమిగూడిన విశ్వాసుల సాక్షిగా.. కార్లో తల్లిదండ్రులు, కుటుంబీకుల సమక్షంలో పోప్ లియో–14 ఆదివారం స్వయంగా సెయింట్‌హుడ్ ప్రకటించారు. డిజిటల్ వేదిక ద్వారా క్రైస్తవాన్ని లక్షలాది మంది విశ్వాసులకు చేరువ చేసినందుకు గౌరవసూచకంగా కార్లోను ఈ విధంగా గౌరవించుకున్నట్టు వాటికన్ వర్గాలు తెలిపాయి. సెయింట్ హోదా పొందిన తొలి మిలీనియల్‌గా కార్లో చరిత్ర పుటలకెక్కారు. 1980–90 మధ్య పుట్టిన వారిని మిలీనియల్స్ అంటారన్నది తెలిసిందే. కార్లో లుకేమియా బారిన పడి 2006లో 15 ఏళ్లకే స్వర్గస్థులయ్యారు. దేవునికి అంకితమై కార్లో అప్పటికే తన జీవితంలో ఎన్నో అద్భుతాలను చేశారని సెయింట్‌హుడ్ కార్యక్రమంలో పోప్ కీర్తించారు. ఆయన పోప్‌గా బాధ్యతలు చేపట్టాక ఈ కార్యక్రమం నిర్వహించడం ఇదే తొలిసారి. ''మరణానంతరం కార్లో రెండు అద్భుతాలకు కారకుడయ్యారు. పాంక్రియాటిక్ సమస్యతో ఇబ్బంది పడుతున్న ఓ బ్రెజిల్ చిన్నారి తల్లిదండ్రులు కార్లోను స్తుతించగా వ్యాధి నయమైంది. ప్రమాదం బారిన పడ్డ ఓ కోస్టారికా విద్యార్థి కార్లోను ప్రార్థించి కోలుకున్నాడు''అని పోప్ వెల్లడించారు.

'అత్యాధునిక' ఆధ్యాత్మిక కెరటం!

జీన్స్, టీ–షర్ట్, స్నీకర్ షూ. అల్ట్రా మోడర్న్ టీనేజర్‌కు అచ్చమైన ప్రతీక కార్లో. కానీ పయనించిందంతా ఆధ్యాత్మిక మార్గం. ఇంతటి వైరుధ్యానికి మారుపేరుగా నిలిచిన కార్లో 1991లో ఇటాలియన్ తల్లిదండ్రులకు లండన్‌లో పుట్టారు. తర్వాత వారి కుటుంబం ఇటలీలోని మిలాన్‌కు మారింది. చిన్నతనంలో అల్లరి పిడుగే అయినా పదేళ్లు దాటకుండానే క్రైస్తవం, క్రీస్తు బోధల పట్ల అచంచల విశ్వాసం పెంచుకున్నారు. పక్కింటి పిల్లాడిలా అత్యంత సాదాగా కనిపించినా, అసాధారణ పనులతో క్యాథలిక్ ప్రపంచంలో చెరిగిపోని పేరు సంపాదించుకున్నారు. కంప్యూటర్ కోడింగ్‌పై కార్లోకు అపారమైన పట్టుంది. క్రీస్తు బోధలను, ఆయన చూపిన అద్భుతాలను ప్రపంచమంతటికీ తెలిపే లక్ష్యంతో 'క్యాథలిక్ ఫెయిత్' ఏకంగా ఓ బహుభాషా వెబ్‌సైట్ పెట్టారు. లుకేమియా బారిన పడి మరణించాక ఆయన దేహాన్ని విశ్వాసుల సందర్శనార్థం ఇటలీలోని అసిసీ నగరంలో గాజుపేటికలో భద్రపరిచారు. ఆయన చివరగా ధరించిన జీన్స్, నైక్ ట్రైనర్ దుస్తుల్లోనే ఉంచడం విశేషం! దాన్ని ఏటా లక్షలాది మంది సందర్శిస్తారు.



ట్రంప్ తీరుపై ఆదివారం షికాగోలో నిరసనలు

షికాగోపై ట్రంప్...
రణన్నినాదం!

'షిపోకలిప్స్' అంటూ సోషల్ మీడియాలో ఫొటో

- యుద్ధ శాఖగా అమెరికా రక్షణ విభాగం పేరు మార్పు
- మరిన్ని నగరాలకూ ఇదే ట్రీట్‌మెంట్ అంటూ ప్రకటన
- డెమొక్రాట్ల ప్రాబల్య ప్రాంతాలపైనే ప్రత్యేకంగా గురి
- సొంత నగరంపైనే యుద్ధమా: ఇల్లినాయీ గవర్నర్

వాషింగ్టన్/షికాగో: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యుద్ధోన్మాదం చివరికి సొంత దేశాన్ని కూడా వదలడం లేదు. అమెరికాలో మూడో అతి పెద్ద నగరమైన షికాగోపై ఆయన అక్షరాలా యుద్ధమే ప్రకటించారు! విపక్ష డెమొక్రటిక్ పార్టీ ఆధిపత్యమున్న షికాగో నుంచి వలసదార్లను వెళ్లగొట్టబోతున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం అమెరికా రక్షణ శాఖ పేరునే ఏకంగా యుద్ధ శాఖగా మారుస్తూ కార్యనిర్వాహక ఉత్తర్వుపై శుక్రవారం సంతకం చేశారు. 1979లో వియత్నాం యుద్ధం సమయంలో తెరకెక్కించిన 'అపోకలిప్స్ నౌ' చిత్రం పోస్టర్‌ను అనుకరిస్తూ 'షిపోకలిప్స్ నౌ' పేరిట ఓ చిత్రాన్ని సోషల్ మీడియాలో ట్రంప్ స్వయానా పోస్టు చేశారు. షికాగోపై ఎగురుతున్న హెలికాప్టర్లు, నీటిపై ప్రజ్వరిల్లుతున్న మంటలు అందులో కనిపిస్తున్నాయి. ఆ సినిమాలో యుద్ధోన్మాది అయిన లెఫ్టినెంట్ కల్నల్ కిల్గోర్ పాత్రలో ట్రంప్ దర్శనమిస్తున్నారు. అందులోని ఫేమస్ డైలాగ్‌ను గుర్తుకు తెస్తూ 'ఈ ఉదయం డిపోర్టేషన్ల వాసనను ఆస్వాదిస్తున్నా' అంటూ పోస్టు చేశారు. 'డిపార్టుమెంట్ ఆఫ్ వార్ అని ఎందుకు అంటున్నామో షికాగో తెలుసుకోనుంది' అని పేర్కొన్నారు. బాల్టిమోర్, న్యూ ఆర్లీన్స్‌కు సైతం ఇలాంటి ట్రీట్‌మెంట్ తప్పదంటూ సోషల్ మీడియాలో పోస్టుచేశారు. పోర్ట్‌ల్యాండ్, ఒరెగాన్‌పైనా గురిపెట్టారు. షికాగోకు నేషనల్ గార్డ్ దళాలు, ఇమ్మిగ్రేషన్ ఏజెంట్లను కూడా పంపించబోతున్నట్లు వెల్లడించారు. ఇవన్నీ విపక్ష డెమొక్రటిక్ పార్టీకి బలమున్న ప్రాంతాలే కావడం గమనార్హం. లాస్ ఏంజెలెస్‌లో ఇప్పటికే నేషనల్ గార్డ్ దళాలను రంగంలోకి దించడం తెలిసిందే. ఇప్పుడు షికాగోలో వాటితో పాటు ఇమిగ్రేషన్ ఏజెంట్లను మోహరించబోతున్నారు.

భయం గుప్పెట్లో షికాగో

ట్రంప్ హెచ్చరికలతో షికాగోలోని విదేశీయులు, ప్రధానంగా లాటిన్ మూలాలున్నవాళ్లు ఆందోళన చెందుతున్నారు. కొందరు తమ పౌరసత్వాన్ని ధ్రువీకరించుకోవడానికి అమెరికా పాస్‌పోర్టులను నిత్యం దగ్గరే ఉంచుకుంటున్నారు. ట్రంప్ తీరును నిరసిస్తూ నగరవ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలతో జనం కదం తొక్కుతున్నారు.

ఉడుత ఊపులకు బెదరం: ప్రిట్జ్‌కెర్

ట్రంప్ తీరును ఇల్లినాయిస్ గవర్నర్ జె.బి.ప్రిట్జ్‌కెర్ తప్పుపట్టారు. ఆయన నియంతగా మారజూస్తున్నారంటూ మండిపడ్డారు. ''సొంత దేశంలోని నగరంపై యుద్ధోన్మాదం ప్రదర్శిస్తున్నారు. ఇది జోక్ కాదు. సాధారణ విషయం అంతకన్నా కాదు. ట్రంప్ బలమైన నాయకుడు కాదు. పిరికి వ్యక్తి అలాంటి వాళ్ల బెదిరింపులకు ఎవరూ భయపడబోరు'' అని తేల్చిచెప్పారు.

సాక్షి
హైదరాబాద్
సోమవారం ; 8 ; సెప్టెంబర్ ; 2025



బర్డ్ 'హిట్'
ఆకాశం.. ఈ పేరు చెప్పగానే మేఘాలతోపాటు విమానాలు, పక్షులు గుర్తుకు వస్తాయి. అయితే ఇప్పుడు ఆ పక్షుల పేరు చెబితే విమానయాన సంస్థలు హడలిపోతున్నాయి. -8లో



నగరంలో డ్యాన్స్ వర్కవుట్ అవుతోంది..
ఒకప్పుడు డ్యాన్స్ క్లాస్‌లో చేరుతున్నారంటే నైపుణ్యం సాధించడానికి అని అనుకునేవాళ్లు. ఇప్పుడు అది క్యాలరీల ఖర్చుకో, వెయిట్‌లాస్ కోసమో అన్నట్టు మారింది. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
31.0/22.0

వాతావరణం
నగరంలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షం కురవొచ్చు. గరిష్టంగా 31, కనిష్టంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

హుస్సేన్ సాగర్‌లో వ్యర్థాల తొలగింపు షురూ



సాక్షి, సిటీబ్యూరో/బంజారాహిల్స్: హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం చేసిన వినాయక విగ్రహాల తొలగింపు చర్యలు మొదలయ్యాయి. హెచ్ఎండీఏ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో వ్యర్థాల వెలికితీత పనులను ప్రారంభించారు. గత 10 రోజుల నుంచి హుస్సేన్‌సాగర్, పీపుల్స్‌ప్లాజా, జలవిహార్‌ల్లో ఏర్పాటు చేసిన బేబీపాండ్స్‌లో నిమజ్జనం జరుగుతుండగా, జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులు ఎప్పటికప్పుడు వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని తొలగిస్తున్నారు. ఆదివారంరాత్రి వరకు సుమారు 4,800 టన్నులకుపైగా వ్యర్థాలను వెలికితీసినట్లు అధికారులు తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తోపాటు ఐరన్, విగ్రహాల అలంకరణ కోసం వినియోగించిన వివిధ రకాల వస్తువులను వెలికితీస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమం మరో మూడు రోజులపాటు కొనసాగనుంది. ఇంకా మరో 6,800 టన్నులకు పైగా వ్యర్థాలు ఉండవచ్చునని చెప్పారు. నెక్లెస్ రోడ్, ట్యాంక్‌బండ్ రెండు వైపులా పెద్ద సంఖ్యలో విగ్రహాలను నిమజ్జనం చేసిన సంగతి తెలిసిందే. ఆదివారం మధ్యాహ్నం వరకు కూడా విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలు కొనసాగాయి. ఈ కార్యక్రమానికి విఘాతం కలగకుండా వ్యర్థాలను వెలికితీసే పనులను కొనసాగించారు. తొలగించిన వ్యర్థాలను జీహెచ్ఎంసీకి అప్పగించనున్నారు.ఇందు కోసం 400 మంది జీహెచ్ఎంసీ కార్మికులను షిఫ్టుల వారీగా పనిచేయిస్తున్నారు. ఈ నెల 6, 7 తేదీల్లో 2 వేల టన్నుల వ్యర్థాలను తొలగించారు. 20 లారీల ద్వారా చెత్తను ఇక్కడి నుంచి తరలిస్తున్నారు. విగ్రహాలు నిమజ్జనం కాగానే పూజా వ్యర్థాలను లారీల ద్వారా డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు.

నేడు 'ఎస్కీ'లో అంతర్జాతీయ సదస్సు ప్రారంభం

రాయదుర్గం: ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా క్యాంపస్‌లో రెండు రోజులపాటు నిర్వహించే అంతర్జాతీయ సదస్సును సోమవారం ప్రారంభిస్తున్నట్లు 'ఎస్కీ' డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు తెలిపారు. క్యాంపస్‌లోని సెంటినరీ కన్వెన్షన్ సెంటర్‌లో ఉదయం 10 గంటలకు 'సస్టేనబుల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ త్రూ సర్క్యులర్ ఎకానమీ అండ్ టెక్నోలాజికల్ ఇన్నోవేషన్' అనే అంశంపై ఈ సదస్సు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తెలంగాణ రెరా చైర్మన్, ఐఏఎస్ అధికారి డాక్టర్ ఎన్.సత్యనారాయణ, విశిష్ట అతిథులుగా విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి సి.అచలేందర్‌రెడ్డి, జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ సీఎన్ రఘుప్రసాద్, ప్రపంచ బ్యాంక్ కన్సల్టెంట్ డాక్టర్ డీఏ మోహన్, తెలంగాణ సీఐఐ వైస్ చైర్మన్ డాక్టర్ ఎం.గౌతమ్‌రెడ్డి, డాక్టర్ పీజీ శాస్త్రి పాల్గొంటారని ఆయన వివరించారు.



భక్తుల నీరాజనాలు అందుకున్న వినాయకుడు ప్రశాంత వదనంతో నిమజ్జనమయ్యాడు. నిమజ్జనాలు ఆదివారం రాత్రి ఏడు గంటలకల్లా విజయవంతంగా పూర్తి అయ్యాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. మరోవైపు హుస్సేన్‌సాగర్‌లోని వ్యర్థాల తొలగింపు పనుల్లో సిబ్బంది నిమగ్నమయ్యారు.



ఎత్తే సవాలైంది!

ఈసారి గణేష్ విగ్రహాల నిమజ్జనం ఆలస్యం

- ఎత్తయిన విగ్రహాల సంఖ్య పెరగడమే జాప్యానికి కారణం
- గత ఏడాదితో పోలిస్తే తగ్గిన ఉదంతాలు
- 40 గంటలు అవిశ్రాంతంగా విధులు: సీపీ



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్

సాక్షి, సిటీబ్యూరో: గణేష్ ఉత్సవాల్లో కీలక ఘట్టమైన శోభాయాత్ర ముగిసింది. ఆదివారం రాత్రి ఏడుగంటలకల్లా హుస్సేన్‌సాగర్‌లో విగ్రహాల నిమజ్జనం పూర్తి అయింది. శోభాయాత్ర, నిమజ్జనాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు, జీహెచ్ఎంసీ, ఇతర శాఖల అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈసారి మండపాల సంఖ్యతోపాటు విగ్రహాల ఎత్తూ గణనీయంగా పెరిగిపోవడం వల్లే నిమజ్జన ప్రక్రియలో కొంత జాప్యం జరిగినట్లు నగర కొత్వాల్ సీవీ ఆనంద్ ప్రకటించారు.

'ఆఫ్‌లైన్'లో రెట్టింపు..

నగర కమిషనరేట్ పరిధిలో గణేశ్ మండపాలకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ జరిగింది. ఈ ఏడాది మొత్తం 12,030 విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చారు. అనుమతులు తీసుకోకుండా మరో 40 వేల మండపాలు ఏర్పాటయ్యాయి. క్షేత్రస్థాయి అధికారులు ఆఫ్‌లైన్ విధానంలో వాటి వివరాలు నమోదు చేసుకున్నారు. ఆయా గణపతి విగ్రహాల ఎత్తు, నిమజ్జన ఊరేగింపు మార్గం తదితరాలను గుర్తిస్తూ అది నిమజ్జనం అయ్యే వరకు పర్యవేక్షించారు. దీనికోసం ప్రతి విగ్రహానికి ఓ క్యూఆర్ కోడ్ కేటాయించారు. ఈ మండపాల నుంచి నిమజ్జనం జరిగే ప్రాంతం వరకు ప్రతి మార్గాన్నీ పర్యవేక్షించిన అధికారులు అడ్డంకులు లేకుండా కృషి చేశారు.

'లెక్కల్లో'లేని విగ్రహాలు..

నగరంలో ఏర్పాటైన కొన్ని విగ్రహాలతోపాటు పొరుగు కమిషనరేట్లు, జిల్లాల నుంచి వచ్చిన విగ్రహాల ఊరేగింపుల వల్ల కొన్ని ఇబ్బందులు వచ్చాయి. వీటిలో కొన్ని ఏకంగా 40 అడుగుల ఎత్తు ఉన్నాయి. ఫలితంగా ఆయా మార్గాల్లో ఉన్న కొన్ని కరెంట్ వైర్లు, చెట్లు, కేబుల్ తీగలు విగ్రహాలకు అడ్డంకులుగా మారాయి. మోనప్ప ఐలాండ్-రాజ్‌భవన్ మార్గంలో శనివారం రాత్రి ఓ విగ్రహం చెట్టు కొమ్మలకు తగిలి వాహనంపైనే వెనక్కు ఒరిగిపోయింది. దీంతో పంజగుట్ట ప్రాంతంలో రిజర్వ్‌లో ఉంచిన క్రేన్‌ను తీసుకువచ్చి విగ్రహానికి ఎలాంటి నష్టం లేకుండా వాహనంపై నిలబెట్టారు. ఇలా మరికొన్ని చోట్లా జరగడంతో ఆయా మార్గాల్లో వాహనాలు ఆగిపోయి శోభాయాత్రకు అవాంతరాలు ఏర్పడ్డాయి.

నెక్లెస్‌రోడ్‌కి చేరిన 900 విగ్రహాలు..

ఈ ఏడాది మూడోరోజు నుంచి పదకొండో రోజు వరకు దాదాపు 1.4 లక్షల విగ్రహాలను నిమజ్జనమైనట్లు అధికారులు చెప్తున్నారు. వీటిలో 1.2 లక్షల విగ్రహాలు బేబీ పాండ్స్, ఇతర చిన్న చెరువుల్లో నిమజ్జనం కాగా.. మిగిలినవి హుస్సేన్‌సాగర్‌సహా ఇతర చెరువుల్లో జరిగాయి. ఐదడుగుల కంటే ఎక్కువ ఎత్తున్న 4,700 విగ్రహాలు శనివారం ఉదయం నుంచి హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం అయ్యాయి. ఆదివారం మధ్యాహ్నానికి దాదాపు 900 విగ్రహాలతో ఉన్న లారీలు మిగిలిపోవడంతో వీటిని నెక్లెస్ రోడ్డులోకి మళ్లించారు. ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజా, గార్డెన్ పాయింట్, జలవిహార్, సంజీవయ్య పార్కు వద్ద ఉన్న కొన్ని క్రేన్ల ద్వారా నిమజ్జనం చేశారు. ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్‌లో ట్రాఫిక్ ఆంక్షలు ఎత్తేశారు.

> #### మండపాల నిర్వాహకులకు కృతజ్ఞతలు
> ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ సమితి సభ్యుల సహకారంతో బడా గణేషుడి నిమజ్జనం గతేడాది కంటే ముందుగా పూర్తయింది. మాకు సహకరించిన ఉత్సవ సమితితోపాటు మండపాల నిర్వాహకులకు కృతజ్ఞతలు. ఊరేగింపుల్లో జరిగిన చిన్న, చిన్న ఘర్షణలపై వివిధ ఠాణాల్లో ఐదు కేసులు నమోదయ్యాయి. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన 170 మంది పోకిరీలతోపాటు జేబుదొంగల్ని పట్టుకున్నాం. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఇలాంటి నేరాల సంఖ్య తగ్గింది. సామూహిక నిమజ్జనం కోసం దాదాపు 40 గంటల నిర్విరామంగా పని చేసిన అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు.
> – సీవీ ఆనంద్, హైదరాబాద్ పోలీసు కమిషనర్

కీలకదశకు
పాతబస్తీ మెట్రో విస్తరణ



- మొత్తం 886 ఆస్తుల కూల్చివేతకు చర్యలు
- ఇప్పటి వరకు 550 ఆస్తుల కూల్చివేత
- రూ.433 కోట్ల పరిహారం చెల్లించిన హెచ్ఎంఆర్

సాక్షి, సిటీబ్యూరో: పాతబస్తీ మెట్రో విస్తరణకు అవసరమైన పనులు వేగం పుంజుకొని కీలక దశకు చేరుకున్నాయి. కారిడార్ నిర్మాణానికి వీలుగా 'రైట్ ఆఫ్ వే'లభించే దశకు చేరువయ్యాయి. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కి.మీ. పరిధిలో మెట్రో రైలు మార్గం నిర్మాణం చేపట్టనున్న సంగతి తెలిసిందే. ఈ మార్గంలో రోడ్డు విస్తరణ కోసం 1,100 ఆస్తులను తొలగించే అవకాశం ఉన్నట్లు మొదట అంచనా వేశారు. కానీ, వాటి సంఖ్య 886కు తగ్గిందని హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైల్ లిమిటెడ్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు సుమారు 550 పైగా ఆస్తుల కూల్చివేతలు తుదిదశకు చేరుకున్నాయని చెప్పారు. ప్రభావిత ఆస్తులకు సంబంధించిన యజమానులకు రు.433 కోట్ల నష్టపరిహారం చెల్లించినట్లు పేర్కొన్నారు. వర్షాలు, పండుగలు, మొహర్రం వంటి వేడుకల సమయంలోనూ స్థానికులకు ఇబ్బందులు కలగకుండా పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ కేబుళ్ల తొలగింపు రోడ్డు విస్తరణ పనులకు సవాల్‌గా నిలిచినప్పటికీ, వాటిని అధిగమించి ముందుకు వెళ్తున్నామన్నారు.

మెట్రో నిర్మాణానికి డీజీపీఎస్ సర్వే...

మెట్రో స్తంభాలు, స్టేషన్ల నిర్మాణానికి అవసరమైన ప్రాథమిక పనులను కూడా హెచ్ఏఎంఆర్ఎల్ చేపట్టింది. ఇందు కోసం అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్(డీజీపీఎస్) సర్వే కొనసాగుతోంది. భూగర్భంలో ఉన్న మంచినీటి పైపులైన్‌లు, పారిశుధ్య పైపులైన్‌లు, కేబుళ్లు వంటి యుటిలిటీలను గుర్తించడంతోపాటు భూ సామర్థ్యం, మట్టి పరీక్షలు, అలైన్‌మెంట్ మార్గంలో ఉన్న సున్నితమైన కట్టడాల పరిరక్షణ వంటి ప్రధాన అంశాలపై అధికారులు దృష్టి సారించారు. 'ఇది అధునాతన సర్వే వ్యవస్థ. వేగవంతమైన బహుముఖ కోణంలో డిజిటల్ రూపంలో ఫలితాలను అందజేస్తుంది'అని అన్నారు. డీజీపీఎస్ డేటాను గతంలో చేసిన డ్రోన్ సర్వే డేటాతో అనుసంధానించినట్లు చెప్పారు.దీని వల్ల ప్రాజెక్ట్ అమలు మరింత వేగవంతమవుతుందన్నారు.

వివిధ విభాగాలతో సమన్వయం...

- మొత్తం 7.5 కిలోమీటర్ల విస్తీర్ణాన్ని కొన్ని భాగాలుగా విభజించి అవసరమైన ప్రదేశాల్లో కంట్రోల్ పాయింట్లను ఏర్పాటు చేశారు. హై-ప్రెసిషన్ గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్స్ (జీఎన్ఎస్ఎస్) రిసీవర్‌లను నిర్దేశిత ప్రదేశాలను ఖచ్చితంగా నిర్ణయించడానికి వినియోగిస్తున్నట్లు ఎన్వీఎస్ వివరించారు.
- ఉపగ్రహాల నెట్‌వర్క్ సిగ్నళ్ల ఆధారంగా ఈ స్థానాలను ఖచ్చితంగా గుర్తించి మెట్రో పనుల సర్వే, మ్యాపింగ్‌లో వినియోగించనున్నారు.
- పాతబస్తీలో విస్తరించనున్న 100 అడుగుల రోడ్డు మార్గంలో అనేక నీటి సరఫరా లైన్లు, మురుగునీరు, వరద నీరు, విద్యుత్, టెలికాం లైన్లు వంటి యుటిలిటీలు ఉన్నాయి.
- మెట్రో స్తంభాలకు పునాదులను వేయడానికి ముందుగానే భూమిలోపల ఉన్న యుటిలిటీలను పక్కకు మళ్లించేందుకు జలమండలి, జీహెచ్ఎంసీ, టీజీఎస్పీడీసీఎల్, బీఎస్ఎన్ఎల్ వంటి ప్రభుత్వ విభాగాల సహకారం కోరారు.
- యుటిలిటీలను గుర్తించడానికి గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ (జీపీఆర్) సర్వేను చేపట్టారు. ఈ సర్వే వల్ల భూతలం కింద ఉన్న వస్తువులు, నిర్మాణాలను పసిగట్టవచ్చు.
- మెట్రో నిర్మాణానికిగాను భూసామర్థ్య పరీక్షలను కూడా హెచ్ఏఎంఆర్ఎల్ చేపట్టింది.
- మెట్రో పనులను సజావుగా కొనసాగించేందుకు 100 మీ. ఒకటి చొప్పున మైలు రాళ్లను ఏర్పాటు చేయనున్నారు. సున్నిత కట్టడాలకు విఘాతం లేకుండా జాగ్రత్తలు చేపట్టారు.
- ప్రస్తుతం కొనసాగుతున్న ఈ కీలకదశ పనులు పూర్తయిన వెంటనే మెట్రో నిర్మాణం ప్రారంభమవుతుందని ఎన్వీఎస్‌రెడ్డి అన్నారు.

గణేష్ నిమజ్జనోత్సవం విజయవంతం

3 లక్షల 3 వేల గణేష్ విగ్రహాల నిమజ్జనం
- ఇప్పటి వరకూ 20 వేల టన్నుల వ్యర్థాలు సేకరణ
- అధికారులు, సిబ్బందికి మేయర్, కమిషనర్ అభినందన
- పారిశుద్ధ్య కార్మికుల సేవలకు ప్రత్యేక ప్రశంస



లక్డీకాపూల్ : గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా, విజయవంతంగా జరిగిందని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ తెలిపారు. ఆదివారం సాయంత్రం వరకు గ్రేటర్ వ్యాప్తంగా 3 లక్షల 3 వేల గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేశారన్నారు. పకడ్బందీ ప్రణాళిక, పటిష్టమైన ఏర్పాట్లతో కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది, పోలీస్, విద్యుత్, హెచ్ఎండీఏ, హైడ్రా, రెవెన్యూ, సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందికి మేయర్ గద్వాల విజయలక్ష్మి, కమిషనర్ అభినందనలు తెలిపారు. పారిశుద్ధ్యం, విద్యుత్ సౌకర్యంతోపాటు టాయిలెట్లు, సరిపడా క్రేన్ల ఏర్పాటు తదితర అంశాల్లో జీహెచ్ఎంసీ చేపట్టిన చర్యలు సత్ఫలితాలిచ్చాయి. నిమజ్జనం మార్గం పొడవునా ఏర్పాటు చేసిన గణేశ్ యాక్షన్ టీమ్స్ రోడ్లపై చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాయి. ప్లాస్టిక్ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలతో ఫలితం కనిపించింది. రోడ్డు సేఫ్టీ డ్రైవ్‌లో నగరంలోని రోడ్లకు మరమ్మతులు చేపట్టడం, ప్రధానంగా నగరంలో ఖైరతాబాద్ మహా గణపతి, బాలాపూర్ గణేష్‌లతో సహా నిమజ్జన శోభాయాత్ర జరిగే 303 కిలోమీటర్ల మేర మార్గం మరమ్మతులు చేపట్టడంతో ఊరేగింపు సాఫీగా, సురక్షితంగా, వేగంగా జరిగిందని పేర్కొన్నారు. పారిశుద్ధ్యానికి ప్రాధాన్యతనిస్తూ 15 వేల మంది సిబ్బంది నిరంతరం క్షేత్రస్థాయిలో మూడు షిఫ్టుల్లో విధులు నిర్వర్తించడంతో పారిశుద్ధ్య నిర్వహణలో ఇబ్బందులు కనిపించలేదన్నారు. 72 కృత్రిమ కొలనులతో ప్రధాన చెరువులపై ఒత్తిడి లేకుండా, ట్రాఫిక్ జామ్‌లు లేకుండా, భక్తులు స్థానికంగానే నిమజ్జనం అయ్యేలా చూడగలిగామన్నారు. జీహెచ్ఎంసీ కల్పించిన ఉచిత భోజన సౌకర్యం భక్తులు, ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని పేర్కొన్నారు. పారిశుద్ధ్య కార్మికుల సేవలను మేయర్, కమిషనర్ ప్రత్యేకంగా ప్రస్తావించి ప్రశంసించారు.. వారి నిరంతర సేవల వల్లే ఇప్పటి వరకూ 20 వేల అధిక టన్నుల వ్యర్థాలను సేకరించినట్లు తెలిపారు. ఈ వ్యర్థాలను జవ జవహర్ నగర్ లోని ప్రాసెసింగ్ సెంటర్‌కు పంపామన్నారు.

గణేష్ ఉత్సవసమితి సభ్యులు, మీడియా, ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు


వినాయక చవితి ఉత్సవం, మహా నిమజ్జనం కార్యక్రమం సజావుగా జరిగేలా యంత్రాంగానికి తమ వంతు సహకారం అందించిన గణేష్ ఉత్సవ సమితి సభ్యులు, మీడియా, ప్రజలకు మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ కర్ణన్ కృతజ్ఞతలు తెలిపారు. జీహెచ్ఎంసీ యంత్రాగం, ప్రభుత్వ శాఖలు చేసిన ఏర్పాట్లను, అధికారుల సూచనలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మీడియా క్రియాశీలంగా వ్యవహరించిందని ఆదివారం ఒక ప్రకటనలో కొనియాడారు.

కాంగి'రేసు' మల్లగుల్లాలు!

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక అభ్యర్థిత్వంపై అధికార పార్టీ కసరత్తు

- బీసీ కార్డు ప్రయోగానికి సిద్ధం
- తలనొప్పిగా మారిన స్థానిక కుమ్ములాటలు
- ప్రత్యర్థుల ఊహకందకుండా వ్యూహాత్మక అడుగులు

సాక్షి, సిటీబ్యూరో: అధికార కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నిక అభ్యర్థిత్వం ఖరారుపై మల్లగుల్లాలు పడుతోంది. అధికారంలోకి వచ్చిన తర్వాత రెండో ఉపఎన్నిక కావడంతో సీరియస్‌గా తీసుకొని ప్రతి అడుగూ ఆచితూచి వేస్తోంది. ఎన్నికల షెడ్యూల్ విడుదల కంటే ముందుగానే గెలుపు మార్గాలను సుగమం చేసుకునేందుకు ముగ్గురు మంత్రులు, 18 మంది కార్పొరేషన్ల చైర్మన్లను రంగంలోకి దింపి అభివృద్ధి మంత్రం జపిస్తోంది. ప్రత్యర్థుల రాజకీయ ఎత్తుగడలను గమనిస్తూ వారి ఊహలకు అందని విధంగా పావులు కదుపుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇదేస్థానంలో పోటీ చేసి ఓటమి పాలైన భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ అజారుద్దీన్ తిరిగి బరిలో నిలిచేందుకు ఆసక్తి కనబర్చారు. అయితే మైనారిటీ అభ్యర్థిని బరిలోకి దింపితే హిందూత్వ ఎజెండాతో బీజేపీ బలపడే ప్రమాదం ఉందని భావించి టికెట్ రేసు నుంచి ఆయనను తప్పించి గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవికి ఎంపిక చేసింది. మైనారిటీయేతర అభ్యర్థిని బరిలో నిలిపేందుకు సిద్ధమైంది. ఇటీవల హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ 'స్థానిక'అభ్యర్థిత్వాన్ని పరిశీలిస్తామని ప్రకటించి పార్టీ శ్రేణుల్లో జోష్ నింపారు. అయితే తాజాగా పార్టీలో అంతర్గత విభేదాలు, కుమ్ములాటలు, కొత్త, పాత కేడర్ మధ్య ఆధిపత్య పోరు, అమాత్యుల ముందే అమీతుమీలకు దిగడం వంటి వ్యవహారాలు గుదిబండగా తయారయ్యాయి. టికెట్ రేసులో ఉన్న స్థానిక ఆశావహులు కూడా కేవలం మంత్రుల పర్యటన కార్యక్రమాలకే పరిమితమై ఎవరికి వారే



యమునా తీరే అన్న చందంగా వ్యవహరించడాన్ని పార్టీ తీవ్రంగా పరిగణించినట్లు కనిపిస్తోంది. దీంతో అభ్యర్థిత్వం ఎంపిక విషయంలో స్థానికత అంశంపై పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది.

బీసీ అభ్యర్థిత్వం వైపు మొగ్గు

కాంగ్రెస్ పార్టీ ఉప ఎన్నికల్లో బీసీ అభ్యర్థిత్వంపై మొగ్గు చూపేందుకు సిద్ధమైనట్లు కనిపిస్తోంది. తాజాగా అసెంబ్లీలో తీసుకున్న బీసీ రిజర్వేషన్ పెంపు నిర్ణయం పార్టీకి కలిసి వచ్చి ఉపఎన్నికల్లో లబ్ధి చేకూర్చే విధంగా బీసీ అభ్యర్థిత్వాన్ని పరిశీలిస్తోంది. ఉప ఎన్నికను ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న నేపథ్యంలో విజయబావుట ఎగరవేయడమే లక్ష్యంగా గెలుపు గుర్రం అన్వేషణలో పడింది. ఒకవైపు నియోజకవర్గంలో అభివృద్ధి పనులను ఏకరవు పెడుతూ అన్నివర్గాల ప్రజలను మెప్పించేందుకు ప్రయత్నిస్తూనే, మరోవైపు బలమైన బీసీ అభ్యర్థిని బరిలో దింపేందుకు కసరత్తు చేస్తోంది. ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు యువనేత నవీన్ యాదవ్, జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, విద్యావేత్త భవానీశంకర్ తదితరులు ఆసక్తి కనబర్చుతున్నారు. వారి ఆర్థిక బలాబలాలు, రాజకీయ, కుటుంబ నేపథ్యం, ప్రజల్లో వారిపై గల పలుకుబడి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని అభ్యర్థిత్వాన్ని పరిశీలిస్తోంది.

అందరికీ ఆమోదయోగ్యంగా..

అందరికీ ఆమోదయోగ్యమైన, బలమైన అభ్యర్థి పేరును పరిశీలించేందుకు కాంగ్రెస్ పార్టీ తీవ్ర కసరత్తు చేస్తోంది. నియోజకవర్గంలో గెలుపు, ఓటములకు సెలబ్రిటీలు, వ్యాపారవేత్తలు, విద్యావంతులు, నివసించే పలు కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు కీలకమే. ఈ ప్రాంతాల ఓటర్లు సైతం ఆమోదించే అభ్యర్థిని రంగంలోకి దింపాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల పార్టీ అధిష్టానం ఈ ప్రాంతాల్లో పలువురి అభ్యర్థిత్వాలపై సర్వే నిర్వహించినట్లు తెలుస్తోంది.

ఆశల పల్లకిలో...

- అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరిన నవయువ నిర్మాణ సంస్థ వ్యవస్థాపక చైర్మన్, యువనేత నవీన్ యాదవ్ టికెట్ తనకే దక్కుతుందని ఆశలు పెట్టుకున్నారు. అగ్రనేతల నుంచి గ్రీన్ సిగ్నల్ ఉన్నట్లు ఆయన అనుచరులు ప్రచారం చేసుకుంటున్నారు. గతంలో రెండుసార్లు పోటీ చేసిన అనుభవం, స్థానిక పరిచయాలు కలిసి వస్తాయని ఆయన భావిస్తున్నారు.
- పార్టీ అధిష్టానం బీసీ అభ్యర్థిత్వాన్ని పరిశీలిస్తుండటంతో జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ టికెట్‌పై ఆశలు పెట్టుకున్నారు. ఐదేళ్లపాటు మేయర్‌గా సమర్థవంతంగా అందించిన సేవలు, నియోజకవర్గంలోని అన్ని వర్గాలతో ఉన్న పరిచయాలు తన అభ్యర్థిత్వం పరిశీలనకు బలం చేకూర్చవచ్చని ఆయన భావిస్తున్నారు.
- మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ టికెట్‌పై ఆశలు పెట్టుకొని నియోజకవర్గంలో సుడిగాలిలా పర్యటిస్తున్నారు. రెండు పర్యాయాలు సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానానికి ప్రాతినిధ్యం వహించిన నేపథ్యంలో అసెంబ్లీ సెగ్మెంట్‌లోని పరిచయాలు, పదేళ్లపాటు డీసీసీ అధ్యక్ష బాధ్యతలు అభ్యర్థిత్వం పరిశీలనకు కలిసి రావచ్చని ఆయన ఆశలు పెట్టుకున్నారు.
- దివంగత నేత పీజేఆర్ శిష్యుడు, విద్యావేత్త భవానీశంకర్ కాంగ్రెస్ సీటుపై ఆశలు పెట్టుకున్నారు. దశాబ్దాల కాలంగా పార్టీకి అంకితభావంతో సేవలందిస్తున్నందున స్థానికులకు టికెట్ ఇవ్వదల్చుకుంటే తన పేరు పరిశీలించవచ్చని భావిస్తున్నారు. స్థానికంగా ప్రజల్లో పట్టు, కేబుల్ నెట్‌వర్క్, విద్యాసంస్థల కారణంగా పరిచయాలు మరింత కలిసి వచ్చే అంశాలుగా ఆయన భావిస్తున్నారు.

చిలుకూరు బాలాజీ
ఆలయం మూసివేత



మొయినాబాద్: చంద్ర గ్రహణం సందర్భంగా చిలుకూరు బాలాజీ దేవాలయాన్ని ఆదివారం సాయంత్రం మూసివేశారు. ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులకు అవకాశం కల్పించారు. రాత్రి చంద్రగ్రహణం ఉండటంతో సాయంత్రం 4 గంటలకు ఆలయాన్ని మూసివేశారు. గర్భ గుడి తలుపులు మూసి తాళాలు వేశారు. ఆలయ గోపురం ప్రధాన ద్వారాన్ని సైతం మూసివేశారు. గ్రహణం తరువాత సోమవారం ఉదయం 8 గంటలకు సంప్రోక్షణ చేసి ఆలయాన్ని తెరవనున్నారు. స్వామివారికి అభిషేకం చేసిన అనంతరం దర్శనానికి భక్తులను అనుమతిస్తామని అర్చకుడు రంగ రాజన్ తెలిపారు.

IN THE SUPREME COURT OF INDIA
EXTRA-ORDINARY APPELLATE JURISDICTION
SPECIAL LEAVE PETITION (CIVIL) NO. 27578 OF 2024
WITH PRAYER FOR INTERIM RELIEF

BETWEEN:
P.Subash and others ...Petitioners/Appellants
AND
P.Sharath Babu and others ...Respondents
To.
1. P.Sharath Babu S/o. Late P.Yadaiah,
2. P.Sravan Kumar, S/o. P.Yadaiah. Both Respondent no.1 and 2 R/o. Plot No. 605, Vijayapuri Colony, Phase-II, Vanasthalipuram, Hyderabad.
3. Pandala Sudha Rani, W/o.P.Nagender, D/o.P.Yadaiah, R/o. Flat No. 302, Pushpanjali Apartment, Green Hills Colony, Kothapet, Dilsukhnagar, RR District.
4. J.N.Prasanna, W/o. J.K. Nagesh, R/o. H.No. 6-3-1124/B, NGOs Colony, Vanasthalipuram, Hyderabad-70.
5. V.Aruna Sree, W/o. Venkateshwar Rao.
6. N.Vijaya Shanthi, W/o. N. Karunaker, Both No.5 and 6 are R/o. H.No. 6-3-1124/B, NGOs Colony, Vanasthalipuram, Hyderabad-70.
7. P.Sravanthi D/o. Late P.Ashok, R/o. Plot No. 637, SKD Nagar, BN Reddy Colony, Vanasthalipuram, Hyderabad. ...Respondents 1, 2, 9, 13-15, 23

Please take notice that the above Special Leave Petition (Civil) 27578 of 2024 on the file Supreme Court of India, At New Delhi, filed to grant stay in OS No. 105 of 2008 on the file of the XII Addl. Chief Judge, City Civil Court, at Secunderabad. The above case stands posted on **09-09-2025** for your appearance or through your Advocate if any in the said Court at **10:30 a.m.** if you fail to attend the above Court on the said date matter will be decided in your absence.

(BY ORDER OF THE COURT)

Abid Ali Beeran. P
Advocate
Office at: E-315, Anandlok Apartments, Near Ahlcon Public School, Mayur Vihar-1, DELHI. Cell No. 98103 35097

మీ ఆప్తుల అంత్యక్రియలు, శ్రద్ధాంజలి, నిర్యాణం, వర్ధంతి, జయంతిల ప్రకటనల కోసం సంప్రదించండి.
Ph: 040-23256000 Ext: 6344, 9912220352

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate
■ 4 లక్షలకే 605 గజాలు నారాయణఖేడ్ దగ్గర న్యూవెంచర్‌లో ప్లాట్లు అమ్మబడును. రైతు భరోసా, భీమా లభించును. 8309376230. [SCA25007982]

PLOT FOR SALE
■ ఫ్యూచర్ సిటీ @ కడ్తాల్ టౌన్‌లో DTCP అప్రూవల్ వెంచర్‌లో అన్ని డెవలప్‌మెంట్స్‌తో వెంటనే ఇల్లు కట్టుకునే ప్లాట్స్ కలవు. బ్యాంక్ లోన్ కలదు. సంప్ర: 9666695886 [HA-1485]

Services
BUSINESS SERVICE
■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9100329739 [H-800538]

PERSONAL CARE
OLD AGE HOME
■ వృద్ధులు, NRI'S లగ్జరీ రూమ్స్, లిఫ్ట్ @ మేడిపల్లి. దీర్ఘకాలిక మంచాన ఉన్న వారికి 24/7 మెడికల్, ఉప్పల్ & చీర్యాల్. మీన్స్ భోజన వసతి. 7981467036, 939103 9990, 6281125552 [H-783382]

CHANGE OF NAME
■ I, B GANESH @BATHULA GANESH S/o Late B NARASIMHA R/o H.No:1-2-209, Pragathi Nagar, Kothapet, Uppal(M), R.R Dist, T.G. In my School Admission my Surname was Wrongly entered as B. GANESH S/o B NARASIMHA AS Per My Adhar Card my Surname is Changed as KAMTAM GANESH S/o KAMTAM NARASIMHA [SCA25007985]

Wanted
■ గర్ల్స్ హాస్టల్‌లో వంట చేయటానికి 40 నుండి 50 సం॥లు వయస్సు ఉన్న సింగిల్ లేడీ కావలెను. వసతి, ఉచిత భోజనం & నెల జీతం. అడ్రస్ : దిల్‌సుఖ్‌నగర్. Ph : 7075239265 [HA-16037]
■ శంషాబాద్ నర్మదా MG షోరూంలో పని చేయుటకు సేల్స్ మేనేజర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, సర్వీస్ మేనేజర్, సూపర్‌వైజర్స్, మెకానిక్‌లు కావలెను. సంప్ర॥ సెల్ నెంబర్స్ : 9492628629, 9491402020. [J-562]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు — జోన్ సెంటర్స్
3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9010244403	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	9912225453

వివరాలకు : 6-2-24/1, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

బర్డ్ 'హిట్'!

విమానాలకు విహంగాల ముప్పు
- దేశ వ్యాప్తంగా భారీగా నమోదవుతున్న బర్డ్ హిట్స్
- ఐదో స్థానంలో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్
- 2020 నుంచి 207 ఉదంతాలు
- జనావాసాలు పెరగడమే కారణం అంటున్న నిపుణులు



సాక్షి, సిటీబ్యూరో: ఆకాశం ఈ పేరు చెప్పగానే మేఘాలతో పాటు విమానాలు, పక్షులు గుర్తుకు వస్తాయి. రైట్ సోదరులు సైతం పక్షులను చూసి స్ఫూర్తి పొందే విమానాన్ని కనిపెట్టారు. అయితే ఇప్పుడు ఆ పక్షుల పేరు చెబితే విమానయాన సంస్థలు హడలిపోతున్నాయి. బర్డ్ హిట్స్ గణనీయంగా పెరిగిపోవడం, ఈ విహంగాల వల్ల విమానాలను ఎనలేని నష్టం జరుగుతుండటమే దీనికి కారణం. విమానం ఎగిరే, కిందికి దిగే సమయంలో దాని ఇంజన్ లేదా ఇతర భాగాలను పక్షులు ఢీకొట్టడాన్ని బర్డ్ హిట్ అంటారు. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ నివేదిక ప్రకారం 2020 నుంచి ఈ ఏడాది జూన్ వరకు దేశ వ్యాప్తంగా 2807 బర్డ్ హిట్స్ నమోదు కాగా.. వీటిలో 207 హైదరాబాద్‌కు సంబంధించినవే. 695 ఉదంతాలతో ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ప్రథమ స్థానంలో ఉండగా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం ఐదో స్థానంలో ఉంది. సాధారణ వ్యక్తులకు చిన్న విషయంగా కనిపించే, వినిపించే బర్డ్ హిట్ విమానాలకు అపారమైన నష్టం కలిగిస్తుంది. ప్రధానంగా గద్దలు, రాబందులు తదితరాలే విమానాలకు తగులుతూ ఉంటాయి. ఇంజిన్‌లోకి పక్షి చొచ్చుకుపోవడం వల్ల అది ఫెయిల్ అయ్యే ప్రమాదం ఉంది. ముందు భాగంలో ఉండే నాసెల్ (నోస్ కోన్), వింగ్స్, విండ్‌షీల్డ్స్‌కు తాకితే ఆయా భాగాలు తీవ్రంగా దెబ్బతింటాయి. బర్డ్ హిట్ వల్ల ఇంజిన్ బ్లేడ్స్ విరిగిపోతే పెను ప్రమాదానికి ఆస్కారం ఉంటుంది. అనేక సందర్భాల్లో బర్డ్ హిట్ వల్ల పరిస్థితులు అత్యవసర ల్యాండింగ్ వరకు వెళ్లాయి. ఈ కారణాల వల్లే విమానయాన రంగంలో బర్డ్ హిట్‌ను తీవ్రంగా పరిగణిస్తారు. ప్రతి ఉదంతాన్నీ కచ్చితంగా నమోదు చేస్తుంటారు. ప్రాణనష్టం లేనప్పటికీ బర్డ్ హిట్ వల్ల నష్టం జరిగితే ఆ విమానాల మరమ్మతు కోసం భారీ మొత్తం వెచ్చించాల్సి వస్తుంది. టేకాఫ్ సమయంలో ఇలాంటి జరిగితే వెంటనే ల్యాండింగ్ చేయడంతో పాటు ప్రయాణికుల కోసం మరో విమానాన్ని ఏర్పాటు చేయడం తదితరాల వల్ల, విమాన సేవలకు అంతరాయం, ఆలస్యంతో పాటు విలువైన పని గంటలు వృథా అవుతుంటాయి. విమానాశ్రయం చుట్టూ జనావాసాలు పెరిగిపోడం ఈ బర్డ్ హిట్స్ చోటు చేసుకోవడానికి కారణమని నిపుణులు చెబుతున్నారు. బహిరంగ ప్రదేశాల్లో పడేసే ఆహార వ్యర్థాల వల్లా ఈ ఉదంతాలు పెరుగుతాయని స్పష్టం చేస్తున్నారు. పక్షుల కదలికల్ని గుర్తించడానికి విమానాశ్రయాల్లో ప్రత్యేక రాడార్ వ్యవస్థల్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే విమానాశ్రయాల వద్ద, రన్‌వేల పైనా బర్డ్ కంట్రోల్ కోసం ప్రత్యేకంగా బర్డ్ కంట్రోల్ టీమ్స్ పేరుతో ఉద్యోగులను నియమిస్తుంటారు. వీళ్లు టపాసులు, ఫ్లాషింగ్ లైట్లు తదితరాలు వాడుతూ పక్షులను ఆ ప్రాంతాల నుంచి వీలైనంత దూరం తరిమేస్తుంటారు. విమానాశ్రయంతో పాటు ఆ చుట్టు పక్కల ఉన్న పక్షి గూళ్లను గుర్తించి వాటిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తుంటారు. విమానాల్లోనూ యాంటీ బర్డ్ హిట్ టెక్నాలజీని, ఈ బర్డ్ హిట్స్‌ను తట్టుకునే సామర్థ్యాన్నీ అభివృద్ధి చేసే ప్రయోగాలు జరుగుతున్నాయి.

బర్డ్ హిట్ 'లెక్కలు' ఇలా...

విమానాశ్రయం	2020	2021	2022	2023	2024	2025 (జూన్)
ఢిల్లీ	62	94	183	185	130	41
ముంబై	43	54	90	88	86	41
బెంగళూరు	29	22	84	85	88	35
అహ్మదాబాద్	57	49	39	86	77	29
హైదరాబాద్	33	29	38	48	43	16
కోల్‌కతా	23	33	30	48	43	16
చెన్నై	23	31	49	42	43	17
పుణే	17	09	30	39	39	11
భువనేశ్వర్	10	17	28	46	33	16
త్రివేంద్రం	12	11	17	42	27	16

శంషాబాద్‌లో జరిగిన బర్డ్ హిట్స్ ఇవీ..
- గత నెల 5న ఉదయం 6.12 గంటలకు బహ్రెయిన్‌కు టేకాఫ్ తీసుకున్న గల్ఫ్ ఎయిర్‌లైన్స్ జీఎఫ్–275 విమానం
- అదే రోజు రాత్రి 10.44 గంటలకు బహ్రెయిన్‌కే బయలుదేరి టేకాఫ్ తీసుకున్న గల్ఫ్ ఎయిర్‌లైన్స్ జీఎఫ్–277 విమానం
- ఈ నెల 2న ఉదయం చెన్నై నుంచి హైదరాబాద్ వచ్చి ల్యాండింగ్ అవుతున్న స్పైస్ జెట్ ఎయిర్‌లైన్స్ ఎస్‌జీ–2019 విమానం
- ఈ నెల 3న రాత్రి 7.30 గంటలకు వారణాసి నుంచి వచ్చిన ల్యాండింగ్ అవుతున్న ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ఐఎక్స్–2979 విమానం

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

కుత్బుల్లాపూర్: ఆర్టీసీ బస్సు ఢీని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొమ్మేపల్లి ప్రజయ్ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న జానా శ్రీను ఆదివారం జాతీయ రహదారిపై రత్నదీప్ ఎదురుగా రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు అతడిని ఢీకొట్టింది. బస్సు చక్రాలు శ్రీను మీదుగా వెళ్లడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని అంబులెన్స్‌లో గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజకీయ లబ్ధి కోసమే లంబాడీలపై కుట్ర



మాట్లాడుతున్న గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మూడ్ ధర్మనాయక్

సంతోష్‌నగర్: ఎన్నికల సమయంలో రాజకీయ నిరుద్యోగులు పదవుల కోసం హడావిడి చేస్తూ లంబాడీలపై విషం కక్కే ప్రయత్నం చేస్తున్నారని.. ఆర్టికల్ 342ను సరిగా అర్థం చేసుకోకుండా కోర్టులను సైతం తప్పుదోవ పట్టించే దళారులు తమ అవసరాల కోసం గిరిజన తెగలను వాడుకుంటున్నారని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మూడ్ ధర్మనాయక్, జిల్లా అధ్యక్షులు వి.రామ్‌కుమార్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.బాలు నాయక్ అన్నారు. సంతోష్‌నగర్‌లోని సీఐటీయు కార్యాలయంలో ఆదివారం గిరిజన సంఘం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... లంబాడీలు ఎస్టీ జాబితాలో నాలుగవ సీరియల్‌లో ఉన్నారన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో వందల మంది లంబాడీలు పాల్గొన్నారన్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా గుర్తించారన్నారు. రాష్ట్రంలో లంబాడి రిజర్వేషన్ల విషయంలో రాజకీయ పార్టీలు తమ వైఖరి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కోయ, గొండు, లంబాడీ తెగల మధ్య ఘర్షణ వాతావరణానికి రాజకీయ పార్టీల వైఖరే ప్రధాన కారణమన్నారు. పాలకవర్గాలు తమ ప్రయోజనాల కోసం తెగల మధ్య గొడవలు సృష్టిస్తున్నారని గిరిజన తెగలు అన్ని ఆలోచించి సమన్వయంతో ముందుకు వెళ్లాలన్నారు. పాలకవర్గాల కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పంతు నాయక్, భీమా నాయక్, శంకర్ నాయక్, మోతీలాల్, రాజేశ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

23.98 గ్రాముల కొకైన్ పట్టివేత



పోలీసుల అదుపులో నిందితుడు



స్వాధీనం చేసుకున్న కొకైన్

కుత్బుల్లాపూర్: గోవా నుంచి హైదరాబాద్‌కు మాదక ద్రవ్యాలు అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతడి నుంచి 23.98 గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎక్సైజ్ అధికారి షేక్ ఫయాజుద్దీన్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మాధవయ్య నేతృత్వంలో సీఐ నర్సిరెడ్డి, ఎస్ఐ పవన్‌కుమార్‌రెడ్డి సిబ్బందితో కలిసి ఆదివారం బాలానగర్ వై జంక్షన్‌లో తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో బైక్‌పై వెళ్తున్న గోవా మపూసాకు చెందిన సంతోష్ జాదవ్‌ను అదుపులోకి తీసుకుని సోదా చేయగా అతడి వద్ద చిన్న చిన్న ప్యాకెట్లలో 23.98 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది వెంకటేశ్వరరావు, సత్తార్, సంజయ్, మునాఫ్, తేజ పాల్గొన్నారు. కాగా నిందితుడు సంతోష్‌జాదవ్ గతంలో బేగంపేట్‌లో సీజ్ చేసిన 19 గ్రాముల కొకైన్ కేసులో రెండో నిందితుడిగా ఉండి పరారీలో ఉన్నట్లు తెలిపారు.

యువకుడిపై ఆకతాయిల దాడి..



ధ్వంసమైన కారు అద్దాలు



గాయపడిన భువనేశ్వర్‌రెడ్డి..

కుత్బుల్లాపూర్: ఆకతాయిలు ఆదివారం తెల్లవారుజామున కొంపల్లిలోని ఓ టిఫిన్ సెంటర్ వద్ద ఓ యువకుడిపై దాడి చేసిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గుండ్ల పోచంపల్లి ప్రాంతానికి చెందిన భువనేశ్వర్‌రెడ్డి తన స్నేహితులతో కలిసి ఆదివారం తెల్లవారుజామున కొంపల్లిలోని టిఫిన్ సెంటర్‌కు వచ్చాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న కొందరు యువకులు అతడితో మాటలు కలిపి గొడవకు దిగారు. వారందరూ మూకుమ్మడిగా భువనేశ్వర్‌పై దాడి చేశాడు. ఎందుకు కొడుతున్నారంటూ... ప్రశ్నించగా మమ్మల్ని అడుగుతావా ...అంటూ మళ్లీ దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన అతడిని కారులో ఆసుపత్రికి తీసుకెళ్తుండగా బైక్‌లపై వెంబడించి కారు అద్దాలు పగలగొట్టారు. దాదాపు అరగంట పాటు హల్‌చల్ చేయడంతో అక్క ఉన్నవారు భయంతో పరుగులు తీశారు. కొంపల్లి గ్రామానికి చెందిన ఆదిరెడ్డి దినేష్, జ్ఞానేశ్వర్ దాస్ లతోపాటు సుమారు 30 మందికి పైగా దాటికి పాల్పడినట్లు గుర్తించారు. తీవ్రంగా గాయపడిన భువనేశ్వర్‌ను ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేయించారు. పేట్‌బషీరాబాద్ ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకుంటామన్నారు.

భర్త వైద్యం కోసం నగరానికి వచ్చిన మహిళ పర్సు చోరీ

బంజారాహిల్స్: భర్త వైద్యం కోసం నగరానికి వచ్చిన ఓ మహిళ పర్సును చోరీకి గురైన సంఘటన జూబ్లీహిల్స్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తిరుపతి చిల్కాపూర్ కోకోలు తోటకు చెందిన కోలె శ్రీలక్ష్మీ తన భర్తకు ఆరోగ్య పరీక్షల నిమిత్తం ఈ నెల 4న హైదరాబాద్‌కు వచ్చింది. ఈ క్రమంలో 5న ఉదయం కూకట్‌పల్లి నుంచి తన భర్తతో కలిసి జూబ్లీహిల్స్ శ్రీపెద్దమ్మ ఆలయానికి వెళ్లింది. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–36లోని ఆలయ కమాన్ వద్ద పూజా సామగ్రిని కొనుగోలు చేసిన కవర్‌లోనే తన పర్సును ఉంచింది. కొద్దిసేపటి తర్వాత వాటర్ బాటిల్ కొనేందుకు పర్సు కోసం చూడగా కనిపించలేదు. కవర్ కత్తిరించి ఉండటంతో గుర్తుతెలియని వ్యక్తులు తన పర్సును చోరీ చేశారని, అందులో రూ.30 వేలు ఉన్నాయని బాధితురాలు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో ట్రాఫిక్ కానిస్టేబుల్ మృతి



కానిస్టేబుల్ డేవిడ్ (ఫైల్)

మల్కాజిగిరి: స్నేహితులతో కలిసి నిమజ్జనానికి వెళ్లిన ట్రాఫిక్ కానిస్టేబుల్ గుండెపోటుతో మృతి చెందిన సంఘటన మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మల్కాజిగిరి విష్ణుపురికాలనీకి చెందిన కె.డేవిడ్(31) ఘట్‌కేసర్ ట్రాఫిక్ పీఎస్‌లో ట్రాఫిక్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 6న స్నేహితులు ఏర్పాటు చేసిన గణేష్ నిమజ్జనంలో పాల్గొన్నాడు. నిమజ్జనం ర్యాలీలో నృత్యం చేస్తుండగా గుండెపోటు రావడంతో కింద పడ్డాడు. స్నేహితులు అతడిని సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి అక్కడి నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ సంఘటన విష్ణుపురి కాలనీలో విషాదాన్ని నింపింది. ఆదివారం డేవిడ్ అంత్యక్రియలు నిర్వహించారు.

మద్యం మత్తులో పోలీసు వాహనాన్ని ఢీకొన్న కారు

- యువతి మృతి
- డీఐ, కానిస్టేబుల్‌కు గాయాలు



వాహనం నడిపిన అక్షిత్ సింగ్



కాశ్వి మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగిస్తున్న

లంగర్‌హౌస్: మద్యం మత్తులో నిర్లక్ష్యంగా కారు నడుపుతూ కొందరు విద్యార్థులు పోలీసు వాహనాన్ని ఢీకొట్టారు. ఓ యువతి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటరాములు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అత్తాపూర్‌కు చెందిన హరీష్ రెండు రోజుల క్రితం తాము ఏర్పాటు చేసిన వినాయకుడిని నిమజ్జనం చేశారు. వేడుకలు ఘనంగా జరగడంతో మిత్రులకు పార్టీ ఇవ్వాలని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలో ఇక్ఫాయ్ యూనివర్సిటీలో బీబీఏ చదువుతున్న తన స్నేహితులను పార్టీకి ఆహ్వానించాడు. పంజాబ్‌కు చెందిన కాశ్వి విజయ్ వర్గి(20), ఆమె సోదరుడు ఇంటర్ విద్యార్థి తనిష్క్ విజయ్ వర్గి, రియా విజయ్‌వర్గిలు పార్టీకి హాజరయ్యారు. ఆదివారం తెల్లవారుజామున కోఠిలో ఉంటున్న అక్షిత్ సింగ్ కారులో వారు నలుగురితో పాటు కూకట్‌పల్లికి చెందిన లిఖిత షిండేతో కలిసి బయల్దేరారు. మొఘల్‌నగర్ రింగ్ రోడ్డు వైపు వినాయక నిమజ్జనం నేపథ్యంలో ట్రాఫిక్‌జామ్ కావడంతో పీవీ ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నెంబర్ 112 నుంచి మూసీ పక్క రోడ్డులో వెళ్లి లంగర్‌హౌస్ మీదుగా పీ ఇంద్రారెడ్డి ఫ్లై ఓవర్ ఎక్కారు. బ్రిడ్జి దిగే క్రమంలో అతివేగం కారణంగా కారు ముందు వెళుతున్న పోలీసు వాహనాన్ని వెనక నుంచి బలంగా ఢీకొంది. దీంతో కారు వెనక సీట్‌లో కూర్చున్న కాశ్వి సింగ్ ఛాతి, తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది.

తప్పిన పెను ప్రమాదం....

ప్రమాదం జరిగిన వెంటనే కారులో ఎయిర్ బ్యాగులు తెరుచుకోవడంతో ముందు కూర్చున్న వారు గాయాలతో బయటపడ్డారు. వెనక కూర్చున్న కాశి మృతిచెందగా ఆమె సోదరుడు తనిష్క్ తీవ్రంగా గాయపడ్డాడు. అయితే పోలీసు వాహనాన్ని ఢీ కొట్టగా పోలీసు వాహనం ముందు వెళుతున్న డీసీఎంను ఢీ కొట్టింది. అయితే పోలీసు వాహన డ్రైవర్‌తో పాటు, డీసీఎం డ్రైవర్ అప్రమత్తమై హ్యాండ్ బ్రేక్ వేయడంతో వాహనాలు కొద్దిగా ముందుకు వెళ్లి ఆగిపోయాయి. లేని పక్షంలో ముందు ఉన్న ఊరేగింపులపైకి దూసుకెళ్లి పెను ప్రమాదం జరిగేది. ఈ ఘటనలో డీఐ సత్యనారాయణకు తీవ్ర గాయాలు కాగా కానిస్టేబుల్ వాజీద్, హోంగార్డు అలీముద్దీన్‌ను స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వాహనాలు నుజ్జునుజ్జయ్యాయి. పోలీసులు వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాశ్వి మృతదేహానికి ఉస్మానియా మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు.

ఉద్యోగం రాలేదని..
మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



షాబాద్ అహ్మద్ ఫాహిమి (ఫైల్)

పోచారం: ఉద్యోగం రాలేదని మనస్తానికి లోనైన ఓ యువకుడు విషం తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజువర్మ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జార్కండ్‌క చెందిన షాబాద్ అహ్మద్ ఫాహిమి (30) దుబాయ్ వెళ్లి రెండున్నరేళ్లు అక్కడ పనిచేసి 2025 జనవరిలో ఇండియాకు తిరిగి వచ్చాడు. అప్పటి నుంచి పోచారం మున్సిపాలిటీ సద్భావన టన్‌షిప్‌లో ఉంటున్న సోదరుడి ఇంట్లో ఉంటున్నాడు. పలు ప్రయత్నాలు చేసినా ఉద్యోగం రాకపోవడంతో మనస్తాపానికి లోనయ్యాడు. ఆదివారం ఉదయం బెడ్‌రూంలో కూల్‌డ్రింగ్‌లో విషం కలుపుకుని తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిని గుర్తించిన అతడి సోదరుడు స్థానికుల సహాయంతో అతడిని ఘట్‌కేసర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

టస్కర్ కిందపడి పారిశుద్ధ్య కార్మికురాలి మృతి

- రోడ్డు దాటుతుండగా ప్రమాదం
- డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న సైఫాబాద్ పోలీసులు



రేణుక మృతదేహం

లక్డీకాపూల్ : గణేష్ నిమజ్జనోత్సవంలో అపశృతి చోటుచేసుకుంది. రోడ్డు దాటుతుండగా టస్కర్ ఢీకొని జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికురాలు మృతి చెందిన సంఘటన ఆదివారం సైఫాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. జీహెచ్‌ఎంసీలో పారిశుద్ధ్య కార్మికురాలిగా పని చేస్తున్న రేణుక ఆదివారం ఉదయం బషీర్ బాగ్ నుంచి లిబర్టీ వెళ్లే మార్గంలో విధులు నిర్వహిస్తుంది. ఆ సమయంలో రోడ్డు దాటుతుండగా వినాయక విగ్రహాన్ని తీసుకెళుతున్న టస్కర్ ఢీకొనడంతో వాహనం కింద పడిపోయింది. ఈ ఘటనలో ఆమె తలకు తీవ్ర గాయాలు కావడంతో తోటి కార్మికులు ఆమెను చికిత్స నిమిత్తం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం సమీపంలోని హైదరాబాద్ నర్సింగ్ హోంకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. సైఫాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. టస్కర్ డ్రైవర్ గజానంద్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. రేణుక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. గుడిమల్కాపూర్‌కు చెందిన రేణుక 15 ఏళ్లుగా జీహెచ్‌ఎంసీలో పారిశుద్ధ్య కార్మికురాలిగా విధులు నిర్వహిస్తున్నట్లు తోటి కార్మికులు తెలిపారు.

మృతురాలి కుటుంబానికి అండగా ఉంటాం

పారిశుద్ధ్య కార్మికురాలి కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ హామీ ఇచ్చారు. విధి నిర్వహణలో ఉన్న పారిశుద్ధ్య కార్మికురాలు రోడ్డు ప్రమాదానికి గురైనట్లు తెలియడంతో కమిషన్ హుటాహుటిన హైదరాబాద్ నర్సింగ్ హోమ్‌కి చేరుకున్నారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు తెలియడంతో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఘటనపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ ఘటన దురదృష్టకరమని కమిషనర్ పేర్కొన్నారు. ఆయనతో పాటు అదనపు కమిషనర్ రఘు ప్రసాద్, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి ఉన్నారు. ప్రమాద ఘటనపై నగర మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ కర్ణన్ తో మాట్లాడారు. అనంతరం ఆమె మృతురాలి కుటుంబ సభ్యులతోనూ మాట్లాడి ధైర్యం చెప్పారు.

దేవాలయాల మూసివేత



శ్రీనగర్ కాలనీలో మూసివేసిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం

బంజారాహిల్స్: రాహుగ్రస్త సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లోని ఆలయాలన్నీ ఆలయ అర్చకులు, అధికారులు మూసివేశారు. ఆదివారం ఉదయం ఆలయాల్లో పూజలు నిర్వహించిన అనంతరం 12 గంటల తర్వాత ఆలయాలను మూసివేశారు. శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం, అయ్యప్ప స్వామి ఆలయం, శివాలయాల్లో ఉదయం పూజల అనంతరం ఆలయాన్ని మూసివేసినట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి శ్రీనివాస శర్మ తెలిపారు. తిరిగి సోమవారం ఉదయం 8 గంటల తర్వాత ఆలయ సంప్రోక్షణ అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని పూజలు పూర్తయిన తర్వాతే భక్తులకు దర్శనం ఉంటుందన్నారు.

రావి నారాయణరెడ్డికి నివాళి



నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు

బంజారాహిల్స్: సాయుధ పోరాట వీరసేనాని రావి నారాయణరెడ్డి జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. బంజారాహిల్స్‌లోని లోటస్‌పాండ్ ఆర్ఎస్ఆర్ ఆడిటోరియం ఆవరణలో రావి నారాయణరెడ్డి విగ్రహానికి సీపీఐ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాయుధ పోరాటంలో ఆయన చేసిన కృషిని వారు కొనియాడారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో టమాటా.23, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 35, బెండకాయ 40, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 53, పచ్చకాకర 27, పందిరి బీర 41, క్యాబేజీ 15, క్యారెట్ 40, దొండ 40, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 45, గోకరకాయ 35, కీర 15, దోసకాయ 15, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 23, చామగడ్డ 23, మొరంగడ్డ 45, కందగడ్డ 40, సొరకాయ 15, పొట్లకాయ 23, అరటికాయ 11, మునగకాయ 3-4, ముల్లంగి 3-5. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

కాంట్రాక్టు అధ్యాపకులకు అందని వేతనాలు

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులకు గత రెండు నెలల నుంచి వేతనాలు అందకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు పరుశరామ్ మాట్లాడుతూ..ప్రతినెల 1న రెగ్యులర్ అధ్యాపకులతో పాటు కాంట్రాక్టు అధ్యాపకులకు వేతనాలు చెల్లించాలని ప్రభుత్వ ఆదేశాలున్నా ఓయూ అధికారులు ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ కాంట్రాక్టు అధ్యాపకులకు సెప్టెంబర్ 8వ తేదీ వచ్చినా వేతనాలు చెల్లించడం లేదన్నారు. 2025-26 విద్యా సంవత్సరం ప్రారంభమైన నాటి నుంచి జూన్ నెల నుంచి వేతనాల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. సకాలంలో జీతాలు చెల్లించాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

రెండో రోజూ అదే జోరు..!

రాత్రి వరకు కొనసాగిన భారీ గణేశ్ ప్రతిమల నిమజ్జనాలు

- నెక్లెస్ రోడ్డు, ఎన్టీఆర్ మార్గ్‌లో రెండు వైపులా బారులు తీరిన విగ్రహాలు
- సాయంత్రం అందుబాటులోకి వచ్చిన ట్యాంక్‌బండ్



బంజారాహిల్స్: గణపతి నిమజ్జన మహోత్సవాలు ఆదివారమైన రెండో రోజు కూడా జోరుగా సాగాయి. శనివారం అర్ధరాత్రి తర్వాత మండపాల నుంచి బయల్దేరిన గణనాథుడి విగ్రహాలు ఆదివారం సాయంత్రం వరకు హుస్సేన్‌సాగర్‌లోని ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్డు, ట్యాంక్ బండ్‌లలో నిమజ్జనం అయ్యాయి. పోలీసులు ట్యాంక్ బండ్ వైపు, తెలుగు తల్లి ఫ్లై ఓవర్ వైపు రోడ్డును అందుబాటులోకి తీసుకొచ్చేందుకు విగ్రహాల వాహనాలన్నింటిని నెక్లెస్ రోడ్డుతో పాటు ఎన్టీఆర్‌మార్గ్ వైపు తరలించారు. దీంతో మధ్యాహ్నం వరకు తెలుగు తల్లి ఫ్లై ఓవర్ రోడ్డుతో పాటు ట్యాంక్ బండ్ అంబేద్కర్ చౌరస్తా రోడ్డు వాహనదారులకు అందుబాటులోకి వచ్చింది. మరో వైపు ఎన్టీఆర్ గార్డెన్ వెనుకాల విగ్రహాల వాహనాలను అధికారులు పెద్ద ఎత్తున తరలించారు. నెక్లెస్ రోడ్డు, ఎన్టీఆర్ మార్గ్‌లు నిమజ్జనాలు పూర్తవుతున్నా కొద్దీ ఖాళీ వాహనాలను ముందుకు పంపించి వెనుక ఉన్న వాహనాలను క్రేన్ల వద్దకు తరలించారు.









ఎన్టీఆర్ గార్డెన్ వెనుక రోడ్డులో వాహనాలు



ఎన్టీఆర్ మార్గ్‌లో బారులు తీరిన విగ్రహాలు

గణేశ్ భక్తులకు అన్నప్రసాదం పంపిణీ



అన్న ప్రసాదాన్ని వడ్డిస్తున్న సభ్యులు

ఖైరతాబాద్: శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ, అడహక్ కమిటీ ఆధ్వర్యంలో ఖైరతాబాద్ మహాగణపతి నవరాత్రి ఉత్సవాల నుంచి నిమజ్జనోత్సవాల వరకు మహాగణపతి సేవలో ఉన్న వారికి ఉదయం, మధ్యాహ్నం, రాత్రి రోజూ 5 వేల మందికి అన్న ప్రసాదాలను అందజేసినట్లు అడహక్ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. వివిధ ప్రాంతాల్లో, విభాగాల్లో విధులు నిర్వహించిన పోలీసులు, ఆర్ అండ్ బీ, జీహెచ్ఎంసీ, ఎలక్ట్రిసిటీ, శానిటేషన్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, ఉత్సవ కమిటీ వలంటీర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులకు 12 రోజుల పాటు ఖైరతాబాద్ శాఖ గ్రౌండ్‌లో పంపిణీ చేశామన్నారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే, అడహక్ కమిటీ అధ్యక్షుడు దానం నాగేందర్ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా నిర్వహించామని వెల్లడించారు. నిత్యం 50 మంది కమిటీ సభ్యులు కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొని భక్తులకు 5 క్వింటాళ్ల ప్రసాదం పంపిణీ చేశారని తెలిపారు. గత సంవత్సరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. గణనాథుడి సేవలో విధులు నిర్వహించిన ప్రతి ఒక్కరూ సంతోషం వ్యక్తం చేశారని, వచ్చే సంవత్సరం మరింత ఉత్సాహంతో కార్యక్రమాన్ని చేస్తామని తెలిపారు.

నైపుణ్యం ఉంటే మంచి అవకాశాలు



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ప్రముఖ విద్యావేత్త టి. గోపాలకృష్ణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఏ రంగాన్ని ఎంపిక చేసుకుంటామో ఆ రంగంలో నైపుణ్యం సాధిస్తే వారికి మంచి అవకాశాలు లభిస్తాయని ప్రముఖ విద్యావేత్త టి. గోపాలకృష్ణ అన్నారు. ఆదివారం చిక్కడపల్లిలోని ఆరోరా డిగ్రీ, పీజీ కళాశాలలో జీవితంలో విజయవంతం కావడం ఎలా అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో అమెరికా నుంచి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గోపాల కృష్ణ మాట్లాడుతూ.... విద్యార్థులలో సృజనాత్మకత ఉండాలన్నారు. ముఖ్యంగా ఉన్నత లక్ష్యంతో పాటు క్రమశిక్షణ, సానుకూల దృక్పథాన్ని పెంపొందించుకుంటే వారు అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తారని చెప్పారు. విజయవంతం కావాడానికి ఆత్మవిశ్వాసం ఎంతో ముఖ్యమని తన అనుభవాలను ఉదాహరణతో వివరించారు. మనం వెళ్లే దారిలో అనేక సవాళ్లను ఎదుర్కొవాల్సి వస్తుందని వాటిని అధిగమించినప్పుడే విజయానికి చేరుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా. అజయ్‌కుమార్, కోఆర్డినేటర్ డా. మీరాజోషి, సైన్స్ విభాగాధిపతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతులుగా తీర్చిదిద్దే వారే గురువులు

చిక్కడపల్లి: విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దే వారే గురువులని యువ కళావాహిని అధ్యక్షుడు లంకా లక్ష్మీనారాయణ అన్నారు. శిఖరం ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఆదివారం త్యాగరాయ గానసభలో నిర్వహించారు. ఈ సందర్భంగా 'భారత్ ఐకాన్ - ఉత్తమ ఉపాధ్యాయ'పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన లక్ష్మీనారాయణకు ఎంపికైన ప్రముఖులకు పురస్కారాలను ప్రదానం చేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యతో పాటు వివిధ నైపుణ్యాలను అందించేది ఉపాధ్యాయులేనని అన్నారు. ఈ కార్యక్రమంలో సిటీ సివిల్ కోర్టు సూపరింటెండెంట్ పీవీపీ అంజనీకుమారి, ప్రముఖులు చక్రపాణి, దామోదర్, నాగేంద్ర, భరతనాట్య గురువు రాగరంజని, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బోసిపోయిన 'బడా గణేశ్' చౌరస్తా



బోసిపోయిన ఖైరతాబాద్ లైబ్రరీ చౌరస్తా

ఖైరతాబాద్: ఖైరతాబాద్ మహాగణపతి వినాయక ఉత్సవాలతో నిత్యం లక్షలాది మంది భక్తులతో పుణ్యక్షేత్రాన్ని తలపించిన ఖైరతాబాద్ లైబ్రరీ చౌరస్తా ఆదివారం బోసిపోయి దర్శనమిచ్చింది. రోజూ లక్షలాది మంది భక్తులతో అడుగు తీసి అడుగు వేయలేనంత మంది రద్దీతో దర్శనమిచ్చిన ఖైరతాబాద్ పరిసర ప్రాంతాలు శనివారం ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనోత్సవం పూర్తి కాగానే ఆదివారం బోసిపోయి దర్శనమిచ్చింది.

పోటీలతో ప్రతిభకు పదును

చిక్కడపల్లి: నాట్య కళాకారుల్లో కూచిపూడి నృత్య పోటీలు ప్రతిభను పెంపొందిస్తాయని బీఆర్ఎస్ సీనియర్ నేత నాగేష్ ముదిరాజ్ అన్నారు. బంగారు తెలంగాణ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం త్యాగరాయగానసభలో కూచిపూడి నృత్యపోటీలు జరిగాయి. ఆయన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. రిటైర్డ్ జడ్జి బూర్గుల మధుసూదన్, మిలటరీ అధికారి కేసీ. రావు, నిర్వాహకులు విక్కీ మాస్టర్ పాల్గొన్నారు.

రైలులో నగల బ్యాగ్ చోరీ

కాచిగూడ: రైల్లో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికురాలి బ్యాగ్ చోరీపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప సమాచారం మేరకు... పార్సిగుట్ట ప్రాంతానికి చెందిన మాధవి (50) కాచిగూడకు రావడానికి నాగర్‌సోల్‌లో అజంతా ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కింది. రైలు ధర్మాబాద్ స్టేషన్‌కు వచ్చే సరికి తన బ్యాగ్ కనిపించలేదు. బ్యాగులో 35 గ్రాముల బంగారు ఆభరణాలు, 2 ఐ ఫోన్లు, రూ. 20 వేలు ఉంది. బాధితురాలు ఆదివారం కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసును నాందేడ్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేశారు.

పేద, మధ్య తరగతికి ఎంతో ఉపశమనం

మాజీ ఎమ్మెల్యే చింతల



మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న చింతల

ఫిలింనగర్: ప్రధాని మోదీ పేద, మధ్య తరగతి ప్రజల కోసం పలు విభాగాలపై జీఎస్టీలో తీసుకున్న కీలక నిర్ణయాలు ఎంతో ఉపశమనం కలిగిస్తున్నాయని ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. దసరా, దీపావళి కానుకగా జీఎస్టీ తగ్గించిన నిర్ణయాన్ని స్వాగతిస్తూ జూబ్లీహిల్స్ డివిజన్ బీజేపీ నేతల ఆధ్వర్యంలో విగ్రహాల చౌరస్తాలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతల మాట్లాడుతూ... ముఖ్యంగా హెల్త్, లైఫ్ ఇన్సూరెన్స్ కేటగిరీల్లో సున్నా జీఎస్టీ అనేది సంచలనమైన నిర్ణయమన్నారు. దీని వల్ల పేదలకు ఎంతో భారం తప్పుతుందని అన్నారు. జీఎస్టీలో తీసుకున్న నిర్ణయాల వల్ల పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. బీజేపీ సీనియర్ నేతలు కాడిగారి బోజిరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్, గడ్డం వెంకటస్వామి, వల్లపు శంకర్, గణేష్ యాదవ్, అనిల్‌కుమార్, మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులకు సత్కారం



విద్యుత్ అధికారులను సత్కరిస్తున్న మండప నిర్వాహకులు

బంజారాహిల్స్: గణేశ్ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా గత 5 రోజుల నుంచి విద్యుత్ అధికారులు, సిబ్బంది మండపాల వద్ద, నిమజ్జన రూట్‌లోనూ అప్రమత్తంగా ఉండి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా విస్తృతంగా పర్యటించారు. టీజీఎస్‌పీడీసీఎల్ బంజారాహిల్స్ డీఈ హనుమంతరెడ్డి, ఏడీఈ రమేష్‌కుమార్, ఏఈ రమేష్‌తో పాటు సుమారు వంద మంది విద్యుత్ సిబ్బంది బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, మాదాపూర్ ప్రాంతాల్లో పర్యటించి జారుతున్న వైర్లను సరిజేయడమే కాకుండా కరెంటు షాక్‌కు అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి సమస్యలు పరిష్కరించారు. ఈ సందర్భంగా విద్యుత్ అధికారులను పలువురు మండప నిర్వాహకులు ఆదివారం ఘనంగా సత్కరించారు. ఇటీవల ఉప్పల్‌లో చోటుచేసుకున్న ఘటన నేపథ్యంలో విద్యుత్ అధికారులు, సిబ్బంది గత మూడు వారాల నుంచి పలు చర్యలు తీసుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవడమే కాకుండా కరెంటు స్తంభాలకు వేలాడుతున్న కేబుల్ వైర్లను లారీల కొద్దీ తొలగించారు. అలాగే ప్రమాదకరంగా ఉన్న స్తంభాలను మార్చడంతో పాటు వేలాడుతున్న వైర్ల వద్ద బంచ్ కేబుల్స్ ఏర్పాటుచేశారు. దీంతో ఎలాంటి ఘటనలు లేకుండా నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా ముగిశాయి. ఏ చిన్న ప్రమాదానికీ ఆస్కారం లేకుండా తాము ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు 24 గంటలూ సిబ్బందిని అప్రమత్తంగా ఉంచామని బంజారాహిల్స్ డీఈ హనుమంతరెడ్డి తెలిపారు. దీంతో ఎక్కడా చిన్న అవాంఛనీయ సంఘటన చోటుచేసుకోలేదని, ఇదంతా తమ సిబ్బంది కృషి అని పేర్కొన్నారు.

ఎక్కడి గుంతలు అక్కడే..

బంజారాహిల్స్: గణేశ్ నిమజ్జన శోభయాత్ర జరిగే రోడ్లలో వాహనాలు తేలిగ్గా వెళ్లేవిధంగా రోడ్లపై గుంతలు పూడ్చాలని నెల రోజుల క్రితం మంత్రి పొన్నం ప్రభాకర్, ఆ తర్వాత పలు సమీక్షా సమావేశాల్లో పోలీసు అధికారులు జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. గణేశ్ విగ్రహాలు నిమజ్జనానికి తరలే రోడ్లలో ఎక్కడెక్కడ గుంతలు ఉన్నాయో స్థానిక పోలీసులు వాటి ఫొటోలతో పాటు పూర్తి వివరాలను జీహెచ్ఎంసీ ఇంజనీర్లకు అందజేశారు. గణేశ్ నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా వాహనాలు ఒడిదుడుకలు లేకుండా గుంతలను పూడ్చామని ఇటీవల జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ఘనంగా ప్రకటించుకున్నారు. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం రోడ్లపై గుంతలు ఎక్కడా పూడ్చలేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ నివసించే జూబ్లీహిల్స్ సర్కిల్-18 పరిధిలో ఎక్కడ గుంతలు అక్కడే వాహనాలకు నరకాన్ని చూపించాయి. వాహనాలు గుంతల్లో పడి ఎక్కడ విగ్రహాలు కూలిపోతాయోనని గణేశ్ మండప నిర్వాహకులు బిక్కుబిక్కుమంటూ ముందుకుసాగారు. వాహనాలు ముందుకు సజావుగా సాగలేదు. వెంకటేశ్వరకాలనీ, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ డివిజన్ల పరిధిలో ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారుల్లో 250కి పైగా గుంతలు వాహనదారులకు చుక్కలు చూపించాయి. ఆయా డివిజన్ల ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఒక్క గుంతను కూడా పూడ్చిన పాపానపోలేదు. గుంతలు పూడ్చామని కమిషనర్ చెప్పుకున్నా ఎక్కడికక్కడ విగ్రహాలు తరలించే వాహనాలకు గుంతలు తీవ్ర ఇబ్బందులు కలిగించడమే కాకుండా ముందుకు సజావుగా సాగకపోవడంతో నిమజ్జన ప్రక్రియలో తీవ్ర జాప్యం జరిగింది. ఎటుచూసినా గుంతలమయమైన రహదారులపై విగ్రహాలు తరలిస్తున్న వాహన డ్రైవర్లు నరకాన్ని చవిచూశారు. పలుచోట్ల గుంతల్లో లారీ ఇరుక్కోవాల్సి వచ్చింది. క్రేన్ల సహాయంతో పోలీసులు వాటిని ముందుకుతరలించారు. జీహెచ్ఎంసీ ఇంజనీర్ల నిర్వాకంతో రోడ్లపై గుంతలకు మరమ్మతులు జరగకపోగా శోభాయాత్రలో తీవ్ర అపశృతులు దొర్లాయి.



బంజారాహిల్స్ రోడ్డునెంబర్-8 సప్తపర్ణి రోడ్డులో గుంతలు

విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేయాలి



కాచిగూడ: విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. బీసీ మహాసభ ఆధ్వర్యంలో ఫీజు బకాయిలు చెల్లించాలని ఆదివారం కాచిగూడ, నింబోలిఅడ్డ సర్కిల్‌లో బీసీ నేతలతో కలిసి ఆయన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేందర్‌పటేల్‌గౌడ్ మాట్లాడుతూ... విద్యార్థులకు ఫీజు బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో వారు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంతో ఉజ్వలమైన భవిష్యత్ ఉన్న యువత, విద్యార్థులు ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వారి భవిష్యత్ అంధకారంగా మారుతోందని అన్నారు. విద్యార్థుల ఫీజుబకాయిలు రూ.4,300 కోట్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని స్కాలర్‌షిప్స్ రూ.15వేల వరకు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో పి.కృష్ణ, భూషణ్, భాస్కర్, ముత్యాల్‌రావు, ప్రశాంత్ నిమ్కర్, సత్యపాల్ సింగ్, ప్రదీప్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా లడ్డూ వేలం పాటలు



గాయత్రిహిల్స్‌లో లడ్డూను రూ. 2.11 లక్షలకు దక్కించుకున్న మల్లేష్ యాదవ్

బంజారాహిల్స్: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో గణనాథుడి చేతుల్లో పూజలందుకున్న లడ్డూలను దక్కించుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు. జూబ్లీహిల్స్ రోడ్ నెం10లోని గాయత్రిహిల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి చేతిలోని లడ్డూను బస్తీకి చెందిన ఇ. మల్లేష్ యాదవ్ రూ.2.11 లక్షలకు దక్కించుకోగా సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొమ్మినేని రాఘవులు ఆయనను ఘనంగా సత్కరించి లడ్డూను అందజేశారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని ఇందిరానగర్ బస్తీలో త్రిశూల్ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి వద్ద లడ్డూను స్థానిక కాంగ్రెస్ నేత శ్యాం, మాధవి దంపతులు రూ. 71 వేలకు లడ్డూను దక్కించుకున్నారు.

నవోదయకాలనీలో...

శ్రీనగర్‌కాలనీ: నవోదయకాలనీలోని ద్వారకామయి అపార్ట్‌మెంట్ గణనాథుని లడ్డూ వేలం ఆదివారం సందడిగా సాగింది. లడ్డూను అపార్ట్‌మెంట్ సెక్రటరీ వీరగంధం రమేష్ రూ. 3.29 లక్షలకు దక్కించుకున్నారు. అపార్ట్‌మెంట్ అధ్యక్షులు రవికుమార్, ఉపాధ్యక్షుడు సంజీవ్ పాల్గొన్నారు.



ఇందిరానగర్‌లో రూ. 71 వేలకు శ్యాం, మాధవి దంపతులు



నవోదయకాలనీలో రూ. 3.29 లక్షలకు లడ్డూ దక్కించుకున్న రమేష్



వెంకటగిరిలో రూ. 90 వేలకు శంకరయ్య...

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

30వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలి

కాచిగూడ: ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 30వేల టీచర్ పోస్టులను భర్తీ చేసే విధంగా వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సీఎం రేవంత్ రెడ్డికి ఆయన లేఖ రాశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచడానికి టీచర్ పోస్టులు భర్తీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు. టీచర్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో 12వేల పాఠశాలల్లో ఇంగ్లీష్, మ్యాథ్స్, సైన్స్ పాఠాలు చెప్పే టీచర్లు లేక విద్యార్థులు వెనుకబడి పోతున్నారని ఆయన తెలిపారు. బీఈడీ, డీఈడీ చేసి అన్నీ అర్హతలు గల 16 లక్షల మంది నిరుద్యోగులు ఉద్యోగం లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. విద్యార్థుల ఉజ్వలమైన భవిష్యత్తులను దృష్టిలో పెట్టుకుని టీచర్ పోస్టుల భర్తీకై నోటిఫికేషన్ జారీ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కేసీఆర్ కుటుంబ అవినీతిపై దర్యాప్తు జరిపించాలి

హిమాయత్‌నగర్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబ అవినీతి అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు జరిపించాలని తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర రవికుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత కేవలం మాజీ మంత్రి హరీష్ రావు, ఎంపీ సంతోష్ రావుల పైనే ఆరోపణలు చేసిందని కేసీఆర్, కేటీఆర్‌లు కూడా అవినీతి అక్రమాలలో భాగస్వాములేనని ఆరోపించారు. పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు కవితకు బీఆర్ఎస్ అవినీతి అక్రమాలు కనిపించలేదా అని ప్రశ్నించారు.

జాతీయ ప్రజాస్వామిక లౌకిక కూటమి ఏర్పాటు

హిమాయత్‌నగర్ : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల నాయకత్వంలో ఏర్పడిన జాతీయ ప్రజాస్వామిక లౌకిక కూటమి(ఎన్‌డిఎస్ఎఫ్) ద్వారా మాత్రమే మనువాద పార్టీలను ఓడించగలుతామని ఎన్‌డిఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు వడ్డమూరి కృష్ణస్వరూప్ స్పష్టం చేశారు. తెలంగాణలో త్వరలో జరిగే స్థానిక ఎన్నికలతో పాటు పలు అసెంబ్లీ నియోజకవర్గాలలో జరిగే ఉప ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని కేంద్ర కార్యాలయంలో జరిగిన స్టీరింగ్ కమిటీ సమావేశంలో రాజకీయ భవిష్యత్ కార్యాచరణను రూపొందించి మాట్లాడారు. మనువాద పాలకుల నుండి రాజ్యాంగాన్ని రక్షించుకుందాం, దళిత బహుజనుల హక్కులని కాపాడుకుందాం అనే నినాదంతో అక్టోబర్ నెలఖారులో నగరంలో భారీ ర్యాలీ చేపట్టనున్నట్లు తెలిపారు. వివిధ పార్టీలు, సంఘాల నేతలు ఎస్.అశోక్, కోళ్ల సుధాకర్, వి.ఎల్.రాజు, పుల్లూరి వెంకట రాజేశ్వర్ రావు పాల్గొన్నారు.

పింఛన్‌దారులను సీఎం మోసం చేశారు



మాట్లాడుతున్న పద్మశ్రీ మంద కృష్ణమాదిగ..

కుత్బుల్లాపూర్: ఎన్నికల సమయంలో పింఛన్లు పెంచుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి 20 నెలలు కావస్తున్నా ఒక్క రూపాయి పెంచలేదని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ అన్నారు. పెన్షన్ దారుల సన్నాహక సభ ఆదివారం షాపూర్‌నగర్‌లోని ఎం.జె గార్డెన్స్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మంద కృష్ణమాదిగ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే చేయూత పెన్షన్లు పెంచుతామని హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి పింఛన్‌దారులను దారుణంగా మోసం చేశారన్నారు. 20 నెలలుగా ఒక్క రూపాయి పెంచలేదన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి నాయకులు,పింఛన్‌దారులు పాల్గొన్నారు.

'మనిషీ ఒకసారి సిగ్గు పడు' ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య కొలకనూరి ఇనాక్ తదితరులు

ఖైరతాబాద్: తెలుగు వెలుగు సమాఖ్య పేరుతో ఆదివారం ఖైరతాబాద్‌లోని ఐఏఈసీ కళాశాలలో కవన వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ పాల్గొని పి.హెచ్.నగరాజారావు రచించిన మనిషీఒకసారి సిగ్గు పడు కావ్యాన్ని ఆవిష్కరించారు. యువభారతి అధ్యక్షుడు ఆచార్య ఫణీంద్ర,, ఆచార్య వంగపల్లి విశ్వనాథం, కవన వేదిక అధ్యక్షుడు చీకోలు సుందర్య, రంజని అధ్యక్షుడు జయంతి రాజారాం, కవి నటరాజారావు, యువభారతి కార్యదర్శి జీడిగుంట, కవన వేదిక కార్యదర్శి రఘుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మూల కణాలకే ముప్పు..!

పదేళ్లలో రెట్టింపైన రక్తకణ వ్యాధులు, కేన్సర్లు

- నగరంలో నెలకు 200 వరకు కొత్త కేసులు
- బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌తో మెరుగైన జీవితం



సాక్షి, సిటీబ్యూరో: శరీర అవయవాలకు ఆక్సిజన్ అందించడం నుంచి జబ్బుల నుంచి రక్షించే వ్యాధి నిరోధ శక్తి వరకు కీలకంగా వ్యవహరించేది రక్తం. అంతటి ప్రాధాన్యమున్న రక్తమే ప్రమాదంలో పడితే.. శరీరంలోని అన్ని అవయువాలకు ముప్పు పొంచి ఉన్నట్లే. ఒక్క మాటలో చెప్పాలంటే ఆ వ్యక్తి ఎక్కువ కాలం బతకడం కష్టం. అంతటి ప్రాణాంతకమైన రక్త కణ సంబంధిత వ్యాధుల నుంచి కేన్సర్ వరకు బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ ఉత్తమమైన ఫలితాలనిస్తోంది. ఎముక మజ్జలో చెడు రక్తకణాలను తొలగించి ఆరోగ్యవంతుడైన వ్యక్తి నుంచి సేకరించిన మూలకణాలను మార్పిడి చేయడంతో వ్యక్తి జీవిత కాలం పెరుగుతుంది. గడిచిన కొన్నేళ్లుగా రక్తసంబంధిత కేసుల సంఖ్య పెరుగుతోందని, ఎముక మజ్జ మార్పిడి శస్త్ర చికిత్సల సంఖ్య అదే సంఖ్యలో వృద్ధి చెందుతోందని వైద్యులు పేర్కొంటున్నారు.

- మహానగరంలో పదికిపైగా ఆసుపత్రులు బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చికిత్సలు అందిస్తున్నాయి. పదేళ్ల క్రితం నెలకు సుమారుగా 70 నుంచి 100 కొత్త కేసులు వచ్చేవని, ప్రస్తుతం ఈ సంఖ్య 200 దాటిపోయిందని వైద్యులు చెబుతున్నారు. రక్త కణాల్లో ఇన్ఫెక్షన్లు, లుకేమియా, లింఫోమా, మైలోమా వంటి బ్లడ్ కేన్సర్లకు బీఎంటీ (బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్) ఖచ్చితమైన పరిష్కారంగా కనిపిస్తుందని వైద్యులు పేర్కొంటున్నారు. మైలోమా పెద్దల్లో కనిపిస్తుండగా, మిగతా రెండు చిన్న పిల్లల్లో ఎక్కువగా కనిపిస్తున్నాయి. అక్యూట్ మైలాయిడ్ ల్యుకేమియా ఉన్న పిల్లల్లో సుమారు 70 శాతం మందికి బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాల్సి ఉంటుందట. రక్తంలోని కేన్సర్ కణాలను తొలగించి వాటి స్థానంలో కొత్త కణాలను భర్తీ చేయకపోతే వ్యక్తి బతకడం కష్టమని వైద్యులు పేర్కొంటున్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలో భద్రాచలం, ఏటూరు నాగారం తదితర ప్రాంతాల్లో సికిల్ సెల్ అధికంగా కనిపిస్తుంది. దీని వల్ల మెదడు, గుండెతో సహా అన్ని అవయవాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. ఇటువంటి వారికి బీఎంటీ అవసరం ఎక్కువగా ఉంటుంది. చిన్నపిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. సెల్స్ పనిచేయవు. అటువంటి సమయంలో మూల కణాలు మార్చుతారు. దీంతో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఆరోగ్యవంతమైన జీవితం సులభమవుతుంది. సెల్స్ సాధారణ జీవిత కాలం 120 రోజులు. తలసేమియా రోగుల్లో 30 రోజులకే చనిపోతుంది. వ్యాధి తీవ్రతను బట్టి బాధితులకు వారంలో రెండు దఫాలు రక్తం ఎక్కిస్తుంటారు. హెమోగ్లోబిన్ డిఫెక్ట్‌తోనూ సెల్ వేగంగా చనిపోతుంది. ఉత్పత్తి వేగం తగ్గుతుంది. ఫలితంగా రక్త హీనతకు గురవుతారు. కొత్త రక్తం ఎక్కించినా రక్త కణాలు వేగంగా విరిగిపోతుంటాయి. పదేపదే రక్తం అవసరం పడుతుంది. ఏడాది వయసు నుంచి 70 ఏళ్ల వారికి కూడా బీఎంటీ చేస్తారు. ఆరోగ్యవంతుడైన, యుక్త వయస్కుల నుంచి ఆరోగ్యవంతమైన మూలకణాలను సేకరించి అవసరమైన వారికి వినియోగిస్తారు.

భవిష్యత్తులో వందేళ్లు బతికే అవకాశం



సాధారణ జ్వరం, ఆయాసం వంటివి ఏదైనా వారం రోజుల్లో తగ్గకుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఏదైనా ప్రాణాంతకమైన జబ్బు ఉంటే గుర్తించిన వెంటనే చికిత్సలకు అవకాశం ఉంటుంది. ఆలస్యం చేస్తే చిన్న జబ్బు సైతం ప్రమాదకరంగా మారొచ్చు. బ్లడ్ కేన్సర్ వంటి భయంకరమైన జబ్బులు 5 శాతం జన్యుపరంగా వస్తుంగా మిగతా 95 శాతం ఎలాంటి కారణాలు లేకుండానే వస్తున్నాయి. ప్రతి రోగానికి ప్రస్తుతం అత్యాధునిక చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. రక్త కణ సంబంధిత రోగాలు, కేన్సర్‌లకు ఎముక మజ్జ మార్పిడితో సాధారణ జీవితాన్ని కొనసాగించే అవకాశం ఉంటుంది. మనుషులు వందేళ్లు బతికే అవకాశం ఉంటుంది.

– డా.తోట నరేంద్రకుమార్, బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ స్పెషలిస్టు వైద్యులు

మంచిరేవులలో ఆదిమానవుడి ఆనవాళ్లు



మంచిరేవులలో రాతియుగం ఆనవాళ్లను చూపుతున్న శివనాగిరెడ్డి

మణికొండ: హైదరాబాద్ నగర శివారు, నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవులలో ఆదిమానవుని ఆనవాళ్లు కనిపించాయని, వాటి వద్ద వివరాలు ఏర్పాటు చేసి పురావస్తు పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దవచ్చని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. ఆదివారం మూసీ నది పరసరాల్లో జరిపిన పురావస్తు అన్వేషణ, స్థానిక వీరభద్రస్వామి ఆలయ వంశపారంపర్య అర్చకులు మాడపాటి పరమేశ్వర ఇచ్చిన సమాచారంతో రాతి పరుపుపై ఆనవాళ్లను గుర్తించామన్నారు. ఆలయ పరిసరాల్లో ఉన్న రాతి పరుపులపై 15 చోట్ల కొత్తరాతి యుగం (క్రీ.పూ.4000) సంవత్సరం నాటి రాతి గొడ్డళ్లను పదును పెట్టేందుకు నూరిన (అరగదీసిన) గుర్తులు ఉన్నాయన్నారు. అవి 15 సెంటీమీటర్ల పొడవు, 3 సెంటీమీటర్ల వెడల్పు, 2 సెంటీ మీటర్ల లోతుతో ఉన్నాయన్నారు. మూసీనది ఒడ్డున వీరభద్రాలయం చుట్టు పక్కల కొత్త రాగియుగం వారు నివసించారని, జంతువుల వేట, పశుపోషణ, కొద్ది పాటి వ్యవసాయానికి మూసీ నీటి వనరులతో జీవనం సాగించారని తెలిపారు. ఈ ఆనవాళ్లు హైదరాబాద్ నగర చరిత్రను 6 వేల సంవత్సరాల పూర్వానికి తీసుకుని వెళ్తున్నాయని, వాటిని భవిష్యత్తు తరాలకు చేయించేలా కాపాడుకోవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ఆ దిశగా నార్సింగి మున్సిపాలిటీ అధికారులు, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ పరిశోధనల్లోతనతో పాటు ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ బందా, సమతా మూర్తి శిల్పి డీఎస్‌వీ ప్రసాద్, స్థపతి రాఘవేంద్రసాగర్‌లు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

టిక్కెట్ తనిఖీలు ఇక డిజిటలైజేషన్

దక్షిణ మధ్య రైల్వేలో వినూత్న యత్నం



సాక్షి, సిటీబ్యూరో : టిక్కెట్ తనిఖీ వ్యవస్థను పటిష్టం చేయడంతో పాటు ఎలాంటి అక్రమాలకు అవకాశం లేకుండా టిక్కెట్ తనిఖీ కార్యకలాపాలను పారదర్శకం చేసేందుకు డిజిటలైజేషన్ చేపట్టినట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల రియల్‌టైమ్ టిక్కెట్ తనిఖీలు ఎప్పటికప్పుడు నమోదవుతాయన్నారు. ఈ మేరకు టిక్కెట్ తనిఖీ సిబ్బంది కోసం బయో మెట్రిక్ సైన్-ఆన్‌ను ప్రవేశపెట్టామన్నారు. దక్షిణమధ్యరైల్వే జోన్‌లోని 6 ట్రావెలింగ్ టికెట్ ఎగ్జామినర్ (టీటీఈ)లాబీలలో దీన్ని అందుబాటులోకి తెచ్చారని వివరించారు. సికింద్రాబాద్, కాచిగూడ, విజయవాడ, గుంతకల్, గుంటూరు,నాందేడ్‌లను ప్రయోగాత్మకంగా బయో మెట్రిక్ సైన్-ఆన్/సైన్-ఆఫ్ కోసం ఎంపిక చేశామన్నా. దశలవారీగా ఈ వ్యవస్థను దక్షిణమధ్య రైల్వేలోని మొత్తం 73 టీటీఈ లాబీల్లో అలుచేయనున్నట్లు తెలిపారు. గతంలో టికెట్ తనిఖీ సిబ్బంది సైన్-ఆన్/సైన్-ఆఫ్ కోసం పేరు, పాస్‌వర్డ్‌లను వినియోగించేవారు. ప్రస్తుతం టికెట్ తనిఖీ సిబ్బంది లాగిన్ విధానాన్ని క్రమబద్ధీకరించేందుకు ఈ టీటీఈల లాబీలలో ఆధార్ ఆధారిత బయో మెట్రిక్ సైన్-ఆన్/సైన్-ఆఫ్ వ్యవస్థను ప్రవేశపెట్టారన్నారు.

'రాజ్యాంగ అమలుకు-విధ్వంసానికి' మధ్య జరిగే ఎన్నికలు

సదస్సులో వక్తలు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

హిమాయత్‌నగర్: త్వరలో జరుగనున్న ఉపరాష్ట్రపతి ఎన్నికలు 'రాజ్యాంగ అమలుకు-రాజ్యాంగ విధ్వంసానికి' మధ్య జరుగుతున్న ఎన్నికలు అని పలువురు మేధావులు అభిప్రాయం వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని, కాపాడుకోవాలంటే సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డిని ఉప రాష్ట్రపతిగా గెలిపించుకోవాలని వారు కోరారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డికి సంఘీభావంగా ఆదివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొ.కోదండరాం, పౌర హక్కుల జాతీయ నేత ప్రొ.హరగోపాల్, విద్య కమిషన్ సభ్యులు పి.ఎల్.విశ్వేశ్వరయ్య, సీనియర్ సంపాదకులు రామచంద్రమూర్తి, కె.శ్రీనివాస్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొ.కోదండరాం మాట్లాడుతూ రాజ్యాంగ విలువల పరిరక్షణకు జస్టిస్ సుదర్శన్ రెడ్డి గెలుపునకు తెలుగు రాష్ట్రాల ఎంపీలు కృషి చేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిఫార్సు చేయడం వల్ల, బీఆర్ఎస్ పార్టీ ఓటు వేయమని చెప్పడం సరికాదని అన్నారు. ఆయన ఇండియా కూటమి అభ్యర్థి అని గ్రహించాలని సూచించారు. ప్రొ.హరగోపాల్ మాట్లాడుతూ రాజ్యాంగ అమలు కోసం జస్టిస్ సుదర్శన్ రెడ్డి జీవితాంతం పాటుపడ్డారని, చరిత్ర, న్యాయశాస్త్రం మీద సంపూర్ణ అవగాహన ఉన్న ఆయనను గెలిపించుకోవాలని కోరారు. మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఉప రాష్ట్రపతి పదవి రాష్ట్రపతి పదవిలాగా కాదని రాజ్యసభలో చైర్మన్‌గా కూడా కీలక బాధ్యతలు వహిస్తారని అన్నారు. అలాంటి కీలకమైన పదవికి ప్రజల పక్షాన మాట్లాడే గొంతుకగా జస్టిస్ సుదర్శన్ రెడ్డిని గెలిపించాలన్నారు.

మైమరిపించిన నృత్యం



మాదాపూర్: కళాకారులు కథక్, కూచిపూడి నృత్యప్రదర్శనలతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహించే వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం లక్ష్మి విశ్వనాథన్ కథక్ నృత్యప్రదర్శనలో భాగంగా దుర్గ స్తుతి, తీన్‌తాల్, దర్బార్ తరాన అంశాలను ప్రదర్శించి అలరించారు. భవాని నృత్యాంజలి కళాక్షేత్రం గురువు తొండపు భవాని శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనను ప్రదర్శించి అలరించారు. దశావతారం, బృందావనం, ఆనందనర్తన గణపతి, బ్రహ్మాంజలి, ముద్దుగారే యశోధ, మూషికవాహన, పుష్పాంజలి తదితర అంశాలను కళాకారులు నందిత, అద్విక, ధరణి, ప్రఫుల్ల, సాత్విక, ఖ్యాతి, లాస్య, హేమాన్య, పల్లవి, షణ్ముఖి, శివాని, శ్రేష్ట తదితరులు ప్రదర్శించారు.

జీవో నెంబర్ 49 ను పూర్తిగా రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బానోతు రామరావు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆసిఫాబాద్ కొమురంభీం జిల్లా ఆదివాసీలకు, ఇతర పేదలకు అన్యాయం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 49ను వెంటనే రద్దు చేయాలని గిరిజన హక్కుల సంఘం రాష్ట్ర కన్వీనర్ బానోతు రామరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 3ను పునరుద్ధరించాలని కోరారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గిరిజన హక్కుల సంఘం రాష్ట్ర కమిటి ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రామరావు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏజెన్సీలో పీసా చట్టం ప్రకారం గ్రామ సభుల పెట్టకుండానే ఏక పక్షంగా 339 గ్రామాలకు అన్యాయం చేస్తూ అక్రమంగా జీవో నెంబర్ 49ను తీసుకొచ్చిందని అన్నారు. ప్రజా ఉద్యమాలతో రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 49ను తాత్కాలికంగా నిలుపుదెల చేసిందని ఈ జీవోను పూర్తి స్థాయిలో రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పులులు, అడవుల సంరక్షణ పేరుతో గ్రామాలను ఖాళీ చేయించి తరువాత అటవీ భూములను కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పి గిరిజనులను అడవి నుండి దూరం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు అంబటి నాగయ్య, సంఘం కో కన్వీనర్లు తిరుపతి నాయక్, భూక్య శ్రీనివాస్, మాలోతు బాలు నాయక్, ఎట్టి ప్రశాంత్, సంతోష్, శివ తదితరులు పాల్గొన్నారు.

లైవ్ మ్యూజిక్, హైఎనర్జీ డ్యాన్స్

మాదాపూర్: లైవ్ మ్యూజిక్, హైఎనర్జీ డ్యాన్సులతో అసోసియేట్‌లు సరదాగా గడిపారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో ఆదివారం ఎడిపి ఇండియా మానవవనరుల నిర్వహణ సాఫ్ట్‌వేర్, సర్వీసెస్‌లో ప్రముఖ సంస్థ తన 26వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. థింగ్ బియాండ్ ఫర్ ఎ న్యూ ఎరా పేరిట ఏర్పాటు చేసిన థీమ్‌తో వేడుకను నిర్వహించారు. ఎడిపి ప్రైవేటు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ విజయ్‌వెములపల్లి మాట్లాడుతూ 26 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం గొప్ప మైలురాయి అని తెలిపారు. ప్రతిభా పురస్కారాలు, వివిధ రంగాలలో అసోసియేట్‌ల కృషిని అబినందించారు. డీజే నైట్‌తో ఉత్సాహంగా గడిపినట్టు తెలిపారు.

కమ్యూనిస్టులు బలహీన పడుతున్నారు

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం



మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం

మన్సూరాబాద్: కమ్యూనిస్టులు బలహీన పడుతున్నారు.. బీజేపీ బలపడుతోంది..దీంతో దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది అని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం అన్నారు. సీపీఎం రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాటాలు- వక్రీకరణాలు- వాస్తవాలు సదస్సును మన్సూరాబాద్‌లోని ఎంఈ రెడ్డి గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన సుమారు 4వేల మంది కమ్యూనిస్టులు అమరులయ్యారన్నారు. తెలంగాణ అంతటా వెట్టిచాకిరి, భూస్వాములు, పెత్తందారులు, పట్వారీల దాష్టికాలకు వ్యతిరేకంగా 1930లో ఆంధ్రమహాసభ పేరుతో కమ్యూనిస్ట్ పార్టీ ప్రజల ముందుకు వచ్చిందని వివరించారు. తెలంగాణ సాయుధ పోరాటంతో తొలి అమరుడు దొడ్డి కొమరయ్యయని, సుమారు 10వేల ఎకరాల భూములను పేదలకు పేదలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టులదని పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని బీజేపీ హిందు ముస్లీం పోరాటంగా వక్రీకరిస్తోందని మండిపడ్డారు. బీహార్‌లో 65లక్షల ఓట్లను తొలగించారని, ప్రజాప్రతినిధులు అవినీతికి కేసులో ఇరుక్కుని 30 రోజుల పాటు జైలులో ఉంటే పదవి ఊడిపోయేలా బీజేపీ చట్టం తీసుకు వస్తోందని.. ప్రజాస్వామ్యాన్ని హరించేందుకు బీజేపీ కొత్త ఎత్తుగడలు వేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, నాయకులు చంద్రమోహన్, కీసర నర్సిరెడ్డి, ఆలేటి ఎల్లయ్య, వెంకన్న, వీరయ్య, శ్రీనివాస్, యాదిరెడ్డి, మల్లేషం, కృష్ణయ్య, గణేష్, సంధ్య, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం

జస్టిస్ చంద్రకుమార్



మాట్లాడుతున్న రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్

బన్సీలాల్‌పేట : ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ప్రమాదంలో పడ్డాయని రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ తెలిపారు. ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డికి సంఘీభావంగా ఆదివారం సికింద్రాబాద్ బోయిగూడలోని నాలెడ్జ్ సెంటర్‌లో తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడు బన్నూరు కొండారెడ్డి అధ్యక్షతన న్యాయవాదుల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇటీవల ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి బి. సుదర్శన్ రెడ్డి నక్సలిజానికి మద్దతు ఇస్తూ తీర్పునిచ్చారని ఆరోపించడం దురదృష్టకరమన్నారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థి రాధాకృష్ణన్ గురించి చెప్పుకోదగ్గ విషయాలు ఏమీ లేకపోవడంతో జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డిపై అమిత్ షా నిస్సత్తువ ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రాజ్యాంగాన్ని భ్రష్టుపట్టించడానికి అనైతికచర్యలకు పాల్పడుతున్నారన్నారు. ప్రమాదంలో ఉన్న రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులతో పాటు ప్రజలందరిపై ఉందని వివరించారు. వీక్షణం ఎడిటర్ ఎన్. వేణుగోపాల్ మాట్లాడుతూ.. ఈ ఉపరాష్ట్రపతి ఎన్నిక రాజ్యాంగానికి, రాజ్యాంగ వ్యతిరేకతకు జరుగుతున్న పోరని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరు



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ అపర్ణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ స్కీమ్ వర్కర్ల న్యాయమైన సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేయాలని ఐఎఫ్‌టియూ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అపర్ణ పిలుపునిచ్చారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఐఎఫ్‌టీయూ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. సదస్సును ప్రారంభించిన డాక్టర్ అపర్ణ మాట్లాడుతూ... సుదీర్ఘకాలంగా బడా పారిశ్రామిక వేత్తలు పని గంట పెంపు గురించి ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొస్తున్నాయని అన్నారు. బడా కార్పొరేట్ సంస్థల కలలు సాకారం చేయడానికి మోదీ ప్రభుత్వం లేబర్ కోడ్ల ద్వారా 8 గంటల పని దినాన్ని సవరించి 12 గంటల పనిదినంగా మార్చడానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఐఎఫ్‌టియూ జాతీయ నాయకులు ఎస్ బాలన్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలోనే కాదు దేశంలో అనేక రాష్ట్రాలలో కార్మికులకు పని దినాలను పెంచి పని చేయిస్తున్నారని అన్నారు.

నేడు సీఎం రేవంత్‌రెడ్డి సభ



బహిరంగ సభ ఏర్పాట్లపై సమాలోచన చేసిన ఎమ్మెల్యే, కలెక్టర్, అధికారులు

మణికొండ: గోదావరి జలాలను మరో రెండు విడతలుగా హైదరాబాద్ నగరానికి తరలించే పనులను ప్రారంభించేందుకు సోమవారం ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి గండిపేటకు రానుండటంతో ఆదివారం జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌లు ఏర్పాట్లను పరిశీలించారు. పనుల ప్రారంభోత్సవం తరువాత బహిరంగ సభ ఏర్పాటు చేస్తుండటంతో అందుకు అవసరమైన పనులను శరవేగంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ముందుగా కోకాపేట నియోపోలీస్ వద్ద ఔటర్ రింగ్ రోడ్డుకు ఏర్పాటు చేసిన అదనపు ఎగ్జిట్ 1ఎ (ట్రంపెట్)ను సీఎం ప్రారంభిస్తారన్నారు. అక్కడి నుంచి గండిపేటకు చేరుకుని జలమండలి ఏర్పాటు చేస్తున్న గోదావరి జలాల పైలాన్‌ను ఆవిష్కరిస్తారన్నారు. అనంతరం పక్కనే ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి మాట్లాడతారని తెలిపారు. కార్యక్రమంలో జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

9 నుంచి అఖిల భారత జైల్ డ్యూటీ మీట్



పోలీసు క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్స్‌లను అందజేస్తున్న జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర సౌమ్య మిశ్రా

కాచిగూడ: తెలంగాణ జైలు, సవరణ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 9నుంచి 11వ తేదీ వరకు రాజా బహదూర్ వెంకటామారెడ్డి పోలీస్ అకాడమిలో 7వ 'అఖిల భారత జైలు డ్యూటీ మీట్ -2025' నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర జైళ్లు, సవరణ శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా ఐపిఎస్ తెలిపారు. సన్నాహక కార్యక్రమంలో భాగంగా తెలంగాణ కాంటిజెంట్ జట్టు సభ్యులైన 84 మంది క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దేశంలోని 21 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల నుండి 1,300 మందికి పైగా జైలు సిబ్బంది, 184 మంది మహిళలు పాల్గొని 36 విభాగాల్లో తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. ఈ ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రం రెండవసారి అతిథ్యం ఇస్తోంది. మంగళవారం ఉదయం హిమాయత్‌సాగర్‌లోని పోలీస్ అకాడమిలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్యఅతిథిగా పాల్గొని జైలు డ్యూటీ మీట్ ను ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె.రామక్రిష్టారావు , రాష్ట్ర హోంశాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రవి గుప్తా , రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ పాల్గొంటారని తెలిపారు.

17 సంవత్సరాలుగా ఒకే భక్తుడికి గణేశ్ లడ్డూ

నాడు రూ. 600.. నేడు రూ 2.10 లక్షలు



లడ్డూను సొంత చేసుకుంటున్న మునేశ్వర్ దపంతులు

రహమత్‌నగర్: పదిహేడు సంవత్సరాలుగా లడ్డూను వేలం పాటలో దక్కించుకుంటూ, గణనాధునిపై తన కున్న భక్తి శ్రద్ధలను చాటుకుంటున్నాడు ఓ భక్తుడు. హెచ్‌ఎఫ్‌నగర్ ఫేజ్1 బస్తీలో సీతారామ భక్త సమాజం ఆధ్వర్యంలో 30 ఏళ్లుగా స్థానికంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.అయితే మునేశ్వర్ అనే భక్తుడు గత పదిహేడు సంవత్సరాలుగా వేలం పాటల్లో లడ్డూను సొంతం చేసుకుంటున్నాడు. తొలిసారి ఆయన రూ. 600 నుంచి చెల్లించి స్వామి వారి లడ్డూను కైవసం చేసుకున్నాడు. ఆ తరువాత వరుసగా పదహారు సంవత్సరాలు ఆయనే లడ్డూను సొంతం చేసుకుంటున్నాడు. తాజాగా శనివారం రాత్రి గణేష్ మండపం వద్ద నిర్వహించిన వేలం పాటలో రూ 2.10 లక్షలకు మరోసారి లడ్డూను సొంతం చేసుకుని తన భక్తిని చాటుకున్నాడు. ఉత్సవ కమిటీ నిర్వహకులు సతీష్,వెంకటేష్ తదితరులు మునేశ్వర్ దంపతులకు ఘనంగా సన్మానించారు.

నగరంలో జర్మన్ ఇంటీరియర్..



సాక్షి, సిటీబ్యూరో: ఫర్నిచర్ ఉత్పత్తులకు పేరొందిన హెట్టిచ్ నగరంలో ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను కొత్తగా రూపొందించింది. దీనిని హెట్టిచ్ ఇండియా, సార్క్, మిడిల్ ఈస్ట్ ఆఫ్రికా మేనేజింగ్ డైరెక్టర్ ఆండ్రీ ఎక్‌హోల్ట్ ప్రారంభించారు. ఫర్నిచర్ ఫిట్టింగ్‌లు, ఆర్కిటెక్చరల్ డోర్ హార్డ్‌వేర్, ఫర్నిచర్ లైట్లు, వంటగది ఉపకరణాలతో పాటు ప్రపంచవ్యాప్తంగా పేరొందిన జర్మన్–ఇంజినీరింగ్ మ్యాజికల్ ఇంటీరియర్ ఉత్పత్తులను నగరంలో అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. తమ సరికొత్త హైదరాబాద్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో నగరవాసులు ఉచిత డిజైన్ సేవలు, డోర్‌స్టెప్ కన్సల్టేషన్‌తో పాటు నిపుణుల సలహాలు, సూచనలను పొందవచ్చన్నారు.

'ఖేటికా' ఫుడ్స్ నూతన కేంద్రం..

సాక్షి, సిటీ బ్యూరో: ఆహార పదార్థాల తయారీలో ఉపయోగించే ముడి ఉత్పత్తులైన స్టేపుల్స్ విభాగంలో పేరొందిన ఫుడ్ బ్రాండ్లలో ఒకటైన ఖేటికా, నగరంలో ఇటీవలే తన కొత్త తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఈ కార్యకలాపాలను ప్రారంభిస్తున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఖేటికా సహ వ్యవస్థాపకులు రఘువీర్ అల్లాడ మాట్లాడుతూ 'తెలుగువాడిగా నగరంలో తాజా ఉత్పత్తులకు అంకితమైన మా కొత్త తయారీ కేంద్రాన్ని ప్రారంభించడం సంతోషకరం' అంటూ పేర్కొన్నారు. ఇది దేశంలోనే అతిపెద్ద తయారీ ప్లాంట్ అని, తయారైన 24 గంటల్లోనే నగరవాసులకు తమ ఉత్పత్తులను అందించగలుగుతామని ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు. అధిక ప్రొటీన్, ప్రామాణికమైన అల్పాహారం కోసం నగరంలో పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని మిల్లెట్ ఆధారిత ఉత్పత్తులను అందించనున్నామన్నారు.

ఫ్యాషన్ శైలి ప్రతిబింబించేలా..

నగరంలో లగ్జరీ స్టోర్ ప్రారంభం

హాజరైన ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ



సాక్షి, సిటీ బ్యూరో : కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ భారత దేశపు ఫ్యాషన్ శైలి ప్రతిబింబించేలా మెహదీపట్నంలోని మసాబ్ ట్యాంక్ వేదికగా ఓ సరికొత్త స్టోర్ ఆదివారం ప్రారంభమైంది. లగ్జరీ ఫ్యాషన్ ఉత్పత్తులను నగరంలోని ప్రతి మహిళకూ చేరువచేయడమే తమ స్టోర్ లక్ష్యమని నిర్వాహకులు పేర్కొన్నారు. తమ స్టోర్‌లో డైలీ వేర్ ఉత్పత్తుల నుంచి లగ్జరీ వేర్, ప్రత్యేక డిజనర్ వేర్, బ్రైడల్ కలెక్షన్ (వెయ్యి నుంచి 30 లక్షల వరకూ) ప్రీమియం నాన్ ఆల్కహాలిక్ పెర్ఫ్యూమ్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కస్టమర్ల కోసం ఆన్‌లైన్ సదుపాయంతో పాటు వ్యక్తిగత సర్వీస్, భవిష్యత్తులో పిల్లల లగ్జరీ వేర్ కలెక్షన్ ప్రారంభించే ఆలోచన చేస్తున్నామని తెలిపారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా ఏఐఎంఐఎం అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నాంపల్లి ఎమ్మెల్యే మజీద్ హుస్సేన్ పాల్గొన్నారు.

ఒకప్పుడు డ్యాన్స్ క్లాస్‌లో చేరుతున్నారంటే.. నృత్యంలో నైపుణ్యం సాధించడానికి అని అనుకునేవాళ్లు. ఇప్పుడు అది క్యాలరీల ఖర్చుకో, వెయిట్‌లాస్ కోసమో అన్నట్టు మారింది. నగరంలో డ్యాన్స్‌ను ఆసక్తితోనో, ఆదాయ మార్గంగా మలుచుకుందామనో అనుకునేవారికన్నా.. సమూహంలో కలిసిపోవడానికి, సందడిగా గడపడానికి, వీటన్నింటినీ మించి ఆరోగ్య మార్గంగా చూస్తున్న వారే ఎక్కువయ్యారు.

– సాక్షి, సిటీబ్యూరో



నగరంలో డ్యాన్స్..
వర్కవుట్ అవుతోంది..

డ్యాన్స్ ఫర్ ఫిట్ అంటున్న యువతరం

- నిన్నటి ఆనంద తాండవమే నేడు ఆరోగ్య మార్గం
- నగరవాసుల ఫిట్‌నెస్ రొటీన్‌గా మారిన డ్యాన్స్
- టీనేజర్లకు హిప్ హాప్, జంటల్ని ఆకట్టుకుంటున్న సల్సా
- వయసులకు, వ్యాపకాలకు తగ్గట్టుగా ఎంపిక తీరు..

బరువులు మోస్తూ వ్యాయామం చేయడానికి ఇష్టపడని, జిమ్ వర్కవుట్స్‌కి దూరంగా ఉండే వారు ఫిట్‌నెస్ సాధించడానికి డ్యాన్స్ ప్రత్యామ్నాయంగా అవతరించింది. నగరంలోని ప్రతి డ్యాన్స్ స్టూడియో నేమ్‌బోర్డుల్లో డ్యాన్స్‌కు అదనంగా'ఫిట్‌నెస్' జోడిస్తున్నారు. ఏరోబిక్స్‌ను ఒక వ్యాయామంగా కన్నా డ్యాన్స్ వర్కవుట్‌గానే చాలా మంది ఇప్పటికీ పరిగణిస్తున్నారు.



అమెరికన్ కౌన్సిల్ ఆన్ ఎక్సర్‌సైజ్ ప్రకారం, జుంబా గంటకు 300–600 కేలరీల మధ్య బర్న్ చేయగలదు, ఇది ఉత్సాహంగా ఉంటూనే బరువు తగ్గడానికి ఒక అద్భుతమైన మార్గం అని.. జర్నల్ ఆఫ్ ఫిజికల్ యాక్టివిటీ అండ్ హెల్త్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం, డ్యాన్స్ కార్డియో హృదయనాళాల ఆరోగ్యంతోపాటు మొత్తం ఫిట్‌నెస్‌ను గణనీయంగా మెరుగుపరుస్తుంది. క్యాలరీలను బర్న్ చేయడానికి ఇది ఒక ఆహ్లాదకరమైన మార్గం. జర్నల్ ఆఫ్ స్పోర్ట్స్ సైన్స్ అండ్ మెడిసిన్‌లోని అధ్యయనం ప్రకారం, హిప్–హాప్ డ్యాన్స్ ఒత్తిడిని తగ్గించడం ద్వారా మానసిక ఆరోగ్యాన్ని అందిస్తుంది.

అధ్యయనాలు చెబుతున్న లాభాలు..

ఆరోగ్య సాధనకు ఉపకరించి పని ఒత్తిడిని దూరం చేస్తుంది నృత్యం. కార్పొరేట్ ఉద్యోగుల కోసం ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు.. 'కార్పొరేట్

ఒత్తిడిని జయిస్తుంది..

ఉద్యోగుల్లో అత్యధికులు జంటగా చేసే సల్సా నృత్యం పట్ల మక్కువ చూపుతున్నారు. చక్కని ఫిట్‌నెస్‌కు ఇదో మార్గమని వారు చెబుతున్నారు. కనీసం గంట పాటు చేసే నృత్యం 450 నుంచి 550 క్యాలరీలు ఖర్చవుతాయని స్పెషల్ డ్యాన్స్ ట్రైనింగ్ ప్యాకేజీలు అందిస్తోన్న స్టెప్స్ అకాడమీ నిర్వహకులు పృథ్వీరాజ్ చెప్పారు.

డ్యాన్స్ మస్ట్.. లుక్ బెస్ట్..

'బాగా డాన్స్ చేయడమంటే బాగా కన్పించడమే' అని ప్రసిద్ధ ఫిట్‌నెస్ శిక్షకురాలు దినాజ్ వర్వత్ వాలా సూత్రీకరించారు. సిటీలో ఇంటర్నేషనల్ డ్యాన్సింగ్ స్టైల్స్‌కు భారీగా ఆదరణ ఉంది. వీటిలో చిన్నారుల్ని బాలీవుడ్ డ్యాన్స్ స్టైల్స్ ఆకర్షిస్తుంటే.. టీనేజర్స్ హిప్–హాప్, వర్కింగ్ పీపుల్ సల్సాని లైక్ చేస్తున్నారని డ్యాన్స్ మాస్టర్ బాబీ చెబుతున్నారు.

క్యాలరీలు కరుగుతున్నాయ్..

సుమారు 100కిలోల బరువున్న వ్యక్తి నిమిషం పాటు నృత్యం చేస్తే దాదాపు 1.4 క్యాలరీలు ఖర్చు అవుతాయి. 70కిలోల బరువున్న వ్యక్తి 20 నిమిషాలు నృత్యం చేస్తే దాదాపు 196 క్యాలరీలు ఖర్చు అవుతాయని, సావధానంగా చేయడం వల్ల 20 నిమిషాలకు 140 నుంచి 150 క్యాలరీలు, మధ్యస్థంగా చేయడం వల్ల 160 నుంచి 180 క్యాలరీలు, వేగంగా చేసే విధానం వల్ల 180 నుంచి 200 క్యాలరీలు ఖర్చవుతాయని ఓ పరిశోధన వెల్లడించింది. ఈ డ్యాన్స్ వర్కవుట్స్‌ని వారంలో 2 నుంచి నాలుగు సార్లు తమ వ్యాయామ రొటీన్‌లో భాగంగా మార్చుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. లాటిన్ అంతర్జాతీయ సంగీతాన్ని సరదా, ఉత్సాహభరిత నృత్య కదలికలతో మిళితం చేసే నృత్య వ్యాయామం జుంబా. ఇది వ్యాయామాన్ని డ్యాన్స్ పార్టీగా మారుస్తుంది. దీని ద్వారా మనం వ్యాయామం చేస్తున్నామనే విషయం మర్చిపోయేలా ఇది రూపొందింది.



హిప్–హాప్ డ్యాన్స్..

హిప్–హాప్ వర్కౌట్లు ఫిట్‌నెస్‌ను తాజా నృత్య కదలికలతో కలపడానికి ఒక గొప్ప మార్గం. ఈ దినచర్య తరచూ బలం, చురుకుదనం, సమన్వయాన్ని కలిగి ఉంటాయి. ఉల్లాసమైన సంగీతాన్ని ఇష్టపడేవారి ఫిట్‌నెస్ దినచర్యకు కొంచెం చురుకుదనాన్ని జోడిస్తుంది హిప్–హాప్.

లాభాల నృత్యం..

- ఫుట్ వర్క్ బ్యాలెన్స్ చేసుకోవడం నేర్పుతుంది. రక్తప్రసరణను మెరుగు పరుస్తుంది.
- కొన్ని సైకలాజికల్, బిహేవియర్ సమస్యలకు నాన్ వెర్బల్ సైకోథెరపీగా పనిచేస్తుందని డాన్స్ థెరపిస్టులు అంటున్నారు.
- డిప్రెషన్, ఈటింగ్ డిజార్డర్స్ వంటి సమస్యలను దూరం చేస్తుంది.
- ఎముకల్లో క్యాల్షియం సమన్వయానికి, ఆస్టియోపొరోసిస్ వ్యాధి నివారణకు ఉపకరిస్తుంది.
- లో బీపీ, అధిక కొలెస్ట్రాల్ సమస్యలకూ సమాధానం ఈ డాన్స్.
- కోర్ మజిల్స్ పటిష్టతకు సహకరిస్తుంది.
- ఫీల్‌గుడ్ హార్మోన్ లైన అడ్రినలిన్, సెరొటోనిన్, ఎండార్ఫిన్‌ల ఉత్పత్తికి దోహదం చేస్తుంది.
- బాడీ లాంగ్వేజ్ మెరుగుపరుస్తుంది.
- కాళ్లు, హిప్ జాయింట్స్‌తో పాటు లోయర్ పార్ట్ మరింత దృఢత్వాన్ని సంతరించుకునేందుకు దోహదం చేస్తుంది.

డ్యాన్స్‌ఫ్లోర్.. పారా హుషార్..

- చల్లని వాతావరణంలో నర్తించేటప్పుడు ముందుగా బాడీ వార్మప్ కావాల్సిందే. లేకపోతే గాయాలకు కారణమవుతుంది.
- బాల్‌రూమ్ ప్రాక్టీస్‌కు తగిన షూస్ ఎంపిక చేసుకోవాలి.
- టర్న్ తిరిగేటప్పుడు అత్యుత్సాహం కూడదు. షోల్డర్ జాయింట్స్ మీద ఒత్తిడిని గమనించాలి.
- సామర్థ్యానికి అనుగుణంగా నిర్ణీత సమయంలో చేయడం మేలు.





బ్లడ్ మూన్..
వెరీ స్పెషల్..

సింధూరంలా ప్రత్యేక చంద్ర గ్రహణం

- ఆకాశంలో అద్భుత క్షణాల కోసం ఎదురుచూపులు
- నగరంలోని పలు ప్రాంతాల్లో మూన్ లవర్స్ సందడి
- అపోహల చుట్టూ గ్రహణం.. భయాలు అవసరం లేదు : బిర్లా ప్లానిటోరియం ప్రతినిధులు
- సోషల్ మీడియాలో సెలనోఫైల్, బ్లడ్ మూన్ హాష్ ట్యాగ్స్

బ్లడ్ మూన్ హైదరాబాద్ ఆకాశాన్ని మాత్రమే కాదు, సోషల్ మీడియా వేదికలను కూడా ఆక్రమించింది. శాస్త్రీయ నిజాలు, మూఢనమ్మకాలు, యువత ట్రెండ్.. అన్నీ కలిపి నగరాన్ని బ్లడ్ మూన్ ముచ్చట్లతో ముంచెత్తాయి. వచ్చే బ్లడ్ మూన్ వరకూ హైదరాబాదీలు ఈ జ్ఞాపకాన్ని ఫొటోల రూపంలో, పోస్టుల రూపంలో ఆస్వాదిస్తూ మిగిలిపోతారు. నిన్న రాత్రి నుంచి ఈ రోజు ఉదయం వరకూ జరిగిన చంద్ర గ్రహణం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చంద్రుడు ఎర్రటి వర్ణంలో మెరిసిపోవడం వల్ల దీనిని ప్రజలు బ్లడ్ మూన్ అని పిలిచారు. సహజసిద్ధంగా ఏర్పడే ఈ ఖగోళ క్షణం హైదరాబాద్ నగరాన్ని ఆశ్చర్యంలో ముంచెత్తింది.

– సాక్షి, సిటీబ్యూరో


గ్రహణానికి గంటల ముందే ట్విట్టర్, ఇన్‌స్టా, ఫేస్‌బుక్ వేదికలు హాష్‌ట్యాగ్‌లతో సందడి చేశాయి. కొందరు గ్రహణం ఫొటోలు పంచుకుంటే, మరికొందరు 'బ్లడ్ మూన్ అంటే ఏమిటి?' అనే గూగుల్ సెర్చ్‌లో మునిగిపోయారు. ఒక్క రాత్రిలోనే వేల పోస్టులు, వీడియోలు షేర్ కావడం గమనార్హం. ముఖ్యంగా యువత ఈ గ్రహణాన్ని ఫొటోషూట్‌లుగా మార్చుకుని సెలనోఫైల్ బ్లడ్ మూన్ వంటి హాష్‌ట్యాగ్‌లతో క్రియేటివ్‌గా ఎక్స్‌ప్రెస్ చేశారు.

సైన్స్ వర్సెస్ మూఢనమ్మకాలు..

ఒకవైపు శాస్త్రవేత్తలు, పరిశోధన సంస్థలు ఈ ఘటనకు వెనుక ఉన్న ఖగోళ శాస్త్రాన్ని వివరించగా, మరోవైపు సోషల్ మీడియాలో మూఢనమ్మకాలు విపరీతంగా చెక్కర్లు కొట్టాయి. 'గ్రహణ సమయంలో బయటకు వెళ్లకూడదు', 'ఆహారం తినకూడదు' వంటి అపోహలను కొందరు జోరుగా ప్రచారం చేశారు. అయితే హైదరాబాద్‌లోని బీఎం బిర్లా ప్లానిటోరియం నిపుణులు, సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ సైన్స్ రీసెర్చ్, ఐఐటీఎస్ శాస్త్రవేత్తలు ఈ గ్రహణం సహజ ఖగోళ సంఘటన అని, దీనికీ మన ఆరోగ్యం లేదా దైనందిన జీవితానికీ ఎటువంటి సంబంధం, ప్రభావం ఉండదని స్పష్టం చేశారు. 'బ్లడ్ మూన్ కేవలం విజువల్ ఎఫెక్ట్ మాత్రమే. దీనిని చూసి భయపడాల్సిన అవసరం లేదు, ఇది ప్రకృతి అందించే అద్భుత క్షణం' అని వివరించారు.

బ్లడ్ మూన్ అంటే?

సాధారణంగా చంద్రుడు భూమి నీడలోకి వెళ్లినప్పుడు చంద్ర గ్రహణం జరుగుతుంది. కానీ ఈ సమయంలో సూర్యకిరణాలు భూమి వాతావరణాన్ని దాటి చంద్రుని చేరుకున్నప్పుడు, నీలి కాంతి ఫిల్టర్ అవుతుంది, ఎర్రటి కాంతి మాత్రమే చంద్రుడిపై ప్రతిబింబిస్తుంది. అందుకే చంద్రుడు ఎర్రటి రంగులో కనిపిస్తాడు. దీనినే 'బ్లడ్ మూన్' అని పిలుస్తారు.



గతం–భవిష్యత్తు బ్లడ్ మూన్‌లు..

చరిత్ర చెబుతున్నట్లు.. గతంలో హైదరాబాద్‌లో 2018 జూలై 27న ఒక విశేషమైన బ్లడ్ మూన్ కనిపించింది. అది 21వ శతాబ్దంలోనే అత్యంత దీర్ఘమైన చంద్ర గ్రహణంగా రికార్డయ్యింది. 2022లో కూడా కనిపించిన ఈ బ్లడ్ మూన్ ఈ ఏడాది మార్చిలోనూ కనువిందు చేసింది. 2026లో మరో బ్లడ్ మూన్ దర్శనమివ్వనుంది. ఈ విధంగా తరచూ కాకపోయినా, కొన్ని ఏళ్లకోసారి మాత్రమే ఈ అపూర్వ క్షణాలు మన కళ్లముందు మెరుస్తాయి.

హైదరాబాద్ ప్రత్యేకత..

హైదరాబాద్ ఆకాశం నుండి చంద్రగ్రహణం స్పష్టంగా కనిపించడం ఈ సారి ప్రత్యేకత. నగరంలోని హుస్సేన్ సాగర్ తీరంలో, గోల్కొండ కోట ప్రాంగణంలో, షామీర్ పేట్, శంషాబాద్ ప్రాంతాల్లో చాలా మంది ఫొటోగ్రాఫర్లు, సెలనోఫైల్స్ టెలిస్కోపులతో గ్రహణాన్ని ఆస్వాదించారు. టెర్రస్ పార్టీల రూపంలో కూడా బ్లడ్ మూన్ నైట్ జరుపుకున్నవారు ఉన్నారు. చంద్రుడి అందాన్ని ఆస్వాదించే వారికి 'సెలనోఫైల్స్' అని పేరు. ఈ తరం యువతలో ఈ ట్రెండ్ బాగా పెరిగింది. ఇది 'అంతరిక్షంతో కనెక్ట్ అవుతున్నామనే ఫీలింగ్ ఇస్తుంది' అని పలువురు యువత భావించారు.



హెచ్‌సీయూలో క్యాంపస్ 'ఎక్స్‌ప్లోరర్స్'

వారంతా విద్యార్థులు.. కొందరు సీనియర్లైతే.. కొందరు జూనియర్లు.. మరికొందరు కొత్త వారు.. వీరంతా కలిసి పరస్పర స్నేహాన్ని బలపరిచే దిశగా అడుగులు వేశారు. దీనికి నగరంలోని హెచ్‌సీయూ క్యాంపస్ వేదికైంది.. 'ఎక్స్‌ప్లోరర్స్' పేరుతో సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు క్యాంపస్‌లో స్వాగతం పలుకుతూ అవగాహన కల్పించారు. క్యాంపస్‌లో ట్రెక్కింగ్, రాక్ క్లైంబింగ్, నేచర్‌వాక్ నిర్వహిస్తూ.. ఆహ్లాదకరమైన వాతవరణానికి తెరతీశారు..

– రాయదుర్గం

- సీనియర్, జూనియర్ విద్యార్థుల మధ్య స్నేహభావం
- క్యాంపస్‌లో ట్రెక్కింగ్, రాక్ క్‌లైంబింగ్, నేచర్‌వాక్
- పరస్పర స్నేహాన్ని బలపరిచే దిశగా విద్యార్థులు



క్యాంపస్‌లోని ఏబీవీపీ హెచ్‌సీయూ శాఖ ఆధ్వర్యంలో 2018లో ప్రారంభించిన 'ఎక్స్‌ప్లోరర్స్' కార్యక్రమం యేటా నిర్వహిస్తూ వస్తున్నారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీలో అనాదిగా ఉంటున్న ప్రకృతి సోయగాలను ఆస్వాదించేలా సీనియర్లు, జూనియర్లు అనే భావన లేకుండా విభిన్న ప్రాంతాలు, భాషలు, మతాలకు చెందిన వారంతా ఒక్క చోట చేరి.. మనమంతా ఒక్కటే అనే భావన పెంపొందించడమే దీని ప్రధాన లక్ష్యంగా కృషి చేస్తున్నారు. కేవలం ఆన్‌లైన్ సమాచారం ఆధారంగా భారీ సంఖ్యలో విద్యార్థులు 'ఎక్స్‌ప్లోరర్స్' కార్యక్రమంల్లో భాగస్వామ్యం కావడం విశేషం. ప్రధానంగా వీకెండ్‌లోనే కాకుండా సెలవుల సమయంలోనూ నిర్వహిస్తూ వస్తున్నారు. విద్యార్థులకు అనువైన రోజుల్లో మాత్రమే దీనిని నిర్వహిస్తుండడంతో మంచి ఆదరణ లభిస్తోంది. ఈ ఎక్స్‌ప్లోరర్స్ కార్యక్రమానికి కో–ఆర్డినేటర్లుగా విద్యార్థులు నిధిఝా, సౌరబ్ శుక్లా, వంశి పర్యవేక్షించారు.

ప్రకృతి మధ్యలో..

- హెచ్‌సీయూలో సహసిద్ధంగా ఏర్పడిన భారీ బండరాళ్లు పలు చోట్ల దర్శనమిస్తాయి. వాటినే వర్జిన్‌రాక్స్, టెంపుల్‌రాక్, వైట్‌రాక్స్ అంటూ పేర్లతో పిలుస్తుంటారు.
- ఈ ప్రాంతాలలోనే విద్యార్థులు ఎక్స్‌ప్లోరర్స్ పేరుతో ట్రెక్కింగ్, నేచర్‌వాక్, లేక్ వాక్, రాక్ క్‌లైంబింగ్ చేస్తుంటారు.
- ప్రకృతి అందాలను తిలకిస్తూ స్నాక్స్ తింటూ ఎంజాయ్ చేస్తుంటారు.
- వివిధ ప్రాంతాల విద్యార్థులకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేయడం, సెలవుల్లో నగరంలోని పలు ప్రదేశాల్లో టూర్ నిర్వహించడం దీని ముఖ్య ఉద్దేశం.
- ముఖ్యంగా సాలర్‌జంగ్ మ్యూజియం, చార్మినార్, గోల్కొండకోట, బోనాల ఉత్సవాలను లాల్‌దర్వాజా అమ్మవారి దర్శనం వంటి ఇందులో భాగమే.

కొత్త విద్యార్థులకు వినూత్న అనుభూతి..



క్యాంపస్‌లో స్నేహ భావం పెంపొందించడమే దీని లక్ష్యం. ఏబీవీపీ హెచ్‌సీయూ శాఖ సంపూర్ణ మద్దతు ఉంటుంది. క్యాంపస్‌లోని ముఖ్యమైన ప్రాంతాలతో పాటు సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించడం దీని ఉద్దేశం.

– అనిల్‌కుమార్, హెచ్‌సీయూ క్యాంపస్

సీనియర్లు, జూనియర్లు అనే భావన లేకుండా..



క్యాంపస్‌లో చేరిన జూనియర్లకు ఇక్కడి సీనియర్ల మధ్య సఖ్యత ఏర్పడేలా చేయడంతో పాటు ప్రతి ఒక్కరూ ప్రాంతం, భాష, రాష్ట్రం, కుల, మతాలకు అతీతంగా అందరూ ఒకటే అనే భావం ఏర్పడేలా చేయడం కోసం దీనిని నిర్వహిస్తాం.

– ఆయుష్ కుమార్‌సింగ్, హెచ్‌సీయూ క్యాంపస్

దేవా.. ఇదేం బదిలీ చిక్కు!

నిబంధనలకు విరుద్ధంగా బదిలీలకు ఆదేశాలిచ్చి, తర్వాత నాలుక కరుచుకుని.. ఇప్పుడు వాటిని సవరించాలంటూ ప్రభుత్వానికి ప్రతిపాదించింది దేవాదాయ శాఖ. దాదాపు నెల రోజుల క్రితం దేవాదాయ శాఖలో కొందరు అధికారులను బదిలీ చేశారు. అయితే, ఏ జోన్‌లో ఉన్నవారిని ఆ జోన్‌లోనే బదిలీ చేయాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా వేరే జోన్‌లకు బదిలీ చేశారు. ఈ విషయాన్ని ఆలస్యంగా గుర్తించి నాలుక్కరుచుకున్న దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయ అధికారులు, ఇప్పుడు ఆ ఆదేశాలను సవరించి మళ్లీ ఏ జోన్‌లో ఉన్నవారిని ఆ జోన్‌లోనే బదిలీ చేస్తూ కొత్త ఆదేశాలు జారీ చేయాలంటూ ప్రభుత్వానికి ప్రతిపాదించారు.

- సాక్షి, హైదరాబాద్

దేవాదాయ శాఖలో నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు

జోన్ల పరిధి పట్టించుకోకుండా అసిస్టెంట్ కమిషనర్ల బదిలీ

నెల రోజుల తర్వాత నాలుక్కరుచుకున్న అధికారులు

వాటిని రద్దు చేసి కొత్త ఆదేశాలివ్వాలంటూ సర్కారుకు మొర

ఇదీ జరిగింది..

నెల క్రితం దేవాదాయశాఖలో కొందరు సహాయ కమిషనర్లను బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. హైదరాబాద్ నగరంలోని జగన్నాథ స్వామి రామ్‌గోపాల్ ట్రస్టు స్పెషల్ ఆఫీసర్‌గా ఉన్న అసిస్టెంట్ కమిషనర్ సులోచనను మెదక్ అసిస్టెంట్ కమిషనర్‌గా నియమించారు. ఆమె మల్టీజోన్–2 (చార్మినార్ జోన్) అధికారి కాగా, మెదక్ పోస్టు మల్టీజోన్–1 పరిధిలో ఉంది. దీంతో తాను జోన్ ఎలా మారతానంటూ ఆమె కొత్త పోస్టులో చార్జ్ తీసుకోలేదు. ఎండోమెంట్ ట్రిబ్యునల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా ఉంటూ సికింద్రాబాద్ అసిస్టెంట్ కమిషనర్ పోస్టు ఎఫ్ఏసీగా పనిచేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ సంధ్యారాణిని సికింద్రాబాద్ సహాయ కమిషనర్ (రెగ్యులర్)గా నియమించేలా తొలుత ప్రతిపాదించారు. ఆ మేరకు ఆదేశాలు రావాల్సి ఉండగా, విచిత్రంగా ఆమెను మల్టీజోన్–1 పరిధిలోకి వచ్చే వరంగల్‌లోని భద్రకాళి దేవాలయం కార్యనిర్వహణాధికారిగా, వరంగల్ డిప్యూటీ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలతో అప్పగించారు. ఇలాంటి పొరపాట్లను కనీసం కమిషనర్ కార్యాలయం స్థాయిలో గుర్తించాల్సి ఉంటుంది. అలా గుర్తించకుండా వారి బదిలీలను అమలు చేస్తూ కమిషనర్ కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది. దీంతో అది తమ జీతాలపై కూడా ప్రభావం చూపుతుందంటూ ఆ అధికారులు కొత్త పోస్టుల్లోకి వెళ్లేందుకు ససేమిరా అన్నారు. ఇటు పాత కార్యాలయాలతో ప్రమేయం లేకుండా, అటు కొత్త పోస్టుల్లో చేరకుండా త్రిశంకు స్వర్గంలో ఉండిపోయారు. అదే సమయంలో బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం ఈఓగా ఉన్న అసిస్టెంట్ కమిషనర్ కృష్ణను ట్రిబ్యునల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా నియమించారు. అది జోన్ జంఝాటం లేని పోస్టు కావటంతో ఆయన చేరిపోయారు. జోన్ల పరిధి గందరగోళంపై ఆలస్యంగా కళ్లు తెరిచిన అధికారులు ఆ ఆదేశాలు రద్దు చేసి కొత్త ఆదేశాలు ఇవ్వాలంటూ తాజాగా ప్రభుత్వాన్ని కోరారు.

ఇంతకూ కమిషనర్ ఎవరు?

దేవాదాయశాఖ కమిషనర్‌గా ఉన్న వెంకట్రావు గత నెలాఖరులో ఉద్యోగ విరమణ చేశారు. ఆయన సేవలను కొనసాగించాలని నిర్ణయించిన ప్రభుత్వం.. ఆయనను యాదగిరిగుట్ట దేవాలయ కార్యనిర్వహణాధికారిగా నియమించింది. కానీ, ఆయన స్థానంలో దేవాదాయ శాఖ కమిషనర్ ఎవరో స్పష్టత ఇవ్వలేదు. సాధారణంగా ఐఏఎస్ అధికారి బదిలీ అవగానే, ఆ బాధ్యతలు మరొకరికి అప్పగించాలి. పూర్తిస్థాయి పోస్టింగ్ లేనప్పుడు కనీసం అదనపు బాధ్యతలైనా మరో అధికారికి ఇవ్వాలి. కానీ, దేవాదాయశాఖ కమిషనర్ పోస్టు విషయంలో వారం రోజులవుతున్నా ఆదేశాలు జారీ కాలేదు. దీంతో కమిషనర్ లేక పాలనాపరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వేములవాడ దేవాలయం సూపరింటెండెంట్ రాజబాబు డిప్యుటేషన్‌పై కొంతకాలంగా యాదగిరిగుట్ట దేవాలయంలో పనిచేస్తున్నారు. ఆయన డిప్యుటేషన్ రద్దుచేసి నెలన్నర క్రితం సొంత స్థానానికి వెళ్లాలని ఆదేశాలు జారీ అయ్యాయి. కానీ, ఆ బదిలీ అమలులోకి రాలేదు. విచిత్రమేంటంటే ఈ బదిలీ ఆదేశాల్లో 'యాదగిరిగుట్ట కార్యనిర్వహణాధికారి తగు చర్యలు తీసుకోవాలి'అని పేర్కొన్నారు. ఆదేశాలిచ్చిన సమయంలో కమిషనర్, గుట్ట ఈఓ.. రెండు పోస్టుల్లోనూ ఒకే అధికారి ఉండటం విశేషం.

'భూం' చేద్దాం..!

ఏపీఐఐసీకి చెందిన విలువైన వేలాది ఎకరాలు ప్రభుత్వ పెద్దల సన్నిహితులకు పందేరం

ప్రైవేట్ వ్యక్తులు వ్యాపారాలు చేసుకునేందుకు ప్రభుత్వ భూములు పప్పు బెల్లాలు, శనక్కాయల మాదిరిగా పంపిణీ

ప్రభుత్వానికి పైసా ఆదాయం లేకుండా భూములు ధారాదత్తం..

రాష్ట్రంలో స్కామ్‌లమయంగా భూ కేటాయింపులు

నిన్న.. ఊరూ పేరు లేని 'ఉర్సా'కు ఉత్త పుణ్యానికే..! నేడు.. మూతబడ్డ కంపెనీలకూ పందేరం

సీఎం చంద్రబాబు మాటను వేదవాక్కుగా భావించే రిటైర్డ్ ఐఏఎస్ లక్ష్మీపార్థసారథి డైరెక్టర్‌గా ఉన్న కంపెనీకి నెల్లూరులో ఏకంగా 2,776.23 ఎకరాలు

కేతన్ పరేఖ్ స్టాక్ మార్కెట్ కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొన్న 'హెచ్ఎఫ్‌సీఎల్'కు మడకశిరలో 1,000 ఎకరాలు.. మల్టీమీడియా మాట్రిక్స్ నుంచి భూమి బదలాయింపు

చంద్రబాబు అధికారంలోకి రాగానే చక్రం తిప్పే 'అలీప్' రమాదేవికి అనకాపల్లిలో కేటాయించిన దానికి అదనంగా కుప్పంలో ఎంఎస్ఎంఈ పార్కు కోసం మరో 13.70 ఎకరాలు

మూతబడ్డ 'వరాహ ఆక్వా ఫారమ్స్'కు నక్కపల్లిలో ఎంఎస్ఎంఈ పార్కు పేరిట 93 ఎకరాలు

'జే కుమార్ ఇన్‌ఫ్రా'కు విశాఖ పెందుర్తిలో 63.37 ఎకరాలు కేటాయింపు

సాక్షి, అమరావతి: సర్కారు భూమిని ప్రభుత్వమే అభివృద్ధి చేస్తే తిరిగి ఖజానాకే ఆదాయం సమకూరుతుంది! భావి తరాలకు విలువైన సంపద అందుతుంది. ఆ ఆస్తి భద్రంగానూ ఉంటుంది. అందుకు 'ఏపీఐఐసీ' లాంటి ప్రభుత్వ సంస్థలే భేషుగ్గా ఉన్నాయి! కానీ చంద్రబాబు సర్కారు ప్రైవేట్ వ్యక్తులు వ్యాపారాలు చేసుకునేందుకు తమకు కావాల్సిన వారికి భూములను పప్పు బెల్లాలు, శనక్కాయల మాదిరిగా పందేరం చేస్తోంది.. ప్రభుత్వానికి పైసా ఆదాయం లేకుండా ప్రైవేట్ వ్యక్తులకు పంచి పెడుతోంది. రాష్ట్రంలో భూ కేటాయింపులను స్కామ్‌లమయంగా మార్చేసింది! నిన్న.. ఊరూ పేరు లేని 'ఉర్సా' నుంచి నేడు.. మూతబడ్డ కంపెనీలకు భూములను కట్టబెట్టడం దాకా ఇదే తంతు! ముడుపులు ముట్టజెప్పే వారికి అప్పనంగా పంచిపెట్టడం కూటమి సర్కారు అవినీతి, దోపిడీకి నిదర్శనంగా నిలుస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఏది చెబితే అది వేదవాక్కుగా భావించి అమలు చేస్తారని పేరున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి లక్ష్మీపార్థసారథి డైరెక్టర్‌గా ఉన్న 'ఇఫ్కో కిసాన్ సెజ్'కు నెల్లూరులో ఏకంగా 2,776.23 ఎకరాలు కేటాయించడం భూ సంతర్పణలకు పరాకాష్ట!!

టెండర్లు లేకుండా వేలాది ఎకరాలు...

రాష్ట్రంలో ఏపీఐఐసీకి చెందిన వేలాది ఎకరాలు పచ్చ నేతలకు ఫలహారంగా మారుతున్నాయి! ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్క్స్ విత్ ప్లగ్ అండ్ ప్లే పేరిట ఇప్పటికే 5,221 ఎకరాలను కట్టబెట్టడానికి టెండర్లు పిలిచిన రాష్ట్ర ప్రభుత్వం మరోపక్క అసలు ఎటువంటి టెండర్లే లేకుండా తమకు కావాల్సిన వారికి 4,246.30 ఎకరాలు కట్టబెడుతూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. టీడీపీ అధికారంలోకి రాగానే చక్రం తిప్పే మాజీ ఐఏఎస్ అధికారి లక్ష్మీపార్థసారథి డైరెక్టర్‌గా ఉన్న 'ఇఫ్కో కిసాన్ సెజ్'కు నెల్లూరులో ఏకంగా 2,776.23 ఎకరాలు కేటాయించడం గమనార్హం. ఇక మహిళా పారిశ్రామికవేత్తనంటూ టీడీపీ ప్రభుత్వం రాగానే ప్రచారం చేసుకునే 'ఎలీప్' రమాదేవికి ఇప్పటికే అనకాపల్లిలో 31 ఎకరాల భూమి కేటాయించగా తాజాగా కుప్పంలో 13.70 ఎకరాలను అప్పగించారు. టీడీపీతో చెట్టాపట్టాలు వేసుకుని తిరిగే చలమలశెట్టి అనిల్ డైరెక్టర్‌గా ఉన్న 'స్కైరూట్'కు చిత్తూరు జిల్లా రౌతుసురమాలలో 300 ఎకరాలను ధారాదత్తం చేశారు. స్టాక్ మార్కెట్‌లోనే అతిపెద్ద కుంభకోణంగా పేరుపొందిన కేతన్ పరేఖ్ స్కామ్‌లో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొన్న 'హిమాచల్ ఫ్యూచరిస్టిక్ కమ్యూనికేషన్స్' (హెచ్ఎఫ్‌సీఎల్)కు శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో 1,000 ఎకరాలు పందేరం చేయడం గమనార్హం. ఇప్పటికే మూతపడిన విశాఖకు చెందిన 'వరాహ ఆక్వా ఫామ్స్'కు నక్కపల్లి వద్ద 93 ఎకరాలు, జే కుమార్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ లిమిటెడ్‌కు పెందుర్తిలో మరో 63.37 వద్ద ఎకరాలు కేటాయించారు. అంతేకాదు.. ఈ భూములను అభివృద్ధి చేసినందుకుగాను ఎకరాకు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు క్యాపిటల్ సబ్సిడీతో పాటు 100 శాతం నాలా మినహాయింపు, విద్యుత్, నీరు లాంటి ఇతర మౌలిక సదుపాయాలన్నీ ఆ కంపెనీలకు ప్రభుత్వమే కల్పిస్తుంది. ఇలా ఏపీఐఐసీ నుంచి భూములు పొందిన ఈ సంస్థలు పార్కులను అభివృద్ధి చేసి మార్కెట్ రేటుకు విక్రయించుకుని సొమ్ము చేసుకుంటాయి.

టీడీపీ సన్నిహితుడికి 300 ఎకరాలు

టీడీపీతో చెట్టాపట్టాలు వేసుకుని తిరిగే చలమలశెట్టి అనిల్ డైరెక్టర్‌గా ఉన్న 'స్కైరూట్'కు చిత్తూరు జిల్లా రౌతుసుర మాలలో 300 ఎకరాలను ధారాదత్తం చేశారు.

SKYROOT AEROSPACE PRIVATE LIMITED's Annual General Meeting (AGM) was last held on 18 Dec 2023. and as per records from Ministry of Corporate Affairs (MCA), its balance sheet was last filed on 2023-03-31.SKYROOT AEROSPACE PRIVATE LIMITED's NIC code is 7499 (which is part of its CIN). As per the NIC code, it is inolved in Other business activities n.e.c.[This class includes service activities generally delivered to commercial clients].

Directors of SKYROOT AEROSPACE PRIVATE LIMITED are GIRISH BALA KISHORE TALLAM, ANIL KUMAR CHALAMALASETTY ., MAYANK RAWAT, MUKESH BANSAL, . BHARATH NAGA BHARATH DAKA, CHANDANA PAWAN KUMAR, SONU PANDIT, and CHANDANA PAWAN KUMAR.

SKYROOT AEROSPACE PRIVATE LIMITED's Corporate Identification Number (CIN) is U74999TG2018PTC125073 and its

మూసేసిన కంపెనీకి 93 ఎకరాలు..

విశాఖకు చెందిన వరాహ ఆక్వా ఫామ్స్ 1994లో ఏర్పాటు కాగా ఈ కంపెనీని ప్రస్తుతం మూసివేసినట్లు (స్ట్రైక్ ఆఫ్) కంపెనీస్ ఆఫ్ రిజిస్ట్రార్ డేటా పరిశీలిస్తే తెలుస్తోంది. ఆక్వా రంగంలో ఉన్న కంపెనీ.. అందులోనూ మూతపడిన కంపెనీకి నక్కపల్లిలో బల్క్‌డ్రగ్ పార్కు పక్కనే ఎంఎస్ఎంఈ పార్కు అభివృద్ధి పేరుతో 93 ఎకరాలను కేటాయించడం గమనార్హం. ఈ కంపెనీ గురించి విశాఖతోపాటు ఆక్వా రంగ ప్రముఖులను ఆరా తీయగా ఇప్పటి వరకు ఆ పేరు ఎప్పుడూ వినలేదన్న సమాధానం వచ్చింది. అలాగే ముంబైకి చెందిన 'జే కుమార్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్'కు పెందుర్తి వద్ద ఎంఎస్ఎంఈ పార్కు అభివృద్ధి పేరిట 63.37 ఎకరాలను కేటాయించారు.

కుంభకోణంలో వెలుగు వెలిగిన కంపెనీకి..

2001లో దేశ స్టాక్ మార్కెట్‌ను ఒక కుదుపు కుదిపిన కేతన్ పరేఖ్ కుంభకోణం చాలా మందికి గుర్తుండే ఉంటుంది. ఆ స్కామ్‌లో ప్రధానంగా హిమాచల్ ఫ్యూచరిస్టిక్ కమ్యూనికేషన్స్ (హెచ్ఎఫ్‌సీఎల్) పేరు మారు మోగింది. 1998–2001 మధ్య మానిప్యులేషన్ చేయడం ద్వారా హెచ్ఎఫ్‌సీఎల్ ధరను భారీగా పెంచేసి కేతన్ పరేఖ్ భారీ లాభాలు గడించాడన్నది ప్రధాన ఆరోపణ. ఈ కంపెనీ ప్రస్తుతం టెలికమ్యూనికేషన్స్ రంగంలో కార్యకలాపాలను నిర్వహిస్తోంది. ఇప్పుడు అటువంటి కంపెనీ మన రాష్ట్రంలో రక్షణ రంగంలో పెట్టుబడులు పెడుతుందంటూ శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో 1,000 ఎకరాలను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీటిని చూస్తుంటే భూ కేటాయింపులపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయని అధికారులే వ్యాఖ్యానిస్తున్నారు. వాస్తవంగా మడకశిర వద్ద షెల్స్, టీఎన్టీ ఫిల్లింగ్, మల్టీమోడ్ హ్యాండ్ గ్రెనేడ్స్ తయారీ కోసం మీడియా మాట్రిక్స్ వరల్డ్‌వైడ్ లిమిటెడ్‌కు ఎకరా రూ.7 లక్షలు చొప్పున 671 ఎకరాలను కేటాయిస్తూ ఈ ఏడాది ఏప్రిల్ 19న రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే తాము ఉత్పత్తి ప్రారంభించడానికి న్యాయపరమైన సమస్యలు తలెత్తుతున్నాయని, అందువల్ల ఈ భూమిని హెచ్ఎఫ్‌సీఎల్‌కు బదలాయించాలంటూ ఆ కంపెనీ కోరింది. దీన్ని ఆమోదిస్తూ, మీడియా మాట్రిక్స్‌కు చేసిన భూ కేటాయింపులు రద్దు చేసి వాటిని హెచ్ఎఫ్‌సీఎల్‌కు కేటాయిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి పేరిట అడ్డగోలుగా కంపెనీలకు భూ కేటాయింపులు చేస్తున్నారనేందుకు ఈ ఉదాహరణ ఒక్కటి చాలని అధికార యంత్రాంగం పేర్కొంటోంది. కనీసం కంపెనీల పుట్టు పూర్వోత్తరాలు పరిశీలించకుండా, న్యాయపరమైన సలహాలు తీసుకోకుండా విలువైన భూములను అడ్డగోలుగా కేటాయించడం ఏమిటని విస్తుపోతున్నారు. న్యాయపరమైన ఇబ్బందులు ఉన్నాయని వెల్లడించిన కంపెనీ సూచించిన సంస్థకే తిరిగి భూములను ఎలా కేటాయిస్తారని ప్రశ్నిస్తున్నారు.




సీఎం చంద్రబాబు నాయుడుతో రమాదేవి, సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరితో రమాదేవి

రమాదేవికి 31 ఎకరాలు

ఇక మహిళా పారిశ్రామికవేత్తనంటూ టీడీపీ ప్రభుత్వం రాగానే ప్రచారం చేసుకునే 'ఎలీప్' రమాదేవికి ఇప్పటికే అనకాపల్లిలో 31 ఎకరాల భూమి కేటాయించగా తాజాగా కుప్పంలో 13.70 ఎకరాలను అప్పగించారు.

ఇఫ్కో కిసాన్ సెజ్‌కు 2,776.23 ఎకరాలు

నెల్లూరులో పలు పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేసిన ఏపీఐఐసీని కాదని.. ఏకంగా 2,776.23 ఎకరాలను పారిశ్రామిక పార్కు అభివృద్ధి పేరుతో ఇఫ్కో కిసాన్ సెజ్‌కు కూటమి సర్కారు కేటాయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబుకు అత్యంత నమ్మకంగా వ్యవహరించే మాజీ ఐఏఎస్ అధికారి దేవరకొండ లక్ష్మీపార్థసారథి భాస్కర్ ఈ కంపెనీ డైరెక్టర్లలో ఉన్నారు. 2014–19లోనూ, ఇప్పుడు తిరిగి టీడీపీ అధికారంలోకి వచ్చాక ఈమె కీలకంగా వ్యవహరిస్తున్నారు. గతంలో టీడీపీ సర్కారులో అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్, అమరావతి డెవలప్‌మెంట్ పార్టనర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో డైరెక్టరుగా వ్యవహరించిన లక్ష్మీ పార్థసారథి ఇప్పుడు అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్నారు. ఆమె తెలుగుదేశం పార్టీకి ఎంత దగ్గర అంటే.. ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్ స్థాపించిన ఆంధ్రా షుగర్స్‌లో కూడా డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. తమ చేతులో మనిషిలా ఉండే పార్థసారథి ఇఫ్కో కిసాన్ సెజ్‌లో డైరెక్టర్‌గా ఉండటంతో రూ.వేల కోట్ల విలువైన భూములను ఎటువంటి టెండర్లు లేకుండానే కట్టబెడుతూ ప్రభుత్వ పెద్దలు ఉత్తర్వులు ఇచ్చేశారు.

IFFCO KISAN SEZ LIMITED's Annual General Meeting (AGM) was last held on 18 Dec 2023. and as per records from Ministry of Corporate Affairs (MCA), its balance sheet was last filed on 2023-03-31.IFFCO KISAN SEZ LIMITED's NIC code is 4520 (which is part of its CIN). As per the NIC code, it is inolved in Building of complete constructions or parts thereof; civil engineering.

Directors of IFFCO KISAN SEZ LIMITED are BALVINDER KUMAR, DEVARAKONDA LAKSHMIPARTHASARATHY BHASKER, UDAI SHANKER AWASTHI, INDRA DEO PANDEY, RAKESH KAPUR, SUDHAKAR TALLAPRAGADA, and NITESH GUPTA.

IFFCO KISAN SEZ LIMITED's Corporate Identification Number (CIN) is U45209DL2008PLC175835 and its registration number is 175835. Users may contact IFFCO KISAN SEZ LIMITED on its

ఇఫ్కో కిసాన్ సెజ్‌లో డైరెక్టర్‌గా ఉన్న లక్ష్మీపార్థసారథి

'చిన్న' ప్రయత్నంతో రూ.400 కోట్ల భూమికి ఎసరు!

- మచిలీపట్నం గొడుగుపేట వెంకటేశ్వరస్వామికి కూటమి సర్కారు పంగనామాలు
- విజయవాడ గొల్లపూడిలో స్వామి వారికి చెందిన 39.99 ఎకరాల్లో టీడీపీ ముఖ్య నేత పాగా
- ఇక్కడ బహిరంగ మార్కెట్‌లో ఎకరం విలువ రూ.10 కోట్లు
- ఇలాంటి భూమిని కారుచౌకగా కొట్టేసేందుకు స్కెచ్

ప్రాథమిక ఆధారాలు లేనప్పుడు..

ముందస్తు బెయిల్ ఇవ్వొచ్చు

ఎస్సీ, ఎస్టీ కేసుల్లో 'సుప్రీం' కీలక తీర్పు

- ఆరోపణలు నిరాధారమైనప్పుడు కోర్టులు తమ విచక్షణాధికారాన్ని ఉపయోగించొచ్చు
- ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు
- ఎఫ్ఐఆర్ చదివిన వెంటనే ప్రాథమిక ఆధారాలపై ఓ నిర్ధారణకు రావొచ్చు
- కోర్టులు ఆధారాల్లోకి వెళ్లడం.. మినీ ట్రయల్ నిర్వహించడం చేయరాదు
- ఎస్సీ, ఎస్టీలు సమాజంలో చాలా కాలంగా అణగారిన వర్గాలుగా ఉన్నారు
- వారి రక్షణ, హక్కుల కోసమే ఈ చట్టం తెచ్చారు
- నిజానికి.. ఈ చట్టం కింద ముందస్తు బెయిల్‌పై నిషేధం ఉంది
- అయినా, ఆరోపణలు నిరాధారమైనప్పుడు ముందస్తు బెయిల్‌కు అది అడ్డంకి కాదు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

కోర్టు కళ్లుగప్పి కుప్పి గంతులు!

మద్యంపై అక్రమ కేసులో ఆ ముగ్గురి విడుదలను అడ్డుకునేందుకు విఫల యత్నాలు

ఏసీబీ కోర్టులో ఓ అధికారి ద్వారా కథ నడిపిన ప్రభుత్వ పెద్దలు!

సాక్షి, అమరావతి, సాక్షి ప్రతినిధి, విజయవాడ/గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): మద్యం విధానంపై అక్రమ కేసులో ఆది నుంచీ కుట్రపూరితంగా వ్యవహరిస్తూ వస్తున్న కూటమి సర్కారు కోర్టు ఉత్తర్వులను సైతం లెక్క చేయకుండా బరితెగింపు ధోరణితో ప్రవర్తించడం న్యాయవర్గాల్లో తీవ్ర విస్మయం కలిగిస్తోంది. రిటైర్డ్ అధికారులు కాల్వ ధనుంజయరెడ్డి, పెళ్లకూరు కృష్ణమోహన్‌రెడ్డి, వికాట్ కంపెనీ డైరెక్టర్ బాలాజీ గోవిందప్పలకు ఏసీబీ కోర్టు బెయిల్ మంజూరు చేసినప్పటికీ వారు జైలు నుంచి విడుదల కాకుండా అడ్డుకునేందుకు చంద్రబాబు సర్కారు విఫల యత్నాలు చేసింది. కోర్టు ఆదేశించినప్పటికీ వారిని విడుదల చేయకుండా విజయవాడ జిల్లా జైలు వద్ద ఆదివారం ఉదయం మూడు గంటల పాటు హై డ్రామా నడిపింది. ఉదయం 6 గంటలకే రావాల్సిన జైలర్‌ను 9 గంటల వరకు రానివ్వకుండా చేసి ప్రభుత్వ పెద్దలు తెరచాటు కుతంత్రాలకు పాల్పడ్డారు. దొంగ కేసుల్లో ఇరికించి బయటకు రాకుండా చేసే కుట్రలకు మరింత పదును పెట్టారు. అయితే న్యాయవాదులు జైలు ఎదుట ధర్నాకు దిగటం.. సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వ్యక్తం కావడం .. అప్రజాస్వామిక పోకడలపై అన్నివర్గాలు ప్రశ్నిస్తుండటంతో ఉలిక్కిపడిన ప్రభుత్వం హడావుడిగా హైకోర్టులో హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు చేసి వారు జైలు నుంచి విడుదల కాకుండా ఉండేందుకు చివరి నిమిషం వరకు ప్రయత్నించింది. అందుకు జైలు అధికారులు సహకరిస్తూ ఉద్దేశపూర్వకంగానే విడుదలలో తీవ్ర జాప్యం చేశారు. మచిలీపట్నం నుంచి జైలు సూపరింటెండెంట్ బస్సులో వస్తున్నారంటూ కొద్దిసేపు ఈ నాటకాన్ని రక్తి కట్టించగా.. తీరా ఆయన వచ్చాక కూడా విడుదల చేయకుండా ఆలస్యం చేశారు. అయితే ఆ కుట్రలేవీ ఫలించక పోవడంతో ఏసీబీ కోర్టు తీర్పునకు అనుగుణంగా ఎట్టకేలకు ఉదయం 9.30 గంటల సమయంలో ఆ ముగ్గురూ జైలు నుంచి విడుదలయ్యారు. గోవిందప్ప తదితరులకు ఏసీబీ కోర్టు శనివారం సాయంత్రం డీఫాల్ట్ బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. కృష్ణమోహన్‌రెడ్డి తరఫు న్యాయవాది విష్ణువర్ధన్ సకాలంలో పూచీకత్తులను కోర్టుకు సమర్పించారు. ఈ నేపథ్యంలో రిలీజ్ ఆర్డర్‌ని జైలుకు పంపాలని ఆయన కోరగా ఏసీబీ కోర్టులోని ఓ అధికారి ఇందుకు ససేమీరా అన్నారు. దీంతో విష్ణువర్ధన్ ఈ విషయాన్ని న్యాయాధికారి భాస్కరరావు దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారు. రిలీజ్ ఆర్డర్‌ను కోర్టు అమీనా ద్వారా జైలు అధికారులకు పంపాలని న్యాయమూర్తి ఆదేశించారు. అయితే సదరు కోర్టు ఉద్యోగి మాత్రం మొండికేశారు. మిగిలిన ఇద్దరి పూచీకత్తులు సమర్పిస్తేనే మొత్తం ముగ్గురి రిలీజ్ ఆర్డర్‌లను జైలుకు పంపుతానని ఆ అధికారి స్పష్టం చేశారు. ఏకంగా న్యాయాధికారి ఆదేశాలను సైతం ఖాతరు చేయకుండా ఆ అధికారి సమయం ముగిసిపోయేంత వరకు తాత్సారం చేశారు. దీంతో కృష్ణమోహన్‌రెడ్డి శనివారం జైలు నుంచి విడుదలయ్యే అవకాశం లేకుండా పోయింది. ఇదంతా స్పష్టంగా ప్రభుత్వ పెద్దల డైరెక్షన్‌లో జరిగిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ ముగ్గురూ జైలు నుంచి విడుదలైతే హైకోర్టును ఆశ్రయించినా ఫలితం ఉండదని భావించిన ప్రభుత్వ పెద్దలు తెర వెనుక ఏసీబీ కోర్టు ఉద్యోగి ద్వారా ఈ తతంగం నడిపించినట్లు చర్చ జరుగుతోంది.

ప్లాన్ 'బీ' కూడా బెడిసికొట్టడంతో...

ఏసీబీ కోర్టు ఉద్యోగి ద్వారా మొదటి ప్లాన్‌ను అమలు చేసిన ప్రభుత్వ పెద్దలు రెండో ప్లాన్‌లో భాగంగా శనివారం రాత్రి 9.30 గంటలకు హైకోర్టును ఆశ్రయించారు. ఈమేరకు బాలాజీ గోవిందప్ప, ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలకు బెయిల్ మంజూరు చేస్తూ ఏసీబీ కోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో సవాలు చేసింది. దీనిపై హౌస్ మోషన్ పిటిషన్లు దాఖలు చేసి అత్యవసర విచారణకు కోరింది. ఏసీబీ కోర్టు ఉత్తర్వుల మేరకు గోవిందప్ప తదితరులు ఆదివారం విడుదల కానుండటంతో దాన్ని అడ్డుకునేందుకు హౌస్ మోషన్ అస్త్రాన్ని ప్రయోగించింది. దీనిపై అత్యవసరంగా విచారణ జరపాలని హైకోర్టును కోరింది. ప్రభుత్వం దాఖలు చేసిన ఈ హౌస్ మోషన్ పిటిషన్ల గురించి హైకోర్టు రిజిస్ట్రార్ (జుడీషియల్) ఫోన్ ద్వారా ప్రధాన న్యాయమూర్తి (సీజే) దృష్టికి తెచ్చారు. అయితే ఈ వ్యాజ్యాలపై ఇప్పటికిప్పుడు అంత అత్యవసరంగా విచారణ జరపాల్సిన అవసరం లేదని భావించిన ప్రధాన న్యాయమూర్తి అనుమతిని నిరాకరించారు. వీటిని సోమవారం అనుబంధ కేసుల విచారణ జాబితాలో చేర్చాలని రిజిస్ట్రీని ఆదేశించారు. కోర్టు కేసుల విచారణ జాబితా శుక్రవారం సాయంత్రమే సిద్ధమైపోయినప్పటికీ, అత్యవసరం దృష్ట్యా ఆ వ్యాజ్యాలను అనుబంధ జాబితాలో ఉంచాలని రిజిస్ట్రీని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఈ వ్యాజ్యాలపై న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప సోమవారం విచారణ జరపనున్నారు. హౌస్‌మోషన్ అత్యవసర విచారణకు హైకోర్టు నిరాకరించడంతో బాలాజీ గోవిందప్ప తదితరులను జైలు నుంచి విడుదల కాకుండా అడ్డుకోవాలన్న ప్రభుత్వ పెద్దల రెండో ప్లాన్ కూడా బెడిసికొట్టింది. ఎప్పుడైతే హైకోర్టు అత్యవసర విచారణకు నిరాకరించిందో ఇక అప్పుడు జైలు అధికారులు చేసేదేమీ లేక ఏసీబీ కోర్టు తీర్పు మేరకు గోవిందప్ప తదితరులను జైలు నుంచి విడుదల చేశారు.

ఈ ప్రభుత్వానికి న్యాయం, చట్టం అంటే గౌరవం లేదు: ధనుంజయరెడ్డి

కోర్టు ఆదేశాలన్నా ఈ ప్రభుత్వానికి లెక్క లేదని.. న్యాయం, చట్టం అంటే ఏమాత్రం గౌరవం లేదని అనంతరం ధనుంజయరెడ్డి పేర్కొన్నారు. హైకోర్టులో హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు చేసి ఉద్దేశపూర్వకంగానే విడుదలలో జాప్యం చేశారని చెప్పారు.

జైలు ఎదుట న్యాయవాదులు, నేతల బైఠాయింపు..

వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, మొండితోక అరుణకుమార్, లేళ్ల అప్పిరెడ్డి, మాజీ మంత్రులు అంబటి రాంబాబు, వెలంపల్లి శ్రీనివాస రావు, మాజీ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, సుధాకర్ బాబు, పార్టీ నేతలు, న్యాయవాదులు ఉదయం ఆరు గంటల నుంచే పెద్ద సంఖ్యలో జైలు వద్దకు చేరుకుని నిరీక్షించారు. కోర్టు బెయిల్ ఇచ్చినా 15 గంటల పాటు జైలులోనే నిర్బంధించడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. గంటలు గడిచిపోతున్నా విడుదల చేయకపోవడంతో జైలు సూపరింటెండెంట్ తీరుకు నిరసనగా రోడ్డుపై బైఠాయించారు. జైళ్ల శాఖ డీఐజీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జైలు అధికారుల తీరుపై పిటిషనర్ల తరఫు న్యాయవాదులు విష్ణువర్ధన్, పి.నిర్మల్ కుమార్ తీవ్ర నిరసన తెలిపారు.

15 గంటలు అక్రమంగా జైల్లో ఉంచారు




ముగ్గురికీ శనివారం సాయంత్రమే కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఆరు గంటలలోపే జైలు వద్దకు వచ్చాం. ఆదివారం ఉదయం 6.30 గంటలకు విడుదల చేస్తామన్నారు. విడుదల చేయకుండా అధికారులు కావాలనే తాత్సారం చేశారు. 15 గంటలకు పైగా ముగ్గురిని జైలులో అక్రమంగా ఉంచారు. ఈ విషయాన్ని హైకోర్టు దృష్టికి తీసుకెళ్తాం.

– చంద్రగిరి విష్ణువర్ధన్, పి.నిర్మల్ కుమార్, న్యాయవాదులు

కోర్టు ఉత్తర్వుల ధిక్కరణే



ఏసీబీ కోర్టు ముగ్గురుకీ బెయిల్ మంజూరు చేసింది. జైలు అధికారులకు శనివారం సాయంత్రమే మెయిల్ ద్వారా, నేరుగా అందజేసింది. ఫోన్‌లో జైలు సూపరింటెండెంట్‌ను సంప్రదించినా సకాలంలో విడుదల చేయకుండా జాప్యం చేశారు. ఇది పూర్తిగా కోర్టు ఉత్తర్వుల ధిక్కరణ కిందకే వస్తుంది. జైలు నియమావళి ప్రకారం బెయిల్ ఆర్డర్ వచ్చిన తర్వాత ఒక్క నిమిషం లోపల ఉంచినా అక్రమ నిర్బంధమే అవుతుంది. ఉద్దేశపూర్వకంగానే ఇలా ప్రవర్తించారు.

– టి.నాగార్జునరెడ్డి, న్యాయవాది

పస లేని అక్రమ కేసు..



సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు కోర్టులంటే లెక్కలేదు. ఆ ముగ్గురూ జైలు నుంచి బయటకు రాకుండా లంచ్ మోషన్ దాఖలు చేసేందుకే విడుదలలో ఉద్దేశపూర్వకంగా జాప్యం చేశారు. కోర్టు ఉత్తర్వులను కూడా జైలు అధికారులు పట్టించుకోరా? ఇంత దారుణమైన ప్రభుత్వాన్ని ఇప్పటివరకు చూడలేదు. రాజకీయ కక్ష సాధింపుల్లో భాగంగానే లేని లిక్కర్ స్కామ్‌ను ఉన్నట్లుగా చిత్రీకరించి అక్రమంగా జైల్లో పెట్టారు. చార్జ్‌షీట్ అంతా తప్పుల తడక. ముగ్గురికీ బెయిల్ రావడంతో ఈ అక్రమ కేసులో పసలేదని ప్రభుత్వం భయపడుతోంది. చంద్రబాబు చెప్పినట్టుగా సిట్ అధికారులు కథలు అల్లుతున్నారు. న్యాయవాదులు సైతం ఆందోళన చేయాల్సిన దుస్థితి ఈ ప్రభుత్వంలో దాపురించింది. గతంలో వంశీపై బనాయించిన కేసులో కూడా బెయిల్ వచ్చినా పట్టించుకోలేదు. చంద్రబాబు కక్ష సాధింపు ధోరణిని ప్రజలు గమనిస్తున్నారు.

– అంబటి రాంబాబు, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత

మంచిమాట

సన్నిధి

మనిషినీ జంతువునీ వేరు చేసేది మాట, మనిషినీ మనిషినీ వేరు చేసేదీ మాటే. నిజమైన సంభాషణ మనకు జీవం పోస్తుంది. మనలో ధైర్యాన్ని నింపే దీపం, మనలో ఆశను వెలిగించే వెలుగు. అది మన గమ్యాన్ని నిర్దేశించే మార్గదర్శి, మనలోని భయాన్ని జయించే సైనికుడు. మాటే మన కీర్తిని నిర్మించే శిల్పం, మాటే భవిష్యత్తు అనే వనంలో విత్తే తొలి విత్తనం. మనం పలికే ప్రతి మాటా ఒక సంబంధానికి మూల బీజం. అది బంధాలను విడగొట్టగలదు, లేదా కొత్త సంబంధాలను స్థాపించగలదు.

సంభాషణ

హృదయాల కలయిక



అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితం చ యత్ స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయం తప ఉచ్యతే

ఇతరులకు బాధ కలిగించని, సత్యంతో కూడిన, ప్రియమైన, మేలు చేసే మాటలను పలకడం, మరియు ఆత్మ పరిశీలన చేయడం – ఇవి తపస్సుగా చెప్పబడ్డాయి. ఈ శ్లోకం సంభాషణ కేవలం మాటల మార్పిడి కాదని, అది ఒక పవిత్రమైన సాధన అని తెలియజేస్తుంది.

సంభాషణ ఒక మహోన్నతమైన కళ. అది కేవలం పెదవుల నుండి వచ్చే పదాల సమూహం కాదు, అది ఆత్మల మధ్య జరిగే గానం. నిజమైన సంభాషణ మన అంతరంగపు చీకటిలో వెలుగును నింపుతుంది, కన్నీళ్లను ఆనందపు జల్లులుగా మారుస్తుంది, యుద్ధం లేకుండానే విజయాన్ని సాధిస్తుంది.

దీనికి అత్యుత్తమ ఉదాహరణ శ్రీ కృష్ణుడు అర్జునుడికి ఇచ్చిన ఉపదేశం. ధర్మానికి, కర్మకు మధ్య చిక్కుకున్న అర్జునుడి మనసు సంశయం అనే దట్టమైన పొగమంచులో నిలిచిపోయింది. కానీ, శ్రీకృష్ణుని మాటలు కేవలం గొంతు నుండి రాలేదు; అవి జ్ఞానపు సూర్యోదయంలా ఆ పొగమంచును తొలగించి, మార్గాన్ని స్పష్టంగా చూపాయి. ప్రేమతో, కరుణతో నిండిన ఆ మాటలు, అర్జునుడిలో ఆత్మవిశ్వాసాన్ని నింపి, శాంతితో కూడిన విజయాన్ని అందించాయి.

మాటలకు ఉన్న శక్తికి మరొక ఉదాహరణ, ఒక అసాధ్యమైన సముద్రాన్ని చూసి నిరాశలో ఉన్న హనుమంతుడు ఒకప్పుడు, తన అపారమైన శక్తిని మరచిపోయే ఒక శాపంతో బంధించబడిన హనుమంతుడు నిరాశలో ఉన్నప్పుడు, ఆ శాపాన్ని తొలగించే మంత్రం లాంటి జాంబవంతుడి మాటలు, 'ఓ వాయుపుత్రా! నీ అపార శక్తిని మరచితివి!' అని గర్జించాయి. ఆ మాటల గర్జనకే, హనుమంతుడిలో నిద్రపోయిన సామర్థ్యం తిరిగి మేల్కొల్పబడింది. ఆ ఒక్క మాటే వేలాది యోజనాల సముద్రాన్ని దూకే శక్తినిచ్చింది. మాట అంటే కేవలం ఒక ధ్వని కాదు, అది మనలోని అంతులేని సామర్థ్యాన్ని బయటకు తెచ్చే ఒక ప్రేరణ.

సంగచ్ఛధ్వం సంవదధ్వం, సం వో మనాంసి జానతామ్

అందరూ కలిసి నడవండి, కలిసి మాట్లాడండి, మీ మనసులు ఒకరినొకరు అర్థం చేసుకోండి. ఈ సూక్తి సంఘటిత జీవితానికి సంభాషణ ఎంత ముఖ్యమో తెలియజేస్తుంది. హృదయాల మధ్య గోడలు కట్టే మాటల బదులు, వారధులు నిర్మించే మాటలను పలకాలి. అదే అసలైన సంభాషణ. మన మాటలు మన వ్యక్తిత్వానికి, మన హృదయానికి ప్రతిబింబాలు. వాటిని శుభ్రంగా, సున్నితంగా, ప్రేమతో ఉంచినప్పుడే మన జీవితం ఒక అందమైన కవితలా మారుతుంది.

> మాటలు కేవలం అక్షరాల సమ్మేళనం కాదు. అవి మన అంతరంగపు భావాలకు ప్రతిరూపాలు. మనసులో ఉన్న ఆలోచనలను, హృదయంలో ఉన్న అనుభూతులను వెలికి తీసే ఒక అద్భుతమైన శక్తి సంభాషణకు ఉంది. అది ఒక నిశ్శబ్ద ప్రవాహం. ఒకరి హృదయాన్ని మరొకరి హృదయంతో కలిపే ఒక అద్భుతమైన వారధి. ఈ వారధి ఎంత దృఢంగా ఉంటే, మన మధ్య సంబంధాలు అంత గాఢంగా ఉంటాయి. అందుకే సంభాషణ కేవలం సమాచార మార్పిడి కాదు. అది హృదయాల కలయిక.

– కె. భాస్కర్ గుప్తా
(వ్యక్తిత్వ వికాస నిపుణులు)




నేడు ప్రపంచ అక్షరాస్యతా దినోత్సవం

మహిళా పాఠకులు చదవాల్సిన 20 పుస్తకాలు

స్త్రీలు రాసిన పుస్తకాలు, స్త్రీల గురించిన పుస్తకాలు చదవడం అంటే కొత్త మైదానాల్లోకి అడుగు వేయడమే. సాహిత్యం వికాసాన్ని, వివేచనను ఇస్తుంది. ఇంటిలోని మహిళ పుస్తక పఠనం మొదలెడితే ఇంటిల్లిపాది పాఠకులు అవుతారు. 'సాక్షి' పాఠకుల కోసం ప్రత్యేకంగా ప్రతి మహిళ కనీసం చదివి ఉండాల్సిన 20 పుస్తకాలు ఇక్కడ ఇస్తున్నాం. ఇలా ఎంపిక చేయదగ్గవి తెలుగు నుంచి మరో వందైనా ఉన్నాయి. ఈ ఎంపికలో నచ్చినవి తీసుకొని చదవండి.



1. సచ్చరిత్ర- బండారు అచ్చమాంబ
తొలి తెలుగు కథకురాలు బండారు అచ్చమాంబ జీవిత్రచరిత్ర ఇది. గురజాడ అప్పారావు కన్నా ముందే 'ధనత్రయోదశి' కథ రాసి తెలుగు కథకు బాటలు వేశారు. 'సచ్చరిత్ర' తప్పక చదవదగ్గది.

2. మావూరి ముచ్చట్లు- పాకాల యశోదారెడ్డి

తెలంగాణ ప్రాంతం నుంచి మాండలిక సౌందర్యంతో కథలు రాసిన రచయిత్రి. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు ఆచార్యులుగా పనిచేసి పదవీ విరమణ చేశారు.

3. నా ఇంగ్లండు యాత్ర- పోతం జానకమ్మ

జానకమ్మ అనే తెలుగింటి ఆడపడుచు 1873లో ఓడలో చేసిన ఇంగ్లండు ప్రయాణ విశేషాలను, ఆనాటి సామాజిక పరిస్థితులను పుస్తక రూపంలో రాశారు. 1876లో ఈ పుస్తకం వెలువడింది.

4. శారద లేఖలు- కనుపర్తి వరలక్ష్మమ్మ
సాహితీవేత్తగా ప్రసిద్ధి చెందిన వరలక్ష్మమ్మ 1929 నుంచి 1934 వరకు 'గృహలక్ష్మి' మాసపత్రికలో రాసిన శారద లేఖలు ప్రసిద్ధి పొందాయి. దురాచారాలను ఖండిస్తూ, స్త్రీల అభ్యున్నతి కాంక్షించేలా నడిచే ఈ లేఖలు అనేక అంశాల గురించి చర్చిస్తాయి.

5. స్త్రీ(నవల)- గుడిపాటి వెంకటాచలం

స్త్రీవాదాన్ని బలపరుస్తూ ప్రసిద్ధ రచయిత గుడిపాటి వెంకటాచలం 1925లో రాసిన నవల. స్త్రీలు ఏ అడ్డూ లేకుండా స్వేచ్ఛగా జీవించాలన్న తృష్ణకు ఈ నవల నేపథ్యం.

6. జానకి విముక్తి (నవల)- రంగనాయకమ్మ

స్త్రీలలో రావాల్సిన మార్పులను, వారు సాధించాల్సిన అభ్యున్నతిని కాంక్షిస్తూ రాసిన నవల ఇది. 'జానకి' అనే పాత్ర జీవితంలో జరిగిన అనుభవాలను వివరంగా తెలుపుతుంది ఈ పుస్తకం.

7. కాలాతీత వ్యక్తులు (నవల) - పి.శ్రీదేవి
తెలుగు సాహిత్యంలో పేరెన్నికగన్న నవల. పురుషాధిక్యతను నిరసిస్తూ, స్త్రీలు స్వతంత్రంగా ఎదగాలన్న కాంక్షను కనబరుస్తూ సాగే పాత్రలు ఇందులో కనిపిస్తాయి.

8. నాలో నేను (ఆత్మకథ) - భానుమతీ
నటి, దర్శకురాలు, రచయిత్రి, గాయని, సంగీతకారిణి అయిన భానుమతీ రామకృష్ణ ఆత్మకథ ఈ పుస్తకం. సామాన్య కుటుంబంలో జన్మించిన ఆమె, అంచెలంచెలుగా ఎదిగిన తీరు ఈ పుస్తకంలో చదవొచ్చు.

9. గోరాతో నా జీవితం- సరస్వతి గోరా
ప్రముఖ హేతువాద ఉద్యమకారుడు గోరా సతీమణి సరస్వతి రాసిన ఆత్మకథ ఈ పుస్తకం. సామాన్య గృహిణిగా ఉన్న ఆమె గోరా సాహచర్యంతో హేతువాదిగా ఎదిగిన క్రమాన్ని ఇందులో పొందుపరిచారు.

10. రాజకీయ కథలు- ఓల్గా

స్త్రీల జీవితాల్లోని విభిన్న పార్శ్వాలను, వాటి చుట్టూ అల్లుకున్న రాజకీయాలను పొందుపరిచిన కథలివి. స్త్రీ వాదానికి బలమైన దన్నుగా నిలిచిన కథలు.

11. ఇల్లాలి ముచ్చట్లు- పురాణం సుబ్రహ్మణ్య శర్మ
వారపత్రికలో ప్రచురితమైన ఈ ఇల్లాలి ముచ్చట్లు తెలుగు సాహిత్యంలో విశిష్ట స్థానాన్ని పొందాయి. రోజువారీ సంఘటనలు మొదలుకొని, అంతర్జాతీయ అంశాల దాకా అన్నింటి పట్ల సగటు ఇల్లాలి స్పందన ఇది. హాస్యం, వ్యంగ్యం, సామాజిక అవగాహన కలగలిసిన ముచ్చట్లు.

12. రాయక్క మాన్యం (కథలు)-

తెలంగాణలోని దళిత జీవన నేపథ్యాన్ని, స్థితిగతులను యథాతథంగా చిత్రించిన కథలివి. దళిత స్త్రీల జీవన పోరాటాన్ని ఈ కథల్లో చూడొచ్చు.

13. నల్లపొద్దు- సంపాదకురాలు:
దళిత స్త్రీలు రచించిన సాహిత్యాన్ని తొలిసారిగా పుస్తక రూపంలోకి తీసుకొచ్చి అందించిన పుస్తకం. ఈ రచనల్లో అస్తిత్వ ఘర్షణ, నిరంతర పోరాట స్ఫూర్తి కన్పిస్తాయి.

14. నీలి మేఘాలు (స్త్రీవాద కవిత్వం)
తెలుగు స్త్రీవాద సాహిత్యంలో కీలకమైన కవిత్వ సంపుటి. స్త్రీల సమస్యలు, వారి అంతరంగాలు, అభ్యంతరాలకు బలమైన వ్యక్తీకరణతో కవిత్వ రూపం ఇక్కడ కనిపిస్తుంది.

15. నిర్జనవారధి (ఆత్మకథ)- కొండపల్లి కోటేశ్వరమ్మ
కమ్యూనిస్టు ఉద్యమకారిణి కొండపల్లి కోటేశ్వరమ్మ ఆత్మకథ. 92 ఏళ్ల వయసులో ఆమె రాసిన ఈ పుస్తకం తెలుగు రాష్ట్రాల్లోని అనేక పరిణామాలను వివరిస్తుంది.

16. ఆధునిక భారత తొలి ముస్లిం ఉపాధ్యాయురాలు: ఫాతిమా షేక్

భారతదేశ తొలి ముస్లిం ఉపాధ్యాయురాలు, సామాజిక సంస్కర్త, జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల సహోద్యోగి ఫాతిమా షేక్. ఆమె జీవిత చరిత్ర తప్పక తెలుసుకోవాల్సినది. రచన: నసీర్ అహ్మద్.

17. చదువు తీర్చిన జీవితం (ఆత్మకథ)- కాళ్లకూరి శేషమ్మ
మెట్టు మెట్టు ఎక్కిన ఒక సామాన్య మహిళ ఆత్మకథ ఈ పుస్తకం. క్రమశిక్షణ, సంయమనంతో తన జీవితాన్ని తీర్చిదిద్దుకున్న కాళ్లకూరి శేషమ్మ ఏడు దశాబ్దాల అనుభవసారం స్ఫూర్తిదాయకమైనది.


18. నా మాటే తుపాకీ తూటా (ఆత్మకథ)
తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని, ఆపై ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి, రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కమ్యూనిస్టు నేత మల్లు స్వరాజ్యం జీవితాన్ని గ్రంథస్థం చేసిన పుస్తకం ఇది.

19. కుప్పిలి పద్మ కథలు
ఆధునిక స్త్రీల జీవనంలో వస్తున్న మార్పులు, యువతీయువకుల జీవితపు ఆకాంక్షలను ఒడిసిపట్టిన కథలివి. కథలను కవితాత్మకంగా చిత్రించటం కుప్పిలి పద్మ రచనల ప్రత్యేకత.

20. ఎడారి బతుకులు(కథలు)- ఎండపల్లి భారతి
బడుగుజీవుల జీవన క్రమాన్ని, వారి సంతోషాలను, సరదాలను, బాధలనూ ఒకచోట చేర్చిన కథలివి. పల్లెవాసుల జీవనాన్ని యథాతథంగా చిత్రించి అందించారు రచయిత్రి ఎండపల్లి భారతి.

సాక్షి సినిమా

ఆ రోజే మాస్ జాతర?


● రవితేజ

రవితేజ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం 'మాస్ జాతర'. 'ధమాకా' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో రవితేజ, హీరోయిన్ శ్రీలీల జోడీగా నటిస్తున్న చిత్రం ఇది. రవితేజ కెరీర్‌లోని ఈ 75వ సినిమాకు భాను బోగవరపు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో రైల్వే పోలీస్ లక్ష్మణ్ భేరి పాత్ర చేస్తున్నారు రవితేజ. విలన్‌గా నవీన్ చంద్ర కనిపిస్తారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో రవితేజ – శ్రీలీల కాంబినేషన్‌లో కొన్ని సన్నివేశాలు తెరకెక్కిస్తున్నారట. అలాగే ఈ ఇద్దరూ పాల్గొనగా ఓ పాట చిత్రీకరణను కూడా ప్లాన్ చేశారని టాక్. కాగా, ఆగస్టు 27న ఈ సినిమాను విడుదల చేయాలనుకున్నారు. కానీ కొన్ని కారణాల వల్ల కుదరలేదు. ఫైనల్లీ 'మాస్ జాతర' అక్టోబరు 31న విడుదల కానుందని, ఈ దిశగా యూనిట్ సన్నాహాలు చేస్తోందనే టాక్ వినిపిస్తోంది. మరి... వార్తల్లో ఉన్నట్లుగా ఆ రోజే వెండితెరపై మాస్ జాతర కనిపిస్తుందా? వేచి చూడాల్సిందే.

మాస్ డ్యాన్స్?


● చిరంజీవి


● నయనతార

మాస్ డ్యాన్స్ చేస్తారా? రొమాంటిక్ సాంగ్ పాడుకుంటారా? ఇంతకీ చిరంజీవి–నయనతార ఏ తరహా పాట చేయనున్నారు? అనే చర్చ జరుగుతోంది. ఈ చర్చకు కారణం ఈ ఇద్దరూ పాల్గొనగా ఒక పాట చిత్రీకరించడానికి సన్నాహాలు చేస్తోంది 'మన శంకరవరప్రసాద్ గారు' యూనిట్. చిరంజీవి హీరోగా నయనతార హీరోయిన్‌గా అనిల్ రావిపూడి దర్శకత్వంలో సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్న చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. ఇటీవల ఆరంభమైన ఈ చిత్రం కొత్త షెడ్యూల్‌లో చిరంజీవి, నయనతార, ఇతర ముఖ్య తారలు పాల్గొనగా టాకీ పార్ట్ షూట్ చేశారు. నేటి నుంచి చిరంజీవి, నయనతార పాల్గొనగా హైదరాబాద్‌లో ఒక పాట చిత్రీకరించనున్నట్లు యూనిట్ పేర్కొంది. "భీమ్స్ సిసిరోలియో ఈ సినిమా కోసం అద్భుతమైన ఆల్బమ్ రూపొందించారు. చిరంజీవి–నయనతారపై చిత్రీకరించే పాటకు డ్యాన్స్ మాస్టర్ విజయ్ పోలంకి కొరియోగ్రఫీ చేస్తారు'' అని యూనిట్ తెలియజేసింది. అయితే... ఇది మాస్ నంబరా? రొమాంటిక్ సాంగా? అనేది తెలియాల్సి ఉంది. వచ్చే సంక్రాంతికి రిలీజ్ కానున్న ఈ చిత్రానికి కెమెరా: సమీర్ రెడ్డి.

తెలుసు కదా.. బై బై!


● రాశీ ఖన్నా


'తెలుసు కదా' యూనిట్‌కు బై బై చెప్పారు రాశీ ఖన్నా. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న రొమాంటిక్ డ్రామా 'తెలుసు కదా'. ఈ చిత్రంలో రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లు. స్టైలిస్ట్ నీరజ కోన దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా అక్టోబరు 17న విడుదల కానుంది. తాజాగా ఈ సినిమాలోని తన పాత్ర షూట్‌ను పూర్తి చేశారు రాశీ ఖన్నా. ఈ సందర్భంగా 'తెలుసు కదా' సినిమా ప్రయాణం గురించి రాశీ ఖన్నా మాట్లాడుతూ –"కెమెరాలు ఆగిపోయిన తర్వాత కూడా మర్చిపోలేని కథలు ఉంటాయి. 'తెలుసు కదా' అలాంటి కథల్లో ఒకటి. అద్భుతమైన అనుభవాలు కలగలిసిన ప్రయాణం ఇది. ఇందులో నాతో పాటు నడిచిన చిత్రయూనిట్ అందరికీ కృతజ్ఞతలు. మేము సృష్టించిన ఈ ప్రపంచంలోకి మీరు అడుగుపెట్టే రోజు కోసం ఎదురు చూస్తున్నాను. ఇది మీకు ఒక గొప్ప రైడ్‌లా ఉంటుంది'' అని పేర్కొన్నారు.

దోశె కింగ్‌గా...


● మోహన్ లాల్

మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ దోశె కింగ్‌గా మారనున్నారట. వెండితెరపై ఈ హీరోని ఇలా మార్చనున్న దర్శకుడు ఎవరో కాదు... సూర్యతో 'జై భీమ్' వంటి ఆలోచన రేకెత్తించే సినిమా తీసి, విజయం సాధించిన దర్శకుడు టీజే జ్ఞానవేల్. శరవణ భవన్ హోటల్ యజమాని రాజగోపాల్ జీవితం ఆధారంగా జ్ఞానవేల్ ఓ కథ తయారు చేశారని కోలీవుడ్ టాక్. ఈ కథని మోహన్‌లాల్‌కి వినిపించారట. ఆయనకు నచ్చి, ఈ సినిమా చేయడానికి ఒప్పుకున్నారని సమాచారం. శరవణ భవన్ అధినేతగా రాజగోపాల్ గొప్ప పేరు సంపాదించుకున్నారు. చిన్న స్థాయి నుంచి చాలా పెద్ద స్థాయికి చేరుకున్న ఆయన జీవితంలో 'డార్క్ షేడ్' కూడా ఉంది. ఓ హత్య కేసులో జీవిత ఖైదుగా ఆయనకు శిక్ష పడిన విషయం తెలిసిందే. అయితే ఖైదీగా ఉన్న కొద్ది రోజులకే రాజగోపాల్ గుండెపోటుతో మరణించారు. రాజగోపాల్ సాధారణ వ్యాపారవేత్తగా మొదలై, ఎంతో ఎత్తుకి ఎదిగి, హత్య కేసులో ఇరుక్కుని డౌన్ ఫాల్ అయినంతవరకూ సినిమాలో చూపించనున్నారట జ్ఞానవేల్. సో... ఈ సినిమాలో మోహన్‌లాల్‌ని డార్క్ షేడ్‌లోనూ చూసే అవకాశం ఉందన్నమాట. 'దోశె కింగ్' టైటిల్‌తో ఈ చిత్రాన్ని రూపొందించనున్నారట. ఈ చిత్రం గురించిన అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

పోటీకి సై


● అజయ్ దేవగణ్


● రణ్‌బీర్ కపూర్

వచ్చే ఈద్ పండక్కి బాక్సాఫీస్ ఫైట్‌కి సై అంటున్నారు అజయ్ దేవగణ్, రణ్‌బీర్ కపూర్. అజయ్ దేవగణ్ హీరోగా నటించిన లేటెస్ట్ మూవీ 'ధమాల్ 4'. రితేష్ దేశ్‌ముఖ్, సంజయ్ మిశ్రా, అర్షద్ వార్సీ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాకు ఇంద్ర కుమార్ దర్శకత్వం వహించారు. ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. భూషణ్ కుమార్, క్రిషణ్ కుమార్, అశోక్ థాకరియా నిర్మించిన ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ఈద్ పండక్కి రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ ప్రకటించారు. ఇక మరోవైపు 'లవ్ అండ్ వార్' సినిమాను ఈద్ పండగ సందర్భంగా 2026 మార్చి 20న రిలీజ్ చేయనున్నట్లుగా గతంలోనే వెల్లడించారు ఈ చిత్రదర్శక–నిర్మాత సంజయ్‌లీలా భన్సాలీ. ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్, విక్కీ కౌశల్, ఆలియా భట్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ఇంకా పూర్తి కాలేదు.


మరి... బాక్సాఫీస్ వద్ద వచ్చే ఈద్‌కి రణ్‌బీర్‌ది పై చేయి అవుతుందా? లేక అజయ్ దేవగణ్ హిట్ అవుతారా? లెట్స్ వెయిట్ అండ్ సీ.

ఓటీటీ – ఇది చూడొచ్చు

దేశ క్షేమం కోసం...

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో దేశభక్తి నేపథ్యంలో రూపొందిన రెండు వెబ్ సిరీస్‌లు సలాక్కార్, సారే జహా సే అచ్ఛా గురించి తెలుసుకుందాం.





ఏ ఎండకా గొడుగు అన్న నానుడి వినే ఉంటారు. ఇలానే ఇప్పుడు ఓటీటీల్లో ఏ ట్రెండ్‌కా స్టోరీ అన్న విధంగా నడుస్తోంది. ఆగస్టు 15 అనగానే ఆ తేదీకి ముందు, తరువాత నెలల్లో దేశభక్తి సినిమాలు రావడం పరిపాటే. ఇలా ప్రస్తుతం ఓటీటీ సిరీస్‌లు కూడా విడుదలవుతున్నాయి. ఇదే నేపథ్యంలో సరిగ్గా వారం రోజుల వ్యవధిలో రెండు దిగ్గజ ఓటీటీల్లో రెండు సిరీస్‌లు రిలీజ్ అయ్యాయి. వాటిలో జియో హాట్ స్టార్ వేదికగా 'సలాక్కార్' ఒకటి అయితే నెట్ ఫ్లిక్స్‌లో విడుదలైన 'సారే జహా సే అచ్ఛా' మరొకటి. వీటిలో విశేషం ఏమిటంటే... రెండు కథాంశాలు దాదాపు ఒకటే. పాత్రలు, కథను నడిపించిన తీరు తప్ప రెండూ అన్నిటికీ అన్నీ సమానమే. అంతలా వీటిలో ఉన్న కథాంశమేమిటో ఓసారి చూద్దాం. 1960 నుండి 1990 సంవత్సర కాలంలో భారత దేశానికి యుద్ధాలు, ఇతర దేశాల నుండి కవ్వింపు చర్యలు లాంటివి ఎన్నో జరిగాయి. సరిగ్గా పాకిస్తాన్–భారత్ యుద్ధం జరిగిన ఆ సమయంలో పాకిస్తాన్ దేశం న్యూక్లియర్ బాంబును తయారు చేయడానికి విశ్వ ప్రయత్నాలు చేసింది. కానీ ఆ ప్రయత్నాలన్నీ మన దేశానికి సంబంధించిన గూఢచార సంస్థ 'రా' నాశనం చేసింది. తమ సంస్థ ద్వారా పాకిస్తాన్‌లోకి గూఢచారులను పంపి, పాకిస్తాన్ న్యూక్లియర్ బాంబు తయారీని సమర్థవంతంగా ఎదుర్కొంది. ఇప్పుడు పైన చెప్పుకున్న రెండు సిరీస్‌లలో ఇదే కథా నేపథ్యం. 1978లో పాకిస్తాన్ దేశం జనరల్ జియా నేతృత్వంలో ఉంది. ఆ సమయంలో ఆదిర్ దయాళ్ అనే గూఢచారి ఇండియన్ ఇమ్మిగ్రేషన్ ఆఫీసర్‌గా పాకిస్తాన్‌లో ప్రవేశిస్తాడు. పాకిస్తాన్‌లోని ఓ ప్రాంతంలో న్యూక్లియర్ బాంబు తయారవుతుందని తెలుసుకుని ఆ ప్రయత్నాలను నాశనం చేయడమే 5 ఎపిసోడ్లతో స్ట్రీమ్ అవుతున్న 'సలాక్కార్' కథ. 1972లో పాకిస్తాన్ దేశం భారత్‌తో షిమ్లా ఒప్పందం తరువాత ఆ దేశ నేత అయిన జుల్ఫికర్ అలీ భుట్టో వేరే దేశాల నుండి విడి భాగాలు తెప్పించి పాకిస్తాన్‌లో న్యూక్లియర్ బాంబు తయారు చేయాలనుకుంటాడు. ఈ ఆపరేషన్‌కి ఐఎస్ఐ హెడ్ అయిన ముర్తజా మాలిక్‌ని నియమిస్తాడు. మాలిక్ ఆపరేషన్‌ని పాకిస్తాన్‌లోనే ఉన్న భారత గూఢచారి విష్ణు సర్వనాశనం చేస్తాడు. ఇదే నెట్‌ఫ్లిక్స్‌లో 6 ఎపిసోడ్లతో స్ట్రీమ్ అవుతున్న 'సారే జహా సే అచ్ఛా' సిరీస్ కథ. రెండు సిరీస్‌లు థ్రిల్లర్ జోనర్‌లో వచ్చినవే. చూసే ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేస్తాయనడంలో సందేహమే లేదు. చరిత్రలో కనుమరుగైన మన గూఢచారుల కథలు ఇవి. వర్త్‌ఫుల్ వాచ్.

– హరికృష్ణ ఇంటూరు



మనదే ఆసియా కప్

ప్రపంచ కప్ టోర్నీకి భారత పురుషుల హాకీ జట్టు అర్హత

ఆసియా కప్ ఫైనల్లో కొరియాపై 4-1తో విజయం ● టోర్నీని అజేయంగా ముగించిన టీమిండియా

రాజ్‌గిర్ (బిహార్): మ్యాచ్ **మ్యాచ్‌కూ రాటుదేలిన** భారత పురుషుల హాకీ జట్టు **అసలు సిసలు సమ**రంలోనూ తమ ఆధిపత్యాన్ని **చాటుకుంది. సొంత** గడ్డపై జరిగిన ఆసియా కప్ **టోర్నీలో హర్మన్‌ప్రీత్** సింగ్ నాయకత్వంలోని భారత **జట్టు చాంపియన్‌గా** నిలిచింది. ఆదివారం జరిగిన **ఫైనల్లో భారత జట్టు** 4-1 గోల్స్ తేడాతో డిఫెండింగ్ **చాంపియన్ దక్షిణ** కొరియా జట్టును ఓడించింది. **ఈ విజయంతో** ఆసియా కప్ విజేత హోదాలో... **భారత జట్టు వచ్చే** ఏడాది ఆగస్టులో బెల్జియం-నెదర్లాండ్స్‌లో జరిగే ప్రపంచ కప్ టోర్నీకి నేరుగా అర్హత సాధించింది. కొరియాతో జరిగిన ఫైనల్లో భారత్ తరఫున దిల్‌ప్రీత్ సింగ్ (28వ, 45వ నిమిషాల్లో) రెండు గోల్స్ చేయగా... సుఖ్‌జీత్ సింగ్ (1వ నిమిషంలో), అమిత్ రోహిదాస్ (50వ నిమిషంలో) ఒక్కో గోల్ సాధించారు. కొరియా జట్టుకు డెయిన్ సన్ (51వ నిమిషంలో) ఏకైక గోల్ అందించాడు. విజేతగా నిలిచిన భారత జట్టుకు హాకీ ఇండియా నజరానా ప్రకటించింది. జట్టులోని ప్రతి సభ్యుడికి రూ. 3 లక్షల చొప్పున... సహాయక సిబ్బందికి రూ. 1 లక్ష 50 వేల చొప్పున నగదు పురస్కారం అందజేయనుంది. ఆసియా కప్‌ను అత్యధికంగా ఐదుసార్లు నెగ్గిన కొరియా జట్టును ఏమాత్రం తక్కువ అంచనా వేయకుండా ఫైనల్లో భారత్ పక్కా వ్యూహంతో ఆడింది. తొలి నిమిషం నుంచే సమన్వయంతో కదులుతూ దాడులు చేసింది. ఫలితంగా తొలి నిమిషంలోనే భారత్ ఖాతా తెరిచింది. ఆ తర్వాత భారత్ జోరు కొనసాగించగా... ఆతిథ్య జట్టు దాడులను అడ్డుకోవడంలోనే కొరియాకు సమయం సరిపోయింది. మ్యాచ్ మొత్తం భారత్ ఒకేతీరుగా ఆడటంతో కొరియాకు తేరుకునే అవకాశం లేకుండా పోయింది. నాలుగు గోల్స్ సమర్పించుకున్నాక కొరియా ఖాతా తెరిచినా అప్పటికే ఆలస్యమైపోయింది. మ్యాచ్ మొత్తంలో భారత్‌కు రెండు పెనాల్టీ కార్నర్‌లు రాగా ఒక దానిని సద్వినియోగం చేసుకుంది. ఒక పెనాల్టీ స్ట్రోక్‌ను వృథా చేసింది. కొరియా జట్టుకు లభించిన మూడు పెనాల్టీ కార్నర్‌లలో ఒక దానిని గోల్‌గా మలిచింది. అంతకుముందు మూడో స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో మలేసియా 4-1తో చైనాపై గెలిచింది.

4 ఆసియా కప్ టైటిల్ సాధించడం భారత్‌కిది నాలుగోసారి. గతంలో భారత్ 2003, 2007, 2017లలో విజేతగా నిలిచింది. కొరియా అత్యధికంగా ఐదుసార్లు ఆసియా కప్ విజేతగా నిలిచింది.

164 తాజా ఆసియా కప్‌లో నమోదైన మొత్తం గోల్స్. ఇందులో 97 ఫీల్డ్ గోల్స్ కాగా... 59 పెనాల్టీ కార్నర్‌ల ద్వారా, 8 పెనాల్టీ స్ట్రోక్‌ల ద్వారా వచ్చాయి. మలేసియా ప్లేయర్ అఖిముల్లా 12 గోల్స్‌తో టోర్నీ టాప్ స్కోరర్‌గా నిలిచాడు. భారత్ తరఫున అభిషేక్, హర్మన్‌ప్రీత్, సుఖ్‌జీత్ 6 గోల్స్ చొప్పున చేశారు.

39 తాజా ఆసియా కప్‌లో అత్యధిక గోల్స్ చేసిన జట్టుగా భారత్ (39) నిలిచింది. ఈ టోర్నీలో భారత్ ఆరు మ్యాచ్‌ల్లో గెలిచి, ఒక మ్యాచ్‌ను 'డ్రా' చేసుకొని అజేయంగా నిలిచింది.

వన్డేల్లో అతిపెద్ద విజయం నమోదు చేసిన ఇంగ్లండ్ క్రికెట్ జట్టు
మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

చరిత్ర సృష్టించిన భారత బృందం

- ప్రపంచ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో తొలిసారి స్వర్ణం గెలిచిన భారత పురుషుల కాంపౌండ్ జట్టు
- 'మిక్స్‌డ్ టీమ్' ఈవెంట్‌లో రజతం గెలిచిన జ్యోతి సురేఖ-రిషభ్ జోడీ


స్వర్ణాలతో ప్రథమేశ్, అమన్, రిషభ్


రజత పతకాలతో జ్యోతి సురేఖ, రిషభ్

గ్వాంగ్‌జు (దక్షిణ కొరియా): ప్రపంచ ఆర్చరీ చాంపియన్‌షిప్ పురుషుల కాంపౌండ్ టీమ్ ఈవెంట్‌లో భారత పతక నిరీక్షణ ముగిసింది. ఈ మెగా ఈవెంట్ చరిత్రలో పురుషుల కాంపౌండ్ టీమ్ ఈవెంట్‌ను ప్రవేశపెట్టి మూడు దశాబ్దాలు అవుతున్నా భారత్ ఖాతాలో ఇన్నాళ్లు పతకం చేరలేదు. అందరి అంచనాలను తారుమారు చేస్తూ ఈసారి భారత బృందం ఏకంగా స్వర్ణ పతకాన్నే సొంతం చేసుకుంది. ఆదివారం జరిగిన కాంపౌండ్ పురుషుల టీమ్ ఈవెంట్‌లో రిషభ్ యాదవ్, అమన్ సైనీ, ప్రథమేశ్‌లతో కూడిన భారత జట్టు విజేతగా అవతరించింది. ఫైనల్లో రిషభ్, అమన్, ప్రథమేశ్ త్రయం 235-233తో గిరార్డ్, జీన్ ఫిలిప్, డుబోయిస్‌లతో కూడిన నెదర్లాండ్స్ జట్టును ఓడించింది. తొలి రౌండ్‌లో 'బై' పొందిన భారత జట్టు రెండో రౌండ్‌లో 232-232 (30-28) 'షూటౌట్'లో ఆస్ట్రేలియా జట్టుపై, క్వార్టర్ ఫైనల్లో 234-233తో అమెరికా జట్టుపై, సెమీఫైనల్లో 234-232తో టర్కీ జట్టుపై విజయం సాధించింది. మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి వెన్నం జ్యోతి సురేఖ రజత పతకం సొంతం చేసుకుంది. ఫైనల్లో జ్యోతి సురేఖ-రిషభ్ యాదవ్ జోడీ 155-157తో సానీ డి లాట్-మైక్ ష్లోస్సర్ (నెదర్లాండ్స్) ద్వయం చేతిలో ఓడిపోయింది.

తెలుగు టైటాన్స్‌కు రెండో విజయం



విశాఖ స్పోర్ట్స్: ప్రో కబడ్డీ లీగ్ 12వ సీజన్‌లో తెలుగు టైటాన్స్ రెండో విజయాన్ని సాధించింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 44-34తో బెంగాల్ వారియర్స్‌పై నెగ్గింది. టైటాన్స్ జట్టులో భరత్ 12, విజయ్ 11 పాయింట్లు సాధించారు. రెయిడర్ చేతన్ సాహు, డిఫెండర్ అంకిత్ చెరో 5 పాయింట్లు చేశారు. బెంగాల్ తరఫున కెప్టెన్ దేవాంక్ ఒంటరి పోరాటం చేసి 13 పాయింట్లు సాధించాడు. డిఫెండర్లలో నితీశ్ (6), ఆశిష్ (5) మెరుగ్గా ఆడారు. అనంతరం పోటాపోటీగా జరిగిన రెండో మ్యాచ్‌లో రెండుసార్లు విజేతగా నిలిచిన జైపూర్ పింక్ పాంథర్స్ 35-36తో దబంగ్ ఢిల్లీ చేతిలో ఓడిపోయింది. దబంగ్ కెప్టెన్ అషు మలిక్ 21 పాయింట్లు సాధించాడు. జైపూర్ తరఫున రెయిడర్లు నితిన్ (14), సాహిత్ (10) రాణించారు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో హరియాణాతో బెంగళూరు బుల్స్, పుణేరి పల్టన్‌తో పట్నా పైరేట్స్ తలపడతాయి.

సబలెంకాదే టైటిల్

- యూఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్ విజేతగా బెలారస్ స్టార్
- వరుసగా రెండో ఏడాది టైటిల్ గెలిచిన వరల్డ్ నంబర్‌వన్
- ఫైనల్లో అనిసిమోవాపై విజయం
- రూ. 44 కోట్ల 11 లక్షల ప్రైజ్‌మనీ సొంతం



న్యూయార్క్: ఈ ఏడాది మూడో ప్రయత్నంలో బెలారస్ స్టార్ అరీనా సబలెంకా 'గ్రాండ్' టైటిల్‌ను దక్కించుకుంది. టెన్నిస్ సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ యూఎస్ ఓపెన్... మహిళల సింగిల్స్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్ సబలెంకాకే టైటిల్ లభించింది. భారత కాలమానం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున ముగిసిన మహిళల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ సబలెంకా 94 నిమిషాల్లో 6-3, 7-6 (7/3)తో ఎనిమిదో సీడ్, ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ అమండ అనిసిమోవా (అమెరికా)పై గెలిచింది. ఈ ఏడాది ఆ్రస్టేలియన్ ఓపెన్ ఫైనల్లో మాడీసన్ కీస్ (అమెరికా) చేతిలో, ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో కోకో గాఫ్ (అమెరికా) చేతిలో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచిన 27 ఏళ్ల సబలెంకా... యూఎస్ ఓపెన్ ఫైనల్లో మాత్రం విజేతగా నిలిచింది. గతంలో అనిసిమోవా చేతిలో ఆరుసార్లు ఓడిపోయి, మూడుసార్లు మాత్రమే నెగ్గిన సబలెంకా కీలకమైన 'గ్రాండ్‌స్లామ్' ఫైనల్లో మాత్రం తన ఆధిపత్యాన్ని చాటుకుంది. ఈ ఏడాది రెండు గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్ పరాజయాల జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకోకుండా సాధికారిక ఆటతీరుతో అనిసిమోవా ఆటను కట్టించింది. మరోవైపు అనిసిమోవా వరుసగా రెండో గ్రాండ్‌స్లామ్ టోర్నీలోనూ రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకుంది. గత జూలైలో వింబుల్డన్ టోర్నీ ఫైనల్లో 0-6, 0-6తో స్వియాటెక్ (పోలాండ్) చేతిలో దారుణంగా ఓడిన అనిసిమోవా యూఎస్ ఫైనల్లో మాత్రం సబలెంకాకు గట్టిపోటీనే ఇచ్చింది. విజేత సబలెంకాకు 50 లక్షల డాలర్లు (రూ. 44 కోట్ల 11 లక్షలు), రన్నరప్ అనిసిమోవాకు 25 లక్షల డాలర్లు (రూ. 22 కోట్ల 5 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

ఎల్ఐసీ-హెచ్ఎఫ్ఎల్‌లో 192 అప్రెంటిస్‌లు

ఎల్ఐసీ-హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్(హెచ్ఎఫ్ఎల్) దేశంలోని అన్ని రాష్ట్రాలలో ఖాళీగా ఉన్న అప్రెంటిస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 192.
» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. 01.06.2021 నాటికి డిగ్రీ పూర్తి చేసి ఉండాలి.
» **వయసు:** 20 నుంచి 25 ఏళ్లు ఉండాలి.
» **స్టైపెండ్:** నెలకు రూ.12,000.
» **శిక్షణ కాలం:** 12 నెలలు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 02.09.2025.
» **పరీక్ష ఫీజు చెల్లించడానికి చివరితేది:** 24.09.2025
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 22.09.2025
» **ప్రవేశ పరీక్ష తేది:** 01.10.2025.
» **శిక్షణ ప్రారంభతేది:** 01.11.2025.
» **వెబ్‌సైట్:** www.lichousing.com

ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్శిటీలో పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్శిటీ 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి పీజీ,పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **కోర్సుల వివరాలు:** ఎంఎస్సీ, పీహెచ్‌డీ(అగ్రికల్చర్), పీహెచ్‌డీ(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్), పీహెచ్‌డీ(టెక్నాలజీ), పీహెచ్‌డీ(కమ్యూనిటీ సైన్స్).
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 03.09.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.09.2025.
» **ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 22.09.2025.
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://angrau.ac.in

చెస్, హైదరాబాద్‌లో 25 అప్రెంటిస్‌లు

హైదరాబాద్‌లోని డీఆర్‌డీవోకు చెందిన సెంటర్ ఫర్ హై ఎనర్జీ సిస్టమ్స్ అండ్ సైన్సెస్(చెస్)... గ్రాడ్యుయేట్, టెక్నీషియన్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 25.
» **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు-10, టెక్నీషియన్ అప్రెంటిస్‌లు-05, డిప్లొమా అప్రెంటిస్‌లు-10.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్,డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
» **స్టైపెండ్:** నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లకు రూ.9000, టెక్నీషియన్ అప్రెంటిస్‌లకు రూ.8000.
» **ఎంపిక విధానం:** అభ్యర్థుల మార్కుల శాతం, షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డైరెక్టర్ సెంటర్ ఫర్ హై ఎనర్జీ సిస్టమ్స్ అండ్ సైన్సెస్(చెస్) డీఆర్‌డీవో, ఆర్‌సీఐ క్యాంపస్, హైదరాబాద్ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 22.09.2025.
» **వెబ్‌సైట్:** https://drdo.gov.in

డీపీసీసీ, ఢిల్లీలో 14 పోస్టులు

ఢిల్లీ పొల్యూషన్ కంట్రోల్ కమిటీ(డీపీసీసీ).. రెగ్యులర్ ప్రాతిపదికన గ్రూప్-ఏ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 14.
» **పోస్టుల వివరాలు:** సీనియర్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్-05, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్-05, సైంటిస్ట్ సి-01, సైంటిస్ట్ బి-02, ప్రోగ్రామర్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ, డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** సీనియర్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్‌కు 50 ఏళ్లు, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్, సీనియర్ సైంటిస్ట్‌కు 40 ఏళ్లు, ప్రోగ్రామర్, సైంటిస్ట్-బికి 35 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.15,600 నుంచి 39,100.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, డీపీసీసీ, మూడో ఫ్లోర్, బ్లాక్-1, డీఎంఆర్‌సీ ఐటీ పార్క్ బిల్డింగ్, శాస్త్రి పార్క్, ఢిల్లీ-110053 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 24.09.2025.
» **వెబ్‌సైట్:** https://dpcc.delhigovt.nic.in

గ్రామీణ బ్యాంకుల్లో కొలువుల మేళ

» ఆర్‌ఆర్‌బీలో 13,217 పోస్టులకు ఐబీపీఎస్ నోటిఫికేషన్
» ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూలో ప్రతిభతో ఎంపిక


బ్యాంక్ జాబ్స్

రీజనల్ రూరల్ బ్యాంకు(ఆర్ఆర్‌బీ)ల్లో కొలువుల నగారా మోగింది. దేశవ్యాప్తంగా ఉన్న 28 గ్రామీణ బ్యాంకుల్లో 13,217 ఉద్యోగాల భర్తీకి ఐబీపీఎస్ (ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్) నోటిఫికేషన్ వెలువడింది. వీటిల్లో ఆఫీస్ అసిస్టెంట్(క్లర్క్), ఆఫీసర్ పోస్టులు ఉన్నాయి. ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులకు ప్రిలిమ్స్, మెయిన్స్ ద్వారా, ఆఫీసర్ పోస్టులకు ప్రిలిమ్స్, మెయిన్స్‌తో పాటు ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు. ఈ నేపథ్యంలో.. ఆర్‌ఆర్‌బీల్లో ఉద్యోగాలు, అర్హతలు, ఎంపిక విధానంపై ప్రత్యేక కథనం..

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ (ఐబీపీఎస్) సంస్థ.. రీజనల్ రూరల్ బ్యాంక్స్(ఆర్ఆర్‌బీ)లో గ్రూప్-ఏ, గ్రూప్-బీ పోస్టుల భర్తీకి ఆర్ఆర్‌బీ XIV నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- మొత్తం పోస్టుల సంఖ్య: 13,217.

పోస్టుల వివరాలు

ఆఫీస్ అసిస్టెంట్స్ (మల్టీపర్పస్)-7,972 పోస్టులు, ఆఫీసర్ స్కేల్-I(అసిస్టెంట్ మేనేజర్)-3,907, ఆఫీసర్ స్కేల్-II(అగ్రికల్చర్ ఆఫీసర్)-50, ఆఫీసర్ స్కేల్-II(లా)-48, ఆఫీసర్ స్కేల్-II (సీఏ)-69, ఆఫీసర్ స్కేల్-II(ఐటీ)-87, ఆఫీసర్ స్కేల్-II(జనరల్ బ్యాంకింగ్ ఆఫీసర్)-854, ఆఫీసర్ స్కేల్-II (మార్కెటింగ్ ఆఫీసర్)-15, ఆఫీసర్ స్కేల్-II (ట్రెజరీ మేనేజర్)-16, ఆఫీసర్ స్కేల్-III-199 పోస్టులు.

తెలుగు రాష్ట్రాల్లో ఖాళీలు

950(తెలంగాణలో 450 ఆఫీస్ అసిస్టెంట్లు, 348 ఆఫీసర్ పోస్టులు; ఆంధ్రప్రదేశ్‌లో 150 ఆఫీస్ అసిస్టెంట్లు, 2 ఆఫీసర్ పోస్టులు ఉన్నాయి)

అర్హత

పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో 50 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ, ఎంబీఏ, సీఏ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం, స్థానిక భాషలో ప్రావీణ్యం, కంప్యూటర్ నాలెడ్జ్ తదితర అర్హతలు ఉండాలి.

వయసు

ఆఫీస్ అసిస్టెంట్‌కు 18 నుంచి 28 ఏళ్లు, ఆఫీసర్ స్కేల్-I కు 18 నుంచి 30 ఏళ్లు, ఆఫీసర్ స్కేల్IIకు 21 నుంచి 32 ఏళ్లు, ఆఫీసర్ స్కేల్-IIIకు 21 నుంచి 40 ఏళ్లు ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్ల గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

ఎంపిక విధానం

- **ఆఫీస్ అసిస్టెంట్:** ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్ష, ఆన్‌లైన్ మెయిన్ పరీక్ష నిర్వహిస్తారు. వీటికి ఇంటర్వ్యూ ఉండదు. ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన వారిని షార్ట్‌లిస్ట్ చేసి మెయిన్ పరీక్షకు అనుమతిస్తారు. మెయిన్ పరీక్షలో ప్రతిభ ఆధారంగా తుది ఎంపిక చేస్తారు.
- **ఆఫీసర్ స్కేల్-I:** ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్ష, ఆన్‌లైన్ మెయిన్స్ పరీక్షతోపాటు ఇంటర్వ్యూ కూడా ఉంటుంది. ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన వారిని షార్ట్‌లిస్ట్ చేసి మెయిన్ పరీక్షకు అనుమతిస్తారు. మెయిన్ పరీక్షలో ప్రతిభ ఆధారంగా ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. మెయిన్‌తోపాటు ఇంటర్వ్యూలో చూపిన ప్రతిభ ఆధారంగా తుది ఎంపిక చేపడతారు.
- **ఆఫీసర్ స్కేల్-II - III:** సింగిల్ ఆన్‌లైన్ పరీక్ష ఉంటుంది. ఇందులో అర్హత సాధించిన వారికి ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.

ప్రిలిమినరీ పరీక్ష విధానం

ఆఫీస్ అసిస్టెంట్(మల్టీపర్పస్) పోస్టులకు నిర్వహించే ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్ష ఆబ్జెక్టివ్ తరహాలో 80 ప్రశ్నలు-80 మార్కులకు ఉంటుంది. ఇందులో రీజనింగ్ విభాగంలో 40 ప్రశ్నలు-40 మార్కులకు, న్యూమరికల్ ఎబిలిటీ 40 ప్రశ్నలు-40 మార్కులకు ఉంటాయి. పరీక్ష సమయం 45 నిమిషాలు.

ఆఫీసర్ స్కేల్ 1 పోస్టులకు నిర్వహించే ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్ష ఆబ్జెక్టివ్ తరహాలో 80 ప్రశ్నలు-80 మార్కులకు ఉంటుంది. ఇందులో రీజనింగ్ విభాగంలో 40 ప్రశ్నలు-40 మార్కులకు, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ 40 ప్రశ్నలు-40 మార్కులకు ఉంటాయి. పరీక్ష సమయం 45 నిమిషాలు.

మెయిన్ పరీక్ష విధానం

ఆఫీస్ అసిస్టెంట్(మల్టీపర్పస్) పోస్టులకు నిర్వహించే ఆన్‌లైన్ మెయిన్ పరీక్ష ఆబ్జెక్టివ్ తరహాలో 200 ప్రశ్నలు-200 మార్కులకు ఉంటుంది. ఇందులో రీజనింగ్ 40 ప్రశ్నలు-50 మార్కులకు, న్యూమరికల్ ఎబిలిటీ 40 ప్రశ్నలు-50 మార్కులకు, కంప్యూటర్ నాలెడ్జ్ 40 ప్రశ్నలు-20 మార్కులకు, జనరల్ అవేర్‌నెస్ 40 ప్రశ్నలు-40 మార్కులకు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 40 ప్రశ్నలు-40 మార్కులకు, హిందీ లాంగ్వేజ్ 40 ప్రశ్నలు-40 మార్కులకు ఉంటాయి. పరీక్ష సమయం 120 నిమిషాలు.

ఆఫీసర్ స్కేల్1 పోస్టులకు నిర్వహించే ఆన్‌లైన్ మెయిన్ పరీక్ష ఆబ్జెక్టివ్ తరహాలో 200 ప్రశ్నలు-200 మార్కులకు ఉంటుంది. ఇందులో రీజనింగ్ 40 ప్రశ్నలు-50 మార్కులకు, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ 40 ప్రశ్నలు-50 మార్కులకు, కంప్యూటర్ నాలెడ్జ్ 40 ప్రశ్నలు-20 మార్కులకు, జనరల్ అవేర్‌నెస్ 40 ప్రశ్నలు-40 మార్కులకు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 40 ప్రశ్నలు-40 మార్కులకు, హిందీ లాంగ్వేజ్ 40 ప్రశ్నలు-40 మార్కులకు ఉంటాయి. పరీక్ష సమయం 120 నిమిషాలు.

ఆఫీసర్ స్కేల్2(జనరల్ బ్యాంకింగ్) పోస్టులకు నిర్వహించే ఆన్‌లైన్ మెయిన్ పరీక్ష ఆబ్జెక్టివ్ తరహాలో 200 ప్రశ్నలు-200 మార్కులకు ఉంటుంది. ఇందులో రీజనింగ్ 40 ప్రశ్నలు-50 మార్కులకు, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ 40 ప్రశ్నలు-50 మార్కులకు, కంప్యూటర్ నాలెడ్జ్ 40 ప్రశ్నలు-20 మార్కులకు, ఫైనాన్షియల్ అవేర్‌నెస్ 40 ప్రశ్నలు-40 మార్కులకు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 40 ప్రశ్నలు-40 మార్కులకు,హిందీ లాంగ్వేజ్ 40ప్రశ్నలు-40 మార్కుల కు ఉంటాయి.పరీక్ష సమయం 120 నిమిషాలు.

ఆఫీసర్ స్కేల్2(స్పెషలిస్ట్ కేడర్) పోస్టులకు నిర్వహించే ఆన్‌లైన్ మెయిన్ పరీక్ష ఆబ్జెక్టివ్ తరహాలో 240 ప్రశ్నలు-200 మార్కులకు ఉంటుంది. ఇందులో రీజనింగ్ 40 ప్రశ్నలు-40 మార్కులకు, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ 40 ప్రశ్నలు-40 మార్కులకు, కంప్యూటర్ నాలెడ్జ్ 40 ప్రశ్నలు-20 మార్కులకు, ఫైనాన్షియల్ అవేర్‌నెస్ 40 ప్రశ్నలు-40 మార్కులకు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 40 ప్రశ్నలు-20 మార్కులకు, హిందీ లాంగ్వేజ్ 40 ప్రశ్నలు-20 మార్కులకు, ప్రొఫెషనల్ నాలెడ్జ్ 40 ప్రశ్నలు-40 మార్కులకు ఉంటాయి. పరీక్ష సమయం 150 నిమిషాలు.

ఆఫీసర్ స్కేల్3 పోస్టులకు నిర్వహించే ఆన్‌లైన్ మెయిన్ పరీక్ష ఆబ్జెక్టివ్ తరహాలో 200 ప్రశ్నలు-200 మార్కులకు ఉంటుంది. ఇందులో రీజనింగ్ 40 ప్రశ్నలు-50 మార్కులకు, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ 40 ప్రశ్నలు-50 మార్కులకు, కంప్యూటర్ నాలెడ్జ్ 40 ప్రశ్నలు-20 మార్కులకు, ఫైనాన్షియల్ అవేర్‌నెస్ 40 ప్రశ్నలు-40 మార్కులకు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 40 ప్రశ్నలు-40 మార్కులకు, హిందీ లాంగ్వేజ్ 40 ప్రశ్నలు-40 మార్కులకు ఉంటాయి. పరీక్ష సమయం 120 నిమిషాలు.

నెగిటివ్ మార్కుల నిబంధన

ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్ పరీక్షల్లో నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి సదరు ప్రశ్నకు కేటాయించిన మార్కుల్లో 1/4 వంతు మార్కులను తగ్గిస్తారు.

సిలబస్-ప్రిపరేషన్ ఇలా

- ఇంగ్లిష్ లాంగ్వేజ్‌లో.. ఇడియమ్స్, సెంటెన్స్ కరెక్షన్, వొకాబ్యులరీ, సెంటెన్స్ రీ అరేంజ్‌మెంట్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూట్స్‌పై అవగాహన పెంచుకోవాలి. ఇంగ్లిష్ వొకాబ్యులరీపై పట్టు సాధించాలి. ఇంగ్లిష్ దినపత్రికలు చదవడం, ఇంగ్లిష్ న్యూస్ చానల్స్ వినడం ద్వారా భాషను మెరుగుపరచుకోవాలి.
- న్యూమరికల్ ఎబిలిటీ విభాగం కోసం అర్థమెటిక్ అంశాలైన పర్సంటేజెస్, నిష్పత్తులు, లాభ-నష్టాలు, నంబర్ సిరీస్, బాడ్‌మాస్ నియమాలను ప్రాక్టీస్ చేయాలి. గత పరీక్షలు, వెయిటేజీని దృష్టిలో పెట్టుకొని డేటా ఇంటర్‌ప్రిటేషన్, అనాలిసిస్‌లపై ప్రత్యేకంగా ఫోకస్ చేయాలి.
- రీజనింగ్ విభాగంలో.. మార్కుల సాధనకు కోడింగ్ - డీకోడింగ్, బ్లడ్ రిలేషన్స్, డైరెక్షన్, సిలాజిజమ్ విభాగాలను బాగా ప్రాక్టీస్ చేయాలి. పాత ప్రశ్న పత్రాల సాధన మేలు చేస్తుంది.
- జనరల్/ఎకనామిక్/ ఫైనాన్షియల్ అవేర్‌నెస్‌లో స్కోర్ కోసం బ్యాంకింగ్ రంగం పరిణామాలు, విధానాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. బ్యాంకింగ్ రంగంలోని అబ్రివేషన్లు, పదజాలం, విధులు, బ్యాంకులకు సంబంధించిన కొత్త విధానాలు, కోర్ బ్యాంకింగ్‌కు సంబంధించి చట్టాలు, విధానాలు, రిజర్వ్ బ్యాంకు విధులపై అవగాహన ఏర్పరచుకోవాలి.
- జనరల్ అవేర్‌నెస్‌లో.. కరెంట్ అఫైర్స్, స్టాక్ జనరల్ నాలెడ్జ్ , ఆర్థిక సంబంధ వ్యవహారాలు (ఎకానమీ, ప్రభుత్వ పథకాలు)పై అవగాహన పెంచుకోవాలి.
- కంప్యూటర్ నాలెడ్జ్‌లో .. కంప్యూటర్ ఆపరేషన్ సిస్టమ్స్, కంప్యూటర్ స్ట్రక్చర్, ఇంటర్నెట్ సంబంధిత అంశాలు, పదజాలంపై దృష్టి పెట్టాలి. కీ బోర్డ్ షాట్ కట్స్, కంప్యూటర్ హార్డ్‌వేర్ సంబంధిత అంశాలు (సీపీయూ, మానిటర్, హార్డ్ డిస్క్ తదితర) గురించి తెలుసుకోవాలి.
- క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్/ డేటా ఇంటర్‌ప్రిటేషన్ విభాగంలో రాణించాలంటే.. అర్థమెటిక్ అంశాలతోపాటు క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, సింప్లిఫికేషన్స్, అప్రాక్సిమేషన్స్ అంశాలను అధ్యయనం చేయాలి.
- ప్రొఫెషనల్ నాలెడ్జ్‌లో మార్కుల కోసం అకడమిక్ అర్హతలకు సంబంధించిన అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 01.09.2025.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 21.09.2025.
- ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్ష: నవంబర్/డిసెంబర్ 2025
- ఆన్‌లైన్ మెయిన్ పరీక్ష: డిసెంబర్ 2025/ఫిబ్రవరి 2026
- వెబ్‌సైట్: https://ibps.in

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం-భౌతిక శాస్త్రం
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-తెలంగాణ హిస్టరీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం-రీజనింగ్

స్టాక్ మార్కెట్లు

(శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సూచీ		పాయింట్లు	ముగింపు
సెన్సెక్స్	▽	7	80,711
నిఫ్టీ	△	7	24,741

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	21,700	▽	7
డోజోన్స్	45,401	▽	220
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,208	▽	9
డాక్స్	23,597	▽	173
షాంఘై	3,813	△	46
నికాయ్	43,019	△	438

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ధామస్‌కుక్	87.90	88.72
£	బ్రిటన్ పౌండ్	ధామస్‌కుక్	116.40	119.37
€	యూరో	ధామస్‌కుక్	101.20	103.95
¥	జపాన్ యెన్ (100)	ధామస్‌కుక్	59.00	60.51
AU$	ఆస్ట్రేలియా డాలర్	ధామస్‌కుక్	56.37	58.63
S$	సింగపూర్ డాలర్	ధామస్‌కుక్	66.08	69.80
SAR	సౌదీ రియాల్	ధామస్‌కుక్	22.60	24.10
UAE D	యూఏఈ దిర్హామ్	ధామస్‌కుక్	23.10	24.34
¥	చైనా యువాన్	ధామస్‌కుక్	11.45	13.28

వాహన బీమా.. కావాలి ధీమా!

థర్డ్ పార్టీ ప్లాన్‌లో సొంత నష్టానికి పరిహారం రాదు • కాంప్రహెన్సివ్ పాలసీలోనే మెరుగైన రక్షణలు
అందుబాటులో ఎన్నో యాడాన్ ప్లాన్‌లు • వీటితో ఆర్థిక భారం తగ్గించుకోవచ్చు
రక్షణలు, మినహాయింపులను సమగ్రంగా తెలుసుకోవాలి



మేఘాలకు చిల్లులు పడ్డాయా! అన్నట్టు స్వల్ప వ్యవధిలోనే వర్షాలు కుమ్మేయడం ఇటీవలి కాలంలో సాధారణమైపోయింది. గంటలో 10 సెంటీమీటర్లకు పైగా పడుతున్న వర్షంతో హైదరాబాద్, ముంబై సహా ఎన్నో నగరాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం చూస్తున్నాం. వర్షాలు, వరదల కారణంగా వాహనాలు దెబ్బతిని ఆర్థిక నష్టం ఎదురైతే..? బైక్ లేదా కారు ఇంజన్ దెబ్బతింటే..? అలాంటి సందర్భంలో థర్డ్ పార్టీ బీమా కవరేజీ ఉన్నా, ఎందుకూ ఉపయోగపడదు. కావాల్సింది సమగ్ర కవరేజీతో కూడిన బీమా పాలసీ. ఇది లేకపోతే ఎదురయ్యే నష్టాన్ని సొంతంగా భరించాల్సి వస్తుంది. అందుకే వాహన బీమా పాలసీ తీసుకునే ముందు పరిశీలించాల్సిన విషయాలు బోలెడు ఉన్నాయి.

– సాక్షి, బిజినెస్ డెస్క్

మెరుగైన ఆదాయం నేపథ్యంతో మన దేశంలో కార్లు కొనే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. 2024–25లో 43 లక్షల కార్లు అమ్ముడుపోయాయి. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలోనూ 42 లక్షల కార్లు అమ్ముడయ్యాయి. ద్విచక్ర వాహన అమ్మకాలు 2024–25లో ఏకంగా 1.9 కోట్లకు చేరాయి. కానీ, వాహనం కొనేటప్పుడు ఎక్కువ మంది చేస్తున్న పెద్ద తప్పు.. డీలర్ ఇచ్చే థర్డ్ పార్టీ ఆటో ఇన్సూరెన్స్ ప్లాన్‌తో సరిపెట్టుకోవడం. తొలిసారి వాహనం కొనుగోలు చేస్తున్న వారే కాదు, కొత్త వాహనానికి మారుతున్న వారిలోనూ ఎక్కువ మంది థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ ప్లాన్‌కే పరిమితమవుతున్నారు. ఎందుకంటే మోటారు వాహ న చట్టం ప్రకారం.. థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ కవర్ తీసుకోవడం తప్పనిసరి. కారు అయితే మూడేళ్లు, టూవీలర్ అయితే ఐదేళ్ల కాలానికి థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్‌ను కొనుగోలు సమయంలోనే తీసుకోవాల్సి ఉంటుంది. కాంప్రహెన్సివ్ ఇన్సూరెన్స్ (సమగ్ర బీమా) తప్పనిసరి కాదు. దీంతో చాలా మంది వాహనదారులు అనవసర ఖర్చు ఎందుకని భావించి థర్డ్‌పార్టీ కవరేజీకి పరిమితమవుతున్నారు.

థర్డ్ పార్టీ.. సొంతానికి రాజీ

థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ అన్నది.. తన వాహనం కారణంగా మరో వ్యక్తికి (మూడో పక్షం/థర్డ్ పార్టీ) గాయాలు కావడం లేదా మరణానికి దారితీయడం లేదా మూడో పార్టీకి చెందిన ప్రాపర్టీకి నష్టం కలిగించిన సందర్భాల్లో పరిహారం చెల్లించడానికి పరిమితమవుతుంది. వాహనదారుడు గాయపడడం లేదా సొంత వాహనానికి నష్టం ఏర్పడితే ఈ ప్లాన్‌లో పరిహారం రాదు. ఇందుకు థర్డ్ పార్టీతోపాటు ఓన్ డ్యామేజ్ పాలసీ కూడా ఉండాలి. కాంప్రహెన్సివ్ ఆటో ఇన్సూరెన్స్ ప్లాన్‌లో ఇవన్నీ ఉంటాయి. స్టాండర్డ్ కాంప్రహెన్సివ్ పాలసీలో వరదల వల్ల కారు లేదా బైక్ ఇంజన్‌కు నష్టం వాటిల్లితే పరిహారం లభిస్తుంది. కానీ, ఇందులో తిరకాసు ఉంది. వర్షపు నీటిలో మునిగినప్పుడు ఇంజన్‌ను స్టార్ట్ చేయడం కారణంగా ఇంజన్‌కు నష్టం వాటిల్లితే పరిహారం రాదు. నీటి వల్ల ఇంజన్‌కు సహజంగా నష్టం జరిగితేనే పరిహారం వస్తుంది. నీటిలో మునిగినప్పుడు ఇంజన్‌ను ఆన్ చేయడానికి ప్రయత్నించడం వల్ల ఇంజన్‌లోని కంబషన్ చాంబర్‌లోకి నీరు ప్రవేశిస్తుంది. దీంతో లోపలి విడిభాగాలు దెబ్బతింటాయి. దీన్ని హైడ్రోస్టాటిక్ లాక్‌గా చెబుతారు. ఇక్కడ పాలసీ దారుడు మొదటి పార్టీ, బీమా సంస్థ రెండో పార్టీ అవుతుంది.

ఇంజన్ ప్రొటెక్షన్ కవర్



నీటిలో మునిగినప్పుడు ఇంజన్‌ను స్టార్ట్ చేయడానికి ప్రయత్నించడం వల్ల జరిగే నష్టానికి కూడా పరిహారం కావాలంటే అప్పుడు కాంప్రహెన్సివ్ పాలసీకి అదనంగా ఇంజన్ ప్రొటెక్షన్ కవర్‌ను జోడించుకోవాలి. ఇంజన్ ప్రొటెక్షన్ కవరేజీ ఉంటే అప్పుడు వరద నీటి కారణంగా ఇంజన్‌కు, గేర్ బాక్స్‌కు నష్టం ఏర్పడితే మరమ్మతులకు అయ్యే అధిక వ్యయాలను బీమా సంస్థ చెల్లిస్తుంది. రీపెయిర్ చేయలేని విధంగా దెబ్బతింటే కొత్త ఇంజన్, గేర్ బాక్స్‌కు అయ్యే వ్యయాలను నిబంధనల మేరకు చెల్లిస్తుంది. కనుక రెగ్యులర్ పాలసీకి అదనంగా ఇంజన్ ప్రొటెక్షన్ కవర్ కూడా తీసుకోవాలి. ప్రీమియం కొంత పెరిగినప్పటికీ.. ఊహించని పరిస్థితుల్లో ఆర్థిక నష్టాన్ని నివారిస్తుంది. ఇంజన్‌కు మరమ్మతులు సొంతంగా చేయించుకోవాలంటే భారీగానే ఖర్చవుతుంది. 'వాహనాలు అత్యాధునిక టెక్నాలజీతో వస్తున్నాయి. ఎలక్ట్రిక్, డీజిల్, పెట్రోల్ అన్నదానితో సంబంధం లేకుండా అవి కీలక ఆస్తులుగా మారుతున్నాయి. వాటికి రక్షణ కల్పించుకోవాలి. సమగ్ర బీమా రక్షణతో మానసికంగా నిశ్చింత ఏర్పడుతుంది' అని పాలసీబజార్ మోటార్ ఇన్సూరెన్స్ బిజినెస్ హెడ్ పరాస్ పస్రిచా తెలిపారు.

జీరో డిప్రీసియేషన్ కవర్



వాహనంలోని విడిభాగాలు వాడుకలో కొంత కాలానికి విలువను కోల్పోతుంటాయి. క్లెయిమ్ చేసినప్పుడు ఆ మేరకు విలువలో బీమా సంస్థలు కోత పెడతాయి. ప్రమాదం కారణంగా ఏదైనా విడిభాగం దెబ్బతిని దాన్ని పూర్తిగా మార్చుకోవాల్సి వస్తే, అప్పుడు పూర్తి పరిహారం రాక, కొంత జేబు నుంచి ఖర్చు చేయాల్సి వస్తుంది. జీరో డిప్రీషియేషన్ కవర్ ఉంటే విడిభాగం మార్పిడి ఖర్చును బీమా సంస్థే చెల్లిస్తుంది.

రిటర్న్ టు ఇన్‌వాయిస్



ఈ యాడాన్ కవర్ తీసుకుంటే.. వాహనం చోరీకి గురైనా లేక ప్రమాదంలో పూర్తిగా దెబ్బతిని మరమ్మతులు చేయలేని సందర్భంలో తిరిగి వాహనం కొనుగోలు, పన్నులు, రిజిస్ట్రేషన్‌కు అయ్యే చార్జీలన్నింటినీ బీమా కంపెనీ నుంచి పొందొచ్చు. ఈ సందర్భంగా 'ఇన్సూర్డ్ డిక్లేర్డ్ వ్యాల్యూ' (ఐడీవీ) గురించి తెలుసుకోవాలి. వాహనం చోరీకి గురైనప్పుడు లేదా ప్రమాదం వల్ల మరమ్మతులు చేయలేని స్థితిలో వాహనం ధరతో సంబంధం లేకుండా ఐడీవీనే బీమా సంస్థ చెల్లిస్తుంది.

రోడ్ సైడ్ అసిస్టెన్స్



ప్రయాణంలో ఉన్నట్టుండి బైక్ లేదా కారు మొరాయించొచ్చు. ఎంత ప్రయత్నించినా అది స్టార్ట్ అవ్వకపోతే అప్పుడు రోడ్‌సైడ్ అసిస్టెన్స్ కవర్ ఆదుకుంటుంది. అంతేకాదు రోడ్డు ప్రమాదం కారణంగా వాహనం దెబ్బతిని నిలిచిపోయిన సందర్భంలోనూ సాయపడుతుంది. వారంలో అన్ని రోజులూ, రోజులో అన్ని సమయాల్లోనూ ఈ సదుపాయాన్ని బీమా సంస్థలు ఆఫర్ చేస్తున్నాయి. బైక్ లేదా కారును సమీపంలోని మరమ్మతుల కేంద్రానికి (సర్వీసింగ్ సెంటర్)కు తరలిస్తారు. ఇందుకయ్యే ఖర్చును బీమా కంపెనీయే పెట్టుకుంటుంది. సుదూర ప్రయాణాలు చేసే వారికి ఈ కవరేజీ అనుకూలం. సాధారణంగా వాహనం మొరాయించిన ప్రదేశం నుంచి 50 కిలోమీటర్ల పరిధిలో (ఒక్కొక్క కంపెనీ ఒక్కో పరిమితి)ని కేంద్రానికి టోయింగ్ వాహనంపై తరలిస్తాయి. చిన్న సమస్య అయితే కొన్ని సందర్భాల్లో మెకానిక్‌ను పంపించి అక్కడికక్కడే పరిష్కారం చూపిస్తుంటాయి.

న్యాయ సాయం



ఇది కూడా ఐచ్ఛిక కవరేజీయే. ప్రమాదం అనంతరం ఎదురయ్యే న్యాయ సమస్యలకు సంబంధించి సాయాన్ని దీని కింద ఉచితంగా పొందొచ్చు. ప్రమాదం వల్ల నేరాభియోగాలు ఎదుర్కోవాల్సి వస్తే లాయర్ సేవలకు అయ్యే చార్జీలను బీమా కంపెనీ చెల్లిస్తుంది.

డైలీ అలవెన్స్ కవర్



ప్రమాదం లేదా ప్రకృతి విపత్తుల కారణంగా వాహనానికి మరమ్మతులు అవసరమై గ్యారేజీకి వెళ్లిందనుకోండి. వాహన మరమ్మతులు పూర్తయ్యే వరకు రోజువారీగా రూ.500–1,500 వరకు నగదు ప్రయోజనం పొందొచ్చు. దీనివల్ల ప్రత్యామ్నాయ రవాణా కోసం అయ్యే ఖర్చులను భర్తీ చేసుకోవచ్చు.

బ్యాటరీకి రక్షణ



ఎలక్ట్రిక్ స్కూటర్ లేదా బైక్ బ్యాటరీ దెబ్బతింటే రూ.50,000 వరకు ఖర్చు అవుతుంది. అదే ఎలక్ట్రిక్ కారులో బ్యాటరీ మార్చుకునేందుకు కొన్ని రెట్లు అధికంగా ఖర్చు చేయాల్సి వస్తుంది. తయారీ లోపాలు లేదా వాడుకలో భాగంగా బ్యాటరీ దెబ్బతింటే స్టాండర్డ్ ఆటో ఇన్సూరెన్స్‌లో పరిహారం రాదు. కనుక బ్యాటరీ ప్రొటెక్షన్ కవర్‌ను జోడించుకుంటే.. ఉన్నట్టుండి బ్యాటరీ విఫలమైతే మరమ్మతులు లేదా కొత్త బ్యాటరీ ఏర్పాటుకు అయ్యే వ్యయాలను పొందొచ్చు.

ఇతర యాడాన్‌లు



ఇవి కాకుండా కన్స్యూమబుల్స్, టైర్ ప్రొటెక్టర్, క్లచ్ ప్రొటెక్టర్ తదితర యాడాన్ కవర్‌లు అందుబాటులో ఉన్నాయి. తమ అవసరాలకు అనుకూలంగా ఉన్న వాటిని, ప్రీమియం ఆధారంగా ఎంపిక చేసుకోవచ్చు.

వ్యక్తిగత వస్తువులు పోతే..



కాంప్రహెన్సివ్ కారు పాలసీలో కారు చోరీకి గురైతే ఇన్సూర్డ్ డిక్లేర్డ్ వ్యాల్యూ ప్రకారం బీమా సంస్థ చెల్లింపులు చేస్తుంది. కానీ, కారులో ఉన్న విలువైన వస్తువులకు సైతం పరిహారం కోరుకునే వారు ఈ యాడాన్ పాలసీ తీసుకోవచ్చు.

ఇవి గమనించాలి..

- ముఖ్యంగా వరద నీటికి అవకాశం ఉన్న పల్లపు ప్రాంతాల్లో నివసించే వారు, ఆయా ప్రాంతాల మీదుగా రవాణా చేసే వారు ఇంజన్ ప్రొటెక్షన్ కవర్‌ను తప్పకుండా తీసుకోవాలి.
- పాలసీ తీసుకునే ముందు అందులో కవరేజీ సదుపాయాలు, మినహాయింపులతోపాటు ఏవైనా తగ్గింపులు ఉన్నాయా? అని సమగ్రంగా తెలుసుకోవాలి. ఇతర ప్లాన్లలోని ఫీచర్లతో పోల్చి చూసుకున్న తర్వాత మెరుగైన బీమా పాలసీని తీసుకోవాలి. వాహన డీలర్ ఆఫర్ చేసే ప్లాన్లలో ఫీచర్ల వివరాలను ఆయా కంపెనీల వెబ్‌సైట్లకు వెళ్లి తెలుసుకోవచ్చు. కేవలం ప్రీమియం కాకుండా రక్షణ సదుపాయాలను గమనించాలి.
- వాహనానికి ఎలాంటి కవరేజీ అవసరం అన్నది తెలుసుకున్న తర్వాతే కొనుగోలుకు వెళ్లాలి.
- కొనుగోలు సమయంలో కొందరు సరైన వివరాలు ఇవ్వడం లేదు. దీనివల్ల తర్వాత క్లెయిమ్ తిరస్కరణ ఎదురుకావొచ్చు.
- ముఖ్యంగా జీరో డిప్రీసియేషన్, ఇంజన్ ప్రొటెక్షన్, రోడ్‌సైడ్ అసిస్టెన్స్, రిటర్న్ టు ఇన్‌వాయిస్ కవర్‌లను జోడించుకోవడం ఎంతో అవసరం.
- తక్కువ ఖర్చు అయ్యే భాగాలకు ప్రత్యేకంగా యాడాన్‌లు అవసరం లేదు.
- నో క్లెయిమ్ బోనస్ ఆఫర్ చేసే ప్లాన్‌ను పరిశీలించొచ్చు. దీనివల్ల ఒక సంవత్సరంలో ఎలాంటి క్లెయిమ్ లేనప్పుడు రెన్యువల్ ప్రీమియంపై తగ్గింపు లభిస్తుంది.

వినియోగం వృద్ధితో అధిక ఆదాయం

జీఎస్‌టీ సంస్కరణలపై
ఆర్థిక మంత్రి సీతారామన్ స్పందన

న్యూఢిల్లీ: జీఎస్‌టీ ఇటీవలి సంస్కరణలతో వినియోగం పుంజుకుని, మెరుగైన ఆదాయానికి బాటలు వేస్తుందన్న ఆశాభావాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వ్యక్తం చేశారు. తద్వారా జీఎస్‌టీ రేట్ల క్రమబద్ధీకరణతో ఏర్పడే రూ.48,000 ఆదాయ లోటు భర్తీ అవుతుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు. జీడీపీ వృద్ధికి బలాన్నిస్తుందన్నారు. మొదటి త్రైమాసికంలో (జూన్ క్వార్టర్) బలమైన వృద్ధి రేటు నమోదు కావడం, చరిత్రాత్మక జీఎస్‌టీ సంస్కరణలతో.. పూర్తి ఆర్థిక సంవత్సరానికి 6.3–6.8 శాతం అంచనాలను అధిగమిస్తామని ప్రకటించారు.జీఎస్‌టీలో 12%, 28% జీఎస్‌టీ శ్లాబులను ఎత్తివేస్తూ.. అందులోని మెజారిటీ ఉత్పత్తులను 5, 18 శాతం శ్లాబుల్లోకి మార్చుతూ గత వారం జీఎస్‌టీ కౌన్సిల్ సమావేశం నిర్ణయించడం తెలిసిందే. దీన్ని ప్రజా సంస్కరణగా మంత్రి సీతారామన్ అభివర్ణించారు. దీనివల్ల ప్రతి కుటుంబానికీ ప్రయోజనం దక్కుతుందన్నారు. రేట్ల తగ్గింపు ప్రయోజనాన్ని వినియోగదారులకు బదిలీ కావడాన్ని తాను స్వయంగా పర్యవేక్షిస్తున్నట్టు మంత్రి చెప్పారు. ఇప్పటికే కార్ల తయారీదారులు, బీమా కంపెనీలు, పాదరక్షల వంటి కొన్ని పరిశ్రమలు రేట్ల తగ్గింపును ప్రకటించడాన్ని గుర్తు చేశారు.

'రూపాయి'ని గమనిస్తున్నాం..

కరెన్సీ మారకం విలువలను ప్రభుత్వం గమనిస్తున్నట్టు మంత్రి సీతారామన్ తెలిపారు. 'డాలర్‌తో రూపాయి ఎక్కువ విలువను కోల్పోయింది. ఇతర కరెన్సీలతో కాదు' అని స్పష్టం చేశారు. భారత్‌పై అమెరికా పెద్ద మొత్తంలో టారిఫ్‌లు విధించడం, భారత క్యాపిటల్ మార్కెట్లలో విదేశీ ఇన్వెస్టర్ల వరుస అమ్మకాలతో డాలర్‌తో రూపాయి విలువ 88.38 కనిష్ట స్థాయికి పడిపోవడం తెలిసిందే.

ప్రధాని చొరవ.. ఆర్థిక మంత్రి కసరత్తు

'ఒక్కసారి జీఎస్‌టీ సంగతి చూడండి' ప్రధాని మోదీ చేసిన సూచన ఆధారంగానే ఈ భారీ కసరత్తుకు పూనుకున్నట్టు మంత్రి సీతారామన్ స్వయంగా వెల్లడించారు. ''గత జీఎస్‌టీ కౌన్సిల్ భేటీకి ముందు (2024 డిసెంబర్‌లో) ప్రధాని నాకు కాల్ చేశారు. 'ఒకసారి జీఎస్‌టీ విధానంపై దృష్టి పెట్టండి. రేట్ల పరంగా ఎందుకంత అయోమయం? వ్యాపారాలకు సులభతరంగా మార్చండి' అని చెప్పారు. ఆ తర్వాత బడ్జెట్(2025–26)లో ఆదాయపన్ను ఉపశమన చర్యలపై చర్చల సమయంలోనూ.. 'జీఎస్‌టీపై మీరు పనిచేస్తున్నారు కదా?' అంటూ ప్రధాని మళ్లీ గుర్తు చేశారు. జీఎస్ టీ అమల్లోకి వచ్చి ఎనిమిదేళ్లు ముగిసిన నేపథ్యంలో సమగ్ర సమీక్ష అవసరమని భావించాం. వ్యా పారులు, చిన్న, మధ్య స్థాయి పరిశ్రమల కోణం నుంచి చూశాం'' అని మంత్రి సీతారామన్ చెప్పారు.



లుపిన్ లిమిటెడ్ | బ్రోకరేజ్: పీఎల్ క్యాపిటల్ | కొనొచ్చు

స్టాక్స్ వ్యూ


ప్రస్తుత ధర: రూ. 1,945 **టార్గెట్:** రూ. 2,400

ఎందుకంటే: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) తొలి త్రైమాసికం(క్యూ1)లో ఫార్మా రంగ దిగ్గజం లుపిన్ పటిష్ట పనితీరు ప్రదర్శించింది. వార్షిక ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నిర్వహణ లాభం(ఇబిటా) అంచనాలకు అనుగుణంగా 28 శాతం జంప్‌చేసింది. రూ. 1,640 కోట్లను తాకింది. ప్రధానంగా యూఎస్‌లో అమ్మకాలు పుంజుకోవడం దోహదపడింది. ఇందుకు జీటోల్‌వప్టాన్‌సహా ప్రత్యేక ఔషధాలను ప్రవేశపెట్టడం మద్దతిచ్చింది. మొత్తం ఆదాయం సైతం 12 శాతం వృద్ధితో రూ. 6,300 కోట్లకు చేరింది. మా అంచనా రూ. 6,400 కోట్లుకాగా.. దేశీ అమ్మకాలతోపాటు, ఏపీఐ విక్రయాలు ముగించడం ప్రభావం చూపింది. అయితే యూఎస్‌లో అమ్మకాలు త్రైమాసికవారీగా అంచనాలను అందుకుంటూ 15 శాతం ఎగశాయి. 28.2 కోట్ల డాలర్లను తాకాయి. లాభదాయకత విషయంలో కంపెనీ చెప్పుకోదగ్గ టర్న్‌అరౌండ్ సాధించింది. 2023–24 ఇబిటాతో పోలిస్తే రెండు రెట్లు బలపడింది. ఇందుకు అత్యుత్తమ ప్రొడక్ట్ మిక్స్, ప్రత్యేకతరహా ఔషధాల విడుదల, తయారీ యూనిట్లకు యూఎస్ ఎఫ్‌డీఏ అనుమతులు, దేశీయంగా ఫార్ములేషన్ విక్రయాలు పుంజుకోవడం, వ్యయ నియంత్రణా చర్యలు తోడ్పాటునిచ్చాయి. జీటోల్‌వప్టాన్ అమ్మకాల కారణంగా మార్జిన్లు మరింత బలపడటం వీటికి జత కలసింది. త్రైమాసికవారీగా స్థూల మార్జిన్లు 1.6 శాతం మెరుగుపడి పటిష్టస్థాయిలో 71.3 శాతంగా నమోదయ్యాయి. మరోవైపు పరిశోధన, అభివృద్ధి(ఆర్‌అండ్‌డీ) వ్యయాలు వార్షికంగా 38 శాతం పెరిగి రూ. 470 కోట్లకు చేరాయి. ఇవి అమ్మకాలలో 7.9 శాతం వాటాకు సమానంకాగా.. రూ. 86 కోట్ల ఫారెక్స్ లాభాలు సాధించింది. వెరసి రూ. 1,220 కోట్ల నికర లాభం ఆర్జించింది.



ప్రాపర్టీ విక్రయించా.. పెట్టుబడి దారేది?

Q & A




ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

మూడేళ్లలో రూ.10 లక్షలు సమకూర్చుకోవాలన్నది నా ఆలోచన. లార్జ్‌క్యాప్ ఫండ్స్, ఈక్విటీ సేవింగ్స్ ఫండ్స్‌లో సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) ద్వారా ఇన్వెస్ట్ చేసుకోవచ్చా?

– సాత్విక్

మూడేళ్లలో రూ.10లక్షలు రావాలని కోరుకుంటుంటే.. అందుకు ఈక్విటీ పెట్టుబడులు అనుకూలం కాదు. స్వల్పకాలానికి ఈక్విటీలు ఎంతో రిస్క్‌తో ఉంటాయి. కనుక స్వల్పకాలం కోసం భద్రతతో పాటు, స్థిరమైన రాబడులను ఇచ్చే సాధనాలను పరిగణనలోకి తీసుకోవాలి. ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ విభాగంలో షార్ట్ డ్యురేషన్ డెట్ ఫండ్స్‌ను పరిశీలించొచ్చు. వీటిల్లో స్థిరమైన రాబడులు ఉంటాయి. దీంతో మీ పెట్టుబడులు మార్కెట్ అస్థిరతలకు గురికావు. ఒకవేళ లక్ష్య కాలాన్ని మూడేళ్లకు మించి పెంచుకోగలిగి, రిస్క్ తీసుకునేట్టు అయితే అప్పుడు ఈక్విటీ పెట్టుబడులను పరిశీలించొచ్చు. కనీసం ఐదేళ్లు, అంతకుమించిన కాలానికే ఈక్విటీలు సూచనీయం. దీర్ఘకాలంలో మార్కెట్ అస్థిరతలను అధిగమించి పెట్టుబడులు వృద్ధి చెందుతాయి.



ప్రాపర్టీ విక్రయించగా వచ్చిన లాభం నుంచి పన్ను చెల్లించి మిగిలిన మొత్తాన్ని ఈక్విటీ ఆధారిత సాధనాల్లో ఇన్వెస్ట్ చేసుకోవాలా? లేక దీర్ఘకాల మూలధన లాభాల పన్ను నుంచి మినహాయింపు కోసం ఆర్ఈసీ, పీఎఫ్‌సీ, ఐఆర్ఎఫ్‌సీ జారీ చేసే సెక్షన్ 54ఈసీ బాండ్లలో ఇన్వెస్ట్ చేసుకోవాలా..?

– వీరేశ్

ప్రాపర్టీని విక్రయించిన ఆరు నెలల్లోపు క్యాపిటల్ గెయిన్ బాండ్లలో ఇన్వెస్ట్ చేయడం ద్వారా ఆదాయపన్ను చట్టంలోని సెక్షన్ 54ఈసీ కింద రూ.50 లక్షల వరకు లాభాన్ని మూలధన లాభాల నుంచి మినహాయింపునకు అవకాశం ఉంటుంది. ప్రభుత్వ మద్దతు గల ఆర్ఈసీ, పీఎఫ్‌సీ, ఐఆర్ఎఫ్‌సీ తదితర ఇన్‌ఫ్రా ఫైనాన్సింగ్ కంపెనీలు జారీ చేసే బాండ్లను క్యాపిటల్ గెయిన్ బాండ్లుగా చెబుతారు. ఇవి ఐదేళ్ల లాకిన్ పీరియడ్‌తో ఉంటాయి. వీటిపై 5.25 శాతం వార్షిక వడ్డీ రేటు వర్తిస్తుంది. ఈ వడ్డీ పన్ను పరిధిలోకి వస్తుంది. 30 శాతం పన్ను పరిధిలో ఉన్న వారికి పన్ను పోను ఈ బాండ్లపై లభించే నికర రాబడి 3.68 శాతం అవుతుంది. ఈక్విటీ ఫండ్స్‌తో పోల్చి చూసినప్పుడు క్యాపిటల్ గెయిన్ బాండ్లపై లభించే 5.25 శాతం రేటు చాలా తక్కువ. ఈక్విటీల్లో దీర్ఘకాలానికి రెండంకెల రాబడి వస్తుంది. ఫ్లెక్సీక్యాప్ ఫండ్ గత ఐదేళ్ల కాల సగటు రాబడి 20 శాతంగా ఉంది. ఇప్పుడు పన్ను ఆదా కోసం క్యాపిటల్ గెయిన్ బాండ్లలో ఐదేళ్ల కాలానికి రూ.50 లక్షలు ఇన్వెస్ట్ చేస్తే, 5.25 శాతం రేటు ప్రకారం గడువు తీరిన తర్వాత రూ.63 లక్షలు సమకూరుతుంది. అదే రూ.50 లక్షల లాభంపై 20 శాతం క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్ (రూ.10లక్షలు) చెల్లించి, మిగిలిన రూ.40 లక్షలను ఫ్లెక్సీక్యాప్ పథకాల్లో క్రమానుగతంగా ఇన్వెస్ట్ చేస్తే ఐదేళ్లలో రూ.70 లక్షలు సమకూరొచ్చు. ఇలా చూస్తే మూలధన లాభాల పన్ను చెల్లించి, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసుకోవడం మెరుగైనది అవుతుంది. కానీ, ఈక్విటీల్లో మెరుగైన రాబడి వస్తుందని చెప్పి మొత్తం తీసుకెళ్లి ఇన్వెస్ట్ చేయడం సరికాదు. ఐదేళ్లు, అంతకుమించిన కాలాలకు ఈక్విటీల్లో మెరుగైన రాబడులు వస్తాయి. కానీ ఇది కచ్చితమని చెప్పలేం. ఆటుపోట్లు ఉంటాయి. కానీ, క్యాపిటల్ గెయిన్ బాండ్లు హామీతో కూడిన పన్ను లేని రాబడిని ఇస్తాయి. కనుక రిస్క్ లేని రాబడి కోరుకుంటూ, ఐదేళ్ల తర్వాత కచ్చితంగా పెట్టుబడి మొత్తం తిరిగి వెనక్కి తీసుకోవాలని అనుకుంటే క్యాపిటల్ గెయిన్ బాండ్లకు వెళ్లొచ్చు. కొంత రిస్క్ తీసుకుని, అవసరమైతే ఐదేళ్లకు అదనంగా మరికొంత కాలం పాటు ఇన్వెస్ట్ చేసేట్టు అయితే దీర్ఘకాల మూలధన లాభాల పన్ను చెల్లించి మిగిలిన మొత్తాన్ని ఈక్విటీ పథకాలకు కేటాయించుకోవచ్చు.

'సాక్షి ప్లస్' ఈ–పేపర్‌లో ..
దేశ, విదేశీ గణాంకాలు కీలకం
లీగల్ హైయిర్ సర్టిఫికెట్లు.. ఇబ్బందులు

ఆర్ఆర్ కేబుల్ | బ్రోకరేజ్: చాయిస్ ఇంటర్నేషనల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,207 **టార్గెట్:** రూ. 1,820

ఎందుకంటే: విభిన్న వైర్లు, కేబుళ్ల తయారీ దిగ్గజం ఆర్ఆర్ కేబుల్ రెండేళ్ల క్రితమే భారీస్థాయిలో విస్తరణ చేపట్టింది. 2023–24లోనే కేబుళ్ల తయారీ ప్లాంట్ల విస్తరణకు రూ. 1,700 కోట్లతో ప్రణాళికలకు తెరతీసింది. ఈ బాటలో ఇప్పటికే రూ. 500 కోట్ల పెట్టుబడులు వెచ్చించగా.. 2026–27కల్లా మరో రూ. 1,200 కోట్లు కేటాయించనుంది. వీటిలో 80 శాతం నిధులను పవర్ కేబుళ్ల విస్తరణకే వినియోగించనుంది. ఈ విస్తరణను గరిష్ట స్థాయిలో వినియోగించుకుంటే భవిష్యత్‌లో కంపెనీ రూ. 4,800–5,400 కోట్ల శ్రేణిలో అదనపు ఆదాయాన్ని సాధించగలదని భావిస్తున్నాం. ఇందుకు 4 రెట్లు ఫిక్స్‌డ్ అసెట్ టర్నోవర్ అంచనాను ప్రాతిపదిక చేసుకుని అంచనా వేశాం. వెరసి 2027–28కల్లా కేబుళ్లు, వైర్ల(సీఅండ్‌డబ్ల్యూ) బిజినెస్ నుంచి 36 శాతం అధికంగా రూ. 3,890 కోట్ల ఆదాయం నమోదుకాగలదని మదింపు చేశాం. దీనిలో పవర్ కేబుళ్ల విభాగం నుంచి 27 శాతం (రూ. 1,840 కోట్లు) సమకూరే వీలున్నట్లు భావిస్తున్నాం. ఇందుకు వ్యవస్థాగతంగా పలు సానుకూల అంశాలు దోహదపడనున్నాయి. వీటిలో పునరుత్పాదక ఇంధన రంగ పురోభివృద్ధి, డేటా సెంటర్ల విస్తరణ, చైనాయేతర దేశాలలో తయారీకి పెరుగుతున్న ప్రాధాన్యత తదితర అంశాలను ప్రధానంగా ప్రస్తావించవచ్చు. ఈ నేపథ్యంలో కంపెనీ ఆదాయంలో వార్షిక ప్రాతిపదికన 25 శాతం వృద్ధిని అందుకునేందుకు అవకాశముంది. ఫలితంగా దేశీ పవర్ కేబుళ్ల మార్కెట్లో చెప్పుకోదగ్గ వాటాను సాధించడానికి వీలుంటుంది. కంపెనీ యాజమాన్యం గత కొన్నేళ్లుగా దేశీ వైర్ల బిజినెస్‌లో ఆర్జిస్తున్న లాభాలను ఇతర విభాగాలలోకి మళ్లిస్తోంది. దీంతో ప్రత్యర్థి కంపెనీలతో పోలిస్తే ఇబిట్ మార్జిన్లలో కంపెనీ వెనకడుగులో ఉంటోంది. అయితే ఇకపై ఇవి బలపడనున్నాయి.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

సాధారణంగా.. ప్రభుత్వరంగ బ్యాంకులతో పోలిస్తే ప్రైవేటురంగ బ్యాంకుల్లో ఉద్యోగులకు జీతాలు ఎక్కువని అందరూ అనుకుంటారు. కానీ, ఇది తప్పు అంటున్నాయి గణాంకాలు. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా వంటివి.. దేశంలోని అతిపెద్ద ప్రైవేటు బ్యాంకులైన ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీల కంటే సగటున ఎక్కువ జీతాలు ఇస్తున్నాయి.

- సాక్షి, స్పెషల్ డెస్క్

దేశంలో ప్రైవేటు రంగ బ్యాంకుల్లో అగ్రస్థాయి బ్యాంకులు ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ. వీటిలోని ఐసీఐసీఐలో 'సగటు వేతనం' రూ.13 లక్షలు కాగా, హెచ్‌డీఎఫ్‌సీలో రూ.11.14 లక్షలు. ఇది చాలా ఎక్కువే అనిపిస్తుంది. కానీ, ప్రభుత్వ రంగ బ్యాంకులైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) లలో సగటు వేతనం ఇంతకంటే దాదాపు రెట్టింపు ఉండటం విశేషం. (ఆర్థిక సంవత్సరం చివరినాటికి ఉన్న ఉద్యోగుల సంఖ్యతో.. ఆ ఏడాదిలో ఉద్యోగుల కోసం చేసిన మొత్తం ఖర్చును భాగిస్తే వచ్చేదే సగటు వేతనం.). ఎస్‌బీఐలో సగటు వేతనం రూ.27.2 లక్షలు కాగా, బీఓబీలో ఇది రూ.22.1 లక్షలు కావడం విశేషం.

ప్రభుత్వ బ్యాంకుల్లోనే.. జీతం ఎక్కువ!



ఐసీఐసీఐతో పోలిస్తే ఎస్‌బీఐలో రెట్టింపు

హెచ్‌డీఎఫ్‌సీ కంటే బీఓబీలో రెండింతలు

ప్రైవేటు బ్యాంకుల్లో పైస్థాయి'దే పైచేయి

పై స్థాయిలో.. అక్కడే ఎక్కువ..

ప్రైవేటు బ్యాంకుల్లోని అత్యున్నత స్థాయి అధికారులు, సీనియర్ మేనేజ్‌మెంట్ స్టాఫ్ మాత్రం.. ప్రభుత్వ రంగ బ్యాంకులతో పోలిస్తే అధిక జీతాలు పొందుతున్నారు. హెచ్‌డీఎఫ్‌సీ ఎండీ, సీఈఓ 2024–25లో పొందిన వేతనం రూ.12.06 కోట్లు కాగా ఐసీఐసీఐ సీఈఓ సంపాదించింది రూ.10.45 కోట్లు. ఇదే సమయంలో బీఓబీ సీఈఓ పొందింది రూ.73.92 లక్షలు కాగా, ఎస్‌బీఐ చైర్మన్ పొందింది రూ.63.87 లక్షలు.

పే స్కేల్ ప్రకారం..

సాధారణంగా ప్రభుత్వ రంగ బ్యాంకులు జూనియర్ మేనేజ్‌మెంట్ స్థాయిలో ఎక్కువ ఖర్చు పెడితే.. ప్రైవేటు రంగ బ్యాంకులు సీనియర్ మేనేజ్‌మెంట్ స్థాయిలో ఎక్కువ ఖర్చు చేస్తున్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో పే స్కేల్ ప్రకారం జీతం పెరుగుతూ పోతుంటుంది. కానీ, ప్రైవేటు బ్యాంకుల్లో ప్రధానంగా పనితీరు, నైపుణ్యం, వయసు ఆధారంగా పెరుగుతుంది. ప్రభుత్వ రంగ బ్యాంకులతో పోలిస్తే ప్రైవేటు బ్యాంకులకు ఎంట్రీ లెవెల్‌లో ఎక్కువ ఉద్యోగులు కావాలి. అందువల్ల వారికి జీతాలు తక్కువగా ఉంటాయి.

స్త్రీ, పురుషుల వేతనాల్లో తేడాలు

బోర్డు సభ్యులు, కీలక మేనేజర్ స్థాయి వ్యక్తులను పక్కనపెడితే.. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో పురుష ఉద్యోగి సగటు జీతం రూ.5.6 లక్షలు కాగా, మహిళా ఉద్యోగికి రూ.3.9 లక్షలు. ఇదే ఎస్‌బీఐలో పురుషుల జీతం రూ.13.9 లక్షలు కాగా, స్త్రీలకు రూ.12.8 లక్షలుగా ఉంది.

దేశంలో ప్రభుత్వ, ప్రైవేటురంగ బ్యాంకుల్లో 2024-25లో ఉద్యోగుల సగటు జీతం (రూ.లక్షల్లో)

ప్రభుత్వ బ్యాంకులు		ప్రైవేటు బ్యాంకులు	
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	27.2	20.6	ఐడీబీఐ
యూకో బ్యాంక్	25.9	19.2	ఫెడరల్ బ్యాంక్
ఇండియన్ బ్యాంక్	24.7	17.8	సౌత్ ఇండియన్ బ్యాంక్
బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర	23.6	14	యస్ బ్యాంక్
బ్యాంక్ ఆఫ్ బరోడా	22.1	13.5	ఐడీఎఫ్‌సీ బ్యాంక్

ఖాళీలు తక్కువే

కేంద్ర ప్రభుత్వం జులైలో రాజ్యసభలో వెల్లడించిన వివరాల ప్రకారం.. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఈ ఏడాది మార్చి 31 నాటికి 96 శాతం సిబ్బంది ఉన్నారు. అంటే కేవలం 3–4 శాతం మాత్రమే ఖాళీలు ఉన్నాయి. 2020–25 మధ్య ఈ బ్యాంకులు 1,48,687 మందిని నియమించుకున్నాయి. 2025–26లో మరో 48,570 మందిని తీసుకోనున్నారు.

ఎస్‌బీఐలోనే అధికం..: 2024–25 నాటికి దేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఉన్న మొత్తం ఉద్యోగుల సంఖ్య 7.58 లక్షలు. అత్యధిక ఉద్యోగులున్న బ్యాంకుగా ఎస్‌బీఐ నిలిచింది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ఎస్‌బీఐ సహా సగానికిపైగా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో 2020–21తో పోలిస్తే.. 2024–25లో ఉద్యోగుల సంఖ్య తగ్గింది. ఇక ప్రైవేటు రంగ బ్యాంకుల్లో 2024–25 నాటికి ఐసీఐసీఐలో 1.29 లక్షలు మంది ఉంటే, హెచ్‌డీఎఫ్‌సీలో 2.14 లక్షల మంది ఉద్యోగులు ఉన్నారు.

టాప్ బ్యాంకులు.. ఉద్యోగులు

బ్యాంకు	ఉద్యోగులు
ఎస్‌బీఐ	2,36,221
పంజాబ్ నేషనల్ బ్యాంక్	1,02,746
కెనరా బ్యాంక్	81,260
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	73,945
బ్యాంక్ ఆఫ్ బరోడా	73,742

'గోదావరి'కి నేడు సీఎం శంకుస్థాపన

▶ మొదటి పేజీ తరువాయి

జలాలను హైదరాబాద్ తాగునీటి అవసరాలకు వినియోగిస్తారు. మార్గమధ్యలో ఉన్న 7 చెరువులను కూడా నింపుతారు.

ఓఆర్ఆర్ రెండో దశ ప్రాజెక్టు ప్రారంభం

ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) రెండో దశలో భాగంగా రూ.1,200 కోట్లతో జీహెచ్ఎంసీ, ఓఆర్ఆర్ పరిధిలోని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, గ్రామ పంచాయితీలకు తాగునీటి సరఫరా చేసేందుకు నిర్మించిన ప్రాజెక్టును ముఖ్యమంత్రి సోమవారం ప్రారంభించనున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 71 రిజర్వాయర్లు నిర్మించగా, ఇటీవల కొత్తగా నిర్మించిన 15 రిజర్వాయర్లను సీఎం ప్రారంభిస్తారు. ఈ ప్రాజెక్టు ద్వారా సరూర్‌నగర్, మహేశ్వరం, శంషాబాద్, హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం, ఘట్‌కేసర్, కీసర, రాజేంద్రనగర్, శామీర్‌పేట్, మేడ్చల్, కుత్బుల్లాపూర్, ఆర్‌సీపురం, పటాన్‌చెరు, బొలారంతో సహా మొత్తం 14 మండలాల్లోని 25 లక్షల మందికి తాగునీరు అందుతుంది.

నియో పోలిస్ సెజ్‌కు తాగునీటి సరఫరా..

కోకాపేట్ లేఅవుట్ సమగ్ర అభివృద్ధి-నియో పోలిస్ సెజ్‌కు తాగునీటి సరఫరాతో పాటు మురుగునీటి వ్యవస్థను అభివృద్ధి చేసే ప్రాజెక్టుకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. రూ.298 కోట్లతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేసి 13 లక్షల మంది జనాభాకు లబ్ధి కలిగించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

15 నుంచి ఎంబీఏ, ఎంసీఏ తుది కౌన్సెలింగ్



సాక్షి, హైదరాబాద్: ఎంబీఏ, ఎంసీఏ కాలేజీల్లో తుది దశ ప్రవేశాలను ఈ నెల 15 నుంచి చేపడుతున్నట్టు సాంకేతిక విద్య కమిషనర్ దేవసేన ఓ ప్రకటనలో తెలిపారు. 16న ధ్రువ పత్రాల పరిశీలన, 16, 17 తేదీల్లో వెబ్ ఆప్షన్లు చేపడతామన్నారు. ఈ నెల 20న తుది దశ సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. సీట్లు పొందే వారు 23వ తేదీలోగా రిపోర్టు చేయాలని, మిగిలిపోయిన సీట్లకు ఈ నెల 23న కాలేజీలు స్పాట్ అడ్మిషన్లు చేపడతాయని ఆమె వెల్లడించారు.

5 కేటగిరీలు.. మార్గాలు

నిషేధిత జాబితాలోని భూముల విషయంలో నిపుణుల సూచనలు

- 2007 నుంచి '22ఏ' భూముల సమస్య షురూ.. 2017లో మరింత జటిలం
- కనీసం 60 లక్షల ఎకరాల్లో ఈ సమస్య ఉందని అంచనా
- కమిటీలతో సరిపెడుతున్న ప్రభుత్వాలు.. ఇబ్బందుల్లో రైతన్నలు

● ఓ రైతు తన కూతురికి రాసిచ్చిన భూమి అల్లుడి పేరు మీద మార్పిడి కాలేదు. ఎందుకంటే ఆ భూమి సర్వే నంబర్ నిషేధిత జాబితాలో ఉంది. దీంతో ఆ భూమి కట్నం కింద ఇచ్చినా ఉపయోగం లేదంటూ ఆ అల్లుడు తన భార్యను పుట్టింట్లో వదిలి వెళ్లాడు.

● ఓ రైతు తన కూతురు లగ్గానికి తనకున్న ఎకరం భూమి అమ్మాలనుకున్నాడు. కానీ అది నిషేధిత జాబితాలో ఉండడంతో సాధ్యం కాలేదు. రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగి వేసారి పోయిన ఆ రైతు తీవ్ర ఆవేదనతో ఆత్మహత్య చేసుకున్నాడు.

సాక్షి, హైదరాబాద్: గత కొన్నేళ్లుగా తెలంగాణలో నిషేధిత జాబితాలో (రిజిస్ట్రేషన్ల చట్టం సెక్షన్ 22ఏ కింద చేర్చిన) ఉన్న భూముల విషయంలో ఎంతోమంది రైతులు ఎన్నో విధాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిషేధిత భూములు క్రయ విక్రయాలు చేయడానికి అంటే రిజిస్ట్రేషన్ చేయడానికి వీలుండదు. రాష్ట్రంలో సుమారు 60 లక్షల ఎకరాల నిషేధిత భూములున్నాయి. అయితే ఏళ్ల తరబడి సాగు చేసుకునే తమ భూమి 22ఏ జాబితాలో చేరడం, ఆ జాబితాలోంచి తమ భూముల్ని తొలగించుకోవడం సాధ్యం కాక, దాన్ని ఎలా తొలగించుకోవాలో అర్థం కాక రైతన్నలు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ప్రభుత్వాలు కమిటీల ఏర్పాటుతో సరి పుచ్చుకుంటుండటంతో.. ఇదే అదనుగా కొందరు దళారులు రెవెన్యూ శాఖ సహకారంతో డబ్బులు దండుకుంటున్నారు.



దాదాపు రెండు దశాబ్దాలుగా సమస్య

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2007వ సంవత్సరం నుంచి ఈ నిషేధిత భూముల జాబితా మొదలైంది. అప్పట్లో ఏర్పాటు చేసిన కోనేరు రంగారావు కమిటీ ఇచ్చిన సిఫారసుల మేరకు, నిషేధిత భూములుగా గుర్తించిన వాటిని 22ఏ కేటగిరీలో చేర్చి వాటిని సబ్ రిజిస్ట్రార్లకు పంపారు. ఆ భూములు రిజిస్ట్రేషన్ చేయడానికి వీల్లేదని ప్రభుత్వం ఆదేశించింది. అంతకంటే ముందు అమ్మడానికి వీలు లేని భూములను కూడా విచ్చలవిడిగా రిజిస్ట్రేషన్లు చేస్తుండడంతో అసలు ప్రభుత్వ భూములు మిగలవేమోననే ఆలోచనతో కోనేరు రంగారావు కమిటీ ఈ జాబితా కోసం సిఫారసు చేసింది. అప్పటివరకు రాష్ట్రంలో ఉన్న రిజిస్ట్రేషన్ల చట్టాన్ని సవరించిన ప్రభుత్వం అందులో 22ఏ సెక్షన్ చేర్చింది. ఇందులో 22ఏ నుంచి 'ఈ' వరకు ఐదు కేటగిరీల భూములున్నాయి. అసైన్డ్, ప్రభుత్వ, దేవాదాయ, వక్ఫ్‌లతో పాటు వివిధ చట్టాల ద్వారా రిజిస్ట్రేషన్ నిషేధించిన భూములు, ప్రభుత్వ ఆసక్తి ఉన్న భూములు వీటిల్లో ఉన్నాయి. వీటితో పాటు రైతులు ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న, నిజానికి ఈ జాబితా కిందకు రాని భూములు కూడా ఆ జాబితాలో చేరడంతో సమస్యలు మొదలయ్యాయి. 2009లో ఈ జాబితా తయారైన తర్వాత వేల సంఖ్యలో కేసులు హైకోర్టుకు వచ్చాయి.

తెలంగాణ ఏర్పాటు తర్వాత మరిన్ని భూములు..

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత నిషేధిత భూముల జాబితాకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం 2015లో ఓ కమిటీని ఏర్పాటు చేసినా, ఆ కమిటీ పెద్దగా చొరవ చూపని కారణంగా ఆ జాబితాకు సవరణ జరగలేదు. తర్వాత 2017లో అప్పటి ప్రభుత్వం భూరికార్డుల ప్రక్షాళన (ఎల్ఆర్‌యూపీ) చేపట్టింది. ఆ తర్వాత భూ రికార్డుల నిర్వహణ కోసం ధరణి పోర్టల్ అందుబాటులోకి వచ్చినప్పుడు తాజాగా నిషేధిత భూముల జాబితా ఎలా రూపొందించాలో మార్గదర్శకాలిచ్చారు. కానీ ఈ పోర్టల్‌లో పట్టా భూములు కూడా ఏదో కారణంతో నిషేధిత జాబితాలో చేర్చారు. అలాగే భూదాన్, వక్ఫ్ భూములు ఈ కేటగిరీలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో రెండు ప్రత్యేక జీవోలు తయారు చేసి దేవాదాయ, వక్ఫ్ జాబితాలను మళ్లీ పంపమని అడిగారు. దీంతో నిషేధిత జాబితాలోకి మరిన్ని భూములు వచ్చి అదనంగా చేరాయి. సిబ్బంది తప్పిదాలతో పాటు ఆయా భూములు ఉన్న సర్వే నంబర్‌లో పట్టా భూములున్నా వాటిని కూడా 22ఏ జాబితాలో పెట్టారు. పాత ఖాస్రా, ఛేస్సాలాలో ఖారీజ్ ఖాతా అంటూ కొన్ని భూములను చేర్చారు. అయితే ఈ భూములపై నిర్ణయాలను తీసుకునే అధికారం ఎండోమెంట్, వక్ఫ్ ట్రిబ్యునల్స్‌కు మాత్రమే ఉంది. దీంతో పట్టాదారులు చేసేదేమీ లేక కోర్టు మెట్లు ఎక్కాల్సి వచ్చింది. ఈ రకంగా వేలాది కేసులు ఇప్పుడు తెలంగాణ హైకోర్టులో పేరుకుపోయాయి.

రెవెన్యూ చట్టాల నిపుణులు చెపుతున్న దాని ప్రకారం.. ఓ గ్రామంలో 3–5వేల ఎకరాల భూమి ఉందనుకుంటే అందులో ప్రభుత్వ, అసైన్డ్, భూదాన్, సీలింగ్, దేవాదాయ, వక్ఫ్ భూములన్నీ కలిపి ఓ పది శాతం నుంచి 20 శాతం వరకు ఉండొచ్చు. కానీ ఒక్కో గ్రామంలో నిషేధిత జాబితాలో 40 శాతం వరకు భూములున్న సందర్భాలు కూడా ఉన్నాయని వారంటున్నారు. ఈ నేపథ్యంలో కోర్టులు ఎప్పటినుంచో చెబుతున్న విధంగా నిషేధిత భూముల జాబితాను ప్రజలకు అందుబాటులో పెట్టాలని, ఏ గ్రామానికి ఆగ్రామంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, స్థానికంగానే పరిశీలించడం ద్వారా ప్రతి గ్రామానికి ప్రత్యేక నిషేధిత జాబితా తయారు చేసి గ్రామసభ ఆమోదం పొందాలని వారు సూచిస్తున్నారు. తద్వారా సమస్యలు పరిష్కరించాలని చెబుతున్నారు.

ఇప్పుడు చేయాల్సిందేంటి?

- 1958 కంటే ముందు ఇచ్చిన అసైన్డ్ భూములు నిషేధిత జాబితాలో ఉంచాల్సిన అవసరం లేదని, ఆ భూములను వెంటనే తొలగించాలని నిపుణులు సూచిస్తున్నారు. రెవెన్యూ వర్గాల అంచనా ప్రకారం తెలంగాణలో ఇలాంటి భూమి 5 లక్షల ఎకరాల వరకు ఉంటుందని అంచనా.
- స్వాతంత్య్ర సమర యోధులు, మాజీ సైనికులు, రాజకీయ బాధితులకు ఇచ్చిన భూములను పదేళ్ల తర్వాత 22ఏ జాబితా నుంచి తీసేయాలి. వాటిని ఎలాంటి దరఖాస్తులు లేకుండానే తొలగించాలని నిపుణులు చెపుతున్నారు.
- భూమి శిస్తు అమల్లో ఉన్నప్పుడు అసైన్డ్ చేసిన భూములకు పన్ను కట్టకపోతే వాటిని ఖారీజ్ ఖాతాలో చేర్చారు. ఇప్పుడు వాటిని ఆ జాబితా నుంచి తొలగించాలి. ఏ సమయం నుంచి ఎన్నేళ్ల పాటు పట్టా అని కొత్త రికార్డుల్లో వచ్చిందో ఆ మేరకు టైమ్‌లైన్ కటాఫ్ పెట్టుకుని ఆ జాబితాను తీసేయాలి.
- నిషేధిత భూముల జాబితా అంశం అసలు రాష్ట్రస్థాయికి రావద్దని, ఈ జాబితా రూపకల్పన, ఏర్పడే సమస్యల పరిష్కారం కోసం జిల్లా స్థాయిలోనే ఓ పకడ్బందీ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని రెవెన్యూ చట్టాల నిపుణులు చెపుతున్నారు. ఈ ఐదు మార్గాల్లో ప్రభుత్వం, అధికారులు, చొరవ తీసుకుంటేనే రైతుల సమస్యలు పరిష్కారం అవుతాయని స్పష్టం చేస్తున్నారు.



చేతిరాత శిక్షణలో పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్

చేతిరాత పరీక్ష.. పిల్లలకే కాదు.. పెద్దలకు కూడా..

కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి వినూత్న ప్రయోగం

కరీంనగర్: చేతిరాతకు పూర్వ వైభవం తెచ్చేందుకు కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి శ్రీకారం చుట్టారు. కరీంనగర్‌లోని పారమిత విద్యాసంస్థ సహకారంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేతిరాత పోటీలు నిర్వహించారు. ఆగస్టు 20న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠశాల స్థాయి చేతిరాత పోటీలు నిర్వహించారు. ప్రతీ పాఠశాల నుంచి ముగ్గురిని ఎంపిక చేసి 584 మందితో ఆగస్టు 25న మండలస్థాయి పోటీలు, ఆ తర్వాత మండలానికి ముగ్గురి చొప్పున జిల్లాలోని 16 మండలాల నుంచి జిల్లాస్థాయి పరీక్షకు 48 మందిని ఎంపిక చేశారు. ఈనెల 7న పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈ నెల15న కరీంనగర్ కలెక్టరేట్‌లో అవార్డులు అందించనున్నారు.

అధికారులకు పరీక్ష

ఇంగ్లిష్ రాతలో నైపుణ్యం పెంపొందించుకునేందుకు విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు, అధికారులు సైతం జిల్లాస్థాయి పోటీలకు ఉత్సాహంగా హాజరయ్యారు. కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ చేతిరాత పరీక్ష రాశారు.

దారి బాగులేక.. అంబులెన్స్ రాలేక



మధ్యలో ఆగిన అంబులెన్స్ వరకు నడిచి ఎక్కుతున్న బాధితురాలు

చిలప్‌చెడ్ (నర్సాపూర్): దారి సరిగ్గా లేని ఒక తండాకు అంబులెన్స్ వెళ్లలేకపోవడంతో.. తీవ్ర అనారోగ్యానికి గురైన మహిళ అవస్థలకు గురైంది. మెదక్ జిల్లా చిలప్‌చెడ్ మండలం ఫైజాబాద్ గ్రామ పరిధిలోని ఎల్లుగుట్ట తండాలో జరిగిన ఈ సంఘటన వివరాలివి. తండాకు చెందిన ఒక మహిళ అనారోగ్యానికి గురవ్వడంతో కుటుంబ సభ్యులు 108కు కాల్ చేశారు. తండా దారి మట్టిరోడ్డు కావడం, పైగా ఇటీవలి వర్షాలకు పలు చోట్ల రోడ్డు కోతలకు గురికావడంతో అంబులెన్స్ రాలేక మధ్యలోనే ఆగిపోయింది. దీంతో ఆ మహిళను అంబులెన్స్ వరకు నడిపించి ఆస్పత్రికి తరలించారు. కాగా తండాకు సరైన రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ప్రజలు వాపోతున్నారు.

6 నెలలు.. రూ.13.82 లక్షల ఆదాయం

ఆదర్శంగా నిలుస్తున్న మహిళా పెట్రోల్ బంక్



సింగారంలో పెట్రోల్ బంక్..

నారాయణపేట రూరల్: రాష్ట్రంలో కోటిమంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 'ఇందిరా మహిళాశక్తి'ని పటిష్టంగా అమలు చేస్తోంది. నారాయణపేట జిల్లా మహిళా సమాఖ్యలో 8,196 మహిళా సంఘాలు ఉన్నాయి. వీటిలో 91,369 మంది సభ్యులున్నారు. ఇందిరా మహిళాశక్తిలో భాగంగా జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం క్రాస్ రోడ్డులో రూ.1.30 కోట్ల వ్యయంతో జిల్లా మహిళా సమాఖ్య పెట్రోల్ బంక్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది ఫిబ్రవరి 21న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. 20 ఏళ్లకు నెలకు రూ.10 వేల అద్దె ప్రాతిపదికన మహిళా సమాఖ్య ద్వారా ఈ పెట్రోల్ బంక్ నిర్వహణకు బీపీసీఎల్‌తో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఒప్పందం చేసుకుంది.

మహిళలకు ముందస్తు శిక్షణ..

బంక్ నిర్వహణకు సంబంధించిన 11 మంది మహిళలను ఎంపిక చేసి ప్రభుత్వం వారికి ముందస్తుగా జడ్చర్ల, షాద్‌నగర్‌లోని పెట్రోల్ బంక్‌లలో మేనేజర్, సేల్స్ ఉమెన్లుగా శిక్షణ ఇప్పించింది. మొత్తం వ్యయంలో మౌలిక వసతులు కల్పనకు రూ.15 లక్షలు ఖర్చు చేశారు. సీఎం ఆదేశాలు మేరకు ప్రతి 15 రోజులకోసారి పెట్రోల్ బంక్ నిర్వహణపై కలెక్టర్ సమీక్షిస్తున్నారు.

- మహిళా సమాఖ్య పెట్రోల్ బంక్‌లో రోజుకు 4 వేల లీటర్ల పెట్రోల్, 6 వేల లీటర్ల డీజిల్‌ను విక్రయిస్తున్నారు. అందులో విధులు నిర్వర్తించే 10 మంది సేల్స్ ఉమెన్లకు ఒక్కొక్కరికి నెలకు రూ.13,200 చొప్పున, మహిళా మేనేజర్‌కు నెలకు రూ.18 వేలు వేతనంగా జిల్లా సమాఖ్య నుంచి తీసుకుంటున్నారు. మహిళా పెట్రోల్ బంక్ ద్వారా వేతనాలు, ఇతర నిర్వహణ ఖర్చులు పోను ఆరు నెలల్లో రూ.13.82 లక్షల ఆదాయాన్ని ఆర్జించారు.

ఆర్థికంగా ఎదుగుదలకు..



మహిళలు వంటింటికే పరిమితం కాదని నారాయణపేట మహిళా సమాఖ్య నిరూపిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహం బాగుంది. 11 మంది మహిళలం కష్టపడి పనిచేసి రూ.13.82 లక్షల ఆదాయాన్ని గడించాం.

– చంద్రకళ, పెట్రోల్ బంక్ మేనేజర్

మహిళా స్వావలంబనకు తోడ్పాటు



రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇదొక ముందడుగు. తెలంగాణలోనే కాదు దేశం మొత్తంలో జిల్లా మహిళా సమాఖ్యచే నడిచే మొదటి పెట్రోల్ బంక్‌గా గుర్తింపు పొందింది.

– సిక్తా పట్నాయక్, కలెక్టర్, నారాయణపేట

గూగుల్ మ్యాప్‌ను నమ్ముకుని గుంతలో పడ్డారు..

డ్రైవర్ అజాగ్రత్తతో 19 మందికి తీవ్ర గాయాలు ● ఇద్దరి పరిస్థితి విషమం





తీవ్రగాయాలైన హరిశ్చంద్ర, మాణిక్యం, వెంకటనారాయణ

జనగామ: గూగుల్ మ్యాప్ వలస కూలీల ప్రాణాల మీదకు తెచ్చింది. మ్యాప్‌నే నమ్ముకుని డ్రైవింగ్ చేసిన డ్రైవర్ ప్రయాణికుల ప్రాణాలు తీసినంత పనిచేశాడు. ఈ సంఘటన జనగామ జిల్లా కేంద్రంలోని సిద్దిపేట ప్రధాన రహదారి శామీర్‌పేట బైపాస్ వద్ద ఆదివారం తెల్లవారు జామున జరిగింది. ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా కైలూరు మండలానికి చెందిన డ్రైవర్‌తో సహా 19 మంది మత్స్య కార్మికులు తెలంగాణలోని సంగారెడ్డి జిల్లాకు బొలెరో వాహనంలో బయలుదేరారు. సంగారెడ్డి ప్రాంతంలో చెరువుల్లో చేపలు పట్టి, వాహనంలో లోడ్ చేసేందుకు రోజుకు రూ.1,000 వేతనం ఒప్పందంతో ఇక్కడకు వస్తున్నారు. కైలూరు నుంచి బయలుదేరే సమయంలో డ్రైవర్ గూగుల్ మ్యాప్‌ను మాత్రమే నమ్ముకున్నాడు. జనగామ మండలం శామీర్‌పేట బైపాస్ వద్ద మలుపు తిరిగే సమయంలో రెండువైపులా గుంతల రూపంలో ప్రమాదం పొంచి ఉంది. ఇక్కడ ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడం, గూగుల్ మ్యాప్ స్ట్రైట్ రూట్ చూపించడంతో డ్రైవర్ నేరుగా వచ్చేశాడు. దగ్గరకు వచ్చేసరికి మలుపు, పక్కనే గుంత కనిపించడంతో వేగంగా ఉన్న వాహనాన్ని అదుపు చేసే క్రమంలో బొలెరో వాహనం అందులో పల్టీ కొట్టింది. గాఢనిద్రలో ఉన్న కూలీలు బాలి మాణిక్యం, సైదు వెంకటనారాయణ, గంటసాల రాధాకృష్ణ, బాలె హరినాథ్, గంటసాల వెంకన్న, ఇమ్మాన్యుయేల్, బాలె రవికుమార్, గంటసాల రేణుక, గంటసాల సాయి, ముంగర సత్యనారాయణ, కె.ఏసోబు, సైదు హరిశ్చంద్ర, నడుగారి ఆదేశ్, నబిగర్ నాగరాజు, సైదు వెంకటనారాయణ, ఏదూరి నల్లయ్య, బాలె మాణిక్యం, బాలె రవికుమార్, బాలె మణికంఠకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి అంబులెన్స్‌కు సమాచారం అందించగా, క్షతగాత్రులను జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఇందులో హరిశ్చంద్ర, సత్యనారాయణ తల, శరీర భాగాలకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితికి చేరుకోవడంతో ప్రాథమిక చికిత్స అందించి 108లో సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. మిగతా కూలీలకు ఇక్కడే వైద్య పరీక్షలు అందిస్తున్నారు.

గ్రహణం రోజు.. గుప్త నిధులు తీస్తా..

- బషీరాబాద్‌లో పట్టపగలే తవ్వకాలు
- ఐదుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు
- పరారీలో ప్రధాన మాంత్రికుడు



తవ్వకాలు జరిపిన ఇల్లు

బషీరాబాద్: పట్టణంలో పట్టపగలే గుప్త నిధుల తవ్వకాలు కలకలం రేపాయి. దీంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఐదుగురు పట్టుబడగా ప్రధాన మాంత్రికుడు పరారయ్యాడు. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ ఎస్ఐ నుమాన్‌అలీ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన యాగ ప్రశాంత్‌కు పాడుబడిన ఇల్లు ఉంది. 15 ఏళ్లుగా ఆ ఇంటికి తాళం వేసి ఉంది. ఇటీవల ఆ ఇంటి నుంచి రాత్రివేళ శబ్దాలు వస్తున్నాయని.. అక్కడ గుప్త నిధులు ఉన్నాయంటూ ప్రచారం సాగింది. ఈ విషయాన్ని ప్రశాంత్ క్యాద్గిరాకు చెందిన తన స్నేహితుడు పట్నం శ్రీనివాస్‌కు చెప్పాడు. వీరిద్దరూ బషీరాబాద్‌కు చెందిన మోహిజ్, మహేశ్, శివకుమార్‌తో కలిసి గుప్తనిధుల వెలికితీతకు పథకం రచించారు. వారం క్రితం శ్రీనివాస్ కర్ణాటక రాష్ట్రానికి చెందిన మాంత్రికుడు మొల్లను కలిసి గుప్తనిధుల విషయం వివరించాడు. దీంతో సదరు మాంత్రికుడు సెప్టెంబర్ 9వ తేదీన ఆదివారం పౌర్ణమితో పాటు గ్రహణం ఉందని, అదే రోజు నిధులు వెలికితీస్తానని, సామగ్రిని సిద్ధం చేసుకోవాలని సూచించాడు. ఆదివారం బషీరాబాద్‌కు వచ్చిన మాంత్రికుడు ఉదయం 10.30 గంటలకు పాడుబడిన ఇంటికి చేరుకున్నాడు. ప్రశాంత్, శ్రీనివాస్, మోహిజ్, మహేశ్, శివకుమార్‌తో కలిసి ప్రత్యేక పూజలు చేశాడు. అనంతరం తవ్వకాలు ప్రారంభించారు. ఇంట్లో శబ్దాలు బయటకు రావడంతో ఇరుగుపొరుగు వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు రంగప్రవేశం చేశారు. అప్పటికే మాంత్రికుడు అక్కడి నుంచి పరారవ్వగా తవ్వకాలు జరుపుతున్న ప్రశాంత్, శ్రీనివాస్, మోహిజ్, మహేశ్, శివకుమార్‌ను పోలీసులు పట్టుకుని ఠాణాకు తరలించారు. సాయంత్రం తాండూరు రూరల్ సీఐ నగేశ్ తవ్వకాలు జరిపిన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. పరారైన వ్యక్తినే ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న పోలీసులు అతడి కోసం గాలింపు చేపట్టారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

నమో వెంకటేశా.. నమో తిరుమలేశా...

- అళహరి వంశీయులచే దేవస్థానం స్థాపన
- హనుమద్దాసుల ప్రచారంతో ఖ్యాతి గడించిన దేవస్థానం
- శేషసాయి పడగనీడలో కొలువుదీరిన స్వామివారు

పాలమూరులోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి 600 ఏళ్ల చరిత్ర

మహబూబ్‌నగర్ రూరల్: ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పేరెన్నికగన్న శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం కలియుగ వైకుంఠంగా బాసిల్లుతోంది. తెలంగాణ తిరుపతిగా ఖ్యాతికెక్కింది. కొలిచిన వారికి కొంగు బంగారమై విరాజిల్లుతోంది. మహబూబ్‌నగర్ నుంచి 17 కిలోమీటర్ల దూరంలో రాయచూర్ అంతర్రాష్ట్ర రహదారి పక్కన ఎత్తైన గుట్టలపై మన్యంకొండ దేవస్థానం కొలువుదీరింది. స్టేజీ నుంచి మూడు కిలోమీటర్ల మేర ఘాట్‌రోడ్డు గుండా వెళ్తే స్వామివారి దేవస్థానం ఉంటుంది. దాదాపు 600 సంవత్సరాల చరిత్ర గల స్వామి దేవస్థానం దినదినాభివృద్ధి చెందుతూ భక్తుల పాలిట ఇలవేల్పు దైవంగా మారింది. తవ్వని కోనేరు, చెక్కని పాదాలు, ఉలి ముట్టని స్వామి ఇక్కడి ప్రత్యేకత. ఇంత విశిష్టత గల స్వామివారి దేవస్థానానికి ప్రతి ఏడాది వేలాది మంది భక్తులు వచ్చి దర్శించుకుంటారు. ప్రతి సంవత్సరం స్వామివారి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. కేవలం ఒక్క ఉత్సవాల్లోనే దాదాపు లక్షకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకొని తరిస్తారు. ఏటా స్వామివారికి భక్తుల నుంచి దాదాపు రూ.1.50 కోట్లకు పైగా ఆదాయం వస్తుంది.



మన్యంకొండ దేవస్థానం (ఇన్‌సెట్‌లో) మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి వారు

దేవస్థానం చరిత్ర..

600 సంవత్సరాల క్రితం తమిళనాడులోని శ్రీరంగం సమీపంలోని అళహరి గ్రామ నివాసి అళహరి కేశవయ్య కలలో శ్రీనివాసుడు కనిపించి కృష్ణానది తీరప్రాంతంలో గల మన్యంకొండపై నేను వెలిసి ఉన్నానని సెలవిచ్చారు. దీంతో ఆయన తన తండ్రి అనంతయ్యతో పాటు కుటుంబసభ్యులతో కలిసి మన్యంకొండ సమీపంలో గల కోటకదిరలో నివాసం ఏర్పరుచుకొని గుట్టపైకి వెళ్లి స్వామివారికి సేవ చేయడం ప్రారంభించారు. కేశవయ్య దక్షిణాది గల అన్ని దివ్యక్షేత్రాలు సందర్శించడం ప్రారంభించారు. ఓ రోజు కృష్ణానదిలో స్నానం చేసి సూర్యభగవానుడికి నమస్కరించి ఆయన దోసిలితో అర్ఘ్యం వదులుతున్న సమయంలో చెక్కని శిలారూపంలో గల వేంకటేశ్వరస్వామి ప్రతిమ నదిలో అలల ద్వారా వచ్చి కేశవయ్య దోసిలిలో నిలిచింది. దీంతో నదిలో నుంచి వచ్చి దోసిలిలో నిలిచిన విగ్రహాన్ని పరిశీలించగా.. ఆ విగ్రహం శ్రీనివాసుడిగా గుర్తించారు. ఆ విగ్రహాన్ని తీసుకొచ్చి మన్యంకొండపై శేషషాయి రూపంలో గల గుహలో ప్రతిష్ఠించి నిత్య ధూప దీప నైవేద్యంతో స్వామిని ఆరాధించడం ప్రారంభించారు. అంతేకాకుండా దేవస్థానం మండపంలో ఆంజనేయస్వామి, గరుడ్వాలర్ విగ్రహాన్ని కూడా ప్రతిష్ఠించారు. ఈ దేవస్థానం సమీపంలో మునులు తపస్సు చేయడంతో ఈ దేవస్థానం మన్యంకొండగా వినతికెక్కింది. దేవస్థానం ఎదురుగా ఉన్న గుట్టపై అప్పట్లో మునులు తపస్సు చేసిన గుహ ఇప్పటికీ ఉంది. కొన్నేళ్ల పాటు మన్యంకొండపై నిరంతరం పూజలు జరిగిన తర్వాత పూజలు ఆగిపోయాయి.

హనుమద్దాసుల కీర్తనలతో ఖ్యాతి..

అళహరి వంశానికి చెందిన హనుమద్దాసుల వారి కీర్తనలతో మన్యంకొండ ఖ్యాతి గడించింది. దీంతో ఆగిపోయిన స్వామి పూజలు మళ్లీ ప్రారంభమయ్యాయి. హనుమద్దాసుల వారు మళ్లీ పూజలు ప్రారంభించి స్వామివారికి సంబంధించి దాదాపు 300 కీర్తనలు రచించారు. ఈ కీర్తనలు అందరినీ ఎంతో ఆకట్టుకున్నాయి. దేవస్థానం చరిత్రను చాటిచెప్పాయి. హనుమద్దాసుల కృషిని తెలుసుకున్న గద్వాల, వనపర్తి సంస్థానాధీశులు మన్యంకొండకు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే స్వామివారి ఉత్సవాలకు తమవంతు ధర్మంగా అన్ని ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో తమ సైనికులతో కలిసి ప్రతి ఏడాది మన్యం కొండకు వచ్చి స్వయంగా ఏర్పాట్లు చేసేవారు. ఏనుగులతో స్వామివారికి సేవా కార్యక్రమాలు నిర్వహించేవారు. స్వామివారు నిజంగా ఉన్నారని నిరూపించడానికి హనుమద్దాసుల వారు ఎన్నో పనులు చేసి చూపించారు. అప్పట్లో ఆయన దేవస్థానం వద్ద కోనేరును తవ్వించడంతో పాటు పెద్దగుడి గంటను కూడా ఏర్పాటు చేశారు. ఆ గంట ఇప్పటికీ చైర్మన్ గది పక్కన కనిపిస్తుంది. హనుమద్దాసుల తర్వాత ఆయన వంశానికి చెందిన అళహరి రామయ్య దేవస్థానం బాధ్యతలు తీసుకున్నారు. వంశపారంపర్య ధర్మకర్తగా ఉండటంతో పాటు దేవస్థానం అభివృద్ధికి ఎంతో కృషి చేశారు.

స్వామివారి సేవ చేసిన అళహరి వంశీయులు వీరే..

మన్యంకొండ స్వామివారి సేవలో అళహరి వంశీయులు చేసిన కృషి ఎంతో ఉంది. వారిలో అళహరి అనంతయ్య, కేశవయ్య, రంగయ్య, వెంకయ్య, పాపయ్య, హనుమద్దాసు, మేఘయ్య, అనంతయ్య, రామయ్య, వెంకటస్వామి, నారాయణస్వామి ఉన్నారు. ప్రస్తుతం అదే వంశానికి చెందిన అళహరి మధుసూదన్‌కుమార్ వంశపారంపర్య ధర్మకర్తగా కొనసాగుతున్నారు. దేవస్థానం స్థాపనకు కృషి చేసిన అళహరి వంశీయుల వంశవృక్షానికి తెలియజెప్పే చిత్రపటం దేవస్థానంలో ఏర్పాటు చేశారు. కొంతమంది ఫొటోలను కూడా ఏర్పాటు చేశారు.

తెలంగాణ తిరుపతి మన్యంకొండ

తిరుపతికి మన్యంకొండకు చాలా దగ్గరి పోలికలు ఉండటంతో తెలంగాణ తిరుపతిగా మన్యకొండను పిలుస్తారు. ఆర్థిక స్తోమత లేని భక్తులు మన్యంకొండకు వచ్చి స్వామివారిని దర్శించుకుంటే తిరుపతికి వెళ్లినంత పుణ్యం లభిస్తుందని భక్తుల విశ్వాసం. తిరుపతిలో ఏడుకొండలు ఎక్కి స్వామివారిని దర్శించుకుంటారు. అలాగే మన్యంకొండలో కూడా దేవస్థానం చుట్టూ ఏడు కొండలు ఉన్నాయి. అంతేకాకుండా ఇలాంటి పోలికలు చాలా ఉన్నాయి. మన్యంకొండ దేవస్థానానికి చాలా మంది భక్తులు తమ సహకారం అందిస్తుండటంతో దేవస్థానం దినదినాభివృద్ధి చెందుతోంది.

ఒక్కొక్కరు ఒకరిగా.. ముందుకు

అళహరి మధుసూదన్‌కుమార్, చైర్మన్, మన్యంకొండ దేవస్థానం మన్యంకొండ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం కలియుగ వైకుంఠంగా బాసిల్లుతోంది. తవ్వని కోనేరు, చెక్కని పాదాలు, ఉలి ముట్టని స్వామివారు ఇక్కడ ప్రత్యేకం. ఇంత విశిష్టత గల స్వామివారిని వేలాది మంది భక్తులు దర్శించుకుంటారు.

స్వామివారి సేవలో అళహరి వంశీయుల కృషి ఎంతో ఉంది. వంశీయుల్లో ఒక్కొక్కరు ఒకరిగా ముందుకు నడుస్తున్నాం. ప్రస్తుతం స్వామివారి సేవలో తాను పదవ తరం వంశీయుడిగా కొనసాగుతున్నా. ప్రతి సంవత్సరం స్వామివారి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం. రాష్ట్రంలోనే ఆదర్శ దేవస్థానంగా తీర్చిదిద్దడానికి తమవంతు కృషి చేస్తున్నాం.



మునులు తపస్సు చేశారని చెబుతున్న గుహ



మన్యంకొండలో స్వామివారి పాదాలు



మన్యంకొండ శిఖరం



మన్యంకొండలో గరుత్మంతుడి విగ్రహం

పామ్ కెర్నల్ ఆయిల్‌తో సిరులు

- అధిక ధర పలుకుతున్న పామ్ కెర్నల్ ఆయిల్
- సౌందర్య ఉత్పత్తుల తయారీలో వినియోగం
- అప్పారావుపేట ఫ్యాక్టరీలో ప్రత్యేక ప్లాంట్



దమ్మపేట: ఆయిల్‌ఫెడ్ ఫ్యాక్టరీల్లో పామాయిల్ ఉత్పత్తి ఏళ్లుగా జరుగుతోంది. ఇదే సమయంలో ఉప ఉత్పత్తి అయిన పామ్ కెర్నల్ ఆయిల్ సైతం ప్రస్తుతం మంచి డిమాండ్ పలుకుతోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం అప్పారావుపేటలో పామాయిల్ ఫ్యాక్టరీని 2017లో నిర్మించారు. ఆ తర్వాత ఏడాది 2018లో పామ్ కెర్నల్ ఆయిల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఆయిల్ ఇప్పుడు ఏటా 5 వేల టన్నులకు పైగా ఉత్పత్తి అవుతోంది.

తయారీ ఇలా..

పామాయిల్ గెలలోని కాయల గుజ్జు నుంచి ముడి పామాయిల్‌ను ఉత్పత్తి చేస్తారు. ఆపై గుజ్జు లోపల ఉన్న గింజ నుంచి పామ్ కెర్నల్ ఆయిల్ తయారు చేస్తారు. గింజపై పెంకును తొలగిస్తే లోపల ఎండిన కొబ్బరిలాంటి గుండ్రటి ఆకారంలో పదార్థం ఉంటుంది. దీనిని ముక్కలుగా చేసి క్రషింగ్ చేస్తే ముడి పామ్ కెర్నల్ ఆయిల్ వస్తుంది. ఇందులో సంతృప్త కొవ్వు ఆమ్లాలు అధికంగా ఉండటం వల్ల చాలా ఎక్కువ కాలం నిల్వ ఉంటుందని, అధిక ఉష్ణోగ్రతల వద్ద కూడా స్థిరంగా ఉంటుందని చెబుతున్నారు.

మంచి ధర..

ప్రస్తుత మార్కెట్లో టన్ను ముడి పామ్ కెర్నల్ ఆయిల్ ధర రూ.1,60,000కు పైగా పలుకుతోంది. అప్పారావుపేట ఫ్యాక్టరీలో ఏటా సుమారు 55 వేల టన్నుల ముడి పామాయిల్, 5 వేల టన్నులకు పైగా పామ్ కెర్నల్ ఆయిల్ ఉత్పత్తి అవుతోంది. టన్ను పామాయిల్ గెలల నుంచి సుమారు 1.85 శాతం కెర్నల్ ఆయిల్ రికవరీ రాగా, ఒక టన్ను పామాయిల్ గింజల నుంచి 18.5 శాతం కెర్నల్ ఆయిల్ రికవరీ వస్తుందని అధికారులు చెబుతున్నారు.

సౌందర్య ఉత్పత్తులు, తినుబండారాల్లో..

పామ్ కెర్నల్ ఆయిల్‌ను సౌందర్య ఉత్పత్తులైన సబ్బులు, తలకు వాడే నూనె తయారీలో వాడతారు. అంతేకాక బేకరీలో విక్రయించే తినుబండారాల్లోనూ వాడుతున్నారు. ఇక ఆయిల్ తయారీ అనంతరం వచ్చిన ముద్ద వంటి పిప్పిని పశువులు, కోళ్లు, చేపల దాణాగా ఉపయోగిస్తారు. పామాయిల్ గింజపై ఉన్న పెంకులను ఫ్యాక్టరీ బాయిలర్‌లో మంట కోసం, అగర్‌బత్తీలు, దోమల నివారణ బిళ్లల తయారీలో వినియోగిస్తారు.

బొగ్గు బ్లాకుల వేలంపై సింగరేణి ఆసక్తి

ప్రణాళికతో ముందుకు..



బొగ్గు వెలికితీతలో సింగరేణికి అపార అనుభవం ఉంది. కొత్త బొగ్గు బ్లాకులను దక్కించుకుంటేనే సంస్థలకు ఉజ్వల భవిష్యత్ ఉంటుంది. వచ్చే ఐదేళ్లలో 10 గనులు మూతపడి 8వేల మంది ఉద్యోగులు తగ్గిపోయే అవకాశం ఉంది. సింగరేణి బొగ్గు కొనుగోలు చేసే వినియోగదారులు సొంతంగా బొగ్గు బ్లాక్‌లు దక్కించుకుని అదే బొగ్గును వాడుకుంటున్నారు. పోటీ మార్కెట్‌లో దీటుగా ముందుకు సాగేందుకు సంస్థకు కొత్తబొగ్గు బ్లాకులు అత్యవసరం.

– ఎస్.బలరాం, సీఎండీ, సింగరేణి

రాబోయే ఐదేళ్లలో 10 గనుల మూత

- 8 వేల మంది ఉద్యోగులు తగ్గే అవకాశం
- 109 బొగ్గు బ్లాకులను దక్కించుకున్న ఇతర సంస్థలు
- సొంత బ్లాకులతో వినియోగదారులు దూరం

గోదావరిఖని: కేంద్ర ప్రభుత్వం చేపట్టే వేలం పాటలో 109 బొగ్గు బ్లాకులను ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు దక్కించుకున్నాయి. కొత్త బ్లాకుల కేటాయింపుతో సింగరేణి సంస్థ వినియోగదారులు దూరం అవుతోంది. ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, పశ్చిమబెంగాల్, అరుణాచల్‌ప్రదేశ్‌లో కేంద్రప్రభుత్వం వేలం ద్వారా 109 బ్లాకులను ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలకు అప్పగించింది. బొగ్గు బ్లాకులను దక్కించుకోవాలంటే వేలం పాటలో పాల్గొనాల్సి ఉన్నందున సింగరేణి ఆసక్తి చూపుతోంది.

అప్పట్లో రెండే సంస్థలు..

దేశంలో బొగ్గు ఉత్పత్తి చేసేవి సింగరేణి, కోల్ ఇండియానే. కానీ కేంద్ర ప్రభుత్వం చేపట్టే బొగ్గు బ్లాకుల వేలంతో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలూ బొగ్గు రంగంలోకి ప్రవేశించాయి. సింగరేణి బొగ్గు కొనుగోలు చేసే సంస్థలు కూడా బొగ్గు ఉత్పత్తి రంగంలోకి అడుగిడాయి. దీంతో రాబోయే రోజుల్లో వినియోగదారులు గణనీయంగా తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు.



ఒడిశాలోని సింగరేణి నైనీ బ్లాక్ ప్రధాన కార్యాలయం

మరిన్ని రంగాలపై సింగరేణి నజర్

బొగ్గు వెలికితీతలో అగ్రగామిగా నిలిచిన సింగరేణి థర్మల్, సోలార్, హైడ్రో, హైడల్ విద్యుదుత్పత్తిలోనూ దూసుకెళ్తోంది. క్రిటికల్ మినరల్ కోసం అన్వేషిస్తోంది. బంగారు గనులూ దక్కించుకుంది. విదేశాల్లోని బొగ్గు గనుల నిర్వహణకూ కోసం యత్నిస్తోంది. వరుస లాభాలు సాధిస్తూ, దేశంలోనే ఏసంస్థలో లేనివిధంగా కార్మికులకు వాటా ఇస్తోంది. రాష్ట్ర రాజకీయాల్లో కూడా కీలక స్థానం దక్కించుకుంది.

ఉమ్మడి నాలుగు జిల్లాల్లో..

ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో విస్తరించిన సింగరేణి సామాజిక సేవలోనూ పాలుపంచుకుంటోంది. ఈక్రమంలోనే కష్ట, క్లిష్ట పరిస్థితుల్లో బొగ్గు బ్లాకుల వేలంపై దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. కొన్ని గనుల్లో బొగ్గు నిల్వలు అడుగంటి పోవడంతో రాబోయే ఐదేళ్లలో 10 బొగ్గు గనులు మూసివేయడం, కొత్త గనులు రాక.. ఉద్యోగులను తొలగిస్తే పరిస్థితి అధ్వానంగా మారే అవకాశం ఉంది. ఇల్లెందు, మణుగూరు, ఆర్జీ-వన్, మందమర్రి, బెల్లంపల్లి లాంటి ఏరియాల మనుగడ ప్రశ్నార్థకమయ్యే ప్రమాదం ఉంది. ఈ గనులు మూతపడితే 8వేల మంది ఉద్యోగులకు ఉద్వాసన తప్పదని అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. దీన్ని అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి ఉన్నతాధికారులు కొత్త బ్లాకులను దక్కించుకునేందుకు వేలంలో పాల్గొనాల్సిందేనని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

బొగ్గు బ్లాక్‌లు దక్కించుకున్న ప్రభుత్వ సంస్థలు, సంఖ్య

ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్	1
అస్సాం మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్	3
గుజరాత్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్	3
ఎన్‌ఎల్సీ ఇండియా	2
ఎన్‌ఎల్సీఐఎల్	1
ఎన్టీపీసీ మైనింగ్	1
డబ్ల్యూసీఎల్	1
తమిళనాడు జెన్కో	1

భారీగా ఉత్పత్తి పెంచిన కోల్ ఇండియా

దేశంలోనే అత్యధిక బొగ్గు ఉత్పత్తి చేసే కోల్ ఇండియా ఉత్పత్తిని గణనీయంగా పెంచింది. 500 మిలియన్ టన్నుల నుంచి 880 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తి లక్ష్యం వైపు సాగుతోంది. సింగరేణి 60 మిలియన్ టన్నుల నుంచి 70 మిలియన్ టన్నుల వరకే సాధిస్తోంది. మరోవైపు.. విద్యుత్ ఉత్పత్తిలో పేరుగాంచిన ఎన్టీపీసీ 80 మిలియన్ టన్నుల లక్ష్యంతో బొగ్గు ఉత్పత్తి వైపు చేరుకుంది. ఇది సింగరేణికంటే ఎక్కువ. ఎన్‌ఎల్సీ ఇండియా 65 మిలియన్ టన్నుల సామర్థ్యం ఉన్న బొగ్గు బ్లాక్‌ను ఇప్పటికే దక్కించుకుంది. ఈ సంస్థలు 200 మిలియన్ టన్నుల ఉత్పత్తి దిశగా సాగుతున్నాయి.

సింగరేణి భవిష్యత్‌పై సవాళ్లు..

బొగ్గు డిమాండ్ ఇంకా 25 ఏళ్లపాటు మాత్రమే ఉండే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. ఈ సమయంలో కొత్త బ్లాకులను సాధించి పోటీ మార్కెట్లో నిలబడటం సింగరేణికి తప్పనిసరిగా మారింది. సత్తుపల్లి, కోయగూడెం బ్లాక్‌లను కోల్పోవడంతో ఇప్పటికే అపార నష్టం జరిగిందని చెబుతోంది. సింగరేణి బొగ్గు కొనుగోలు చేస్తున్న ఎన్టీపీసీ, తమిళనాడు జెన్‌కో, ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ సంస్థలు సొంతంగా బొగ్గు బ్లాకులను వేలంలో దక్కించుకున్నాయి.

వేలంలో వెనుకంజ..

గతంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కోయగూడెం, సత్తుపల్లి బొగ్గు బ్లాక్‌ల వేలంలో సింగరేణి పాల్గొనలేదు. దీంతో రూ.60 వేల కోట్లకు పైగా ఆదాయం, రూ.15 వేల కోట్ల లాభం కోల్పోవాల్సి వచ్చిందని అంటున్నారు. ప్రభుత్వ ఖజానాకు పన్నుల రూపంలో వెళ్లే ఆదాయానికీ గండి పడింది. కోయగూడెం బ్లాక్‌లో సుమారు 120 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలను వెలికితీయడానికి అవకాశం ఉంది. ఇందులో టన్నుకు కనిష్టంగా రూ.3,300 మేరకు విక్రయించే అవకాశం ఉంది. దీనిద్వారా ఈ ఒక్కగని నుంచే రూ.40 వేల కోట్ల రెవెన్యూ వచ్చే అవకాశం ఉంది. సత్తుపల్లి బ్లాక్‌లో 70 మిలియన్ టన్నుల నిక్షేపాలున్నట్లు అంచనా. దీనిద్వారా రూ.23 వేల కోట్ల రెవెన్యూ తగ్గిపోయింది. ఈరెండు గనుల ద్వారా సుమారు 5వేల మంది స్థానికులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించే అవకాశాలున్నాయి. బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొనకపోవడంతో సింగరేణి పుట్టినిల్లయిన ఇల్లందు ఏరియా భవిష్యత్ మరో 23 ఏళ్లు తగ్గిపోయింది.

వేలంతో ప్రయోజనాలివే..

బొగ్గు బ్లాకుల వేలంతో కొత్త బ్లాక్‌లను సాధించుకోవచ్చు. సింగరేణి మనుగడకు దీర్ఘకాలిక భద్రత లభిస్తుంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయి. రాష్ట్ర ప్రభుత్వానికి డీఎంఎఫ్టీ నిధులు పెరిగే అవకాశం ఉంది. ఉత్పత్తి వ్యయం తగ్గనుంది. సమీప ప్రాంతాలు సామాజిక, ఆర్థిక అభివృద్ధి సాధించే అవకాశం ఉంది. పాఠశాలలు, ఆస్పత్రులు, రహదారులు, తాగునీరు వంటి వసతులు మెరుగుపడతాయి.

అమ్మబోతే కన్నీరు పెట్టిస్తున్న ఉల్లి





బండెనక బండికట్టి.. పదహారు బండ్లుకట్టి.. కాదు కాదు.. నూటొక్క ట్రాక్టర్ బండ్లు వరుసగా క్యూకట్టి ఏ ధర వస్తుందో తెలియక దీన స్థితిలో వేచి చూస్తున్న దృశ్యమిది. ఉల్లి రైతుల కడగండ్లకు అద్దం పడుతోందీ దృశ్యం. ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు క్వింటా రూ.1,200 కాదు కదా.. అందులో సగం ధరతో కూడా కొనుగోలు చేయక పోవడంతో కర్నూలు మార్కెట్ యార్డు వద్ద ఉల్లి లోడ్‌లతో వచ్చిన వాహనాలు భారీ సంఖ్యలో బారులు తీరాయి. ఈ సరుకు ఎప్పడమ్ముడు పోతుందో తెలియక రైతులు రేయింబవళ్లు అక్కడే వేచి ఉంటుండటం పరిపాటిగా మారింది. రెండో రకం ఉల్లికి కిలోకు రూ.2, 3 ఇస్తామంటుండటంతో కొందరు రైతులు విసిగి వేసారి పంటను రోడ్డు పక్కన పడేసి వెళ్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివిగా అన్నదాతల పరిస్థితి దయనీయంగా మారింది.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు ప్రారంభం



చిల్లకూరు : గూడూరులోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం రాష్ట్రస్థాయి ఏడవ ర్యాంకింగ్ చెస్ పోటీలు ప్రారంభం అయ్యాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన చిన్నారులు, పెద్ద క్రీడాకారులు సుమారు 194 మంది ఈ పోటీల్లో పాల్గొంటున్నారని నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ పోటీలపై ఆసక్తి నెలకొందన్నారు. చెస్ టోర్నమెంటు డైరెక్టర్‌గా షేక్ షరీఫా, చీఫ్ ఆర్బిటరీగా బాలాజీ చౌదరి వ్యవహరిస్తున్నారు. ఈ పోటీలను ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ రవిప్రసాద్, రాయ్ చెస్ అకాడమి డైరెక్టర్ షేక్ అబ్దుల్ అజీజ్, తిరుపతి చెస్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాసమూరి, గూడూరు చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నరేంద్రచౌదరి, రవిబాబు పర్యవేక్షిస్తున్నారు.

నేటి నుంచి లాసెట్ అడ్మిషన్ల ప్రక్రియ షురూ

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీ ఆధ్వర్యంలో జరిగిన ఏపీ లాసెట్ మూడు, ఐదు సంవత్సరాల ప్రక్రియకు ఎట్టకేలకు నోటిఫికేషన్ విడుదలైంది. సోమవారం నుంచి 11వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరగనుంది. ఈనెల 12వ తేదీ నుంచి 14 వతేదీ వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. 15న వెబ్ ఆప్షన్ల మార్పునకు అవకాశం కలిపిస్తూ 17వ తేదీన సీట్ల కేటాయింపు చేయనున్నారు. అలాగే బీఈడీ కోర్సులకు సైతం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఉన్నత విద్యామండలి ఆదేశాలు జారీ చేసింది.

ప్రశాంతంగా పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలు

తిరుపతి అర్బన్ : ప్రశాంతంగా పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలను ఆదివారం తిరుపతిలోని ఆరు కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్స్‌లో నిర్వహించామని జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు తెలిపారు. ఆదివారం తిరుపతిలోని పలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫారెస్ట్ అసిస్టెంట్ బీట్, బీట్, సెక్షన్ ఆఫీసర్లకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల నిర్వహణకు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి 12.30 వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5.30 గంటల వరకు పరీక్షలు చేపట్టామని వెల్లడించారు. ఉదయం పరీక్షల్లో 10,493 మంది అభ్యర్థులకు 8,670 మంది మాత్రమే హాజరయ్యారని పేర్కొన్నారు. 1823 మంది హాజరు కాలేదని స్పష్టం చేశారు. అలాగే మధ్యాహ్నం పరీక్షల్లో 1690 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 1335 మంది మాత్రమే వచ్చారని చెప్పారు. 358 మంది హాజరు కాలేదని వివరించారు.

'భూగర్భ' శోకం

వర్షాలు అధికంగా కురిసి వాగులు, వంకలు, నదుల్లో నీరు పోటెత్తింది. పొలాలు నీట మునిగి తీవ్ర పంట నష్టం వాటిల్లింది. రాష్ట్ర ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోకపోవడంతో నీరంతా వృథాగా సముద్రం పాలైంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో చాలా చోట్ల ఈ ఏడాది 'భూగర్భ' శోకమే మిగిలింది. చెరువులు, ఊట కుంటల్లో నీరు స్వల్పంగా కనిపి స్తోంది. భూగర్భ జలాలు లేక వ్యవసాయ బోర్లు పనిచేయకపోవడం, బావుల్లో నీరు అరకొరగా ఉండటంతో సాగు ప్రశ్నార్థకంగా మారింది.

- అడుగంటిన భూగర్భ జలాలు
- బావులు, బోర్ల కింద సాగు దయనీయం
- గతేడాది 6.78 మీటర్లలో జలం
- ఈ ఏడాది 7.80 మీటర్లకు పడిపోయిన వైనం
- మొత్తం 1.02 మీటర్ల తగ్గిన భూగర్భ జలాలు
- కోసిగి, ఓర్వకల్లు, గోనెగండ్ల మండలాల్లో పరిస్థితి దారుణం

కర్నూలు(అగ్రికల్చర్): వర్షాకాలంలోనే భూగర్భ జలాల పరిస్థితి దయనీయంగా తయారైంది. సాధారణంగా జూలై నెలలోనే ఉమ్మడి కర్నూలు జిల్లాలో చెరువులు, కుంటలు నీటితో నిండి కళకళలాడుతూ ఉండేవి. ఈ సారి పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. కొన్ని మండలాల్లో భారీ వర్షాలు కురిసినప్పటికీ చెరువుల్లోకి నీరు చేరలేదు. కుంటలు వెలవెలబోతూ కనిపించాయి. వర్షాకాలం మొదలై మూడు నెలలు అవుతున్నా పరిస్థితిలో మార్పు రాలేదు. మే నెలలో వర్షాలు మురిపించినప్పటికీ జూన్, జూలై నెలల్లో అంతంతమాత్రానికే పరిమితం కావడంతో భూగర్భ జలాలు పడిపోయాయి.

అడుగంటిన ఆశలు

కర్నూలు జిల్లాలో మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు 246 ఉన్నాయి. అధికారుల లెక్కల ప్రకారం వీటి కింద 27,707 ఎకరాల భూములు ఉన్నాయి. మొత్తం 50 శాతం ట్యాంకుల్లో నీటి నిల్వలు అంతంతమాత్రమే ఉన్నాయి. ఫలితంగా భూగర్భ జలాలుఎ పడిపోయాయి. జిల్లా మొత్తం మీద 2024 నవంబరు నెలలో సగటున 6.78 మీటర్లలో భూగర్భజలాలు ఉన్నాయి. అయితే 2025 జూలై నెలలో 7.80 మీటర్లలోకి పడిపోయాయి. గతేడాది నవంబరు నెలతో పోలిస్తే ఈ సారి జూలైలో 1.02 మీటర్ల లోతులోకి భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. ఫలితంగా బావులు, బోర్లు, మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల కింద సాగు ముందుకు సాగని పరిస్థితి ఏర్పడింది. వ్యవసాయ బావులు, బోర్ల కింద రైతులు పంటలు సాగు చేయలేని దుస్థితిలో ఉన్నారు.

'కాకి' లెక్కలు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద భూగర్భ జలాలు పెరగడానికి అవసరమైన పనులు చేపట్టాల్సి ఉంది. అయితే టీడీపీ నేతలు అక్రమ సంపాదనకు అవకాశం ఉండే పనులవైపు మొగ్గు చూపారు. పనులన్నీ కాగితాలపై కనిపిస్తున్నా... క్షేత్రస్థాయిలో కనిపించని పరిస్థితి ఏర్పడింది. 2024–25లో అటవీ ప్రాంతాలు, బీడు భూముల్లో 726, 2025–26లో 114 డగౌంట్ పాండ్స్ నిర్మించినట్లు లెక్కలు ఉన్నాయి. 2025–26లో 8,500 పాంఫాండ్స్ నిర్మించాల్సి ఉండగా 4,000 పాంఫాండ్స్ పనులు పూర్తయ్యాయని లెక్కలు చెబుతున్నాయి. ఇవన్నీ కాగితాల్లోనే కనిపిస్తున్నాయని విమర్శలు వస్తున్నాయి.



గోనెగండ్ల మండలంలో భూగర్భ జలాలు లేక వృథాగా ఉండిపోయిన బోరు



వెల్దుర్తి మండలంలో నీరు లేక ఎండిపోయిన వ్యవసాయ బావి

కనిపించని పురోగతి

చేసిన పనులనే మళ్లీ చేస్తుండటంతో భూగర్భ జలాల్లో పురోగతి కనిపించడం లేదు. జలసంరక్షణ, భూగర్భ జలాల అభివృద్ధి లక్ష్యంగా ఎక్కడా పనులు చేయలేదు. కాల్వలు, చెక్‌డ్యామ్‌లు, చెరువులు, కుంటల్లో పూడికతీత పనులకు ప్రాధాన్యత ఇచ్చారు. డగౌటు పాండ్స్, ఫాంపాండ్స్ వంటి వాటిని నిర్మించలేదు. ఇవన్నీ కాగితాల్లోనే ఉండటం, క్షేత్రస్థాయిలో కనిపించకపోవడంతో వర్షాలు పడుతున్నా భూగర్భ జలాలు పెరగలేదు.

ప్ర'జల' కష్టాలు ఇవీ..

- మండల కేంద్రమైన గోనెగండ్లలో 2024 నవంబరులో 1.14 మీటర్లలోనే భూగర్భ జలాలు ఉన్నాయి. ప్రస్తుతం 8.77 మీటర్ల లోతులో కనిపిస్తున్నాయి. గత ఏడాది నవంబరు నెలతో పోలిస్తే నేడు 7.63 మీటర్ల మేర జలాలు తగ్గిపోయాయి.
- కోసిగి మండలం వందగల్లు గ్రామంలో 2024 జూలైలో భూగర్భ జలాలు 38.75 మీటర్లలో ఉన్నాయి. 2025 మే నెలలో 40.02 మీటర్లలోకి పడిపోయాయి. జూలై నెలలో 39.65 మీటర్ల లోతులో కనిపించాయి. వర్షాకాలంలో భూగర్భ జలాలు పెరుగాల్సి ఉండగా తగ్గడంపై రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- కోసిగి, ఓర్వకల్లు, గోనెగండ్ల మండలాల్లో వెయ్యి అడుగుల మేర బోరు వేసినా గంగమ్మ బయటికి రాని పరిస్థితి ఏర్పడింది.
- జిల్లాలో 1,14,286 బోరు బావులు ఉన్నాయి. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో వానా కాలంలోనే 30 శాతం బో ర్లు మరుగున పడ్డాయి. రానున్న రోజుల్లో వర్షాలు పడితే వీటిల్లో భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఇదీ దుస్థితి..

- కర్నూలు జిల్లాలో 26 మండలాలు ఉన్నాయి. వీటిలో 18 మండలాల్లో భూగర్భ జలాల పరిస్థితి నిరాశజనకంగా ఉంది.
- జూన్ నెల సాధారణ వర్షపాతం 77.7 మి.మీ. ఉండగా 74.3 మి.మీ. మాత్రమే నమోదైంది.
- జూలై నెల సాధారణ వర్షపాతం 90.7 మి.మీ. ఉండగా 76.2 మి.మీ. మాత్రమే నమోదైంది.
- అంతంతమాత్రం వర్షాలు పడటం, చెరువుల్లో సంతృప్తికరంగా నీరు చేరకపోవడంతో భూగర్భ జలాలు ఆందోళన కలిగిస్తున్నాయి.
- జిల్లాలో భూగర్భ జలాలను అంచనా వేసేందుకు 62 పిజియోమీటర్లు ఉన్నాయి. ఈ ఏడాది జూలై లెక్కలను పరిశీలిస్తే భూగర్భ జలాలు అడుగంటాయి. జిల్లాలో సగానికిపైగా గ్రామాల్లో పరిస్థితి దారుణంగా ఉందని భూగర్భ జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు.
- కోసిగి, ఓర్వకల్లు, ఆస్పరి, కౌతాళం, హాలహర్వి, ఆదోని, ఆలూరు, దేవనకొండ, హాలహర్వి, కోడుమూరు, కర్నూలు అర్బన్, మంత్రాలయం, నదవరం, పెద్దకడుబూరు, వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల్లో భూగర్భ జలాలు పెరగలేదు. దీంతో ఉద్యాన పంటలు, కూరగాయలు పంటల సాగు పుంజుకోలేదు.

భూగర్భ జలాలు తగ్గాయి

ఈ ఏడాది జూన్, జూలై నెలల్లో వర్షాలు తక్కువగా ఉండటం భూగర్భ జలాలపై ప్రభావం పండింది. వరుసగా రెండు నెలలు లోటు వర్షపాతం నమోదు కావడంతో జిల్లా భూగర్భ జలాలు తగ్గిపోయాయి. గత ఏడాది ఇదే సమయంతో పోల్చి చూస్తే సగానికిపైగా మండలాల్లో భూగర్భ జలాలు తగ్గిపోయినట్లు స్పష్టం అవుతోంది. అయితే ఆగస్టు నెలలో వర్షాలు కురవడంతో ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– ఎం.శ్రీనివాసరావు, డీడీ, గ్రౌండ్ వాటర్


ముగిసిన పవిత్రోత్సవాలు

పెంచలకోన క్షేత్రంలో



రాపూరు : ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో జరుగుతున్న పవిత్రోత్సవాలలో భాగంగా ఆదివారం లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి శేష వాహనంపై మాడ వీధుల్లో ఊరేగారు. స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను శేష వాహనంపై కొలువుతీర్చి క్షేత్రోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామి వారి అలంకార మండపంలో ఉత్సవ విగ్రహాలకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. శాంతి హోమం, పూర్ణాహుతి , నివేదన, మహాకుంభప్రోక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు సీతారామయ్యస్వామి మాట్లాడుతూ.. మహాపూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగిశాయన్నారు.

శ్రీకాళహస్తిలో..



శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు ఆదివారం ముగిశాయి. మూల విరాట్‌కు పవిత్ర మాలధారణతో విశేష పూజలు ముగిశాయి. ఆలయ అర్చకులు విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం యాగశాల నుంచి పవిత్రమాలలు విశేష పూజా ద్రవ్యాలను ఊరేగింపుగా తీసుకెళ్లి వినాయకుడికి పవిత్రమాల సమర్పించారు. అనంతరం వినాయకుడు, జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి పవిత్రమాలల సమర్పణ వేడుకగా చేపట్టారు.

పద్మావతి అమ్మవారి ఆలయంలో..



చంద్రగిరి : తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన పవిత్రోత్సవాలు ఆదివారం మహాపూర్ణాహుతితో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం శాస్త్రోక్తంగా మహాపూర్ణాహుతి, శాంతి హోమం, కుంభప్రోక్షణ, నివేదన చేపట్టారు. అమ్మవారితో పాటు శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్‌కు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఆ తర్వాత చక్రత్తాళ్వార్‌ను పల్లకీపై ఊరేగింపుగా పద్మ పుష్కరిణి వద్దకు తీసుకెళ్లి శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. దీంతో పవిత్రోత్సవాలను పరిసమాప్తం చేశారు.

బ్రిటన్ మినిస్టర్ కావడమే లక్ష్యం

- యూకే స్టూడెంట్స్ ఎన్నికల్లో గెలుపే రాజకీయాల వైపు నడిపించింది
- రెండుసార్లు కౌన్సిలర్‌గా గెలుపొందా
- అందరితో కలుపుగోలుతనమే నా విజయ రహస్యం
- అక్కడి రాజకీయల్లోను అంతర్గత కుమ్ములాటలు, వివక్ష సహజమే
- 'సాక్షి'తో లండన్‌లోని కెన్సింగ్టన్ అండ్ చెల్సియా డిప్యూటీ మేయర్ ఆర్యన్ ఉదయ్
- స్వస్థలం భీమవరంలో సహవిద్యార్థులతో మమేకం



సాక్షి, భీమవరం: బ్రిటన్ మినిస్టర్ కావడమే తన లక్ష్యమని లండన్‌లోని రాయల్ బరో ఆఫ్ కెన్జింగ్టన్ అండ్ చెల్సియా డిప్యూటీ మేయర్ ఆర్యన్ ఉదయ్ ఆరేటి చెప్పారు. యూకే కాలేజీలో తెలుగు విద్యార్థుల పట్ల వివక్షకు వ్యతిరేకంగా పోరాడి స్టూడెంట్ ఎన్నికల్లో గెలవడమే తన రాజకీయ ప్రవేశానికి కారణమని తెలిపారు. అనంతరం కన్జర్వేటివ్ పార్టీలో చేరి రెండుసార్లు కౌన్సిలర్‌గా గెలిచినట్లు చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం సమీపంలోని తుందుర్రు గ్రామానికి చెందిన ఆర్యన్ ఉదయ్ శుక్రవారం.. భీమవరం వచ్చారు. తాను చదువుకున్న సెయింట్ మెరీస్ స్కూల్‌లో విద్యార్థులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. తన బాల్యం, చదువు, బ్రిటన్ రాజకీయాల్లో ఎదుగుదల, తన లక్ష్యాల గురించి వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

టెన్నిస్ కోసం లండన్‌కు

మాది భీమవరం పక్కనే ఉన్న తుందుర్రు గ్రామం. ఆరేటి వీరాస్వామి, గొబ్బిలమ్మ తాత నాయనమ్మ. తండ్రి వెంకట సత్యనారాయణ కేజీఆర్ ప్రిన్సిపల్‌గా పని చేశారు. తల్లి విజయలక్ష్మి, సోదరి ఇంద్రాణి. 7వ తరగతి వరకు భీమవరంలోని సెయింట్ మేరీస్ స్కూల్‌లో చదువుకున్నా. అప్పటికే ఏపీ తరఫున టెన్నిస్ ఆడుతున్న నేను ఆటపై ఆసక్తితో 8వ తరగతి హైదరాబాద్‌లో చేరాను. స్కూల్ నేషనల్స్, ఇంటర్ స్టేట్ కాంపిటీషన్స్‌కు ఏపీ కెప్టెన్‌గా వ్యవహరించాను. నా స్నేహితులు చాలామంది యూఎస్, యూకే వెళ్లేవారు. గ్రాడ్యుయేషన్ తరువాత టెన్నిస్ కోసం యూకే వెళ్లాను. 2006లో ఏయూ స్కాలర్‌షిప్ రావడంతో లండన్‌లో ఎంఎస్ చేశాను.

రాజకీయాల్లోకి..

యూకే కాలేజీలో తెలుగు విద్యార్థుల పట్ల వివక్ష పూరిత సంఘటనలకు వ్యతిరేకంగా పోరాడేవాడిని. అప్పుడే స్టూడెంట్స్ ఎన్నికల్లో గెలవడం నాలో ఆత్మస్థైర్యం, నమ్మకం పెంచాయి. చదువు అనంతరం అక్కడే ఉండి బిజినెస్ చేసుకుంటూ కన్జర్వేటివ్ పార్టీ ఫాలోవర్‌గా ఉన్నాను. అక్కడి సిటిజన్‌షిప్ కూడా వచ్చింది. బ్రిగ్జిట్ టైంలో డేవిడ్ కేమరూన్ టీంలో చేరాను. నా అనాలసిస్, స్ట్రాటజీని చూసి కన్జర్వేటివ్ పార్టీ తరఫున పనిచేయాలని ప్రోత్సహించేవారు. 2014లో పార్టీలో సభ్యుడిగా చేరాను. రెండు, మూడు సంవత్సరాలు పార్టీ విధివిధానాలు, రాజకీయ పరిస్థితులను సైలెంట్‌గా అబ్జర్వ్ చేస్తూ వచ్చాను. ఇక్కడి మాదిరి అక్కడ కూడా రాజకీయ పార్టీల్లో అంతర్గత విభేదాలు, వివక్ష కామనే. ఈ పరిస్థితులను బట్టి బ్రిటిష్ వాళ్లు మనల్ని రూల్ చేయలేదు. మన అంతర్గత కొట్లాటలతో మనమే పాలించబడ్డామని నా అభిప్రాయం.

ఎవరినీ తక్కువ అంచనా వేయకూడదు

యువత కులమతాలు, ప్రాంతీయ విభేదాలు విడిచిపెట్టి కలిసుండాలి. అనవసరమైన ఆర్భాటాలు, పబ్లిసిటీలకు దూరంగా ఉండాలి. ఎవరినీ తక్కువ అంచనా వేయకుండా లక్ష్యాన్ని చేరేందుకు ముందుకు సాగాలి.

2018, 2022ల్లో సెంట్రల్ కౌన్సిలర్‌గా ఎన్నిక

నిజాం కాలేజీలో ఇంటర్ చదువుతున్న రోజుల్లో ఆర్ఎస్ఎస్‌కు ఆకర్షితుడినయ్యాను. లండన్‌లోను దేవాలయాలకు వెళ్లి దీపారాధన చేసేవాడిని. భారతీయులు, మన సంప్రదాయాలను ఎంతో గౌరవించే పార్టీ ఛైర్మన్, మాజీ మేయర్ జూలీమీల్స్ నన్ను ఎంతో ప్రోత్సహించేవారు. అందరితో కలుపుగోలుతనం నాకు కలిసొచ్చింది. ఇంటర్నల్ ఓటింగ్‌లో తెల్లవాళ్లకంటే అత్యధిక మెజార్టీ సాధించడంతో 2017లో నాకు సీట్ డిక్లేర్ అయ్యింది. 2018లో జరిగిన ఎన్నికల్లో మొదటిసారి సెంట్రల్ కౌన్సిలర్‌గా గెలిచాను. కౌన్సిలర్ అంటే ఇక్కడ ఎమ్మెల్యేతో సమానం. 2022 ఎన్నికల్లోను వరుస విజయాన్ని అందుకున్నాను. లండన్‌లోని ముఖ్యమైన ప్రాంతానికి డిప్యూటీ మేయర్‌గా సుమారు రెండున్నర లక్షలమందికి ప్రాతినిధ్యం వహిస్తున్నాను. ప్లానింగ్, లైసెన్సింగ్, ఎన్విరాన్‌మెంట్ తదితర కీలక కమిటీల్లో సభ్యుడిగా ఉన్నాను. మేయర్ అందుబాటులో లేని సమయంలో ఆ బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది. భారత్, బ్రిటన్ ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్‌లో అక్వా, ఎన్విరాన్‌మెంట్‌కు సంబంధించి కొన్ని పాలసీలు చేయాలని అనుకున్నాం. కానీ సెంట్రల్ స్థాయిలో మా పార్టీ ఓడిపోవడంతో అది సాధ్యం కాలేదు. భవిష్యత్తులో ఆ దిశగా కృషిచేస్తాను. దేవుడి దయతో ఈ స్థాయికి వచ్చాను. వచ్చే ఎన్నికల్లో మేయర్ కావాలన్నదే నా లక్ష్యం. ఎంపీ కావడం, అనంతరం మినిస్టర్ అవడం తదుపరి లక్ష్యాలు.

ఆది శంకరుడు సౌందర్యలహరి రాసిన చోటు.
రాజతరంగిణిలో కల్హణుడు చెప్పిన కథనాల నేల.
సోన్‌మార్గ్ మంచు మీద వెండి వెన్నెల విహారం.
గుల్‌మార్గ్ కేబుల్ కార్‌లో విహంగ వీక్షణం.
పహల్‌గామ్ కుంకుమ పువ్వు తోటల ప్రయాణం.
ఐదు వేల అడుగుల ఎత్తులోదాల్ లేక్ శికార్ రైడ్.
నీటి మీద నడిచే రాజమందిరం హౌస్‌బోట్ స్టే.
షాలిమార్ గార్డెన్స్‌లో గిలిగింతల పర్యాటకం.
ఆరు రోజుల్లో వీటన్నింటినీ చూపించే టూర్ ఇది.



గుల్‌మార్గ్ కేబుల్ కార్ రైడ్

శ్రీనగర్ టూర్...

మంచుతోటలో చందమామ కథ

1 వ రోజు
హైదరాబాద్ నుంచి మధ్యాహ్నం 14.40 గంటలకు 6ఈ–6253 విమానంలో శ్రీనగర్‌కి ప్రయాణం. సాయంత్రం 17.40 గంటలకు విమానం శ్రీనగర్‌కు చేరుతుంది. శ్రీనగర్ ఎయిర్‌పోర్టులో టూర్ నిర్వాహకులు రిసీవ్ చేసుకుంటారు. హోటల్‌లో చెక్ ఇన్ తర్వాత సాయంత్రం ఫ్రీ టైమ్. పర్యాటకులు ఎవరికి వారు సిటీలో నచ్చిన ప్రదేశంలో విహరించవచ్చు. రాత్రి బస శ్రీనగర్‌లో.


సోనామార్గ్



హౌస్ బోట్ – దాల్ లేక్


దాల్ లేక్ విహారం

2 వ రోజు
బ్రేక్‌ఫాస్ట్ తర్వాత శ్రీనగర్ నుంచి టూరిస్ట్ బస్సులో సోన్‌మార్గ్‌కు ప్రయాణం. సోన్‌మార్గ్ పర్యటన పూర్తి చేసుకుని సాయంత్రానికి తిరిగి శ్రీనగర్‌కు రావాలి. రాత్రి బస శ్రీనగర్‌లో. సోన్‌మార్గ్‌కు చేరిన తర్వాత టూరిస్ట్ బస్ ఒక పాయింట్‌లో ఆగుతుంది. పర్యాటకులు బస్సు దిగి స్థానికంగా ఉన్న పోనీ (చిన్న గుర్రం)లను సొంత ఖర్చుతో అద్దెకు తీసుకుని పర్యటించాలి.


వెండి వెన్నెల
సోనామార్గ్‌కు రోడ్డు మార్గంలో ప్రయాణం ఆద్యంతం కళ్లు మిరుమిట్లు గొలుపుతుంది. శ్రీనగర్ నుంచి 80 కిలోమీటర్ల దూరాన ఉంది సోనామార్గ్. ఈ ప్రదేశం తొమ్మిది వేల అడుగుల ఎత్తులో ఉంది. కొండల మీద తెల్లటి మంచు పొడి పొడిగా పై నుంచి బియ్యప్పిండి పోసినట్లు ఉంటుంది. మంచు మీద పడిన సూర్యుడి కిరణాలు సప్తవర్ణాలను ప్రతిఫలిస్తుంటాయి. మంచు మీద వెండి వెన్నెల విన్యాసాలు కనువిందు చేస్తాయి. ఈ పర్యటనకు మే నుంచి అక్టోబర్ వరకు వెళ్లగలం. శీతాకాలంలో మంచు కురుస్తుంటుంది. తజివాస్ గ్లేసియర్ శీతాకాలంలో గడ్డకట్టి వేసవి కాలంలో కరిగి ప్రవహిస్తుంది. సోనామార్గ్ నుంచి ఈ ప్రదేశానికి పోనీల మీద వెళ్లవచ్చు. ఇక్కడ ట్రెకింగ్ చేయవచ్చు. పోనీలు నడిపే వాళ్లను అడిగితే జలపాతాల దగ్గరకు కూడా తీసుకువెళ్తారు.


బేతాబ్ వ్యాలీ – పహల్‌గామ్


మంచులో పైన్ వృక్షాలు – పహల్‌గామ్


3 వ రోజు
బ్రేక్‌ఫాస్ట్ తర్వాత శ్రీనగర్ నుంచి గుల్‌మార్గ్‌కు ప్రయాణం. గుల్‌మార్గ్‌లో గోండాలా కేబుల్ కార్ రైడ్ టికెట్‌లను పర్యాటకులు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలి. ఆసక్తి ఉన్న వారు గుల్‌మార్గ్ నుంచి కిలాన్‌మార్గ్‌కు కి ట్రెక్కింగ్ చేయవచ్చు. సాయంత్రం టూరిస్ట్ బస్ గుల్‌మార్గ్ నుంచి శ్రీనగర్‌కు బయలుదేరుతుంది. రాత్రి బస శ్రీనగర్‌లో.

గుల్‌మార్గ్ మంచు తివాచీ
గుల్‌మార్గ్ పెద్ద స్కీయింగ్ స్పాట్. శ్రీనగర్ నుంచి 50 కిమీల దూరాన ఉంది. మంచు అంటే అలా ఇలా కాదు, అర అడుగు మందంలో తెల్లటి తివాచీ పరిచినట్లు ఉంటుంది. ఇక్కడ గోండాలా కేబుల్ కార్‌లో ప్రయాణిస్తూ విహంగ వీక్షణం చేయవచ్చు. కిందకు చూస్తే తెల్లగా పరుచుకున్న మందపాటి మంచు మిలమిల మెరుస్తూ ఉంటుంది. స్కీయింగ్‌లో నిష్ణాతులు కాకపోయినప్పటికీ హెల్పర్స్ సహాయంతో ప్రయత్నం చేయవచ్చు. ఇక్కడ మహారాణి టెంపుల్, సెయింట్ మేరీస్ చర్చ్ ఉన్నాయి. గుల్‌మార్గ్ ప్రాచీన నామం గౌరీమార్గ్. గౌరీదేవి మార్గంగా పిలిచేవారు. మొఘల్ పాలకుడు జహంగీర్ ఇక్కడ పూలతోటలను పెంచడంతో గుల్‌మార్గ్‌గా వాడుకలోకి వచ్చింది. ఇక్కడ ఇప్పుడు మనం చూస్తున్న గోల్ఫ్ కోర్స్, స్కీ జోన్ వంటి ఆధునిక సౌకర్యాలన్నీ బ్రిటిష్ పాలకులు ఏర్పాటు చేసినవే. వారు ఈ ప్రదేశాన్ని వేసవి విడిదిగా, విహార కేంద్రంగా ఆస్వాదించేవాళ్లు. గుల్‌మార్గ్ ఎనిమిది వేలకు పైగా అడుగుల ఎత్తులో ఉంది. అక్కడి నుంచి కేబుల్ కార్‌లో దాదాపు 14 వేల అడుగుల ఎత్తున్న మౌంట్ అఫర్వాత్ శిఖరానికి చేరడం ఓ గిలిగింత. ఇక్కడ పర్యటిస్తున్నప్పుడు చిన్నప్పుడెప్పుడో చూసిన హిందీ సినిమాలు గుర్తుకు వస్తే మీ జ్ఞాపకశక్తికి సలామ్ చేయాలి. ఎందుకంటే ఇక్కడ డింపుల్ కపాడియా, రిషీకపూర్ నటించిన సూపర్ డూపర్ హిట్ సినిమా 'బాబీ' చిత్రీకరణ ఇక్కడే జరిగింది. ఇంకా అనేక బాలీవుడ్ సినిమాలు ఈ లొకేషన్‌లో విజువల్ రిచ్‌నెస్‌ని ఉపయోగించుకున్నాయి. గుల్‌మార్గ్‌లో మరో వింత ఇగ్లూ కేఫ్. ఇగ్లూ అంటే మంచు ఖండంలో మంచుతో కట్టే ఇల్లు. ఇగ్లూ రెస్టారెంట్‌లో భోజనం చేసిన అనుభూతిని సొంతం చేసుకోవచ్చు. భోజన సమయం కాకపోతే ఇగ్లూ కేఫ్‌లో కాఫీ, టీ తాగడం మరిచిపోవద్దు.




శంకరాచార్య టెంపుల్


నిషాద్‌బాగ్ – శ్రీనగర్



4 వ రోజు
బ్రేక్‌ఫాస్ట్ తర్వాత శ్రీనగర్ నుంచి పహల్‌గామ్‌కు ప్రయాణం. పహల్‌గామ్‌లో టూరిస్ట్ బస్ దిగిన తర్వాత సొంత ఖర్చులతో ప్రైవేట్ జీపులు, పోనీలతో పగలంతా పహల్‌గామ్ పర్యటన పూర్తి చేసుకోవాలి. సాయంత్రం బస్ హోటల్‌కు బయలుదేరుతుంది. హోటల్‌లో చెక్ ఇన్. రాత్రి బస పహల్‌గామ్‌లో.

స్విస్ కాదు ఇండియానే!
పహల్‌గామ్‌కు పర్యాటక ప్రాధాన్యం మాత్రమే కాదు, ప్రాచీన పౌరాణిక ప్రాధాన్యత కూడా ఉంది. శివుడు తన వాహనం నందిని ఇక్కడ వదిలాడని కథనం. ఇక్కడ ఉన్న లిద్దర్ వ్యాలీ, బైసరన్ వ్యాలీ, బేతాబ్ వ్యాలీ అరు వ్యాలీలు ఒకదానిని మించి మరొకటి ప్రకృతి సౌందర్యాన్ని వైవిధ్యతను ఇముడ్చుకున్నాయా అనిపిస్తుంది. స్విట్జర్లాండ్‌లో ఉన్నామా భారత్‌లో ఉన్నామా అనే సందేహం కలుగుతుంది కూడా. ఇంత అందమైన ప్రదేశాలు మనదేశంలో ఉండగా ఇక పాశ్చాత్యదేశాల విహారం ఎందుకు... అనిపిస్తుంది. కుంకుమ పువ్వు తోటల మధ్య ప్రయాణం సాగుతుంది. చెట్లు ఎత్తుగా ఆకాశాన్ని తాకడానికే ఎదుగుతున్నట్లుంటాయి. అతి శీతల వాతావరణం కావడంతో కొమ్మలు పక్కలకు విస్తరించవు. చెట్ల ఆకుల మీద ముగ్గు చల్లినట్లు మంచు రేణువులు వాలి ఉంటాయి. సూర్యకిరణాలకు ఆవిరవుతూ సాయంత్రం నుంచి మళ్లీ కొత్త మంచు చేరుతూ ఉంటుంది. పహల్‌గామ్‌లో పర్యటిస్తున్నప్పుడు ఇదేదో సినిమాలో చూసిన ప్రదేశంలా ఉందేంటబ్బా అనిపిస్తుంది. ఎందుకంటే ఇక్కడ అనేక సినిమాల చిత్రీకరణ జరుగుతుంది. అరువ్యాలీ, బేతాబ్ వ్యాలీ, చందన్‌వారీ వ్యాలీలను చూడవచ్చు. లిద్దర్ వ్యాలీలో గోల్ఫ్ కోర్స్ ఉంది. ఆడే సమయం లేకపోయినా చూసి రావచ్చు. ఇదంతా చదివిన తర్వాత మీకు ఒక విషయం గుర్తుకు వచ్చి ఉండాలి. అదే... పహల్‌గామ్, బైసరన్ వ్యాలీ. ఈ రెండు పదాలకు కలిపి చదువుకుంటే ఏప్రిల్‌లో టీఆర్‌ఎఫ్ ఉగ్రదాడి గుర్తుకు వస్తుంది. 28 మంది అమాయక పర్యాటకులను పొట్టన పెట్టుకున్న సంఘటన కళ్ల ముందు మెదలుతుంది. ప్రస్తుతం అక్కడ పరిస్థితులు పూర్తిగా చక్కబడ్డాయి. బందోబస్తు కూడా పటిష్ఠంగా ఉంది.


గుల్‌మార్గ్ స్నో బైక్ రైడ్


షాలిమార్ గార్డెన్స్ – శ్రీనగర్


పరిమహల్ – శ్రీనగర్

5 వ రోజు
బ్రేక్‌ఫాస్ట్ తర్వాత పహల్‌గామ్ నుంచి శ్రీనగర్‌కు ప్రయాణం. శంకరాచార్య ఆలయ దర్శనం. సాయంత్రం దాల్ లేక్‌లో శికారా రైడ్, దాల్ లేక్ అలల మీద సూర్యాస్తమయాన్ని ఆస్వాదించడం, ఫ్లోటింగ్ గార్డెన్స్ మధ్య విహారం, సాయంత్రం హౌస్‌బోట్‌లో చెక్ ఇన్. రాత్రి భోజనం, బస హౌస్‌బోట్‌లో.

కల్హణుడు చెప్పాడు
ఇది శంకరాచార్య టెంపుల్‌గా వ్యవహారంలోకి వచ్చింది, కానీ ఇక్కడ పూజలందుకునే దేవుడు శివుడు. ఆది శంకరాచార్యుడు భారతదేశ పర్యటనలో భాగంగా ఇక్కడికి వచ్చాడని చెబుతారు. అంతే కాదు సౌందర్యలహరిని ఇక్కడే రాశాడని కూడా చెబుతారు. రాజతరంగిణి గ్రంథంలో కల్హణుడు ఈ ఆలయం గురించి అనేక విషయాలను పొందుపరిచాడు. శ్రీనగర్ అంతటినీ ఓ పది నిమిషాల్లో చూడాలంటే ఆది శంకరాచార్య ఆలయమే రైట్ పాయింట్. ఇక్కడి నుంచి చూస్తే దాల్ లేక్, జీలం నది, హరిపర్బత్ వంటి ముఖ్యమైన ప్రదేశాలన్నీ కనిపిస్తాయి.

ఐదు వేల అడుగుల ఎత్తులో శికారా రైడ్
శికారా అంటే పై కప్పు ఉన్న చెక్కతో చేసిన పడవ. ఈ సరస్సు ఐదు వేల అడుగుల ఎత్తులో ఉంది. దాల్ లేక్‌లో శికారా రైడ్ ఒక మధురానుభూతి. శీతాకాలంలో నీరు గడ్డకడుతుంది. దాల్‌లేక్ నీరు మరీ ఎక్కువగా గడ్డకట్టినప్పుడు ఆ మంచు మీద వాహనాలను నడపడం, క్రికెట్ ఆడడం వంటి సరదాలు చేస్తుంటారు. అయితే ఏటా ఈ స్థాయిలో నీరు గడ్డకట్టదు. శికారాతోపాటు హౌస్‌బోట్ విహారం, బస కూడా ఎక్స్‌పీరియెన్స్ చేసి తీరాలి. విదేశీ పర్యాటకులను ఆకట్టుకోవడం కోసం హౌస్‌బోట్‌లకు హాలీవుడ్, యంగ్ హాలీవుడ్, క్వీన్స్ లాప్ వంటి పేర్లు పెడతారు. ఈ హౌస్‌బోట్‌లు ఏదో రాత్రి బస కోసం చేసిన చిన్న ఏర్పాటులా ఉండదు. రాజమందిరంలాగ ఉంటుంది. నీటి మీద తేలుతున్న రాజభవనంలో బస చేసినట్లు ఉంటుంది. దాల్ లేక్‌లో ఫ్లోటింగ్ గార్డెన్స్ మాత్రమే కాదు ఫ్లోటింగ్ ఏటీఎమ్ కూడా ఉంది. ఫ్యాబ్రికేటెడ్ వాల్స్‌తో చేసిన గదిలో ఎస్‌బీఐ ఏటీఎమ్ సెంటర్ నిర్వహిస్తోంది. ఇక్కడ పర్యటిస్తుంటే ఆమ్‌స్టర్‌డామ్‌లోని ఫ్లోటింగ్ ఫ్లవర్ మార్కెట్‌లో విహరిస్తున్నట్లు ఉంటుంది. కశ్మీర్‌ను ప్యారడైజ్ ఆన్ ఎర్త్ అని ఎందుకంటారో ఇక్కడ విహరిస్తే అవగతమవుతుంది. కేరళలో బోట్‌హౌస్‌లో బస, విహారం చేసిన వాళ్లు శ్రీనగర్ హౌస్‌బోట్ కూడా అలాగే ఉంటుందని లైట్ తీసుకోవద్దు. దేనికదే ప్రత్యేకమైన అనుభూతి.

6 వ రోజు
ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తర్వాత హౌస్‌బోట్ చెక్ అవుట్ చేయాలి. మొఘల్ గార్డెన్స్, బొటానికల్ గార్డెన్స్, షాలిమార్ గార్డెన్స్ సందర్శనం తర్వాత శ్రీనగర్ ఎయిర్‌పోర్టుకు చేర్చి, టూర్ నిర్వాహకులు వీడ్కోలు పలుకుతారు. సాయంత్రం 18.20 గంటలకు 6ఈ– 6255 విమానంలో శ్రీనగర్ నుంచి ప్రయాణం, ఈ విమానం రాత్రి 21.20 గంటలకు హైదరాబాద్‌కు చేరుతుంది.

ఉద్యావనాల కశ్మీరం
కశ్మీర్‌లోని మొఘల్ గార్డెన్స్ ఆరు చోట్ల ఉన్నాయి. ఇవన్నీ నిజానికి మొఘలులు మనదేశంలోకి రావడానికి రెండు వందల ఏళ్ల ముందు నుంచే ఉన్నాయి. పర్షియా నుంచి కశ్మీర్‌కు వచ్చిన పాలకులు, పర్షియన్ ప్రభావం ఉన్న పరిసర ప్రదేశాల పాలకులు ఇక్కడ చక్కటి ఉద్యానవనాలను ఏర్పాటు చేశారు. నిషాద్ బాగ్, షాలిమార్ బాగ్, అచల్బాల్ బాగ్, చష్మా షాహీ, పరి మహల్, వెరినాగ్ అలా ఏర్పడినవే. మొఘలులు మనదేశానికి వచ్చిన తర్వాత అక్బర్, జహంగీర్, షాజహాన్‌లు ప్రత్యేక దృష్టి పెట్టి వాటిని అభివృద్ధి చేశారు. అందమైన పూలతోటల మధ్య రాజవంశస్తుల విడిది భవనాలుంటాయి. ఈ గార్డెన్స్‌లో పర్యటన అక్టోబర్ నుంచి పూలు విచ్చుకోవడం మొదలవుతుంది. మార్చి వరకు పూలు సువాసనలు విరజిమ్ముతుంటాయి. నెహ్రూ మెమోరియల్ బొటానికల్ గార్డెన్‌ను కూడా చక్కగా మెయింటెయిన్ చేస్తుంటారు. శీతల పవనాల మధ్య చక్కగా విరిసిన పూలు, మెత్తగా రాలిపడుతున్న పూల రెక్కల మధ్య విహారం లైఫ్ టైమ్ ఎక్స్‌పీరియెన్స్ అనే చెప్పాలి.

శ్రీనగర్ టూర్ ప్యాకేజ్
- ప్యాకేజ్ పేరు 'మిస్టికల్ కశ్మీర్ ఎక్స్ హైదరాబాద్'. ప్యాకేజ్ కోడ్ ఎస్‌హెచ్‌ఏ11. ఇది ఆరు రోజుల టూర్. హైదరాబాద్ నుంచి మొదలై హైదరాబాద్‌కు చేరడంతో పూర్తయ్యే ఈ టూర్‌లో కశ్మీర్‌లోని శ్రీనగర్, గుల్‌మార్గ్, సోన్‌మార్గ్, పహల్గామ్ కవర్ అవుతాయి.
- ఈ పర్యటనలు అక్టోబర్ ఆరవ తేదీన మరియు నవంబర్ 13వ తేదీన మొదలవుతాయి. ఎవరికి సాధ్యమైన ట్రిప్‌లో వారు బుక్ చేసుకోవచ్చు.
- ప్యాకేజ్ ధరలిలాగ ఉన్నాయి. సింగిల్ ఆక్యుపెన్సీలో 45,100 రూపాయలు, డబుల్ ఆక్యుపెన్సీలో ఒక్కొక్కరికి 34,950, ట్రిపుల్ ఆక్యుపెన్సీలో ఒక్కొక్కరికి 33,510 రూపాయలు.
- ప్యాకేజ్‌లో... విమానం టికెట్‌లు, నాలుగు రోజులు హోటల్ బస, ఒక రోజు హౌస్‌బోట్‌లో బస, బ్రేక్‌ఫాస్ట్‌లు, రాత్రి భోజనాలు, ఐటెనరీలో సూచించిన ప్రదేశాలకు రవాణా, టూర్ ఎస్కార్ట్ సౌకర్యం, ట్రావెల్ ఇన్సూరెన్స్, టోల్ ఫీజులు, పార్కింగ్ ఫీజు, పన్నులు వర్తిస్తాయి.
- పర్యాటక ప్రదేశాల ఎంట్రీ ఫీజులు, మధ్యాహ్న భోజనాలు, ఇంటి నుంచి ఎయిర్‌పోర్టుకు రవాణా, విమానంలో కొనుక్కునే ఆహారపదార్థాలు–డ్రింకులు, పర్యాటక ప్రదేశాల్లో లోకల్ రవాణా, రైడ్‌ల ఖర్చులు ప్యాకేజ్‌లో వర్తించవు. పర్యాటకులు విడిగా భరించాలి.
- గోండాలా కేబుల్ కార్ బుక్ చేసుకోవడానికి లింక్: https://www.jammukashmircablecar.com/

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి



మీరు లక్ష్యాలను చేరుకోవడానికి ప్రయత్నించకపోతే,
వాటిని పెట్టుకోవడం వ్యర్థమే.
- డాన్ కాన్లే, ప్రముఖ ఆర్థిక సలహాదారుడు

దేశ, విదేశీ గణాంకాలు కీలకం

- ప్రపంచ మార్కెట్ల పరిస్థితులకూ ప్రాధాన్యం
- ఈ వారం దేశీ మార్కెట్ల ట్రెండ్‌పై అంచనాలు

ప్రధానంగా దేశ, విదేశీ ద్రవ్యోల్బణ గణాంకాలు ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లకు కీలకంగా నిలవనున్నాయి. వీటికితోడు జీఎస్‌టీ సంస్కరణల ప్రభావం, యూఎస్‌తో వాణిజ్య పరిస్థితులు తదితరాలు సైతం ప్రభావం చూపనున్నట్లు మార్కెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు. యూఎస్ అదనపు టారిఫ్‌ల అమలు ప్రతికూల ప్రభావాన్ని చూపగా.. జీఎస్‌టీ సంస్కరణలు జోష్ నివ్వడంతో గత వారం ఆటుపోట్ల మధ్య మార్కెట్లు 1 శాతంపైగా బలపడ్డాయి. వివరాలు చూద్దాం..

- సాక్షి, బిజినెస్ డెస్క్

వస్తు, సేవల పన్ను(జీఎస్‌టీ) సంస్కరణలకు గత వారం తెరతీయడంతో పలు రంగాలకు లబ్ధి చేకూరనున్నట్లు విశ్లేషణలు వెలువడుతున్నాయి. దీంతో ఇటీవల మందగించిన ఆటో రంగంతోపాటు.. ఎఫ్ఎంసీజీ, ఆతిథ్యం, వినియోగ, ఫుట్‌వేర్ తదితర రంగాలు పుంజుకోనున్నట్లు పరిశ్రమవర్గాలు అంచనా వేస్తున్నాయి. ఫలితంగా దేశీ స్టాక్ మార్కెట్లకు సైతం జోష్ వచ్చినట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. కాగా.. ఈ వారం దేశ, విదేశీ ద్రవ్యోల్బణ గణాంకాలు వెలువడనున్నాయి. ఆగస్ట్ నెలకు వినియోగ ధరల ద్రవ్యోల్బణ(సీపీఐ) వివరాలు శుక్రవారం(12న) వెలువడనున్నాయి. జూలైలో రిటైల్ ధరల రేటు(సీపీఐ) వరుసగా 9వ నెలలోనూ వెనకడుగు వేసింది. 2.1 శాతం నుంచి 1.55 శాతానికి తగ్గింది.

ద్రవ్యోల్బణం, విదేశీ పెట్టుబడులపై కన్ను



చైనా వాణిజ్య మిగులు..

ఆగస్ట్ నెలకు చైనా వాణిజ్య గణాంకాలు నేడు(8న) వెల్లడికానున్నాయి. జూలై చైనా వాణిజ్య మిగులు 98.24 బిలియన్ డాలర్లను తాకింది. దిగుమతులను మించుతూ ఎగుమతులు భారీగా పెరిగిపోవడం మిగులు**కు దారి** చూపే సంగతి తెలిసిందే. ఇక ఆగస్ట్ **సీపీఐ** వివరాలు బుధవారం(10న) వెలువ**డను**న్నాయి. జూలైలో సీపీఐ 0.1 శా**తం** పెరిగింది.

ఇతర అంశాలు

యూఎస్ వాణిజ్య టారిఫ్‌లు, ప్రపంచ స్టాక్ మార్కెట్లలో నెలకొనే పరిస్థితులు, విదేశీ ఇన్వెస్టర్ల తీరు, ముడిచమురు ధరలు, ఆరు ప్రపంచ కరెన్సీలతో మారకంలో డాలరు కదలికలు వంటి అంశాలు సైతం దేశీయంగా సెంటిమెంటుకు కీలకంగా నిలవనున్నట్లు మార్కెట్ నిపుణులు వివరించారు. యూఎస్ గణాంకాలకుతోడు భారత్‌తో వాణిజ్య టారిఫ్‌లపై వార్తలు ఇన్వెస్టర్లను ప్రభావితం చేయనున్నట్లు రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ ఎస్‌వీపీ అజిత్ మిశ్రా పేర్కొన్నారు. అయితే ఇన్వెస్టర్లు వినియోగ ఆధారిత, పెట్టుబడి వ్యయాలకు సంబంధించిన రంగాలవైపు దృష్టిసారించే వీలున్నట్లు స్వస్తికా ఇన్వెస్ట్‌మార్ట్ సీనియర్ టెక్నికల్ అనలిస్ట్ **ప్రవేశ్** గౌర్ తెలియజేశారు. మార్కెట్లలో అ**ప్రమత్తత** కనిపించనున్నట్లు పేర్కొన్నారు. అటు **యూఎ**స్ టారిఫ్‌ల అమలు, ఇటు జీఎస్‌టీ సంస్క**రణల** నేపథ్యంలో ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లకు **కీలకం**గా నిలవనున్నట్లు మాస్టర్ ట్రస్ట్ గ్రూప్ **డైరె**క్టర్ పునీత్ సింఘానియా అభిప్రాయప**డ్డా**రు. కాగా.. ఈ వారం ద్రవ్యోల్బణ గణాం**కాలే**కాకుండా ఈసీబీ వడ్డీ పాలసీ సమీక్ష, **జ**పాన్ రెండో త్రైమాసిక(ఏప్రిల్–జూన్) **జీ**డీపీ వివరాలు వెల్లడికానున్నట్లు మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వెల్త్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా వెల్లడించారు.

యూఎస్ నిరుద్యోగిత

యూఎస్ నిరుద్యోగ గణాంకాలు ఆగస్ట్ చివరి వారంలో 8,000 పెరిగి 2,37,000కు చేరాయి. వెరసి నిరుద్యోగ లబ్ధి దరఖాస్తులు జూన్ తదుపరి అధికంగా నమోదయ్యాయి. గత నెల**లో** ప్రయివేట్ రంగ ఉపాధి 54,000 పుంజు**కో**గా.. జూలైలో వాణిజ్య లోటు దాదాపు 33 శాతం పెరిగి 78 బిలియన్ డాలర్లను దాటింది. జూలైలో కోవిడ్–19 తదుపరి గరిష్టస్థాయిలో నిరుద్యోగిత నమోదైంది. ట్రంప్ వాణిజ్య టారిఫ్‌లు, తదితర **అంశాలు ఉపాధిని దెబ్బతీసినట్లు ఆర్థికవేత్తలు పేర్కొన్నారు. దీంతో ఫెడరల్ రిజర్వ్ ఈ నెల 16–17 తేదీలలో చేపట్టనున్న పాలసీ సమీక్షలో వడ్డీ రేట్ల కోతకు మొ**గ్గు చూపవచ్చన్న అంచనాలు బలపడ్డాయి. ఈ బాటలో ఆగస్ట్ నెలకు యూఎస్ ఉత్పత్తిదారుల ధరల ఇండెక్స్ 10న వెల్లడికానుంది. జూలైలో ఇది 0.9% బలపడింది. గత నెల ద్రవ్యోల్బణ వివరాలు 11న వెల్లడికానున్నాయి. జూలైలో కీలక ద్రవ్యోల్బణం వార్షికంగా 2.7% పెరిగింది.

గత వారమిలా..

ప్రధానంగా జీఎస్‌టీ సంస్కరణలు ఆకట్టుకోవడంతో గత వారం దేశీ స్టాక్ మార్కెట్లు బౌన్స్‌బ్యాక్‌ను సాధించాయి. దీంతో యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ విధించిన 25 శాతం అదనపు సుంకాలు సైతం అమల్లోకి వచ్చిన ప్రతికూల వార్తలను అధిగమిస్తూ మార్కెట్లు నికరంగా లాభపడ్డాయి. గత వారం బీఎస్ఈ సెన్సెక్స్ 901 పాయింట్లు(1.1 శాతం) బలపడి 80,711 వద్ద నిలిచింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ సైతం 314 పాయింట్లు(1.3 శాతం) ఎగసి 24,741 వద్ద స్థిరపడింది. అయితే బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్స్‌లు నామమాత్రంగానే లాభపడటం గమనార్హం!

అమ్మకాలు వీడని ఎఫ్‌పీఐలు

ఈ నెల తొలి వారంలో రూ. 12,257 కోట్లు ఔట్

న్యూఢిల్లీ: గత కొద్ది వారాలుగా దేశీ స్టాక్స్‌లో **విక్రయాలకే** అధిక ప్రాధాన్యమిస్తున్న విదేశీ **పోర్ట్‌ఫోలియో** ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) గత వారం సైతం ఇదే బాటను అనుసరించారు. వెరసి ఈ నెల తొలి వారంలో నికరంగా 1.4 బిలియన్ డాలర్ల(రూ. 12,257 కోట్లు) పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. గత నెల(ఆగస్ట్)లో రూ. 34,900 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించిన ఎఫ్‌పీఐలు జూలైలో రూ. 17,700 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్న సంగతి తెలిసిందే. దీంతో ఈ కేలండర్ ఏడాది(2025)లో ఇప్పటివరకూ దేశీ ఈక్విటీల నుంచి నికరంగా ఎఫ్‌పీఐలు రూ. 1.43 లక్షల కోట్ల పెట్టుబడులను ఉపసంహరించారు. ఇటీవల యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ భారత్‌పై అదనపు సుంకాల విధింపునకు తెరతీయడంతో పాటు.. అమలు చేయడంతో సెంటిమెంటు బలహీనపడినట్లు మార్కెట్‌నిపుణులు పేర్కొన్నారు. ప్రధానంగా ఎగుమతి ఆధారిత రంగాలపై ప్రతికూల ప్రభావం పడనున్న అంచనాలు పెట్టుబడుల ఉపసంహరణకు దారి చూపుతున్నట్లు తెలియజేశారు. అయితే ఈ వారం యూఎస్ ఉపాధి గణాంకాలు, ఫెడ్ పాలసీ సమీక్ష, ఆర్‌బీఐ రేట్ల నిర్ణయాలపై అంచనాలు ప్రభావం చూపనున్నట్లు ఏంజెల్ వన్ సీనియర్ ఫండమెంటల్ అనలిస్ట్ వఖార్‌జావేద్ ఖాన్ వివరించారు.

సెబీకి ఫిజిక్స్‌వాలా అప్‌డేట్

ఐపీవోకు తాజా ముసాయిదా పత్రాలు

న్యూఢిల్లీ: ఎడ్‌టెక్ యూనికార్న్ సంస్థ ఫిజిక్స్‌వాలా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి అప్‌డేటెడ్ ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఐపీవో చేపట్టేందుకు వీలుగా సెబీకి తాజా ముసాయిదా పత్రాలను అందించింది. రూ. 3,820 కోట్ల సమీకరణకు ప్రణాళికలు వేసిన కంపెనీ తొలుత 2025 మార్చిలో గోప్యతా విధానంలో సెబీకి దరఖాస్తు చేసింది. దీనిలో భాగంగా మరోసారి అప్‌డేటెడ్ పత్రాలను దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా కంపెనీ రూ. 3,100 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికితోడు మరో రూ. 720 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. ప్రమోటర్లు అలఖ్ పాండే, ప్రతీక్ బూబ్ విడిగా రూ. 360 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను ఆఫర్ చేయనున్నారు. ప్రస్తుతం కంపెనీలో ఇరువురుకీ విడిగా 40.35 శాతం చొప్పున వాటా ఉంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 461 కోట్లు ఆఫ్‌లైన్, హైబ్రిడ్ సెంటర్ల ఏర్పాటుకు వెచ్చించనుంది. మరో రూ. 548 కోట్లు ప్రస్తుత కేంద్రాల లీజ్ చెల్లింపులకు వినియోగించనుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

8-9-2025

విశాఖ	555-00
చిత్తూరు	563-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	545-00
విజయవాడ	545-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	535-00
వరంగల్	537-00
రిటైల్ ధర	5.95

'థీమ్యాటిక్'తో ప్రయోజనం ఎంత..

నిశాంత్ అగర్వాల్



సీనియర్ మేనేజింగ్ పార్ట్‌నర్, ఆస్క్ ప్రైవేట్ వెల్త్



అంతర్జాతీయంగా వ్యాపారాల్లో అనిశ్చితులు నెలకొనడం, కేవలం ఒకే రంగంలో ఇన్వెస్ట్ చేయడం మంచిదేనా కాదా అనే అంశంపై మరోసారి చర్చకు దారి తీసింది. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ఐటీ, ఫార్మాకు గట్టిగా దెబ్బ తగిలే అవకాశం ఉందని .. తయారీ రంగం, భారీ పెట్టుబడులు అవసరమయ్యే పరిశ్రమలు పాజిటివ్‌గా ఉండొచ్చనే సంకేతాలు కనిపిస్తున్నాయి. అంతగా బాగోలేని రంగాలను పక్కన పెట్టి, ఆకర్షణీయమైన రంగాలు లేదా థీమ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తూ, మార్కెట్లకు మించి రాబడులను రాబట్టాలనుకోవడం చాలా ఆకర్షణీయంగా అనిపించవచ్చు. కానీ వాస్తవంలో పరిస్థితులు వేరుగా ఉంటాయి. మెరుగ్గా రాణించే రంగాలను మాత్రమే అందిపుచ్చుకోవడమనేది పెద్ద సవాలుగా ఉంటుంది.

నియంత్రణ సంస్థలపరంగా నిబంధనల్లో మార్పులు, కొత్త ఉత్పత్తులు లేదా మార్కెట్ పరిణామాలు, అంతర్జాతీయంగా వాణిజ్య పరిస్థితులు, వడ్డీ రేట్లలో మార్పులు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, కమోడిటీలు లేదా కరెన్సీల్లో స్వల్పకాలిక హెచ్చుతగ్గులు మొదలైన వాటి వల్ల తాత్కాలికంగా కొన్ని రంగాలు ఆకర్షణీయంగా కనిపించవచ్చు. అయితే, సగటు రిటైల్ ఇన్వెస్టర్లకు పరిశ్రమవ్యాప్తంగా స్థూల ఆర్థిక పరిస్థితులతో పాటు కంపెనీకి మాత్రమే పరిమితమయ్యే ఇతరత్రా అంశాలను కూడా అధ్యయనం చేయడమనేది చాలా కష్టంగా ఉంటుంది. ఫలితంగా సదరు రంగం ఇటీవలి పనితీరు చూసి కావచ్చు లేదా మీడియాలో హైప్ వల్ల కావచ్చు చాలా మటుకు రిటైల్ ఇన్వెస్టర్లు, సెక్టోరల్ లేదా థీమ్యాటిక్ పెట్టుబడులపై నిర్ణయాలు తీసుకుంటూ ఉంటారు.

బూమ్..ఢామ్..

సెక్టార్లు, థీమ్‌లు సాధారణంగా హెచ్చుతగ్గులు లోనవుతూ వలయాకృతిలో తిరుగాడుతుంటాయి. సదరు రంగం వాస్తవ పనితీరు కనిపించడానికి చాలా ముందే, అంచనాల ఆధారంగా స్టాక్ మార్కెట్లలో వాటి షేర్ల ధర పెరిగిపోతాయి. ఉదాహరణకు ఐటీ రంగం కొన్నాళ్లు బ్లాక్ బస్టర్ రాబడులు అందించాక (ఎన్ఎస్ఈ ఐటీ సూచీ: 1997–1999 మధ్య కాలంలో +173%, +193%, +493%), కొన్నాళ్లు భారీగా కరెక్షన్‌కి లోనయ్యింది (2000–2002 మధ్య కాలంలో –35%, –36%, –6%). ఇక ఫార్మా తీసుకుంటే నాలుగేళ్లు పటిష్టంగా ఉండగా (2012 నుంచి 2015 వరకు: +32%, +26%, +42%, +10%) తర్వాత వరుసగా నాలుగేళ్లు నెమ్మదించింది (–14%, –7%, –8%, –9%). అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభం, ఐఎల్అండ్ఎఫ్ఎస్ సంక్షోభం తలెత్తే వరకు ఇన్‌ఫ్రా, విద్యుత్, రియల్ ఎస్టేట్, ఎన్‌బీఎఫ్‌సీల పరుగులు కొనసాగాయి. ఏదైతేనేం, సెక్టోరల్ పెట్టుబడులతో విజయం సాధించాలంటే ఇన్వెస్టరు కచ్చితత్వంతో ఎంట్రీ ఇవ్వడంతో పాటు కచ్చితమైన పాయింటులో వైదొలగడమూ ముఖ్యమే. ఇది చాలా కష్టతరంగా ఉంటుంది.

సెక్టోరల్ ఫండ్స్ పరిమితులు..

సెక్టోరల్ ఫండ్స్‌కి సంబంధించి కొన్ని రంగాలకు నిర్దిష్ట పరిమితులు ఉంటాయి. సదరు థీమ్ కారణంగా ఆ రంగంలో ఉన్న దాదాపు అన్ని సంస్థలను ఫండ్ మేనేజర్లు ఎంచుకోవాల్సి రావచ్చు. దీనితో కేవలం అత్యధిక రాబడులను అందించే స్టాక్స్‌ను ఎంచుకునే అవకాశం ఉండకపోవచ్చు. ఫలితంగా ఫండ్ పనితీరు పూర్తిగా పరిశ్రమ కదలికలపైనే ఆధారపడుతుంది తప్ప ఫండ్ మేనేజరు నైపుణ్యాలకు తావుండదు.

స్మార్ట్ విధానం ..

ఈ నేపథ్యంలో పరిశోధనల ఆధారంగా వివిధ రంగాలకు కేటాయింపు**లను** ఎప్పటికప్పుడు సవరించే అనుభ**వ**జ్ఞులైన నిపుణుల సారథ్యంలోని డైవర్సిఫైడ్ పోర్ట్‌ఫోలియోల్లో ఇన్వెస్ట్ చేయడం వివేకవంతమైన నిర్ణయం అవుతుంది. సంప్రదాయ పద్ధతిలో ఇన్వెస్ట్ చేసే వా**రు** లేదా తొలిసారి ఇన్వెస్ట్ చేస్తున్న**వారు** దాదాపు సెక్టోరల్, థీమ్యాటిక్ ఫండ్స్ కన్నా ఈటీఎఫ్‌లు, ఇండెక్స్ ఫండ్స్, లేదా డైవర్సిఫైడ్ ఈక్విటీ ఫండ్స్‌తో మొదలుపెట్టడం మంచిది. అనుభవజ్ఞులైన లేదా దూకుడుగా ఉండే మదుపరులు కోర్–శాటిలైట్ వ్యూహాన్ని అనుసరించవచ్చు. ఇందులో ఈక్విటీలకు సంబంధించి 75 శాతం లేదా అంతకు మించిన మొత్తాన్ని ఫ్లెక్సీ–క్యాప్ లేదా మల్టీ–క్యాప్ వ్యూహాల్లాంటివి పాటిస్తూ, నిర్వహణపరంగా మెరుగ్గా **ఉ**న్న డైవర్సిఫైడ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయొచ్చు. మిగతా 25 శాతాన్ని తమ నమ్మకానికి అనుగుణంగా థీమ్యాటిక్ లేదా సెక్టోరల్ ఫండ్స్‌కి కేటాయించవచ్చు. వినియోగం, ఆర్థికం లేదా తయారీకి సం**బం**ధించిన థీమ్యాటిక్ ఫండ్స్ **వ**లు పరిశ్రమలవ్యాప్తంగా విస్తరించి ఉంటాయి కాబట్టి సెక్టోరల్ ఫండ్స్‌తో పోలిస్తే కాస్త తక్కువ రిస్కులు ఉండొచ్చు. ఉదాహరణకు 'కేపెక్స్' థీమ్ ఫండ్‌లో యుటిలిటీలు, సిమెంటు, విద్యుత్, హౌసింగ్, ఆటో మొదలైన రంగాలు ఉండొచ్చు. దీనితో కేవలం ఒకే రంగంలో మొత్తం పెట్టుబడులంతా పెట్టడం వల్ల వచ్చే రిస్కులు కాస్త తగ్గవచ్చు.

గ్లోబల్ ఉద్యోగ సూచిక భారత్

లింకిడిన్ దేశీ మేనేజర్ పట్టాభిరామన్ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: భవిష్యత్ ఉద్యోగ ప్రపంచానికి భారత్ ఒక సూచిక(సైన్‌పోస్ట్)లా నిలవనున్నట్లు గ్లోబల్ ఐటీ దిగ్గజం మైక్రోసాఫ్ట్ సొంత ప్లాట్‌ఫామ్ లింకిడిన్ దేశీ మేనేజర్ కుమరేష్ పట్టాభిరామన్ పేర్కొన్నారు. సంస్థకు వేగంగా వృద్ధి చెందుతున్న, రెండో పెద్ద మార్కెట్‌గా భారత్ అవతరించినట్లు వెల్లడించారు. 16 కోట్లకుపైగా యూజర్లున్నట్లు తెలియజేశారు. ప్రస్తుత వృద్ధి రేటురీత్యా రెండు, మూడేళ్లలో అతిపెద్ద ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్ ప్లాట్‌ఫామ్‌గా ఆవిర్భవించనున్నట్లు అభిప్రాయపడ్డారు. డిజిటల్ ఫస్ట్ యువతతోపాటు.. నైపుణ్యాలు, లక్ష్యాలుగల వర్క్‌ఫోర్స్ దేశీ మార్కెట్‌కు జోష్‌నిస్తున్నట్లు పేర్కొన్నారు. లింకిడిన్ సభ్యుల సంఖ్య గత రెండేళ్లలో 50 శాతానికిపైగా జంప్‌చేసినట్లు వెల్లడించారు. 2020 నుంచి ఆదాయం సైతం రెట్టింపునకుపైగా ఎగసినట్లు తెలియజేశారు. దేశీయంగా 16 కోట్లకుపైగా ప్లాట్‌ఫామ్‌లో రిజిస్టరైనట్లు పేర్కొన్నారు.

లీగల్ హైయిర్ సర్టిఫికెట్లు.. ఇబ్బందులు

కె.సీహెచ్. ఏ.వీ.ఎస్.ఎన్ మూర్తి   **కె.వి.ఎన్ లావణ్య**



ట్యాక్సేషన్ నిపుణులు

వారసులు హక్కులే కాదు బాధ్యతలు కూడా స్వీకరించాలి. అలాంటి ఎన్నో బాధ్యతల్లో ఒకానొక బాధ్యత .. చనిపోయిన వారి తరఫున వారి వారసులు ఆదాయపు పన్ను చట్టం ప్రకారం రిటర్నులు దాఖలు చేయాలి. దాఖలు చేయడానికి వారసులకు ధృవీకరణ పత్రం ఉండాలి. దాన్నే వాడుక భాషలో లీగల్ హైయిర్ సర్టిఫికెట్ అని అంటారు. మరణించిన వారి ఆస్తులను పొందడానికి, బ్యాంకు అకౌంటులోని డబ్బులు పొందడానికి ఈ ధృవీకరణ పత్రం ఉండాలి. ఈ పత్రంలో వారసుల పేర్లు ఉంటాయి. వారే, మరణించిన వ్యక్తికి సంబంధించిన ఆస్తులు, బీమా పాలసీలు, బ్యాంకు అకౌంటులో ఫిక్సిడ్ డిపాజిట్లు మొదలైనవి పొందగలరు. ఇలాంటి ధృవీకరణ వల్ల ఎటువంటి ఇబ్బంది లేకుండా సజావుగా ప్రక్రియ మొదలవుతుంది.

సర్టిఫికెట్ ఎలా వస్తుంది..

మన కాలమ్‌లో ఇది అప్రస్తుతం అయినా, దరఖాస్తు చేసిన తర్వాత మండల/తహసీల్దారు/కోర్టులు రుజువులు అడుగుతాయి. డాక్యుమెంట్లు ఇవ్వాలి. విచారణ ఉంటుంది. ఆ తర్వాత జారీ చేస్తారు. మిగతా అధికార్లు త్వరగా జారీ చేస్తారేమో కానీ కోర్టుకి వెళ్తే చాలాకాలం పడుతుంది.

ఆదాయపు పన్ను చట్టం ప్రకారం..

మరణించిన వ్యక్తికి సంబంధించి తాను జీవించి ఉన్నంత వరకు, తన చేతికి వచ్చిన ఆదాయం మీద పన్ను అధికారికి రిటర్నులు వేయాలి. నిన్ననే ఒక వ్యక్తి పోయారనుకోండి. 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు ఒక రిటర్ను, 2025 ఏప్రిల్ 1 నుంచి 2025 సెప్టెంబర్ 7 వరకు మరొక రిటర్ను.. ఇలా రెండు దాఖలు చేయాలి. గడువు తేదీలోపల చేయాలి.

వారసులేం చేయాలి..

చట్టప్రకారం వారసులు మరణించిన వ్యక్తికి సంబంధించిన రిటర్నులు వేయాలి. ఆదాయం ఎంత, పన్ను భారం ఎంత, టీడీఎస్, టీసీఎస్ మొదలైన విషయాలు అందరికీ మామూలే.

ఏం కాగితాలు /డాక్యుమెంట్లు జతపర్చాలి ..

- చనిపోయిన వ్యక్తి పాన్‌కార్డు
- చనిపోయిన వ్యక్తి డెత్ సర్టిఫికెట్
- లీగల్ హైయిర్ సర్టిఫికెట్లు
- చనిపోయిన వారి విషయంలో పాస్ చేసిన ఆర్డర్లు/నోటీసులు.

పై జాబితాలో (1), (2), అలాగే (4) సులువుగా దొరుకుతాయి. అవన్నీ అప్‌లోడ్ చేయొచ్చు.

లీగల్ హైయిర్ సర్టిఫికెట్ అంటే..

ఈ కింది వాటిని మాత్రమే ఆదాయపు పన్ను వారి పోర్టల్‌లో పొందుపర్చారు

- కోర్టు జారీ చేసిన సర్టిఫికెట్
- రెవెన్యూ అధికారులు జారీ చేసిన సర్టిఫికెట్
- రెవెన్యూ అధికారులు జారీ చేసిన కుటుంబ సభ్యుల జాబితా సర్టిఫికెట్
- రిజిస్టర్ అయిన వీలునామా
- స్టేట్ / సెంట్రల్ ప్రభుత్వం జారీ చేసిన పెన్షన్ సర్టిఫికెట్
- బ్యాంకు లేదా ఆర్థిక సంస్థలు జారీ చేసిన సర్టిఫికెట్. అందులో నామినీ పేరుండాలి.

పైన చెప్పిన డాక్యుమెంట్లు, ఇంగ్లీషులో ఉంటే మంచిది. లేకపోతే ప్రాంతీయ భాషల్లో ఉంటే వాటిని ఆంగ్లంలోకి తర్జుమా చేసి అనువాదం ఇవ్వాలి.

అసలు సమస్య ఏమిటంటే..

గడువు తేదీలోపల రిటర్నులు వేయడానికి ప్రధాన ప్రతిబంధకం ఏమిటంటే, పైన చెప్పిన డాక్యుమెంట్లు సకాలంలో జారీ అవ్వకపోవడమే. కోర్టు జారీ చేయడమంటే.. సంవత్సరాలు పట్టేస్తుంది. రెవెన్యూ అధికారులు జారీ చేయడం అంటే నెలలు పడుతుంది. గడువు తేదీలోపల రావడం జరగదు. ఇవి లేకపోతే రిటర్నులు వేయడానికి కుదరడం లేదు. వీలునామా సులువుగా దొరుకుతుంది. వీలునామాలో ఆస్తి పంపకాలే ఉంటాయి కానీ వారసత్వం గురించి ఉండొచ్చు.. ఉండకపోవచ్చు. పెన్షన్ సర్టిఫికెట్‌లో కూడా కేవలం పెన్షన్ ఎవరికి చెందుతుందో వారి పేరే ఉంటుంది. వారసులందరి పేర్లు ఉండకపోవచ్చు. బ్యాంకు వారు జారీ చేసే సర్టిఫికెట్‌లో నామినీ పేరుంటుంది కానీ వారసుల పేర్లు ఉండకపోవచ్చు.

పైన చెప్పిన సమస్యల గురించి డిపార్టుమెంటు వారు ఆలోచించాలి. పరిశీలించాలి. ప్రాక్టికల్‌గా పరిగణనలోకి తీసుకుని కేవలం డెత్ సర్టిఫికెట్‌తో ఫైల్ చేసుకునే వీలు కల్పించాలి. అవసరం అయితే, వారసుల ధృవీకరణ కోసం అసెస్‌మెంట్‌ను పెండింగ్‌లో పెట్టొచ్చు.



పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

మధ్య కాలానికి మెరుగైన రాబడి

క్వాంట్ మిడ్‌క్యాప్ ఫండ్





మధ్య కాలం నుంచి దీర్ఘకాలానికి పెట్టుబడులపై మెరుగైన రాబడి కోరుకునే ఇన్వెస్టర్ల ముందున్న ఎంపికల్లో మిడ్‌క్యాప్ మ్యూచువల్ ఫండ్స్ కూడా ఒకటి. వీటిల్లో రిస్క్ అధికం. దీర్ఘకాలంలో మెరుగైన రాబడి మిడ్‌క్యాప్ ఫండ్స్‌తో సాధ్యపడుతుందని గత గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఈ విభాగంలో క్వాంట్ మిడ్‌క్యాప్ ఫండ్ మంచి పనితీరు చూపిస్తోంది.

రాబడులు

స్వల్పకాలం నుంచి దీర్ఘకాలంలోనూ ఈ పథకంలో పనితీరు మెరుగ్గా ఉండడం కనిపిస్తుంది. ఆరు నెలల కాలంలో రాబడి 11 శాతంగా ఉంటే, ఏడాది కాలంలో 15 శాతం మేర నష్టం ఉంది. ఇది మినహా మిగిలిన అన్ని కాలాల్లోనూ రాబడులు పటిష్టంగా ఉన్నాయి. మూడేళ్లలో చూస్తే ఏటా 17.57 శాతం చొప్పున డైరెక్ట్ ప్లాన్‌లో రాబడి నమోదైంది. ఐదేళ్లలోనూ ఏటా 29.54 శాతం చొప్పున ప్రతిఫలాన్ని అందించింది. ఇక ఏడేళ్ల కాలంలో 21.25 శాతం, పదేళ్లలోనూ 17.91 శాతం చొప్పున రాబడి తెచ్చిపెట్టింది. బీఎస్ఈ 150 మిడ్‌క్యాప్ టీఆర్ఐ సూచీతో పోల్చి చూస్తే ఐదేళ్లు, ఏడేళ్లలో అదనపు రాబడి ఇచ్చింది. పదేళ్ల కాలంలోనూ సూచీతో పోల్చితే 0.20 శాతం వ్యత్యాసంతో రాబడిని అందించింది. కానీ ఏడాది కాలంలో సూచీ 5 శాతమే నష్టపోగా, ఈ పథకంలో అధిక నష్టం నమోదైంది. మ్యూచువల్ ఫండ్స్‌లో స్వల్పకాల రాబడి కంటే మధ్య కాలంలో రాబడిని ప్రామాణికంగా తీసుకోవచ్చు. కొన్ని సందర్భాల్లో పోర్ట్‌ఫోలియోలో మార్పుల వల్ల కూడా స్వల్పకాలంలో ఇలా జరగొచ్చు.

పెట్టుబడుల విధానం

ఇది యాక్టివ్ ఫండ్. అంటే ఎప్పటికప్పుడు మార్పులు, చేర్పులు చేసేది. 2019 వరకు ఈ పథకం పనితీరు హైబ్రిడ్ ఇన్వెస్ట్‌మెంట్ విధానం కారణంగా అంత గొప్పగా లేదు. 2000 నుంచి స్పష్టమైన మార్పును గమనించొచ్చు. మిడ్‌క్యాప్ ఫండ్ అయినప్పటికీ లార్జ్‌క్యాప్ కంపెనీలకు సైతం చెప్పుకోతగిన కేటాయింపులు చేస్తుంది. అధిక వృద్ధి చూపించే కంపెనీలను క్వాంటిటేటివ్ విధానంలో ఎంపిక చేస్తుంది. రంగాల వారీ మార్పులు, ఆర్థిక ధోరణలను సైతం విశ్లేషిస్తుంది. ముఖ్యంగా కంపెనీ వ్యాల్యుయేషన్లు (విలువలు), లిక్విడిటీ (షేర్ల ట్రేడింగ్ పరిమాణం చెప్పుకోతగ్గ స్థాయిలో ఉండడం), రిస్క్, సరైన సమయంలో ఇన్వెస్ట్ చేయడం అనే వీఎల్ఆర్‌టీ కార్యాచరణను అనుసరిస్తుంది.

పోర్ట్‌ఫోలియో

ప్రస్తుతం ఈ ఫండ్ నిర్వహణలో రూ.8,778 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో 95.55 శాతం ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయగా, 3.34 శాతం మేర డెట్ సాధనాల్లో పెట్టుబడులు పెట్టింది. నగదు నిల్వలు 1.11 శాతంగా ఉన్నాయి. ఈక్విటీ పెట్టుబడులను గమనించినట్టయితే లార్జ్‌క్యాప్ కంపెనీల్లోనే 58.6 శాతం వరకు ఉన్నాయి. మిడ్‌క్యాప్ కంపెనీల్లో 41.34 శాతం పెట్టుబడులు కలిగి ఉంది. మిడ్‌క్యాప్ కంపెనీలు పనితీరు కారణంగా కొంత కాలానికి భారీ కంపెనీలుగా అవతరిస్తుంటాయి. దీని ఫలితంగా ఈ ఫండ్ పెట్టుబడుల్లో లార్జ్‌క్యాప్ కేటాయింపులు అధికంగా కనిపిస్తున్నాయి. భారీ పోర్ట్‌ఫోలియో కాకుండా.. 25 నుంచి 30 స్టాక్స్‌కు పెట్టుబడులను పరిమితం చేస్తుంది. ప్రస్తుత పోర్ట్‌ఫోలియోని గమనిస్తే 30 స్టాక్స్ ఉన్నాయి. ఇందులో టాప్ 10 స్టాక్స్‌లోనే 61.58 శాతం పెట్టుబడులు ఉన్నాయి. పెట్టుబడుల్లో ఇంధన రంగ కంపెనీలు, యుటిలిటీలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ 20.28 శాతం పెట్టుబడులు కేటాయించింది. హెల్త్‌కేర్ కంపెనీల్లో 16.7 శాతం పెట్టుబడులు ఉన్నాయి. ఇండస్ట్రియల్స్ కంపెనీల్లో 14.88 శాతం, కన్స్యూమర్ స్టాపుల్స్ కంపెనీల్లో 11.53 శాతం, టెక్నాలజీ రంగ కంపెనీల్లో 10.53 శాతం చొప్పున ఇన్వెస్ట్ చేసింది.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడులు శాతం
టాటా కమ్యూనికేషన్స్	7.79
అరబిందో ఫార్మా	7.75
మారికో	6.67
ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా	6.56
రిలయన్స్ ఇండస్ట్రీస్	6.54
ప్రీమియర్ ఎనర్జీర్	6.52
లైడ్స్ మెటల్స్	6.29
జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్	4.66
లిండే ఇండియా	3.59
భారత్ ఫోర్జ్	3.18

342 పరుగుల తేడాతో...

● వన్డేల్లో పరుగుల పరంగా అతి పెద్ద విజయం సాధించిన ఇంగ్లండ్
● జో రూట్, బెథెల్ సెంచరీలు ● చివరి వన్డేలో ఘోరంగా ఓడిన దక్షిణాఫ్రికా


బెథెల్


జో రూట్

సౌతాంప్టన్: వన్డే క్రికెట్ చరిత్రలో ఇంగ్లండ్ జట్టు అరుదైన రికార్డు తమ పేరిట లిఖించకుంది. దక్షిణాఫ్రికాతో తొలి రెండు వన్డేల్లో ఓడి ఇప్పటికే సిరీస్ కోల్పోయిన ఇంగ్లండ్ జట్టు ఆఖరి వన్డేలో విశ్వరూపం కనబర్చింది. బ్యాటర్ల జోరుకు బౌలర్ల విజృంభణ తోడవడంతో ఆదివారం జరిగిన మూడో మ్యాచ్‌లో ఇంగ్లండ్ 342 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను మట్టికరిపించింది. అంతర్జాతీయ వన్డేల్లో పరుగుల పరంగా ఇదే అతిపెద్ద విజయం కాగా... రెండేళ్ల క్రితం శ్రీలంకపై భారత్ నమోదు చేసుకున్న 317 పరుగుల గెలుపు రెండో స్థానానికి చేరింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 414 పరుగులు చేసింది. 21 ఏళ్ల జాకబ్ బెథెల్ (82 బంతుల్లో 110; 13 ఫోర్లు, 3 సిక్స్‌లు), సీనియర్ ప్లేయర్ జో రూట్ (96 బంతుల్లో 100; 6 ఫోర్లు) సెంచరీలతో కదంతొక్కగా... జేమీ స్మిత్ (48 బంతుల్లో 62; 9 ఫోర్లు, 1 సిక్స్), జోస్ బట్లర్ (32 బంతుల్లో 62 నాటౌట్; 8 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్ సెంచరీలతో ఆకట్టుకున్నారు. ఆరంభం నుంచే ఇంగ్లండ్ బ్యాటర్లు ధాటిగా ఆడగా... ఆఖర్లో బట్లర్ మెరుపు ఇన్నింగ్స్‌తో జట్టుకు **భారీ స్కోరు అందించాడు.** దక్షిణాఫ్రికా బౌలర్ల**లో కేశవ్ మహరాజ్,** కార్బిన్ బాష్ చెరో రెండు **వికెట్లు పడగొట్టారు.** అనంతరం లక్ష్యఛేదనలో **దక్షిణాఫ్రికా 20.5** ఓవర్లలో 72 పరుగులకే **ఆలౌటైంది. గత రెండు** మ్యాచ్‌ల్లో చక్కటి ప్రదర్శనతో **ఆకట్టుకున్న సఫారీలు...** భారీ లక్ష్యఛేదనలో **పోరాడకుండానే చేతులెత్తేశారు.** కార్బిన్ బాష్ (20), **కేశవ్ మహరాజ్** (17), ట్రిస్టన్ స్టబ్స్ (10) **మాత్రమే రెండంకెల** స్కోరు చేశారు. మార్క్‌రమ్ **(0), రికెల్టన్ (1),** ముల్డర్ (0), బ్రిట్జ్‌కీ (4), **బ్రేవిస్ (6) విఫలమయ్యారు.** ఇంగ్లండ్ బౌలర్ల**లో జోఫ్రా ఆర్చర్** (4/18), ఆదిల్ రషీద్ (3/13) **విజృంభించారు.** ఆర్చర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద **మ్యాచ్'... రూట్,** కేశవ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు దక్కాయి. ఇరు జట్ల మధ్య బుధవారం నుంచి టి20 సిరీస్ ప్రారంభం కానుంది.

హైదరాబాద్ 376 ఆలౌట్

రాణించిన హిమతేజ, వరుణ్ గౌడ్, అమన్ రావు

తమిళనాడుతో బుచ్చిబాబు టోర్నీ ఫైనల్



చెన్నై: హిమతేజ (221 బంతుల్లో 97; 13 ఫోర్లు, 1 సిక్స్), అమన్ రావు (98 బంతుల్లో 85; 11 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరవడంతో బుచ్చిబాబు ఇన్విటేషనల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్లో హైదరాబాద్ జట్టు మెరుగైన స్కోరు చేసింది. ఈ ఇద్దరితో పాటు వరుణ్ గౌడ్ (126 బంతుల్లో 67; 4 ఫోర్లు) కూడా రాణించడంతో... హైదరాబాద్ జట్టు 115.4 ఓవర్లలో 376 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ రాహుల్ సింగ్ (38; 6 ఫోర్లు), నితిన్ సాయి యాదవ్ (37; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) పర్వాలేదనిపించారు. తమిళనాడు బౌలర్లలో విద్యుత్ 4 వికెట్లు తీయగా... త్రిలోక్ నాగ్, హేమ్‌చుడేశన్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం ఇన్నింగ్స్ ఆరంభించిన తమిళనాడు జట్టు ఆదివారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి 61 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 142 పరుగులు చేసింది. రాధాకృష్ణన్ (199 బంతుల్లో 73 బ్యాటింగ్; 2 ఫోర్లు), విమల్ కుమార్ (147 బంతుల్లో 54; 6 ఫోర్లు) అర్ధ శతకాలు సాధించారు. చేతిలో 9 వికెట్లు ఉన్న తమిళనాడు జట్టు... హైదరాబాద్ స్కోరుకు ఇంకా 234 పరుగులు వెనుకబడి ఉంది. రాధాకృష్ణన్‌తో పాటు కెప్టెన్ ప్రదోశ్ రంజన్ పాల్ (13 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. హైదరాబాద్ బౌలర్లలో రోహిత్ రాయుడు ఒక వికెట్ పడగొట్టాడు.



సౌత్‌జోన్ X సెంట్రల్ జోన్

దులీప్ ట్రోఫీ టైటిల్ కోసం 'ఢీ'

● తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో తుదిపోరుకు అర్హత
● 'డ్రా'గా ముగిసిన రెండు సెమీఫైనల్స్
● వెస్ట్, నార్త్ జోన్ జట్లు నిష్క్రమణ ● 11 నుంచి ఫైనల్ పోరు

బెంగళూరు: యశస్వి జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్, శ్రేయస్ అయ్యర్, శార్దుల్ ఠాకూర్‌లాంటి భారత ఆటగాళ్ల ప్రాతినిధ్యం వహించిన వెస్ట్‌జోన్ దులీప్ ట్రోఫీలో సెమీఫైనల్లోనే ఇంటిదారి పట్టింది. సెంట్రల్ జోన్‌తో మ్యాచ్ 'డ్రా' కాగా... తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో దేశవాళీ ఆటగాళ్లతో కూడిన సెంట్రల్ జోన్ ముందంజ వేసింది. మరో సెమీఫైనల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన తన్మయ్ అగర్వాల్, తనయ్ త్యాగరాజన్, రికీ భుయ్‌లు బాధ్యతగా ఆడటంతో సౌత్‌జోన్ కూడా దులీప్ ట్రోఫీ ఫైనల్లోకి దూసుకెళ్లింది. నార్త్‌జోన్‌తో సౌత్ సెమీస్ పోరు కూడా 'డ్రా'గానే ముగిసింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో అంతిమ పోరుకు అర్హత సంపాదించిన సౌత్‌జోన్... ఈ నెల 11 నుంచి ఇదే వేదికపై జరిగే టైటిల్ పోరులో సెంట్రల్ జోన్‌తో తలపడుతుంది. విజేతను తేల్చనున్న ఫైనల్ మ్యాచ్ సంప్రదాయ టెస్టు లాగా ఐదు రోజుల పాటు నిర్వహిస్తారు.

సెంట్రల్ 600 ఆలౌట్

వెస్ట్‌జోన్‌తో జరిగిన ఈ సెమీఫైనల్ మ్యాచ్‌లో సెంట్రల్ జోన్ బ్యాటర్లు సమష్టిగా రాణించారు. ఆఖరి రోజు సారాంశ్ జైన్ (108 బంతుల్లో 63 నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధసెంచరీ కొట్టాడు. దీంతో క్రీజులోకి దిగిన 11 మందిలో ఏకంగా ఆరుగురు బ్యాటర్లు అర్ధశతకం పైచిలుకు పరుగులు చేయడం విశేషం. దీంతో నాలుగో రోజు 556/8 ఆదివారం తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన సెంట్రల్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 164.3 ఓవర్లలో 600 పరుగుల వద్ద ఆలౌటైంది. టెయిలెండర్లు సారాంశ్, యశ్ ఠాకూర్‌లపై కూడా వెస్ట్ బౌలర్లు ప్రభావం చూపలేకపోయారు. దీంతో వీరిద్దరు అవలీలగా పరుగులు సాధించారు. ఈ క్రమంలో సారాంశ్ జైన్ అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. తొమ్మిదో వికెట్‌కు 42 పరుగులు జతయ్యాక యశ్ ఠాకూర్ (21; 5 ఫోర్లు)ను అర్జన్ అవుట్ చేయగా, కాసేపటికే ఖలీల్ అహ్మద్ (0) కూడా అతనికే వికెట్ అప్పగించడంతో సెంట్రల్ ఇన్నింగ్స్ సరిగ్గా 600 వద్ద ముగిసింది. అర్జన్ నాగ్వస్‌వాలాకు 3 వికెట్లు దక్కాయి. తొలి ఇన్నింగ్స్‌లో సెంట్రల్‌కు 162 పరుగుల ఆధిక్యం లభించింది. ఈ ఆధిక్యమే జట్టును ఫైనల్‌కు తీసుకెళ్లింది.

రాణించిన జైస్వాల్

అప్పటికే ఫలితం ఖాయమైన మ్యాచ్‌లో రెండో ఇన్నింగ్స్ ఆడిన వెస్ట్‌జోన్ మ్యాచ్ 'డ్రా'గా ముగిసే సమయానికి 53.3 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 216 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో నిరాశపరిచిన భారత డాషింగ్ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (70 బంతుల్లో 64; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధసెంచరీ సాధించాడు. తొలి ఇన్నింగ్స్‌లో భారీ శతకం సాధించిన రుతురాజ్ గైక్వాడ్ (16) ఈసారి విఫలమవగా, శ్రేయస్ అయ్యర్ (12) రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ మెప్పించలేకపోయాడు. మిగతా వారిలో తనుశ్ కొటియాన్ (72 బంతుల్లో 40 నాటౌట్; 7 ఫోర్లు), ఆర్య దేశాయ్ (35; 5 ఫోర్లు) మినహా ఇంకెవరూ చెప్పుకోదగ్గ స్కోర్లే చేయలేదు. బ్యాటింగ్‌లో రాణించిన సెంట్రల్ బౌలర్ సారాంశ్ జైన్ 5, హర్ష్ దూబే 3 వికెట్లు తీశారు. ఈ మ్యాచ్‌లో సారాంశ్‌కు 8 వికెట్లు దక్కాయి. అజేయ అర్ధసెంచరీ కూడా సాధించడంతో అతనికే 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.

సౌత్‌జోన్‌కు 175 పరుగుల ఆధిక్యం

నార్త్‌జోన్‌తో జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో సౌత్‌జోన్‌కు తొలి ఇన్నింగ్స్‌లో 175 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. ఆఖరి రోజు ఓవర్‌నైట్ స్కోరు 278/5తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన నార్త్‌జోన్ 100.1 ఓవర్లలో 361 పరుగుల వద్ద ఆలౌటైంది. ఆదివారం ఆటలో 83 పరుగులు జోడించి మిగతా సగం వికెట్లను కోల్పోయింది. ఓవర్‌నైట్ బ్యాటర్ శుభమ్ ఖజురియా (252 బంతుల్లో 128; 20 ఫోర్లు, 1 సిక్స్) తన క్రితం రోజు స్కోరు వద్దే అవుటయ్యాడు. లోయర్ ఆర్డర్‌లో మయాంక్ డాగర్ (40 బంతుల్లో 31; 5 ఫోర్లు), సాహిల్ లోత్రా (19; 2 ఫోర్లు) కాసేపు సౌత్‌జోన్ బౌలర్లను ఎదుర్కోవడంతో జట్టు 300 పైచిలుకు స్కోరు దాటింది. అయితే 2 పరుగుల వ్యవధిలో నిధీశ్ వీరిద్దరిని క్లీన్‌బౌల్డ్ చేయడంతో ఆలౌటయ్యేందుకు ఎంతో సమయం పట్టలేదు. గుర్జపనీత్ 4 వికెట్లు తీయగా, నిధీశ్‌కు 3 వికెట్లు దక్కాయి.


జగదీశన్

జగదీశన్ అజేయ అర్ధశతకం

అనంతరం రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టిన సౌత్‌జోన్ మ్యాచ్ ముగిసే సమయానికి 24.4 ఓవర్లలో వికెట్ నష్టానికి 95 పరుగులు చేసింది. ఓపెనర్ నారాయణ్ జగదీశన్ నార్త్ బౌలర్లపై మళ్లీ ఆడుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో 3 పరుగుల స్వల్ప తేడాతో డబుల్ సెంచరీని కోల్పోయిన జగదీశన్ (69 బంతుల్లో 52 నాటౌట్; 6 ఫోర్లు) అజేయ అర్ధశతకంతో రాణించాడు. మొదట హైదరాబాదీ బ్యాటర్ తన్మయ్ అగర్వాల్ (13)తో కలిసి ఓపెనింగ్ వికెట్‌కు 34 పరుగులు జతచేశాడు. తన్మయ్‌ని అకీబ్ నబీ బౌల్డ్ చేయడంతో జగదీశన్‌కు వన్‌డౌన్ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ (54 బంతుల్లో 16 నాటౌట్; 1 ఫోర్) జతయ్యాడు. వీరిద్దరు మరో వికెట్ పడకుండా సౌత్ రెండో ఇన్నింగ్స్‌ను నడిపించారు. 'డ్రా' ఫలితం ఖాయమవడంతో జగదీశన్ అర్ధసెంచరీ పూర్తవగానే ఇరుజట్ల కెప్టెన్లు మ్యాచ్‌ను ముందుగానే ముగించేందుకు చేతులు కలిపారు. రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ అదరగొట్టిన నారాయణ్ జగదీశన్ (తొలి ఇన్నింగ్స్‌లో 197)కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

ఎనిమిది రేసుల తర్వాత...

వెర్‌స్టాపెన్ ఖాతాలో మరో విజయం ● ఇటాలియన్ గ్రాండ్‌ప్రి టైటిల్ గెలిచిన రెడ్‌బుల్ డ్రైవర్





మోంజా (ఇటలీ): ఫార్ములావన్ సీజన్ 16వ రేసు ఇటాలియన్ గ్రాండ్‌ప్రిలో రెడ్‌బుల్ డ్రైవర్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. ఈ సీజన్‌లో పెద్దగా ఆకట్టుకోలేకపోతున్న డిఫెండింగ్ చాంపియన్ వెర్‌స్టాపెన్ ఆదివారం 53 ల్యాప్‌ల ప్రధాన రేసును అందరికంటే వేగంగా, అందరికంటే ముందుగా 1 గంట 13 నిమిషాల 24.325 సెకన్లలో పూర్తి చేసి టైటిల్ చేజిక్కించుకున్నాడు. ఈ సీజన్‌లో వెర్‌స్టాపెన్‌కిది మూడో విజయం. ఈ సీజన్‌లోని మూడో రేసు జపాన్ గ్రాండ్‌ప్రి (ఏప్రిల్ 6న), ఏడో రేసు ఎమిలియా రొమాగ్నా గ్రాండ్‌ప్రి (మే 18న)లో వెర్‌స్టాపెన్ టైటిల్ గెలిచాడు. ఇటాలియన్ గ్రాండ్‌ప్రి రేసును 'పోల్ పొజిషన్'తో ప్రారంభించిన వెర్‌స్టాపెన్ వాయు వేగంతో దూసుకెళ్లాడు. శనివారం ఫార్ములావన్ చరిత్రలో వేగవంతమైన ల్యాప్ రికార్డు నమోదు చేసుకున్న నాలుగుసార్లు చాంపియన్ వెర్‌స్టాపెన్... ఆదివారం రేసు ఆద్యంతం అగ్రస్థానంలోనే కొనసాగాడు. మెక్‌లారెన్‌కు చెందిన లాండో నోరిస్ 1 గంట 13 నిమిషాల 43.532 సెకన్లలో పూర్తి చేసి రెండో స్థానం దక్కించుకున్నాడు. ఆస్కార్ పియాస్ట్రి 1 గంట 13 నిమిషాల 45.676 సెకన్లతో మూడో స్థానంలో నిలిచాడు. చార్లెస్ లెక్‌లెర్క్ (1 గంట 13 నిమిషాల 49.949 సెకన్లు; ఫెరారీ), రసెల్ (1 గంట 13 నిమిషాల 57.206 సెకన్లు; మెర్సిడెస్) వరుసగా నాలుగో, ఐదో స్థానాల్లో రేసును ముగించారు. ఏడుసార్లు చాంపియన్ లూయిస్ హామిల్టన్ (1 గంట 14 నిమిషాల 1.774 సెకన్లు; ఫెరారీ) ఆరో స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఫెర్నాండో అలోన్సో (ఆస్టన్ మార్టిన్), నికో హుల్కెన్‌బర్గ్ (కిక్ సాబెర్) రేసును పూర్తి చేయలేకపోయారు. 24 రేసుల సీజన్‌లో 16 రేసులు ముగిసేసరికి ప్రపంచ డ్రైవర్స్ చాంపియన్‌షిప్‌లో పియాస్ట్రి 324 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా... నోరిస్ 293 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. తాజా విజయంతో వెర్‌స్టాపెన్ 230 పాయింట్లతో మూడో స్థానాన్ని మరింత మెరుగు పర్చుకున్నాడు. తదుపరి రేసు ఈ నెల 21న అజర్‌బైజాన్ గ్రాండ్‌ప్రి జరుగనుంది.

ఇటాలియన్ గ్రాండ్‌ప్రి రేసు ఫలితాలు (టాప్-10)

స్థానం	డ్రైవర్	జట్టు	ల్యాప్‌లు	సమయం	వ్యత్యాసం	పాయింట్లు
1	వెర్‌స్టాపెన్	రెడ్‌బుల్	53	1:13:24.325 సెకన్లు	-	25
2	నోరిస్	మెక్‌లారెన్	53	1:13:43.532 సెకన్లు	19.207 సెకన్లు	18
3	పియాస్ట్రి	మెక్‌లారెన్	53	1:13:45.676 సెకన్లు	21.351 సెకన్లు	15
4	లెక్‌లెర్క్	ఫెరారీ	53	1:13:49.949 సెకన్లు	25.624 సెకన్లు	12
5	రసెల్	మెర్సిడెస్	53	1:13:57.206 సెకన్లు	32.881 సెకన్లు	10
6	హామిల్టన్	ఫెరారీ	53	1:14:01.774 సెకన్లు	37.449 సెకన్లు	8
7	అల్బాన్	విలియమ్స్ రేసింగ్	53	1:14:14.862 సెకన్లు	50.537 సెకన్లు	6
8	గాబ్రియల్	కిక్ సాబెర్	53	1:14:22.809 సెకన్లు	58.484 సెకన్లు	4
9	అంటొనెల్లి	మెర్సిడెస్	53	1:14:24.087 సెకన్లు	59.762 సెకన్లు	2
10	హడ్జర్	రేసింగ్ బుల్స్	53	1:14:28.216 సెకన్లు	63.891 సెకన్లు	1



శ్రీలంకదే టి20 సిరీస్

● చెలరేగిన కమిల్, కుశాల్
● ఆఖరి మ్యాచ్‌లో 8 వికెట్లతో జింబాబ్వేపై గెలుపు

హరారే: జింబాబ్వే పర్యటనను శ్రీలంక విజయవంతంగా ముగించింది. ఇదివరకే రెండు వన్డేల సిరీస్‌ను 2–0తో నెగ్గిన లంక తాజాగా మూడు టి20ల సిరీస్‌ను 2–1తో కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన ఆఖరి టి20లో కమిల్ మిషారా (43 బంతుల్లో 73 నాటౌట్; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), కుశాల్ పెరీరా (26 బంతుల్లో 46 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) దంచేయడంతో శ్రీలంక 8 వికెట్ల తేడాతో ఆతిథ్య జింబాబ్వేపై ఘనవిజయం సాధించింది. నిర్ణాయక పోరులో టాస్ నెగ్గిన సింహళ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 191 పరుగుల భారీస్కోరు చేసింది. ఓపెనర్ మరుమని (44 బంతుల్లో 51; 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీ సాధించాడు. సీన్ విలియమ్స్ (11 బంతుల్లో 23; 5 ఫోర్లు), కెప్టెన్ సికందర్ రజా (18 బంతుల్లో 28; 3 ఫోర్లు, 1 సిక్స్), రియాన్ బర్ల్ (15 బంతుల్లో 26; 1 ఫోర్, 2 సిక్స్‌లు) ధాటిగా పరుగులు చేశారు. ప్రత్యర్థి బౌలర్లలో హేమంత 3, చమీర 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన శ్రీలంక 14 బంతులు మిగిలుండగానే 17.4 ఓవర్లలో రెండే వికెట్లు కోల్పోయి 193 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు నిసాంక (20 బంతుల్లో 33; 4 ఫోర్లు, 1 సిక్స్), కుశాల్ మెండిస్ (17 బంతుల్లో 30; 3 ఫోర్లు, 1 సిక్స్) 5.2 ఓవర్లలో 58 పరుగులు జోడించి చక్కని ఆరంభమిచ్చారు. తర్వాత కమిల్ మిషారా, కుశాల్ పెరీరా ధనాధన్ ఆటతో స్కోరు బోర్డును గెలిచేదాకా పరుగు పెట్టించారు. ఈ క్రమంలో కమిల్ 33 బంతుల్లో అర్ధసెంచరీ సాధించాడు. జింబాబ్వే బౌలర్లలో బ్రాడ్ ఇవాన్స్, సికందర్ రజా చెరో వికెట్ తీశారు.



లక్ష్య చహర్ ముందంజ

లివర్‌పూల్: ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పురుషుల 80 కేజీల విభాగంలో భారత బాక్సర్ లక్ష్య చహర్ శుభారంభం చేశాడు. ఆసియా మాజీ చాంపియన్ హుస్సేని లాషెస్ (జోర్డాన్)తో ఆదివారం జరిగిన తొలి రౌండ్ బౌట్‌లో లక్ష్య 5:0తో ఘనవిజయం సాధించి రెండో రౌండ్‌కు చేరుకున్నాడు. మరోవైపు 55 కేజీల విభాగంలో భారత బాక్సర్ పవన్ బర్త్‌వాల్ పోరాటం ముగిసింది. రెండో రౌండ్‌లో పవన్ 0:5తో మీర్జాఖలీలోవ్ (ఉజ్బెకిస్తాన్) చేతిలో ఓడిపోయాడు.

యువరాజు వెడలె..!







జపాన్ యువరాజు హిసహిటోకు శనివారం 19వ బర్త్‌డే జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు రాచ కుటుంబ సిబ్బంది కిరీటం, దుస్తులు ఇతర అలంకారాలతో కూడిన పెట్టెను అందజేశారు. వీటిని ధరింపజేసి, గుర్రపు బగ్గీలో చక్రవర్తి నివాసంలో జరిగే యుక్త వయసు వేడుకకు తీసుకెళ్లారు. చక్రవర్తి నరుహిటో మేనల్లుడైన హిసహిటో క్రౌన్ ప్రిన్స్ ఫుమిహిటో, యువరాణి కికో కుమారుడు. ఫుమిహిటో తర్వాత జపాన్ సింహాసనం అధిష్టించే అవకాశం ఇతడికే దక్కనుంది.

ఓట్ల దొంగలకు... ఈసీయే కవచం!

పదేళ్లుగా కాపాడుతోంది: ఖర్గే



సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో ఓట్ల దొంగలను స్వయానా కేంద్ర ఎన్నికల సంఘమే కాపాడుతోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆగ్రహం వ్యక్తంచేశారు. పదేళ్లుగా ఓటు చోరులను కాపాడే బ్యాక్ ఆఫీస్‌లాగా ఈసీ పని చేస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించాల్సిన సంస్థ ఓట్ల దొంగలకు రక్షణ కవచంలా మారిందని నిప్పులు చెరిగారు. కర్ణాటకలోని అలంద్ నియోజకవర్గ ఓటర్ ఫ్రాడ్ కేసులో ఈసీ వైఖరిని ఆయన నిలదీశారు. ఈ మేరకు ఆదివారం 'ఎక్స్'లో ఖర్గే పోస్టు చేశారు. కర్ణాటకలోని అలంద్ నియోజకవర్గంలో ఓటర్ ఫ్రాడ్ కేసులో ఎన్నికల సంఘం వైఖరిని ఆయన తప్పుపట్టారు. కీలకమైన ఆధారాలను దాచిపెట్టారని విమర్శించారు. 2023లో కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు అలంద్ నియోజకవర్గంలో వేలాది ఓటర్ల పేర్లు తొలగించేందుకు నకిలీ ఫామ్–7 దరఖాస్తులు వాడినట్లు కాంగ్రెస్ బహిర్గతం చేసింది. దీనిపై కేసు నమోదు కాగా, దర్యాప్తులో 5,994 నకిలీ అప్లికేషన్లు బయటపడ్డాయి. ఇది చిన్న తప్పిదం కాదని, ఓటు హక్కును దోచుకోవడానికి పన్నిన పెద్ద కుట్ర అని ఖర్గే ధ్వజమెత్తారు. ఈ కేసులో నిందితులను గుర్తించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సీఐడీ విచారణకు ఆదేశాలు ఇచ్చింది. తొలుత ఎన్నికల సంఘం కొన్ని పత్రాలు సమర్పించినప్పటికీ ఇప్పుడు మాత్రం కీలక ఆధారాలను ఇవ్వకుండా వెనక్కి తగ్గిందని ఖర్గే ఆరోపించారు. ''ఈసీ ఎందుకు వెనక్కి తగ్గింది? నకిలీ వోటర్ల వెనుక ఉన్న వారిని కాపాడేందుకేనా?'' అని నిలదీశారు. బీజేపీ ఓటు చోరీ డిపార్టుమెంట్ అంటూ ఈసీని అభివర్ణించారు. సీఐడీ దర్యాప్తును నీరుగార్చడానికి బీజేపీ ఆదేశాల మేరకు ఈసీ పని చేస్తోందన్నారు. ఓటు హక్కు అంటే ప్రజాస్వామ్యానికి మూలం అని స్పష్టం చేశారు. ఆ హక్కును కాపాడాల్సిన ఎన్నికల సంఘమే ఓట్ల దొంగలతో చేతులు కలపడం ప్రజాస్వామ్యానికి పెద్ద ముప్పు అని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాల్సిన సంస్థే బలహీన పరుస్తోందని ఆక్షేపించారు.

దేశానికి శత్రువు మోదీ

ప్రధాని నరేంద్ర మోదీ మన దేశానికి శత్రువుగా మారారని మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, మోదీ మంచి స్నేహితులే అయినప్పటికీ ఆ స్నేహం వల్ల భారత్‌కు నష్టమే తప్ప ఎలాంటి లాభం లేదన్నారు. ఆదివారం కర్ణాటకలోని కలబుర్గిలో ఖర్గే మీడియాతో మాట్లాడారు. భారత్‌పై అమెరికా విధించిన 50 శాతం టారిఫ్‌లను ప్రస్తావించారు. దీని వల్ల మన ప్రజలకు భారీ నష్టం జరుగుతుందన్నారు. ట్రంప్‌తో స్నేహం సంగతి పక్కన పెట్టి దేశ ప్రయోజనాలను కాపాడే విషయం ఆలోచించాలని మోదీకి హితవు పలికారు. దేశమే ప్రథమం, ఆ తర్వాతే స్నేహం అని తేల్చిచెప్పారు. జీఎస్టీలో సంస్కరణలతో నిజంగా పేదలకు మేలు జరిగితే స్వాగతిస్తామని వ్యాఖ్యానించారు.

నేడు విపక్ష ఎంపీలకు ఖర్గే విందు

ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు వేసే విధానంపై సోమవారం విపక్ష 'ఇండియా' కూటమి ఎంపీలకు అవగాహన కల్పించనున్నారు. పార్లమెంట్ పాత భవనంలోని సెంట్రల్ హాల్‌లో మాక్ పోలింగ్ నిర్వహిస్తారు. ఈ సందర్భంగా విపక్ష ఎంపీలకు మల్లికార్జున ఖర్గే సోమవారం రాత్రి విందు ఇవ్వబోతున్నారు.

దేశంలోనే పొడవైన రైల్వే సొరంగం

హిమాలయాల్లో తొలిచిన టీబీఎం



న్యూఢిల్లీ: దేశంలోనే అత్యంత పొడవైన, 14.57 కిలోమీటర్ల పొడవైన రైల్వే సొరంగం ఎట్టకేలకు పూర్తయింది. ఉత్తరాఖండ్‌లోని దేవప్రయాగ్–జానసు మధ్య రెండు టన్నెల బోరింగ్ యంత్రా(టీబీఎం)లతో ప్రమాదకరమైన పర్వత ప్రాంతాలను ఛేదించేందుకు రేయింబవళ్లు పనిచేసిన ఆపరేటర్ల కృషి ఫలించింది. నిర్దేశిత సమయానికి ముందే వారు లక్ష్యాన్ని చేరుకున్నారు. 125 కిలోమీటర్ల పొడవైన రిషికేశ్–కర్ణప్రయాగ్ రైల్ లింక్ ప్రాజెక్టులో ఇదో కీలక భాగం. ప్రాజెక్టును డిసెంబర్ 2026 కల్లా పూర్తి చేయాలని రైల్ వికాస్ నిగమ్ లక్ష్యంగా పెట్టుకుంది. అయితే, రైల్వే సొరంగం తవ్వకంలో ఎన్నో అవాంతరాలను ఎదుర్కోవాల్సి వచ్చిందని టీబీఎం ఆపరేటర్ బల్జీందర్ సింగ్ చెప్పారు. 'సొరంగం మార్గంలో భారీ కొండచరియలు విరిగి పడ్డాయి. సాధారణంగా టీబీఎంను 50 వేల నుంచి 60 వేల కిలో న్యూటన్స్ ఫోర్స్‌తో నడుపుతాం. టన్నెల్ మార్గంలో 3.5కిలోమీటర్ల మేర కొండచరియలు అడ్డుపడటంతో వాటన్నిటిని తొలగించేందుకు ఏకంగా 1.3 లక్షల కిలో న్యూటన్స్ ఫోర్స్‌ను వాడాల్సి వచ్చింది'అని వివరించారు. 'ఆ సమయంలో ఈ ప్రాజెక్టును పక్కన పెడతారేమోనని అందరం అనుకున్నాం. ఇక్కడున్న మొత్తం 200 మంది అనుభవజ్ఞులైన సిబ్బంది అంతా కలిసి సాంకేతిక పరిజ్ఞానం సాయంతో విజయవంతంగా నెరవేర్చాం'అని బల్జీందర్ సింగ్ తెలిపారు. 'మా దగ్గర శక్తి అనే పేరుతో ఉన్న జర్మనీ తయారీ టీబీఎంను దాదాపు 10 రోజులపాటు 12 గంటల చొప్పున షిఫ్టుల్లో పనిచేస్తూ ఆగకుండా నడుపుతూనే ఉన్నాం. ఒక్క క్షణం అది ఆగిపోయినా తీరని నష్టం వాటిల్లేది'అని పేర్కొన్నారు. సాధారణ రోజుల్లోనూ 140 మీటర్ల పొడవాటి టీబీఎంను కేవలం కొద్దిసేపు మాత్రమే ఆపేవాళ్లమన్నారు. హిమాలయ పర్వత ప్రాంతాల్లో టీబీఎంను వాడటం ఇదే మొదటిసారని చెప్పారు. ఈ ప్రాజెక్టులో మొత్తం 30 కిలోమీటర్ల మేర టన్నెలింగ్ పనులున్నాయని లార్సెన్ అండ్ టూబ్రో అధికారులు వివరించారు. ప్రధాన టన్నెళ్లు, ఎస్కేప్ టన్నెళ్లు, క్రాస్ ప్యాసేజెస్ వంటి వాటితో దేశంలోనే అత్యంత సంక్లిష్టమైన ముఖ్యమైన మౌలిక రంగ ప్రాజెక్టుగా పేర్కొన్నారు. 30 కిలోమీటర్లకుగాను 21 కిలోమీటర్లు, అంటే 70 శాతం తవ్వకం టీబీఎంతోనే పూర్తి కాగా, మిగతా 9 కిలోమీటర్లు, 30 శాతం మాత్రమే డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ విధానంలో పనులు పూర్తయ్యాయన్నారు.

లండన్‌లో పాలస్తీనా యాక్షన్ ర్యాలీ

425 మంది అరెస్ట్..

లండన్: 'పాలస్తీనా యాక్షన్'ను నిషేధించడాన్ని నిరసిస్తూ శనివారం లండన్‌లోని పార్లమెంట్ స్క్వేర్ వద్ద పెద్ద సంఖ్యలో మద్దతుదారులు గుమికూడారు. పాలస్తీనా యాక్షన్‌కు మద్దతిస్తున్నాం, మారణ హోమాన్ని ఖండిస్తున్నాం అనే ప్లకార్డులు చేబూనారు. నిషేధిత సంస్థను బలపర్చినందుకు పోలీసులు అరెస్టులకు పూనుకున్నారు. కొందరు నిరసనకారులు పోలీసులను దుర్భాషలాడుతూ వారిపైకి ఉమ్మివేయడంతోపాటు, చేతికి అందిన వస్తువులను విసిరేస్తూ కాళ్లతో తన్నారు. పోలీసులపై దాడికి దిగినందుకు 25 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. శనివారం పాలస్తీనా యాక్షన్‌కు అనుకూలంగా పాలస్తీనా కోఎలిషన్ చేపట్టిన ర్యాలీకి 20 వేల మంది తరలిరాగా, 'డిఫెండ్ అవర్ జ్యూరీస్' సంస్థ చేపట్టిన ర్యాలీలో ఎక్కువ మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ర్యాలీల సందర్భంగా నగర వ్యాప్తంగా సుమారు 2,500 మంది పోలీసులను మోహరించారు. పాలస్తీనా యాక్షన్ సంస్థను జూలైలో ఉగ్రవాద సంస్థగా ప్రకటించారు.

దేశ అంతరాత్మకు ఓటెయ్యండి

● ఎంపీలకు జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి బహిరంగ లేఖ



సాక్షి, న్యూఢిల్లీ: దేశ అంతరాత్మకు ఓటు వేయాలని ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో విపక్ష 'ఇండియా'కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి అన్ని పార్టీల ఎంపీలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక బహిరంగ లేఖ విడుదల చేశారు. దేశ ప్రజాస్వామ్య పరిధి సంకుచితమై, పౌర హక్కులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాయని పేర్కొన్నారు. ఇది కేవలం ఉప రాష్ట్రపతిని ఎన్నుకోవడానికి జరుగుతున్న ఎన్నిక కాదని, దేశ ఆత్మను, అంతరాత్మను కాపాడుకునే చారిత్రక బాధ్యత అని ఉద్ఘాటించారు. దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రహస్య బ్యాలెట్ ద్వారా మనస్సాక్షి మేరకు ఓటు వేయాలని ఎంపీలకు విజ్ఞప్తి చేశారు. లేఖలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఇంకా ఏం ప్రస్తావించారంటే...

నాది వ్యక్తిగత ఆకాంక్ష కాదు

''నా అభ్యర్థిత్వం వ్యక్తిగత ఆకాంక్ష కాదు. మన ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించి, బలోపేతం చేయడానికి జరుగుతున్న ఒక సామూహిక ప్రయత్నం. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలతో నిర్మితమైన మన గణతంత్ర ఆత్మను కాపాడుకోవడం మనందరి కర్తవ్యం. ప్రజాసేవలో దశాబ్దాల నా అనుభవాన్ని పార్లమెంటరీ సంప్రదాయాలకు నిష్పక్షపాత సంరక్షకుడిగా ఉపయోగించి సేవ చేస్తా. రాజ్యసభ ఛైర్మన్‌గా సభకు పూర్వ గౌరవాన్ని తీసుకురావడమే నా లక్ష్యం. రాజ్యసభను హేతుబద్ధమైన చర్చలు, నిర్మాణాత్మక సంవాదాలకు నిజమైన వేదికగా మారుస్తా. అనవసర వివాదాలకు తావివ్వకుండా, జాతీయ ప్రయోజనాల కోసం ఆలోచనాత్మకమైన చర్చలు జరిగేలా చూస్తా. సహకారమే నా బలం.. ఘర్షణ కాదు. ఏకాభిప్రాయ సాధనే నా మార్గం. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి మహనీయులు చూపిన దారిలో మనం నడవాలి. వారి ఆశయాలు సాధించాలి.

రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెడతా..

ప్రస్తుత పాలనలో దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాలు, మహిళలు, మైనారిటీలు, యువత అణచివేతకు గురవుతున్నారు. భారత నేలపై ప్రజాస్వామ్యం కేవలం పైపూత మాత్రమే అన్న బాబాసాహెబ్ అంబేద్కర్ హెచ్చరిక నేటి పరిస్థితుల్లో ప్రతిధ్వనిస్తోంది. నేను ఉపరాష్ట్రపతిగా ఎన్నికైతే, సభా కార్యకలాపాలలో సంపూర్ణ తటస్థతను పాటిస్తూ, ప్రతి సభ్యుడి గౌరవాన్ని కాపాడటం ద్వారా పార్లమెంటరీ వ్యవస్థ పవిత్రతను కాపాడటానికి అంకితమవుతా. రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెడతా. ప్రజాస్వామ్యం అంటే సంభాషణ, చర్చ, అసమ్మతి అని గుర్తుంచుకోవాలి. ఉప ఎన్నికల్లో పార్టీ విప్ లేదు, బ్యాలెట్ రహస్యమైనది. ఇది కేవలం మీ ఉపరాష్ట్రపతిని ఎన్నుకోవడానికి వేసే ఓటు కాదు, ఇది భారతదేశ ఆత్మకు, మనస్సాక్షికి వేసే ఓటు. కలిసికట్టుగా మన గణతంత్రాన్ని బలోపేతం చేద్దాం. ప్రజాస్వామ్యాన్ని కాపాడేవారికి ఓటు వేయండి. భవిష్యత్ తరాలు గర్వపడే వారసత్వాన్ని అందిద్దాం. 'జై హింద్, జై సంవిధాన్'' అని అన్నారు.

జైలు లైబ్రరీ క్లర్క్‌గా ప్రజ్వల్



యశవంతపుర: అత్యాచారం కేసులో మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ మనవడు, మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ బెంగళూరు పరప్పన అగ్రహార సెంట్రల్ జైలులో జీవిత ఖైదును అనుభవిస్తుండడం తెలిసిందే. సాధారణ ఖైదీగా ఉంటున్న ప్రజ్వల్ మెకానికల్ ఇంజినీరింగ్ చదివారు. ఆయనకు అధికారులు జైలులోని గ్రంథాలయ క్లర్కుగా బాధ్యతలు అప్పగించారు. ఖైదీలకు పుస్తకాలు ఇవ్వడం, వాటిని నమోదు చేయడం ప్రజ్వల్ పని. రోజువారీ వేతనంగా రూ.522 లభిస్తుంది. న్యాయవాదులతో చర్చలు జరపడం, కోర్టు వాయిదాల కారణంగా లైబ్రరీకి పూర్తి సమయాన్ని ఆయన కేటాయించడం లేదని జైలు అధికారులు తెలిపారు. జీవిత ఖైదు అనుభవించే వారికి నైపుణ్యం, ఆసక్తి ఆధారంగా పనులను కేటాయిస్తారు. వాటన్నిటినీ పూర్తి చేస్తే రోజుకు రూ.522 లభిస్తాయి. వారానికి మూడు రోజుల వంతున నెలకు కనీసంగా 12 రోజులపాటైనా వీరు పనిచేయాల్సి ఉంటుంది.

పంజాబ్‌లో రేపు మోదీ పర్యటన

చండీగఢ్: ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం పంజాబ్‌లో పర్యటించనున్నారు. వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించి, బాధితులను పరామర్శిస్తారు. ప్రధానమంత్రి ఆర్థిక సాయం ప్రకటించే అవకాశం ఉందని పంజాబ్ బీజేపీ అధ్యక్షుడు సునీల్ జాఖర్ చెప్పారు. భీకర వర్షాలు, వరదల ధాటికి పంజాబ్‌లో భారీ నష్టం వాటిల్లింది. సట్లెజ్, బియాస్, రావి నదులు ఉప్పొంగి ప్రవహించడంతో పంటలు నీట మునిగాయి. రహదారులు, ఇళ్లు ధ్వంసమయ్యాయి. రాష్ట్రంలో వరదల వల్ల గత కొన్ని రోజుల్లో ఏకంగా 46 మంది మృతిచెందారు. 1.75 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. పంజాబ్‌లో ఈస్థాయి నష్టం జరగడం గత పదేళ్లలో ఇదే మొదటిసారి.

కఠ్మాండులో నేపాల్-చైనా సైనిక విన్యాసాలు

కఠ్మాండు: నేపాల్, చైనాల మధ్య ఐదో విడత సైనిక విన్యాసాలు ఆదివారం కఠ్మాండులో మొదలయ్యాయి. సాగర్‌మాత మైత్రి పేరుతో పది రోజుల పాటు నేపాల్ సైన్యం, చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీలు పర్యావరణ విపత్తులు, ఐరాస శాంతి పరిరక్షక దళాలు, ఉగ్రవాద వ్యతిరేక చర్యలు తదితర అంశాలపై ఉమ్మడి విన్యాసాలు జరుపుతాయి. 2017 నుంచి రొటేషన్ విధానంలో ఈ విన్యాసాలు జరుగుతున్నాయి. నేపాల్ సైన్యం సామర్థ్యాన్ని ఇనుమడింప జేసేందుకు ఇటువంటి ద్వైపాక్షిక, బహుళ పాక్షిక విన్యాసాలు, వృత్తి పరమైన పోటీలను మిత్ర దేశాలతో చేపడుతున్నట్లు ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.

బర్త్‌డే వేడుకలో గ్యాంగ్ రేప్

కోల్‌కతా: ఓ యువతి పుట్టిన రోజు వేడుకకు వచ్చిన ఇద్దరు స్నేహితులు ఆమెపై గ్యాంగ్ రేప్‌నకు పాల్పడ్డారు. కోల్‌కతాలోని హరిదేవ్‌పూర్‌లో ఈ నెల 5వ తేదీన చోటుచేసుకుంది. 20 ఏళ్ల యువతిపై అత్యాచారానికి పాల్పడిన ఆరోపణలు ఎదుర్కొంటున్న చందన్ మాలిక్, దీప్ బిశ్వాస్‌లు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని తెలిపారు. బాధిత యువతితో చందన్ మాలిక్‌కు కొన్ని నెలల క్రితం పరిచయమేర్పడింది. దక్షిణ కోల్‌కతా పూజా కమిటీ చీఫ్‌నని చెప్పుకున్న మాలిక్ ఆ తర్వాత దీప్‌ను ఆమెకు పరిచయం చేశాడు. పూజా కమిటీలో ఆమెకు కూడా సభ్యత్వం వచ్చేలా చేస్తామని వాగ్దానం చేశారు. తరచూ ముగ్గురూ మాట్లాడుకునేవారు. శుక్రవారం బాధితురాలు బర్త్‌డే జరుపుకుంది. ఆ రోజు రాత్రి ఇద్దరు మిత్రులు కలిసి ఆమెను రీజెంట్ పార్క్ ఏరియాలోని ఓ ఫ్లాట్‌కు తీసుకెళ్లారు. అందరూ కలిసి అక్కడే విందు భోజనం చేశారు. యువతి అక్కడి నుంచి బయటకు వచ్చేందుకు ప్రయత్నించగా తలుపు మూసేసి అడ్డగించారు. ఆమెపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డారు. మరునాడు ఉదయం 10.30 గంటల సమయంలో బాధితురాలు బయటకు వచ్చింది. కుటుంబసభ్యులతో కలిసి వెళ్లి హరిదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుల ఆచూకీ తెలుసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

హొంకీల జుత్తులో... యువరాణి హొయలు



భర్త ప్రిన్స్ విలియంతో కలిసి వచ్చినప్పుడు కొత్తతరహా హెయిర్‌స్టైల్‌లో కనిపించిన యువరాణి కేట్ మిడిల్టన్. బ్రిటన్‌లోని బ్రైటన్ సిటీలోని ఆదివారం ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా ఉమెన్స్ రగ్బీ వరల్డ్ కప్ మ్యాచ్ వేళ తీసిందీ ఫొటో

60 మందిని చంపిన బోకో

మైదుగురి(నైజీరియా): నైజీరియాలో బోకో హరాం ఉగ్రమూకలు దారుణానికి ఒడిగట్టారు. బోర్నో రాష్ట్రంలోని బమా గ్రామంపై దాడి చేసి కనీసం 60 మందిని పొట్టనబెట్టుకున్నారు. ముష్కరులు గ్రామంలోని డజను వరకు ఇళ్లకు నిప్పుపెట్టారు. భీతిల్లిన 100 మందికి పైగా గ్రామస్తులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఘటనాస్థలిని రాష్ట్ర గవర్నర్ బబగన జులుం శనివారం సాయంత్రం పరిశీలించారు. బోకో హరాంలోని ఓ వర్గానికి చెందిన సాయుధులు ఈ దురాగతానికి పాల్పడినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. నైజీరియాలో 2009 నుంచి బోకో హరాం జిహాదీలు హింసాత్మక ఘటనలకు పాల్పడుతున్నారు. పాశ్చాత్య విద్యను వ్యతిరేకిస్తున్న వీరు ఇస్లామిక్ చట్టాల ప్రకారం పాలన జరగాలని డిమాండ్ చేస్తున్నారు.

డీఎంకేది వేర్పాటువాదం

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ధ్వజం



న్యూఢిల్లీ: తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వ వైఖరిపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో పెరిగిపోయిన అవినీతి, కుల సంబంధ నేరాలపై డీఎంకే ప్రభుత్వం సమాధానం చెప్పే పరిస్థితిలో లేదన్నారు. అందుకే, బీజేపీని లక్ష్యంగా చేసుకుని తమిళ భాష, ద్రవిడ గుర్తింపు వంటి భావోద్వేగాలకు సంబంధించిన అంశాలను లేవనెత్తుతోందని మండిపడ్డారు. బీజేపీని ద్రవిడ ప్రయోజనాలకు విరోధి అంటూ చేసే వాదనను మించిన బూటకం మరొకటి లేదని కొట్టిపారేశారు. ఆదివారం మంత్రి నిర్మల పీటీఐతో మాట్లాడారు. డీఎంకే ప్రభుత్వంలో రాష్ట్రంలో మంత్రులపై అవినీతి ఆరోపణలు, మహిళలపై నేరాలు, కుల పరమైన హింస ముఖ్యంగా దళితులపై దాడులు, డ్రగ్స్ దందా పెచ్చుమీరాయి. వీటిపై డీఎంకే వద్ద ఎటువంటి సమాధానం లేదు. వీటి విషయాన్ని పక్కనబెట్టిన ఆ పార్టీ ప్రభుత్వం వేర్పాటువాదాన్ని తలకెత్తుకుంది. తాము పన్నులుగా చెల్లించినదంతా బిహార్‌కు తరలిపోతోందంటున్నారు. బిహార్ ఏమన్నా పాకిస్తాన్‌లో ఉందా? బిహార్ వాసులు మీ ఫ్యాక్టరీల్లో పనిచేస్తున్నారు. వారితో మీరు లాభం పొందుతున్నారు. మీరు పన్నుగా చెల్లించింది కూడా మీ దగ్గరకే రావాలా? ద్రవిడ మోడల్ రాజకీయాలను ఇప్పుడు వేర్పాటువాద మనస్తత్వం డామినేట్ చేస్తోంది'అంటూ నిర్మల విరుచుకుపడ్డారు. సామాజిక న్యాయం తమ వల్ల మాత్రమే సాధ్యమంటూ డీఎంకే చేస్తున్న వాదనల్ని ఆమె కొట్టిపారేశారు. 'అదే నిజమైతే, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో పరువు హత్యలు వంటి కుల హింస ఘటనలు పెరిగిపోయాయి. ముఖ్యంగా ఎస్సీలు తరచుగా దాడులకు గురవుతున్నారు'అని ఆరోపించారు. ఎస్సీలుండే ప్రాంతాల్లోని జలవనరుల్ని మానవ వ్యర్థాలతో కలుషితం చేస్తున్న ఘటనలను చూస్తే తనకు రక్తం మరుగుతోందన్నారు.

అమెరికాపై 75% టారిఫ్‌లు విధించగలరా?

ప్రధాని మోదీకి కేజ్రీవాల్ సవాల్

రాజ్‌కోట్: భారత ఉత్పత్తులపై 50 శాతం టారిఫ్‌లు విధించిన అమెరికాపై 75 శాతం ప్రతీకార సుంకాలను ప్రకటించి బదులు తీర్చుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ పేర్కొన్నారు. ప్రధాని మోదీకి ఇలా చేసేందుకు ధైర్యం ఉందా? అని సవాల్ విసిరారు. అమెరికా ముడి పత్తిపై డిసెంబర్ 31వతేదీదాకా 11 శాతం పన్ను మినహాయిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయంతో మన రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. అమెరికా రైతులు లాభ పడుతుండగా గుజరాత్ రైతులు నిరుపేదలుగా మారుతారని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే మన ప్రధాని మోదీ ధైర్యంగా వ్యవహరించి, అమెరికాపై ప్రతీకార సుంకాలను 75 శాతం విధించాలని, ఈ విషయంలో దేశం ఆయనకు మద్దతుగా నిలుస్తుందని కేజ్రీవాల్ చెప్పారు. ట్రంప్ మనకు తలొగ్గుతారో లేదో అప్పుడు చూడాలన్నారు.

ఎన్‌కౌంటర్‌లో వాంటెడ్ మావోయిస్ట్ మృతి

చైబాసా: జార్ఖండ్‌లో రూ.10 లక్షల పోలీసు రివార్డు కలిగిన మావోయిస్ట్ నేత ఎదురు కాల్పుల ఘటనలో చనిపోయాడు. ఆదివారం ఉదయం వెస్ట్ సింగ్‌భుమ్ జిల్లా పంచ్‌లతబురు హిల్స్ ఏరియాలో ఘటన చోటుచేసుకుంది. రెలా పరల్ ఏరియాలో మావోయిస్టులు సంచరిస్తున్నట్లు శనివారం అందిన సమాచారంతో బలగాలు కూంబింగ్ చేపట్టాయని కొల్హాన్ డీఐజీ అనురంజన్ కిస్పొట్టా చెప్పారు. 'ఆదివారం ఉదయం 5.45 గంటల వేళ ఇరువర్గాల మధ్య కాల్పులు మొదలయ్యాయి. కొద్దిసేపటికే మావో యిస్టులు అక్కడి నుంచి అటవీ ప్రాంతంలోకి జారుకున్నారు. అనంతరం ఆ ప్రాంతంలో జోనల్ కమాండర్ అమిత్ హన్స్‌దా మృతదేహం కనిపించింది. ఒక రైఫిల్, కొన్ని తూటాలు లభ్యమయ్యాయి'అని ఆయన అన్నారు. హన్స్‌దాపై వివిధ జిల్లాల పరిధిలోని 12 పోలీస్ స్టేషన్లలో 96 కేసులున్నాయన్నారు.

బెంగాల్ విభజనకు కారణమైన వైస్రాయ్?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ హిస్టరీ

ఆధునిక భారతదేశ చరిత్ర - బ్రిటిషర్ల పాలన

వైస్రాయ్‌లు

లార్డ్ కానింగ్

ఇతడిని 1858 నవంబర్ 1న అలహాబాద్ కోటలో తొలి రాజప్రతినిధిగా ప్రకటించారు.

మొదటి లార్డ్ ఎల్జిన్ (1862-63)

ఇతడి కాలంలో ప్రధానంగా వహాబీ ఉద్యమం జరిగింది. సుప్రీమ్, సాదర్ కోర్టులను హైకోర్టులో కలిపారు.

సర్ జాన్ లారెన్స్ (1864-69)

లారెన్స్ 1866లో ఒడిశాలో,1868-69లో రాచపుటానాలో సంభవించిన క్షామానికి సంబంధించిన నివారణన చర్యలు తీసుకోవడానికి సలహా సంఘం నియమించాడు. 1866లో వితంతు వివాహ సంస్థను డి.కె. కార్వే ఆధ్వర్యంలో బొంబాయిలో స్థాపించారు. సర్ జాన్ లారెన్స్ అనేక రైల్వే, తంతి తపాలా సౌకర్యాలను కల్పించాడు. ఇతడు యూరప్‌లో మొదటిసారిగా తంతి సౌకర్యం కల్పించాడు. పంజాబ్ కౌలు చట్టాన్ని జారీ చేశాడు. దీని ప్రకారం కౌలుదార్లకు అధికారాలు ఇచ్చారు. భూటాన్ యుద్ధం చేశాడు. ఇతడి కాలంలో మద్రాస్, బొంబాయి, కలకత్తాలో కోర్టులు ఏర్పాటు చేశారు.

లార్డ్ మేయో (1869-72)

ఇతడు స్టాటిస్టికల్ సర్వే ఆఫ్ ఇండియా, వ్యవసాయ, వాణిజ్య శాఖలను ఏర్పాటు చేశాడు. ఇతడు ఆఫీసులోనే హత్యకు గురైన మొదటి గవర్నర్ జనరల్. అజ్మీర్‌లో విద్య కోసం ఒక కళాశాల, రాజ్‌కోట్‌లో రాజకీయ శిక్షణ ఇవ్వడానికి మరో కళాశాల స్థాపించాడు.

లార్డ్ నార్త్ బ్రూక్ (1872-76)

ఇతడి కాలంలో 1875లో వేల్స్ రాజు (ఏడో ఎడ్వర్డ్) భారతదేశాన్ని సందర్శించాడు. 1872లో బహు భార్యత్వ నిషేధ చట్టాన్ని జారీ చేశారు.

లార్డ్ లిట్టన్ (1876-80)

ఇతడి కాలంలో 1878లో ఆయుధ చట్టం, దేశభాషా పత్రికల చట్టాలను చేశారు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడే జాతీయ వాదులను అణచివేయడం కోసం దేశభాషా పత్రికల చట్టాన్ని ప్రవేశపెట్టారు. లిట్టన్ 1878లో ఐ.సి.ఎస్. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల గరిష్ఠ వయసును 21 ఏళ్ల నుంచి 19 సంవత్సరాలకు తగ్గిస్తూ కొత్త నిబంధనలు ప్రకటించాడు. ఇతడు రెండో అఫ్గాన్ యుద్ధం చేశాడు. ఇతడి కాలంలో తీసుకువచ్చిన యుద్ధ చట్టం యావత్ జాతిని నిరాయుధులను చేసింది. రాయల్ టైటిల్స్ యాక్ట్ చేశారు. 1877లో ఢిల్లీ దర్బార్ జరిగింది. ఇతడి కాలంలో మొదటిసారిగా కరవుపై కమిషన్ ఏర్పాటు చేశారు.



1919లో స్వాతంత్ర్యోద్యమ నాయకులైన డాక్టర్ సైఫుద్దీన్ కిచ్లూ, డాక్టర్ సత్యపాల్ అరెస్ట్‌కు నిరసనగా అమృత్‌సర్‌లోని జలియన్ వాలాబాగ్‌లో సమావేశమైన ప్రజానీకంపై జనరల్ డయ్యర్ విచక్షణారహితంగా కాల్పులు జరిపించాడు. ఈ ఊచకోతకు నిరసనగా రవీంద్రనాథ్ టాగూర్ బ్రిటిష్ ప్రభుత్వం ఇచ్చిన నైట్‌హుడ్ బిరుదును త్యజించారు. 1929లో లాహోర్ కాంగ్రెస్ సమావేశంలో సంపూర్ణ స్వాతంత్ర్య సాధనే కాంగ్రెస్ ఆశయంగా ప్రకటించారు. ఇదే సంవత్సరం త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు.

లార్డ్ రిప్పన్ (1880-84)

ఇతడు 1882లో దేశభాషా పత్రికల చట్టాన్ని రద్దు చేసి స్వేచ్ఛా ప్రతిపత్తిని కల్పించాడు. 1881లో మొదటి కర్మాగార చట్టం ప్రవేశపెట్టాడు. దీని ద్వారా కర్మాగారంలో పని చేసే శ్రామికుల పరిస్థితులు మెరుగయ్యాయి. 1882లో ఆర్థిక వికేంద్రీకరణ చేసి ఆదాయాన్ని 3 భాగాలుగా విభజించారు. అవి.. 1) కేంద్ర ప్రభుత్వ ఆదాయం, 2) రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం, 3) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి ఆదాయం. 1882లో స్థానిక ప్రభుత్వాలకు పునాది వేసిన ఘనత రిప్పన్‌దే. ఇతడు 1882-85లో స్థానిక ప్రభుత్వ వ్యవహార చట్టం జారీ చేశాడు. ఇదే సంవత్సరంలో సర్ విలియం హంటర్ అధ్యక్షతన విద్యకు సంబంధించి ఒక కమిషన్‌ను నియమించాడు. ఈ కమిషన్ సూచనల ఆధారంగా ప్రాథమిక పాఠశాల విద్యను స్థానిక సంస్థలకు అప్పగించాడు. స్త్రీ విద్య కూడా ప్రవేశపెట్టారు. ఇతడి కాలంలో యూరోపియన్ల ఒత్తిడి మేరకు 'ఇల్బర్ట్ బిల్లు'ను సవరించారు.

ఈ బిల్లు క్రిమినల్ కేసుల్లో యూరోపియన్లను విచారించడానికి భారతీయ జిల్లా మెజిస్ట్రేటులు, సెషన్స్ జడ్జీలకు అవకాశం కల్పించే శాసనంగా ఉండేది. 1879లో వాసుదేవ్ బలవంత్ ఫాడ్కే అనే ఉద్యోగి అమోషి రైతులను కూడగట్టి మహారాష్ట్రలో సాయుధ తిరుగుబాటు ప్రారంభించాడు. లార్డ్ రిప్పన్ కాలంలో భారతదేశంలో మొదటిసారిగా జనాభా లెక్కలు గణించారు.

లార్డ్ డఫ్రిన్ (1884-88)

ఇతడి కాలంలో 1885లో భారత జాతీయ కాంగ్రెస్ స్థాపనకు ఎ.ఒ. హ్యూమ్ తుది రూపం ఇచ్చాడు. ఇదే సంవత్సరం డిసెంబర్‌లో బొంబాయిలో ప్రథమ జాతీయ కాంగ్రెసు సమావేశానికి డబ్ల్యు.సి. బెనర్జీ అధ్యక్షత వహించాడు. మూడో బర్మా యుద్ధం డఫ్రిన్ కాలంలోనే జరిగింది.

లాండ్జిన్ (1888-94)

ఇతడి కాలంలో ఫ్యాక్టరీ చట్టం చేశారు. సివిల్ సర్వీసులను విభజించారు. 'డ్యూరాండ్ కమిషన్' బ్రిటిష్ ఇండియా, అఫ్గానిస్తాన్ మధ్య సరిహద్దును నిర్ణయించింది. 1892లో 'భారత కౌన్సిళ్ల చట్టం' జారీ చేశారు. దీని ప్రకారం కేంద్ర, రాష్ట్ర శాసనసభల్లో సభ్యుల సంఖ్య పెరిగింది. వీరిలో కొందరిని భారతీయులు పరోక్షంగా ఎన్నుకునే వీలు కలిగింది. కానీ ప్రభుత్వం నియమించే సభ్యుల సంఖ్యాధిక్యత యథాతథంగానే ఉంది. నూతన సభ్యులకు వార్షిక బడ్జెట్‌పై చర్చలో పాల్గొనే అవకాశం కల్పించారు. కానీ, వీరికి ఓటు హక్కు లేదు.

ఎల్జిన్ (1894-99)

ఇతడి కాలంలో 1896-97లో భయంకరమైన క్షామం సంభవించింది. దీనికి కారణాలు తెలుసుకోవడానికి 'లియల్' అధ్యక్షతన ఒక సంఘాన్ని నియమించాడు. ఇది నివేదిక సమర్పించక ముందే 1899లో మళ్లీ క్షామం వచ్చింది.చాపేకర్ సోదరులు 1897లో ఇద్దరు బ్రిటిష్ అధికారులను హత్య చేశారు.

లార్డ్ కర్జన్ (1899-1905)

కర్జన్ 1904లో యూనివర్సిటీ చట్టాన్ని జారీ చేశాడు. 'సర్‌థామస్' ర్యాలీ అధ్యక్షతన యూనివర్సిటీలకు సలహాలు ఇవ్వడానికి ఒక కమిషన్ నియమించాడు. 1904లో ప్రాచీన కట్టడాల (మాన్యుమెంట్స్) రక్షణ చట్టం, ప్రిజర్వేషన్ యాక్ట్‌ను జారీ చేశాడు. బిహార్‌లోని 'పూసా'లో వ్యవసాయ పరిశోధన సంస్థను స్థాపించాడు. 1905లో బెంగాల్‌ను విభజించాడు. కర్జన్ కాలంలోనే 1904లో వి.డి సావర్కర్ 'అభినవ భారత్' పేరుతో ఒక రహస్య విప్లవ సంస్థను స్థాపించాడు.

లార్డ్ మింటో (1905-10)

ఇతడి కాలంలో అతివాదులు, విప్లవ కారులు విజృంభించారు. వీరి కార్యకలాపాలను అరికట్టడానికి 1908లో 'ఎక్స్‌ప్లోజివ్ సబ్‌స్టెన్స్ యాక్ట్' చేశాడు. పత్రికలు, ప్రజావేదికలపై ఆంక్షలు విధించాడు. దీని కారణంగా 1908లో 'లోకమాన్య' బాలగంగాధర్ తిలక్‌ను మాండలే కారాగారంలో నిర్బంధించారు.లార్డ్ మింటో కాలంలోనే 1906లో 'భారత ముస్లింలీగ్'ను స్థాపించారు. ఆగాఖాన్, ఢాకా నవాబు దీని ఏర్పాటుకు కృషి చేశారు. 1907లో భారత జాతీయ కాంగ్రెస్ అతివాదులు, మితవాదులుగా చీలిపోయింది. బెంగాల్ విభజనకు నిరసనగా ప్రతిఘటనోద్యమ నాయకులు 1905 అక్టోబర్ 16ను జాతీయ సంతాప దినంగా ప్రకటించారు. 1906 ఆగస్టు 15న జాతీయ విద్యా సమితి ఆవిర్భవించింది. కలకత్తాలో జాతీయ కళాశాలను ప్రారంభించారు. అరవింద్ ఘోష్ దీనికి మొదటి ప్రిన్సిపల్‌గా వ్యవహరించారు. 1905 తర్వాత అనేక పత్రికలు విప్లవ హింసావాదాన్ని ప్రచారం చేయడం ప్రారంభించాయి. వీటిలో బెంగాలీలో వెలువడే సంధ్య, యుగంధర్; పుణే నుంచి వెలువడే 'కాల్ ప్రముఖ్' పత్రికలు ముఖ్యమైనవి. 1909లో భారత శాసనసభల చట్టం ద్వారా రాజ్యాంగపరమైన రాయితీలు ప్రకటించారు. వీటినే మింటో-మార్లే సంస్కరణలు అంటారు. వీటి ద్వారా కేంద్ర, రాష్ట్ర శాసనసభల్లో ఎన్నికైన సభ్యుల సంఖ్యను పెంచారు. వీరిలో ఎక్కువ మందిని పరోక్ష పద్ధతి ద్వారా ఎన్నుకునే విధానం ప్రవేశపెట్టారు. మత ప్రాతిపదికన ప్రత్యేక నియోజకవర్గాలను కూడా ఏర్పాటు చేశారు. హిందూ-ముస్లింలను విభజించి పాలించడమే ఇందులోని ప్రధాన ఉద్దేశం.

లార్డ్ హార్డింజ్ (1910-1916)

ఇతడి కాలంలో 1911లో బెంగాల్ విభజనను రద్దు చేశారు. భారత రాజధానిని కలకత్తా నుంచి ఢిల్లీకి మార్చారు. అయిదో జార్జి ఢిల్లీ దర్బారును ఏర్పాటు చేశారు. 1914లో మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది. భారత సైనికులు,పౌరులను అనుమతి లేకుండానే యుద్ధంలోకి నెట్టారు. 1915లో గాంధీజీ దక్షిణాఫ్రికా నుంచి భారత్ తిరిగి వచ్చారు. ఇదే సంవత్సరంలో అనిబిసెంట్ హోమ్ రూల్ ఉద్యమాన్ని, మదన్ మోహన్ మాలవ్య 'హిందూ మహాసభ'ను స్థాపించారు. 1915లోనే గోఖలే, ఫిరోజ్‌షా మెహతా మరణించారు.

విద్య, ఉద్యోగ సమాచారం

ఐఐటీ హైదరాబాద్‌లో ఏవీ టెక్నీషియన్ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) హైదరాబాద్ ఒప్పంద ప్రాతిపదికన ఏవీ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 03.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 35 ఏళ్లలోపు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.30,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష/స్కిల్ టెస్ట్/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.09.2025.
» **వెబ్‌సైట్:** https://www.iith.ac.in

ఐఐటీ హైదరాబాద్‌లో వివిధ ఉద్యోగాలు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) హైదరాబాద్‌లో ఒప్పంద ప్రాతిపదికన హెడ్ ఆఫ్ ఆపరేషన్స్, సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **పోస్టుల వివరాలు:** హెడ్ ఆఫ్ ఆపరేషన్స్-01, సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ, ఎంబీఏ లేదా పీజీడీఎం (హెచ్ఆర్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** హెడ్ ఆఫ్ ఆపరేషన్స్ పోస్టుకు 50 ఏళ్లు, సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్‌కు 45 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు హెడ్ ఆఫ్ ఆపరేషన్స్ పోస్టుకు రూ.2,00,000, సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ పోస్టుకు రూ.80,000 నుంచి రూ.1,00,000.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.09.2025.
» **వెబ్‌సైట్:** https://www.iith.ac.in

నక్షత్రాల ఉష్ణోగ్రతలను కొలవడానికి ఉపయోగించేది?



ఉష్ణం

ఉష్ణోగ్రత మాపక రకాలు

వాయు ఉష్ణోగ్రతా మాపకాలు

ఘన, ద్రవ పదార్థాలతో పోలిస్తే వాయువుల ఉష్ణవ్యాకోచం అనేక రెట్లు ఎక్కువగా ఉంటుంది. కాబట్టి వీటిని ఉపయోగించి తక్కువ ఉష్ణోగ్రతను కచ్చితంగా కొలవచ్చు. ఈ ఉష్ణోగ్రత మాపకాల్లో ఎలాంటి వాయువులైనా ఉపయోగించవచ్చు. ఇవి పరిమాణంలో పెద్దవిగా ఉంటాయి. అందువల్ల వీటిని ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి తీసుకెళ్లడం సాధ్యం కాదు. వీటిలో హైడ్రోజన్, నైట్రోజన్, హీలియంలతో పాటు ఏ వాయువునైనా నింపవచ్చు.

నిరోధక ఉష్ణోగ్రతా మాపకాలు

లోహాలను వేడిచేస్తే వాటి నిరోధం పెరుగుతుందనే సూత్రం ఆధారంగా ఈ ఉష్ణోగ్రతా మాపకాలు పనిచేస్తాయి. కానీ వేర్వేరు లోహాల నిరోధాలు వేర్వేరుగా ఉండటం వల్ల వీటిని ఉపయోగించి ఉష్ణోగ్రతలను కచ్చితంగా కొలవలేం. నిరోధక ఉష్ణోగ్రతా మాపకాల్లో ప్లాటినంను వాడతారు.దీన్ని ఉపయోగించి కొలిచే ఉష్ణోగ్రత స్థాయి -200°C నుంచి 1200°C.

అయస్కాంత ఉష్ణోగ్రత మాపకం

పరమశూన్య ఉష్ణోగ్రత -273°C లేదా 0°K-ను కొలవడానికి ఈ ఉష్ణోగ్రతా మాపకాలను ఉపయోగిస్తారు. సాధారణంగా ద్రవస్థితిలో ఉన్న హీలియంను ఇలాంటి మాపకాల్లో వాడతారు.

ఉష్ణ విద్యుత్ ఉష్ణోగ్రతా మాపకం

ఇది సీబెక్ ఫలితం ఆధారంగా పనిచేస్తుంది. దీన్ని ఉపయోగించి క్రిమికీటకాల ఉష్ణోగ్రతలను 0.025°C వరకు కచ్చితంగా కొలవవచ్చు. ఇలాంటి ఉష్ణోగ్రత మాపకాలను Sb, Bi అనే ఉష్ణయుగ్మంతో నిర్మిస్తారు.

సిక్స్ గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతా మాపకం

ఇందులో పాదరసం, ఆల్కహాల్‌ను ఉపయోగిస్తారు. 24 గంటల కాల వ్యవధిలో వాతావరణంలో సంభవించే కనిష్ఠ, గరిష్ఠ ఉష్ణోగ్రతలను కొలవవచ్చు.

బెక్‌మెన్స్ ఉష్ణోగ్రతా మాపకం

వివిధ స్వభావాలు ఉన్న నీటిఆవిరి ఉష్ణోగ్రతలను కొలవడానికి ఈ మాపకాన్ని వాడతారు.

ఉదాహరణ:
1) స్వచ్ఛమైన నీరు 100°C
2) సముద్ర జలం 101°C
3) మలినమైన నీరు 99°C (సుమారు)

బెథిస్కోప్

సముద్రగర్భంలో ఉన్న ఉష్ణోగ్రతలను కొలవడానికి దీన్ని జలాంతర్గామిలో అమరుస్తారు.

క్లినికల్ థర్మోమీటర్

దీన్ని సెంటారియో అనే శాస్త్రవేత్త 1602లో కనుగొన్నాడు. ప్రస్తుతం ఉపయోగిస్తున్న ఆధునిక క్లినికల్ థర్మామీటర్‌ను 1866లో సర్ థామస్ క్లిఫర్డ్ ఆల్బట్ రూపొందించాడు.

పైరో మీటర్

పరిశ్రమల్లోని బట్టీలు లేదా కొలిమిల నుంచి వెలువడే అత్యధిక ఉష్ణోగ్రతలను కొలవడానికి పైరో మీటర్‌ను ఉపయోగిస్తారు. దీని సహాయంతో 3000°C - 3500°C వరకు ఉష్ణోగ్రతలను కొలవడం సాధ్యపడుతుంది.

ఆప్టికల్ పైరోమీటర్

సూర్యుడు లేదా నక్షత్రాల్లో ఉండే అత్యధిక ఉష్ణోగ్రతలను కొలవడానికి ఉపయోగిస్తారు.

పైరోమీటర్, ఆప్టికల్ పైరోమీటర్లు ఉష్ణ వికిరణం ఆధారంగా పనిచేస్తాయి. కాబట్టి వస్తువుల ఉష్ణోగ్రతలను కొలిచేటప్పుడు వేడి వస్తువులు, ఉష్ణోగ్రత మాపకాల మధ్య భౌతిక స్పర్శ ఉండాల్సిన అవసరం లేదు.

విశిష్టోష్ణం

పదార్థం విశిష్టోష్ణం $S = \frac{1}{m}\frac{Q}{t}$

$$\Rightarrow S \propto \frac{1}{\Delta t}$$

m = పదార్థ ద్రవ్యరాశి,
Q = పదార్థానికి అందించిన ఉష్ణరాశి.

విశిష్టోష్ణం, ఆయా పదార్థాల (ఘన, ద్రవ, వాయు) స్వభావంపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి వేర్వేరు పదార్థాల్లో విశిష్టోష్ణ విలువలు వేర్వేరుగా ఉంటాయి.

పాదరసం

ఇది గది ఉష్ణోగ్రత వద్ద ద్రవస్థితిలో లభించే ఒక లోహ మూలకం. పాదరసాన్ని సిన్నబార్ అనే ముడిపదార్థం నుంచి సంగ్రహిస్తారు. స్వభావరీత్యా వెండిలా మెరవడం వల్ల దీన్ని క్విక్ సిల్వర్ అని కూడా అంటారు. పాదరసం లోహాలతో చర్య జరిపినప్పుడు ఏర్పడిన పదార్థాలను అమాల్గమ్‌లు అంటారు. ఇది Fe(ఇనుము)తో చర్య జరపదు. కాబట్టి దీన్ని ఇనుప పాత్రలో రవాణా/నిల్వ చేస్తారు. పాదరసం మంచి ఉష్ణ వాహకం, విద్యుత్ వాహకం. పాదరస కాలుష్యం వల్ల 'మినిమిటా' అనే వ్యాధి వస్తుంది. తొలిసారిగా ఈ వ్యాధిని జపాన్‌లో కనుగొన్నారు.

ఉష్ణ వ్యాకోచాలు

ఘన పదార్థాల ఉష్ణ వ్యాకోచాలు

ప్రతి ఘన పదార్థంలో ద్రవ్యరాశి మూడు అంశాల వెంబడి అంటే X, Y, Z (X- పొడవు, Y- వెడల్పు, Z- ఎత్తు)లలో విభజితమై ఉంటుంది. ఒక ఘన పరిమాణాన్ని వేడిచేస్తే అది మూడు రకాల వ్యాకోచాలను కలిగి ఉంటుంది.

దైర్ఘ్య వాకోచం: ఘన పదార్థాన్ని వేడిచేస్తే ఏదైనా ఒక అక్షం వెంట వ్యాకోచిస్తే దాన్ని దైర్ఘ్య వ్యాకోచం అంటారు.

విస్తీర్ణ వ్యాకోచం: ఒక ఘన పదార్థాన్ని వేడిచేస్తే ఏదైనా రెండు అంశాల వెంట వ్యాకోచిస్తే దాన్ని విస్తీర్ణ వ్యాకోచం అంటారు.

ఘనపరిమాణ వ్యాకోచం: ఒక ఘన పదార్థాన్ని వేడిచేస్తే అన్ని అక్షాల వెంట వ్యాకోచిస్తే దాన్ని ఘన పరిమాణ వ్యాకోచం అంటారు.

ఒక ఘన పదార్థాన్ని వేడిచేస్తే దానిలో ఉండే వివిధ వ్యాకోచాల నిష్పత్తి 1:2:3గా ఉంటుంది. కాబట్టి ప్రతి ఘనపదార్థం దాని ఘనపరిమాణంలో గరిష్ఠ వ్యాకోచాన్ని కలిగి ఉంటుంది. ఘన పదార్థాలను వేడిచేసినప్పుడు వాటి స్వభావాన్ని బట్టి అణువుల మధ్య బంధ దూరంలో మార్పు వస్తుంది.

* కొన్ని ఘన పదార్థాలను వేడిచేస్తే వీటి అణువుల మధ్య బంధ దూరం పెరగడం వల్ల ఆ పదార్థాలు వ్యాకోచిస్తాయి.
  ఉదా: Al, Cu, Fe...
* కొన్ని ఘన పదార్థాలను వేడిచేస్తే వాటి అణువుల మధ్య బంధ దూరం తగ్గి పదార్థాలు సంకోచిస్తాయి.
  ఉదా: ప్లాస్టిక్, రబ్బర్, గాజు, సిల్క్ వస్త్రాలు, తల వెంట్రుకలు, ఫ్యూజు తీగ.
* కొన్ని ఘన పదార్థాలను వేడి చేసినా లేదా చల్లబర్చినా వాటి అణువుల మధ్య బంధదూరం మారదు. కాబట్టి ఇలాంటి పదార్థాలు సంకోచ, వ్యాకోచాలు చెందవు.
  ఉదా: చెక్కదిమ్మ.

అనువర్తనాలు

* రెండు వరుస రైలు పట్టాల మధ్యలో తగినంత ఖాళీ వదలడం వల్ల అవి స్వేచ్ఛగా సంకోచ, వ్యాకోచాలు చేయగలుగుతాయి.
  అందుకే రెండు విద్యుత్ స్తంభాలు లేదా టెలిఫోన్ స్తంభాల మధ్య తీగలను కొంచెం వదులుగా బిగిస్తారు.
* ఒక అల్యూమినియం పాత్రలో ఇనుపపాత్ర బంధించి ఉన్నప్పుడు వాటిని విడదీయాలంటే వేడిచేయాలి. ఇనుము కంటే అల్యూమినియం ఎక్కువగా వ్యాకోచిస్తుంది. అందువల్ల ఇనుప పాత్ర పరిమాణం కంటే అల్యూమినియం పాత్ర పరిమాణం పెరుగుతుంది.
* ఒకవేళ ఇనుప పాత్రలో అల్యూమినియం పాత్ర బంధించి ఉంటే వాటిని వేరు చేయడం కోసం చల్లబర్చాలి. ఈ సందర్భంలో ఇనుప పాత్ర కంటే అల్యూమినియం పాత్ర ఎక్కువగా సంకోచిస్తుంది.
* గది ఉష్ణోగ్రత వద్ద ఒక లోహ పలక మధ్య బిందువు వద్ద ఒక రంధ్రం ఉంది. లోహ పలకను వేడిచేసినప్పుడు అది వ్యాకోచించడం వల్ల రంధ్రం వ్యాసం కూడా పెరుగుతుంది.
* ఎడ్లబండి కొయ్య చక్రంపై వేడిచేసిన ఇనుప చక్రాన్ని అమర్చి నీటిని చల్లినప్పుడు అది సంకోచించి చక్రాన్ని గట్టిగా అదిమి పట్టుకుంటుంది.
* విద్యుత్ బల్బులను సీల్ చేయడం కోసం ప్లాటినం(Pt)ను ఉపయోగిస్తారు. గాజు, ప్లాటినంల సంకోచ వ్యాకోచాలు పరస్పరం సమానంగా ఉండటమే దీనికి కారణం.
* ఇంటి పైకప్పుల నిర్మాణంలో కాంక్రీట్‌తో పాటు స్టీలును ఉపయోగిస్తారు. ఆ రెండు పదార్థాల సంకోచం, వ్యాకోచాలు పరస్పరం సమానంగా ఉండటమే దీనికి కారణం.
* ఇనుప బ్రిడ్జిలను నిర్మించాక వాటిని గోళాకారం లేదా స్థూపాకారం ఉన్న నిర్మాణాలపై ఉంచితే అవి స్వేచ్ఛగా సంకోచ వ్యాకోచాలు చెందుతాయి.
* వేడి గాజు పలకపై చల్లటి ద్రవాన్ని చల్లితే గాజు పొరల మధ్య అసమాన సంకోచాల వల్ల అది పగిలిపోతుంది.
* గాజు పలకపై వేడి ద్రవాన్ని చల్లితే గాజు పొరల మధ్య అసమాన వ్యాకోచాల వల్ల అది పగిలిపోతుంది.
* ఇన్వార్ స్టీల్ అనే పదార్థంలో సంకోచ, వ్యాకోచాలు పరిగణనలోకి తీసుకోలేనంత తక్కువగా ఉంటాయి. కాబట్టి ఈ పదార్థాన్ని శృతి దండాలు, మీటర్ స్కేలు, గోడ గడియారాల్లోని లోలకాల తయారీలో ఉపయోగిస్తారు.

గతంలో వచ్చిన ప్రశ్నలు

1. ఏ ఉష్ణోగ్రత వద్ద నీటికి గరిష్ఠ సాంద్రత ఉంటుంది?
   ఎ) -4°C బి) 4°C
   సి) 60°C డి) 100°C
2. నీటి అసంగత వ్యాకోచ ధర్మాన్ని ఏ పదార్థ స్వభావంతో పోల్చవచ్చు?
   ఎ) రబ్బర్ బి) ప్లాస్టిక్
   సి) ట్రైప్‌మెటల్ డి) పైవన్నీ
3. క్రిమి కీటకాల ఉష్ణోగ్రత కొలవడానికి ఉపయోగించే ఉష్ణోగ్రతా మాపకం?
   ఎ) సిక్స్-గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతా మాపకం
   బి) పైరోమీటర్
   సి) సీబెక్ ఉష్ణవిద్యుత్ ఉష్ణోగ్రతా మాపకం
   డి) అయస్కాంత ఉష్ణోగ్రతా మాపకం
4. ఉష్ణశక్తి యాంత్రికశక్తిగా ఎందులో మారుతుంది?
   ఎ) వాహనం బి) ఫ్యాన్
   సి) ఇస్త్రీపెట్టె డి) విద్యుత్ హీటర్
5. 80°C వద్ద ఉన్న వేడి టీ 70°Cకు చల్లారడానికి అయిదు నిమిషాల సమయం అవసరం. తిరిగి 70°C నుంచి 60°Cకు చల్లారడానికి కావాల్సిన సమయం?
   ఎ) అయిదు నిమిషాలు
   బి) అయిదు నిమిషాల కంటే ఎక్కువ
   సి) అయిదు నిమిషాల కంటే తక్కువ
   డి) ఏదీకాదు
6. ఒక ఇంధనం నుంచి వెలువడే ఉష్ణరాశిని దేనితో కొలుస్తారు?
   ఎ) ఉష్ణోగ్రతా మాపకం
   బి) సాధారణ కెలోరీమీటర్
   సి) బోలోమీటర్
   డి) బాంబు కెలోరీమీటర్
7. రాగి పాత్రలో వేడి ద్రవాన్ని నింపి ఇనుపబల్లపై ఉంచితే అది ఏ పద్ధతి వల్ల చల్లారుతుంది?
   ఎ) ఉష్ణవహనం బి) ఉష్ణ సంవహనం
   సి) ఉష్ణ వికిరణం డి) ఎ, బి
8. ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించేందుకు ఉపయోగించే థర్మోస్టాట్‌ను దేనితో తయారుచేస్తారు?
   ఎ) ఇనుము, ఇత్తడి బి) ఇనుము, రాగి
   సి) రాగి, ఉక్కు డి) ఇత్తడి, రాగి
9. థర్మాస్‌ఫ్లాస్క్‌లోని వేడిద్రవం ఏ పద్ధతి వల్ల ఉష్ణాన్ని నష్టపోదు?
   ఎ) ఉష్ణవహనం బి) ఉష్ణ సంవహనం
   సి) ఉష్ణ వికిరణం డి) పైవన్నీ
10. ఉష్ణోగ్రత మాపకం కనిష్ఠ రీడింగ్ ఎల్లప్పుడూ దేనికి సమానం?
   ఎ) మంచు ఉష్ణోగ్రత
   బి) పాదరస ఉష్ణోగ్రత
   సి) ఆల్కహాల్ ఉష్ణోగ్రత
   డి) నీటి ఆవిరి ఉష్ణక్షగ్రత
11. ఇనుప పాత్రలో అల్యూమినియం పాత్ర ఉంచారు. వీటిని వేరు చేయాలంటే?
   ఎ) ఆ రెండు పాత్రలు వేడి చేయాలి
   బి) ఆ రెండు పాత్రలూ చల్లని నీటిలో ముంచాలి
   సి) ఆ రెండు పాత్రలను సుత్తితో కొట్టాలి
   డి) పైవన్నీ
12. నీటి అసంగత వ్యాకోచం తగ్గించేందుకు దానిలో ఏ ద్రవం కలపాలి?
   ఎ) ఇథైల్ గ్లైకాల్ బి) బెంజీన్
   సి) పెట్రోలు డి) కిరోసిన్
13. విద్యుత్ ఇస్త్రీపెట్టెను కనుగొన్నవారు?
   ఎ) ప్రివోస్ట్ బి) కూలుంబ్
   సి) హెన్రీషెలె డి) విలియం గిల్‌బర్ట్
14. పగటి సమయంలో చంద్రుడి సగటు ఉష్ణోగ్రత ఎంత?
   ఎ) 25°C బి) 50°C
   సి) 75°C డి) 100°C

సమాధానాలు

1) బి; 2) డి; 3) సి; 4) ఎ; 5) బి; 6) డి; 7) డి; 8) ఎ; 9) డి; 10) ఎ; 11) బి; 12) ఎ; 13) సి; 14) డి.

జనరల్ నాలెడ్జ్ ఫర్ గ్రూప్స్

వివిధ శాస్త్రాలు - అధ్యయనాలు

కార్పాలజీ	:	విత్తనాలపై అధ్యయనం
సైటాలజీ	:	మొక్కలు, జంతువుల కణాలపై అధ్యయనం
కార్డియాలజీ	:	గుండె వ్యాధులకు సంబంధించిన అధ్యయనం
కాస్మాలజీ	:	విశ్వం గురించిన అధ్యయనం
క్రిప్టోగ్రఫీ	:	రహస్య సంకేతాలతో రాసిన రాతలపై అధ్యయనం
సైటోపాథాలజీ	:	మొక్కల వ్యాధులపై అధ్యయనం

అచ్చ తెలుగులో రాసిన తొలి గ్రంథం ఏది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

తెలంగాణ కవులు - సాహిత్యం

కాకతీయుల కాలం

విశ్వేశ్వర దేశికుడు (1200-1290): ఇతడినే విశ్వేశ్వర దేశికుడు లేదా శివదేవుడు అంటారు. ఇతడు 'శివతత్వ రసాయనం' రచించాడు. శివదేవుడు కేరళ ప్రాంతానికి చెందిన కీర్తి శంభుని శిష్యుడు. ఇతడు తెలంగాణకు వచ్చి స్థిర పడ్డాడు. ఇక్కడ అనేక మఠాలు (కాళేశ్వరం, ఏలేశ్వరం), దేవాలయాలు (మంథెన, వెల్లాల, గోళగి) నిర్మించాడు. ఇతడు కాకతీయ గణపతి దేవుడి దీక్షా గురువు. ఇతడు రుద్రమదేవి పాలనను, ప్రతాపరుద్రుడి యువరాజత్వాన్ని ప్రశంసించాడు. గణపతి దేవుడి నుంచి 'మందిరం', రుద్రమదేవి నుంచి 'వెలగపూడి' అనే గ్రామాలను పొందాడు. ఈ రెండింటినీ కలిపి 'గోళగి' అనే అగ్రహారంగా మార్చాడు. అక్కడ శివాలయం, ప్రసూతి వైద్యశాల నిర్మించాడు.

గోన బుద్ధారెడ్డి (1210-1240): రంగనాథ రామాయణం రాశాడు. ఇది తెలుగులో తొలి రామాయణం. ఇందులో.. ఇంద్రుడు కోడై కూయడం, లక్ష్మణుడు ఏడుగీతలు గీయడం, ఊర్మిళ నిద్ర, లక్ష్మణ దేవుడి నవ్వు లాంటి కథలు కూడా రాశాడు. దీన్ని ద్విపద కావ్యంలో రచించాడు.

శివదేవయ్య: 'పురుషార్థసారం' గ్రంథాన్ని రచించాడు. ఇతడు గణపతిదేవుడు, రుద్రమదేవి, ప్రతాపరుద్రుడి వద్ద మంత్రిగా పనిచేసి మన్ననలు పొందాడు. సంస్కృతాంధ్ర కవితా పితామహుడిగా కీర్తి పొందాడు.

ఈశ్వర భట్టోపాధ్యాయుడు (1262): ఇతడు మయూరసూరి పుత్రుడు. తన తల్లి పేరుతో, భార్య పేరుతో బూదపురంలో రెండు చెరువులు తవ్వించాడు. అక్కడ దేవాలయాలు నిర్మించాడు. ఇతడు బూదపుర శాసనాన్ని నిర్మించాడు. ఇది మహబూబ్‌నగర్ జిల్లాలో ఉంది.

కుప్పాంబిక (1230-1300): ఈమె తొలి తెలుగు/ తెలంగాణ కవయిత్రి. మొల్ల కంటే ముందే అనేక కవిత్వాలు రచించారు.

చక్రపాణి రంగనాథుడు: శివభక్తి దీపిక, గిరిజాది నాయక శతకం, చంద్రాభరణ శతకం, శ్రీగిరినాథ విక్రయం, వీరభద్ర విజయం (సంస్కృతం) రచించాడు. ('వీరభద్ర విజయం' తెలుగులో పోతన రాశాడు)

కపర్ది: అపస్తంభ శ్రౌత సూత్ర భాష్యం, భరద్వాజ గృహ్యాసూత్ర భాష్యం, అపస్తంభ గృహ్యాపరిశిష్ట భాష్యం, శ్రౌత కల్పకావృత్తి, దివ్య పూర్ణభాష్యం ఇతడి ప్రసిద్ధ గ్రంథాలు. ఇతడు ప్రఖ్యాత వ్యాఖ్యాత మల్లినాథసూరి తండ్రి. మెదక్ జిల్లా కొలిచెలిమివాసి. ఇతడు గొప్ప భాష్యకారుడు.

గంగాధర కవి: మహాభారతాన్ని నాటక రూపంలో రచించాడు.



అప్పయార్యుడు: జినేంద్రకల్యాణాభ్యుదయం రాశాడు.

మంచన: కేయూర బాహు చరిత్ర రాశాడు.

శేషాద్రి రమణ: ఇతడు సంస్కృతంలో యయాతి చరిత్ర, ఉషా రాగోదయం (నాటకం) రచించాడు. యయాతి చరిత్రను తెలుగులో పొన్నెగంటి తెనగానచార్యుడు గోల్కొండ రాజు ఇబ్రహీం కుతుబ్‌షా కాలంలో రాశాడు.

మారన (1289-1323): ఇతడు తెలుగులో తొలి పురాణమైన 'మార్కండేయ పురాణం' తెలుగులో తొలి వ్యాకరణ గ్రంథమైన 'ఆంధ్రభాషాభూషణం' రాశాడు.

కేతన: ఇతడు 'విజ్ఞానేశ్వరీయం' రాశాడు. ఇది తెలుగులో తొలి శిక్షాస్మృతి. ఇది యజ్ఞవల్కుడి స్మృతికి అనువాదం.

విద్యానాథుడు (1289-1323): ప్రతాపరుద్ర యశోభూషణం, ప్రతాపరుద్ర కల్యాణం గ్రంథాలను రాశాడు. వీటిలో ప్రతాపరుద్రుడి యశోగానం కనిపిస్తుంది.

కుమారస్వామి: 'సోమిపథి రత్నాపణ' గ్రంథాన్ని రాశాడు.

చిలకమర్తి తిరుమలాచార్యులు: 'రత్నశాణ' రచించాడు. భట్టుమూర్తి 'నరసభూపాతియం' దీని అనువాదమే.

అగస్త్యుడు (1289-1323): బాల భారతం, కృష్ణచరిత్ర (గద్య కావ్యం), నలకీర్తి కౌముది (పద్య కావ్యం), మణిపరీక్ష (లక్ష్మీ స్తోత్రం), లలిత సహస్ర నామం, శివ సంహిత, శివస్తవం తదితర 74 గ్రంథాలు రచించాడు.

గంగాదేవి అగస్త్యుడి శిష్యురాలు. ఈమె విజయనగర రాజైన కుమార కంపరాయలను వివాహం చేసుకుంది. 'మధుర విజయం' గ్రంథంలో భర్త ఘన విజయాలను వివరించింది.

తిక్కన: ఈయన భారతాన్ని తెలుగులోకి అనువదించారు.

- 'నన్నయ' రాజరాజనరేంద్రుడి, 'తిక్కన' గణపతిదేవుడి, 'ఎఱ్రన' ప్రోలయ వేమారెడ్డి ఆస్థానంలో ఉన్నారు. ఈ ముగ్గురిని 'కవిత్రయం'గా పేర్కొంటారు.
- మల్లికార్జునుడు, హుళక్కి భాస్కరుడు, రుద్రదేవుడు.. ఈ ముగ్గురు కలిసి 'భాస్కర రామాయణం' రచించారు.

రేచర్ల పద్మనాయకులు

విద్యారణ్య స్వామి: ఈయన శృంగేరి పీఠాధిపతి. 'సంగీతసారం' గ్రంథాన్ని రచించారు. విద్యారణ్య స్వామి మహామేధావి, కవి, తాత్వికుడు. హరిహర రాయలు, బుక్కరాయలకు విజయనగర రాజ్యాన్ని స్థాపించడానికి ప్రేరణ ఇచ్చారు. విద్యారణ్యుడు ఏకశిలానగరవాసి అని 21వ శృంగేరి పీఠాధిపతి సచ్చిదానంద భారతి ఆస్థాన విద్వాంసుడైన కాశీ లక్ష్మణ శాస్త్రి 'గురువంశ కావ్యం'లో పేర్కొన్నాడు.

సాయనుడు: ఇతడు చతుర్వేదాలకు భాష్యం రాశాడు. పురుషార్థ సుధానిధి, ఆయుర్వేద సుధానిధి, యజ్ఞతంత్ర సుధానిధి తదితర రచనలు చేశాడు.

పద్మనాయక భూపాలుడు: ఇతడు సారంగధర చరిత్ర రాశాడు. ఇతడికి 'సర్వజ్ఞ' అనే బిరుదు ఉంది.

విశ్వేశ్వరుడు: చమత్కార చంద్రిక, వీరభద్ర విజృంభణ గ్రంథాలను రాశాడు.

కవిభల్లటుడు: గుణమంజరి, పదమంజరి, శూద్రక రాజచరిత్రం, బేతాళ పంచవింశతి ఇతడి ప్రసిద్ధ రచనలు.

మడికి సింగన: సకలనీతి సమ్మతం, పద్మపురోత్తర ఖండం, భాగవత దశమ స్కంధం (ద్విపదం), జ్ఞాన వాశిష్ఠ రామాయణం మొదలైనవి రచించాడు.

సర్వజ్ఞ సింగభూపాలుడు: రసావర్ణ సుధాకరం, సంగీత సుధాకరం, కందర్ప సంభవం, కువలయావళి (రత్నపాంచాలిక) లాంటి రచనలు చేశాడు. ఇతడు బహుముఖ ప్రజ్ఞాశాలి. సంగీత నాట్య మర్మజ్ఞుడు. కవి, నాటకకారుడు. ఇతడు అనేక మంది కవి, పండితులను పోషించాడు. సారంగదేవుడు రచించిన 'సంగీత రత్నాకరం' గ్రంథానికి 'సంగీత సుధాకరం' పేరుతో వ్యాఖ్యానం చేశాడు. రసావర్ణ సుధాకరం అనేది అలంకార శాస్త్రం.

గౌరన: నవనాథ చరిత్ర (దీన్నే శ్రీగిరి పండితుడు చంపువుగా రాశాడు), లక్షణ దీపిక, హరిశ్చంద్రోపాఖ్యానం లాంటి అనేక గ్రంథాలు రచించాడు. ఇతడికి 'సరస సాహిత్య లక్షణ చక్రవర్తి', 'ప్రతివాద మదగజ పంచాననుడు' అనే బిరుదులు ఉన్నాయి. మార్కండేయ, స్కంధ పురాణాల్లో ఉన్న హరిశ్చంద్ర మహారాజు కథే హరిశ్చంద్రోపాఖ్యానం మూలకథ. శ్రీగిరి పండితుడు రెడ్డిరాజుల కాలంలో నవనాథ చరిత్రను చంపువుగా రాశాడు.

బమ్మెర పోతన: పోతన 'వీరభద్ర విజయం', 'భోగినీ దండకం', 'మహాభాగవతం' (తెలుగులో) రచించాడు. ఈయన కొంతకాలం మూడో సింగభూపాలుని ఆస్థానంలో ఉన్నారు. పోతన భాగవతంలో పేర్కొన్న ఏకశిలానగరం నేటి ఓరుగల్లే (వరంగల్). పోతన జన్మస్థలమైన బమ్మెర ఈ జిల్లాలోనే ఉంది. అంతకుముందు ఇది నల్లగొండ జిల్లాలోని గ్రామం. వీరభద్ర విజయంలోని మూలకథ.. శివుడిని ఆహ్వానించకుండా దక్షుడు యజ్ఞం నిర్వహించడం, శివుడి కోప సంకల్పంతో పుట్టిన వీరభద్రుడు దాన్ని ధ్వంసం చేయడం, దక్షుడి శిరస్సు ఖండించడం. భోగినీ దండకంలో నాటి పాలకుల భోగలాలసత్వాన్ని వర్ణించారు. పోతన భాగవతం తెలుగులో భక్తికి మారుపేరుగా నిలిచింది. ఇందులో ప్రహ్లాద చరిత్ర, గజేంద్ర మోక్షం, వామనావతార ఘట్టం, శ్రీకృష్ణ చరిత్ర మొదలైనవాటిని పోతన రమ్యంగా వర్ణించారు.

కొరవి గోపరాజు: 'సింహాసన ద్వాత్రింశిక' రచించాడు. ఇది కథాకావ్యం. ఈ గ్రంథానికి మూలం విక్రమార్క చరిత్ర అనే సంస్కృత కావ్యం. పాల్కురికి తర్వాత తెలంగాణ సాంఘిక జీవితాన్ని విస్తృతంగా వర్ణించిన కావ్యం ఇదే.

కుతుబ్‌షాహీల యుగం (1518-1687)

సుల్తాన్ కులీ: ఇతడికి బడే మాలిక్ (దొడ్డ ప్రభువు) అనే బిరుదు ఉంది.

జంషీద్: కూచిపూడి భాగవతులకు 'కూచిపూడి' గ్రామాన్ని దానం చేశాడు.

ఇబ్రహీం కుతుబ్‌షా: ఇతడిని మల్కిభరాముడిగా పేర్కొన్నారు. ఇతడి ఆస్థానంలో అనేకమంది కవులు ఉండేవారు. వీరిలో ముఖ్యమైనవారు..

అద్దంకి గంగాధరుడు: ఇతడు 1565లో తపతీ సుందరోపాఖ్యానం (తపతీ సంవరణోపాఖ్యానం) రచించి ఇబ్రహీం కుతుబ్‌షాకు అంకితం చేశాడు. 'వసుచరిత్ర'ను దీని ఆధారంగానే రాశారు(1570). అద్దంకి గంగాధరుడు రామరాజ భూషణుడితో పోల్చదగిన ప్రతిభావంతుడైన కవి.

కందుకూరి రుద్రకవి: సుగ్రీవ విజయం (తొలి యక్షగానం), నిరంకుశోపాఖ్యానం, జనార్దనాష్టక స్తోత్రం, గువ్వల చెన్నని శతకం మొదలైనవాటిని రచించాడు. అగ్రశ్రేణి కవుల్లో ఒకరైన రుద్రకవి నల్లగొండ జిల్లాలోని దేవరకొండ సమీపంలో ఉన్న కందుకూరు గ్రామ నివాసి. నిరంకుశోపాఖ్యానం శృంగార ప్రధానమైన సాంఘిక కావ్యం.

పొన్నెగంటి తెలగన: ఇతడు 'యయాతి చరిత్ర' రాశాడు. ఇది అచ్చ తెలుగులో రచించిన తొలి గ్రంథం.

మహమ్మద్ కులీకుతుబ్‌షా: ఇతడు తన ప్రేయసి భాగమతి పేరుపై భాగ్యనగరం నిర్మించాడు. బాగ్ అంటే 'ఉద్యానం' అని అర్థం. చార్మినార్ (1591), హైదరాబాద్ (1593)ను కూడా ఇతడే నిర్మించాడు. ఇతడు మీర్జా మహమ్మద్ అమిన్, వజీహీ, గవాసీ తదితర ప్రముఖ కవులను ఆదరించాడు. మహమ్మద్ కులీకుతుబ్‌షా ఉర్దూ కవితల సంకలనాన్ని దివాన్ పేరుతో అతడి అల్లుడు సుల్తాన్ మహమ్మద్ కుతుబ్‌షా వెలువరించాడు.

సారంగు తమ్మయ్య: హరిభక్తి సుధోదయం, వైజయంతీ విలాసం రచించాడు. సారంగు తమ్మయ్య కుతుబ్‌షాకు అప్పుడిగా వ్యవహరిస్తూనే.. కలంపట్టి కమనీయమైన కావ్యరచనలు చేశాడు. వైజయంతీ విలాసం గ్రంథం తెలుగు శృంగార కావ్యాల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందింది. నాటి పాలకుల భోగలాలసతను మరో కోణం నుంచి చిత్రించిన కావ్యం ఇది.

నేబతి కృష్ణమంత్రి: 'రాజనీతి రత్నాకరం' అనే గ్రంథం రాశాడు.

ఎల్లారెడ్డి: బాలభారతం (అగస్త్యుడి రచనకు అనువాదం), కిరాతార్జునీయం (భారవి రచనకు అనువాదం) రాశాడు.

మల్లారెడ్డి: షట్చక్రవర్తి చరిత్ర, శివధర్మోత్తరం, పద్మపురాణం తదితర రచనలు చేశాడు.

అబ్దుల్లా కుతుబ్‌షా: సంస్కృత 'శుకసప్తతి'ని 'యతినామా' పేరుతో పర్షియన్ భాషలోకి అనువాదం చేశాడు. ఇతడి పాలనా కాలం ఉర్దూ భాషకు స్వర్ణయుగంగా ఉంది. ఇతడు కవి, పండిత పోషకుడే కాకుండా స్వయంగా గొప్ప కవి. అబ్దుల్లా పేరుతో కవితలు రాశాడు. ఇతడి ఆస్థానంలో అనేక మంది పండితులు ఉండేవారు. వారిలో ప్రధాన కవులు-వారి రచనలు..

- గవాసి ఇబిన్ నిషాత్ - తోతినామా.
- తబియా - బహురావగుల్.
- తులసీమూర్తి - సంగీత విద్వాంసుడు.
- క్షేత్రయ్య - రాజుపై 12 వేల కృతులు రాశారు.
- మరింగంటి వేంకట నరసింహాచార్యులు - హరివాసర మాహాత్మ్యం.
- చరిగొండ నరసింహ - శశిబిందు చరిత్ర.
- రాజలింగ కవి - కూర్మపురాణం.
- కోన నారాయణ - వజ్రాభ్యుదయం.
- పిల్లలమర్రి వేంకటపతి - రాజేశ్వర విలాసం.
- గోపతి లింగ కవి - చెన్నబసవ పురాణం.

సురభి మాధవరాయలు: చంద్రికా పరిణయం అనే ప్రౌఢ కావ్యాన్ని శ్లేష అనుప్రాసాది శబ్ద చిత్ర నిపుణత్వంతో రచించాడు.

ఎలకూచి బాలసరస్వతి: సుభాషిత రత్నావళి, మాధవ రాఘవ పాండవీయం రాశాడు. ఇతడు భర్తృహరి సంస్కృతంలో రాసిన శృంగార, నీతి, వైరాగ్య శతకాలను సుభాషిత రత్నావళి పేరుతో అనువాదం చేసి మాధవ రాయల తండ్రి మల్లభూపాలుడికి అంకితం చేశాడు.

అప్పకవి: సాధ్వీజన ధర్మం (ద్విపద కావ్యం), అనంతవ్రతకల్పం (కావ్యం), అంబికావాదం (యక్షగానం), కవి కల్పకం (లక్షణ గ్రంథం) రాశాడు.

పోనుగోటి జగన్నాథాచార్యులు: కుముదవల్లి విలాసం (ఇది భక్తరామదాసు జీవితానికి దగ్గరగా ఉండటం గమనార్హం)

కంచర్ల గోపన్న: దాశరథీ శతకం రాశారు. ఈయనను భక్తరామదాసుగా పేర్కొంటారు. ఈయన అక్కన్న, మాదన్న మేనల్లుడు. 1650లో భద్రాచలం తహశీల్దార్‌గా నియమితులయ్యారు.

భద్రాచలంలో రామాలయం నిర్మించారు. అబుల్‌హసన్ తానీషా ఈయనను గోల్కొండలో బంధించాడు. గోపన్న భక్తికి మెచ్చి చివరకు విడుదల చేశారు.

పెన్గలూరి వెంకటాద్రి: భువన మోహిని విలాసం రాశారు.

విశ్వనాదయ్య: సిద్ధేశ్వర పురాణం (ద్విపదం) రచించారు.

అన్నంభట్టు: తర్క సంగ్రహం రాశారు.

కృష్ణమాచార్యులు: భగవద్గీత (ద్విపద) రాశారు.

What is the profession of Bharat?

Model Questions

Directions (Q.1-5): Study the following information to answer the given questions.

Seven friends, viz Manjit, Naveen, Parul, Hitesh, Tarun, Raghu and Sahil, are pursuing their PhD in different subjects Maths, History, Political Science, Chemistry, Economic, Accounts and Geography, but not necessarily in the same order. They study in three different universities, viz P, Q and S. At least two friends study in the same university. Hitesh is studying Political Science in university P. The one who is studying History is not from university S. Sahil is studying Geography in university Q with only Naveen. Manjit is not studying Economics and is not from university P. Raghu is studying Accounts and is not from university P. Tarun is studying Chemistry but not from university P. No one studies Maths or Economics in university P.

1. Which of the following represents the group that studies in university S?
   1) Hitesh, Naveen
   2) Parul, Raghu, Tarun
   3) Manjit, Tarun
   4) Tarun, Raghu, Manjit
   5) None of these
2. Parul is studying in which of the following universities?
   1) P 2) Q 3) S
   4) Can't be determined
   5) None of these
3. Which of the following combinations is true?
   1) Manjit-Economics-university S
   2) Naveen-History-university Q
   3) Parul-History-university S
   4) Tarun-Chemistry-university Q
   5) None of these
4. Naveen studies which subject in PhD?
   1) History 2) Maths
   3) Economics
   4) Can't be determined
   5) None of these
5. Who among the following is studying History in PhD?
   1) Naveen 2) Parul
   3) Raghu 4) Manjit
   5) None of these

Directions (Q.6-11): Read the following information carefully and answer the given questions.

Eight friends Aman, Bharat, Rohit, Dinesh, Ishant, Farhan, Aditya and Hirender are sitting around a circular table, facing the centre but not necessarily in the same order. Each of them has a different designation, viz Banker, Teacher, Company MD, Politician, Corporate Leader, General Manager, Specialist Officer and CEO. Aman sits third to the right of the CEO. Only two people sit between the CEO and Hirender. The Specialist Officer and the Company MD are immediate neighbours. Neither Aman nor Hirender is either a Specialist Officer or a Company MD. The Specialist Officer is not an immediate neighbour of the CEO. The Banker sits second to the left of Ishant. Ishant is not an immediate neighbour of Hirender. The Banker is an immediate neighbour of both the Politician and the Corporate Leader. The Corporate Leader sits third to the right of Bharat. Bharat is not a Specialist Officer. Rohit sits on the immediate right of the Teacher. Aman is not a Teacher. Farhan is not an immediate neighbour of Aman. Aditya is not an immediate neighbor of the Banker.

6. Four of the following five are alike in a certain way based on the given arrangement and thus form a group. Which is the one that does not belong to that group?
   1) Farhan – Teacher
   2) Aditya – General Manager
   3) Dinesh – Banker
   4) Aman – Corporate Leader
   5) Bharat – CEO
7. Who amongst the following sits third to the left of Ishant?
   1) Banker 2) Aditya 3) Aman
   4) Corporate Leader 5) Bharat
8. Who among the following is a General Manager?
   1) Aman 2) Rohit 3) Hirender
   4) Aditya 5) Dinesh
9. What is the profession of Bharat?
   1) Teacher 2) Banker
   3) Company MD
   4) Specialist Officer
   5) Corporate Leader
10. Who among the following is a Politician?
    1) Rohit 2) Farhan 3) Aditya
    4) Hirender 5) Aman
11. Which of the following is true with respect to the given seating arrangement?
    1) The Politician is an immediate neighbour of the Specialist Officer.
    2) Aditya sits second to the right of Dinesh.
    3) The Politician and the Company MD are immediate neighbours.
    4) The Teacher sits on the immediate left of the CEO
    5) None of these

Directions (Q.12-16): Study the following information to answer the given questions.

In a certain code language:

'firefighters are armymen' is written as 'tee mee kee', 'courageous people are armymen' is written as 'kee loo nee tee', 'courageous being enthusiastic' is written as 'loo pee jee', 'people are enthusiastic' is written as 'kee nee pee' and 'positive people are unpleasant' is written 'nee kee dee see'.

12. What is the code for 'being'?
    1) loo 2) jee 3) kee
    4) pee 5) None of these
13. Which of the following may be the possible code for 'unpleasant firefighters are positive'?
    1) dee see tee mee
    2) dee see kee mee
    3) see tee mee kee
    4) dee see jee lee

BANK EXAMS

REASONING

    5) None of these
14. What does 'pee' stand for?
    1) courageous 2) positive
    3) army men 4) enthusiastic
    5) None of these
15. Which of the following is represented by the code 'see jee tee pee dee kee loo'?
    1) unpleasant armymen enthusiastic being are positive firefighters
    2) unpleasant armymen enthusiastic courageous positive are being
    3) unpleasant armymen being enthusiastic are positive people
    4) unpleasant armymen being are enthusiastic people.
    5) None of these
16. Which of the following is the code for 'firefighters armymen belong to positive people'?
    1) tee mee cee que loo dee
    2) mee cee loo dee kee see
    3) mee tee cee too dee nee
    4) mee tee cee toe nee see
    5) Can't be determined

Directions (Q.17-21): Study the information and answer the given questions:

Seven people P, Q, R, S, T, U and V live on separate floors of a 7-floor building. Ground floor is numbered 1, first floor is numbered 2 and so on until the topmost floor is numbered 7. Each one of these is travelling to a different city, viz Delhi, Mumbai, Patna, Chennai, Kolkata, Bengaluru and Lucknow but not necessarily in the same order. Only three people live above the floor on which P lives. Only one person lives between P and the one travelling to Bengaluru. U lives immediately below the one travelling to Mumbai. The one travelling to Mumbai lives on an even-numbered floor. Only three people live between the ones travelling to Bengaluru and Patna. T lives immediately above R. T is not travelling to Patna. Only two people live between Q and the one travelling to Kolkata. The one travelling to Kolkata lives below the floor on which Q lives. The one travelling to Delhi does not live immediately above or immediately below Q. S does not live immediately above or immediately below P. V does not travel to Chennai.

17. Which of the following is true with respect to V as per the given information?
    1) The one who lives immediately below V is travelling to Mumbai.
    2) V lives on floor no. 7
    3) V lives immediately below T
    4) V lives on the lowermost floor
    5) V is travelling to Bengaluru
18. Who among the following lives on floor no. 3?
    1) The one travelling to Chennai
    2) The one travelling to Kolkata
    3) R 4) V 5) T
19. Who lives on the floor immediately above T?
    1) P 2) Q 3) S 4) V 5) U
20. To which of the following cities is S travelling?
    1) Mumbai
    2) Bengaluru
    3) Patna
    4) Kolkata
    5) Chennai
21. How many people live between the floors on which S and the one travelling to Mumbai live?
    1) None 2) Two 3) One
    4) More than three 5) Three


Answers and Explanations

(1-5):

Friend	University	Subject
Manjit	S	Maths
Naveen	Q	Economics
Parul	P	History
Hitesh	P	Political Science
Raghu	S	Accounts
Sahil	Q	Geography
Tarun	S	chemistry

1. 4 **2.** 1 **3.** 5
4. 3 **5.** 2

(6-11):



6. 5 **7.** 4 **8.** 1
9. 3 **10.** 2 **11.** 4

(12-16):

firefighters are armymen → tee mee kee...(i)

courageous people are armymen → kee loo nee tee...(ii)

courageous being enthusiastic → loo pee jee...(iii)

people are enthusiastic → kee nee pee...(iv)

positive people are unpleasant → nee kee dee see...(v)

From (i), (ii) and (iv) are → kee

From (i) and (ii) armymen → tee

From (i) firefighters → mee

From (iii) and (iv) enthusiastic → pee

From (ii), (iv) and (v) people → nee

From (ii) and (iii) courageous → loo

From (iii) being → jee

From (v) positive/unpleasant → dee/see

12. 2 **13.** 2 **14.** 4
15. 2 **16.** 5

(17-21):

Person	Floor	City
S	7	Chennai
Q	6	Patna
V	5	Lucknow
P	4	Mumbai
U	3	Kolkata
T	2	Bengaluru
R	1	Delhi

17. 1 **18.** 2 **19.** 5
20. 5 **21.** 2